శైలజామిత్ర: ....................

# అడ్డా

శైలజామిత్ర

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

**ADDA** *Stories*
by **Sailajamithra**

| | | |
|---|---|---|
| © | : | Author |
| Cover Painting | : | Javed |
| Cover Design | : | Haneef Shaik |
| First Edition | : | June, 2012 |

For Copies : Palapitta Books
# 16-11-20/6/1/1
# 403, Vijayasai Residency
Saleem Nagar, Malakpet
Hyderabad - 500 036
PH: 040-2767 8430
palapittabooks@gmail.com

Sailajamithra
98, Soujanya Avenue
SBI Colony,Gandhinagar
Hyderabad- 80
Cell: 9290900879
Ph: 040- 27531193
Sailajamithra@gmail.com

Printed at : Vipla Computer Services
*(Designers & Multicolour Offset Printers)*
Nallakunta, Hyderabad - 500 044
Ph : 040-27677078, 27676910
viplacomputers@gmail.com

Price : ₹ 80



# అంకితం



'అమ్మ' అమృతం
'అత్తమ్మ' అజరామృతం
జన్మ, పునర్జన్మల పరిపూర్ణం
నన్ను అనుసరించిన వాస్తవం!

\- శైలజామిత్ర



**వేదగిరి రాంబాబు**

# భిన్నత్వంలో ఏకత్వం, మానవత్వం శైలజామిత్ర కథానికల ప్రధాన సూత్రం!

ఒకటి, రెండు కథానికలు రాయగానే ఆ ప్రక్రియలో మహారాజులమనుకుంటున్న వాళ్ళు, రెండు కవిత్వ ఖండికలు ప్రచురితం కాగానే మహాకవిని అనుకుంటున్న వాళ్ళు ఎక్కువగా ఉంటున్న ఈ రోజుల్లో అయిదు కవితా సంపుటిలు, ఒక కథానికా సంపుటి వచ్చినా ఇంకా విద్యార్థినిలా ఆ ప్రక్రియలలో మరిన్ని మెళకువలు, విశేషాలు తెలుసుకోవాలి, ఇంకా వినూత్న రీతిలో సాహిత్యాన్ని ఆవిష్కరించాలనే తపన శైలజామిత్రగారిలో నాకు కనిపిస్తోంది. అందుకే ఆమె సాహిత్యంలో ఎదుగుదలా కనిపిస్తోంది. 1996 సంవత్సరం నుండి ఇప్పటికి ఎంతో ఎదిగారు. ఇంకా ఎదగగలరు. ఈ రెండో కథానికా సంపుటిలో ఇరవైరెండు కథానికలు ఉన్నాయి. అన్నీ వివిధ పత్రికలలో ప్రచురితమై పాఠకులు మెచ్చినవే! వీటిలో కొన్ని బహుమతులు పొందినవి కూడా ఉన్నాయి. మానవ సంబంధాల మీద రచయిత్రికి గట్టి నమ్మకం ఉందని, నిర్మలమైన ప్రేమతో అవి నిలబడతాయని రచయిత్రి గాఢంగా నమ్ముతున్నారని ఈ కథానికలు చెబుతున్నాయి. 'ప్రేమాంజలి' కథలో అంజలి ఎదురుచూస్తూ పడిన వేదనను భర్త గ్రహిస్తాడు. ఇబ్బందులన్నీ చూసి భయపడి పారిపోవడం, దాక్కోవడం కాదు ధైర్యంగా ఎదుర్కోవాలని అర్థం చేసుకుంటాడు. దాంపత్య బంధాన్ని కూడా ఆర్థిక బంధాలు చెడగొట్టగలవనే హెచ్చరిక చేస్తుంది ఈ కథానిక.

కొన్ని జీవితాలలోని చీకటిని చూపిస్తూ తప్పక 'సరికొత్త సూర్యోదయం' అవుతుందని తెలియజేస్తారు. ఈ కథానికలన్నీ పాజిటివ్ దృక్పథంతోనే కనిపిస్తాయి. నాణెమనే జీవితంలో బొమ్మ, బొరుసు తప్పవనే తెలియజేస్తారు శైలజామిత్రగారు. 'ప్రేమ

శిఖరాలమీద' కూర్చోపెడతారు పాఠకులను తమ కథానికలతో. కల వచ్చినా కలగా భావించకుండా జీవితాన్ని మార్చుకోవాలంటారు 'బతుకే ఒక కలైతే'లో.

ప్రేమ తత్వమే కాదు ప్రస్తుతం కొన్ని ధోరణుల మీద కూడా రచయిత్రి కన్నెర్ర కనిపిస్తుంది. జాతరలాంటి కథానికలు సమాజ ఉద్ధరణకోసం మనుషులకంటే ఆయుధాలే ముందుముందు అవసరమవుతాయేమోనని సూచన చేస్తారు డైరెక్టుగా. డబ్బు డబ్బు అంటూ ఒకర్ని మోసం చేసి ఏడుస్తూ తెచ్చుకున్న డబ్బు ఎంతకాలం నిలుస్తుంది? అని నిలదీస్తారు 'కాలగమనం' కథానికలో. ఇప్పటికీ అలనాటి సీతమ్మ జీవితాన్ని పోలిన గాథల్ని చెప్తారు. 'బతుకుమోపు' రేపటి ప్రపంచం రైతన్నలదేనన్న ధైర్యాన్ని సూరిపోస్తారు. రాబోయే రోజుల్ని తలుచుకుని భయపడే గాజుగుండెల్ని పరిచయం చేస్తారు. మొత్తం మీద జీవితాన్ని తెలుసుకోవడం అవసరమనీ చెబుతాయి ఈ కథానికలు. లోకంలోని అనాథలు కనిపిస్తారు. బతకాలనే నమ్మకంతో జీవితానికి అవతలి గట్టుకి ధైర్యంగా వెళ్లేవాళ్లూ కనిపిస్తారు. ఆలోచించడం అవసరం అని చెప్పేవాళ్ళు... ఇలా రకరకాల మనుషులు కనిపిస్తారు మనకు శైలజామిత్ర కథానికలలో. మనం చూడాల్సిన కోణాల్ని మనకు చెప్పేవాళ్లు కొందరైతే, మనం చూడని చీకటి కోణాల్ని మనకి చెప్పేవాళ్ళు ఇంకొందరు. మనలో ఆలోచనలు రేపేవాళ్లు మరికొందరు. ఆలోచించే గుణాన్ని పెంచేవే మంచి కథానికలని నా అభిప్రాయం. అలాగే మనం ఆలోచించాల్సిన కోణంలో మాత్రమే ఆలోచింపజేసే శిల్పం ముఖ్యం. ఈ విషయాలు ఆకళింపు చేసుకున్న రచయిత్రి శైలజామిత్ర భాష కూడా గలగలా ప్రవహిస్తుంది. ఎక్కడా అడ్డం పడదు.

ఆంగ్లంలో కవిత్వం రాయడమే కాక, ఆంగ్లంలోకి తెలుగు కవిత్వాన్ని అనువదింప జేయడంలో కూడా అనుభవమున్న శైలజామిత్రగారికి స్టోరీకి, సార్ట్ స్టోరీకి మధ్య ఉన్న భేదం తెలుసు. కథకు, కథానికకు మధ్య ఉన్న భేదం తెలుసు. అందుకే చిన్న కథలు, మంచి ఆలోచనలను రేపే కథానికలు రాయగలుగుతున్నారు. ఇంకాఇంకా మంచి కథానికలు వారి కలం నుండి రావాలని కోరుకుంటూ... శైలజామిత్రగారి సమీక్షల, వ్యాసాల సంపుటాల్ని సైతం స్వాగతిస్తూ శెలవ్.

**– వేదగిరి రాంబాబు**

1/12/2011



# "అక్షరం నా ఆత్మాయుధం"
# "సాహిత్యంతోనే నా సహచర్యం"

కాలం కమ్మగా గడిచిపోతుంటే కమ్మని కథలు వస్తాయని అనుకోవడం సహజం. కానీ కమ్మని కాలానికి కంటకాల్లాంటి మనుషులు తోడై ఒకవైపు సమాజాన్ని, మరోవైపు జీవితాల్ని కలుషితం చేస్తుంటే గుండె బరువై బయటకు వచ్చేవి కథలు. కతలో ఆర్ద్రత ఉంటే కలకాలం నిలుస్తుంది అనేది నిజం. కథకు వస్తువుతోపాటుగా శిల్పం, శైలి, అభివ్యక్తీకరణ, భాష అన్నీ సమపాళ్లలో ఉండాల్సిందే అని ప్రముఖ కథకులు ఎందరో తమ కథల ద్వారానే తెలియజేసారు. అయితే కథలు ఎన్ని రాసినా ఇంకా కథల కొరత ఉండనే ఉందనేది ప్రముఖుల వాదన. వేదన కూడా. 'కథ' ఎలా రాయాలి? అనే మాటకు కూడా సరైన సమాధానం లేదు. ఎందుకంటే జిహ్వకో రుచి, పుర్రెకో బుద్ధి" అన్నట్లు ఒక్కొక్క కథకుని నుండి ఒక్కో సమాధానం వస్తుంది. అందుకే ప్రముఖుల కథలు చదివినా అదే ధోరణిలో రాస్తే అనుకరణ అవుతుంది కనుక మన ధోరణిలో సాగిపోతే అది మన కథగా మిగిలిపోతుంది అనేది కేవలం నా ఆలోచన. నేడు మనిషి చుట్టూ అనేక సంఘటనలు ఉన్నాయి. ఆ సంఘటనలన్నీ మలచుకుంటే కథా వస్తువులవుతాయి. లేకుంటే తీరని ఆవేదనలుగా మిగిలిపోతాయి. మామూలు వ్యక్తుల ధోరణిలో కాకుండా రచయితలు ఏ విషయాన్ని తీసి పారెయ్యరు. ప్రతి వేదన తమదిలానే భావిస్తారు. ఆవిధంగా నా కథల న్నింటిని నా చుట్టూ జరుగుతున్న సంఘటనలను ఆధారంగా తీసుకుని రచించినవే.

'నేను' అనే పదం అనడానికి ఎంతో తేలికయింది. వినడానికి బరువైంది. అలాంటి బరువైన పదంలో మనిషి ఇరుక్కుని బయటకు రాలేక, లోపల ఉండిపోలేక సతమతమవు

తున్న క్షణాలను ఏరుకుంటే అవి కథలవుతాయని నా నమ్మకం. కవిత్వంలోనే ప్రపంచాన్ని నిత్యం గమనించే నేను కథాగమనాన్ని కూడా వీక్షిస్తూ ఇప్పటికి దాదాపు 70 కథల దాకా రచించాను. 2005లో ఒక కథాసంపుటి 'తరంగాలు' వచ్చిన తర్వాత నేను మరో కథా సంపుటి 'అడ్డా' అనే పేరుతో తీసుకుని రాగలిగాను. కథ రాయడం ఎంత కష్టమో అంతకంటే కష్టమయిన పని వీటిని ఒక పుస్తక రూపంలోకి తేవడం. రచయితకు ఒక్కో పుస్తకం బయటకు వస్తుంటే ఒక్కో బిడ్డను కన్నంత పని అంటారు. కానీ నేను అలా అనలేను. బిడ్డను మోసేది తొమ్మిది నెలలే అదీ కడుపులో. కానీ ఈ గ్రంథం రావాలని నేను మూడు, నాలుగు సంవత్సరాలు గుండెలో భారాన్ని మోసాను. అంటే బిడ్డ కడుపుకు సంబంధించి ఇన్నాళ్ళకు కంటి ముందరకు వచ్చి నా గుండె తేలిక పడింది.

ఇందులోని కథానికలన్నీ చాలావరకు నా చుట్టూ జరిగిన సంఘటనలే! కాకుంటే అక్కడక్కడా కథానికా సౌలభ్యం కోసం, పరిపూర్ణత కోసం, కొన్ని సంఘటనలు కలపాల్సి వచ్చింది. అంతే! సమాజం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకుంటే ఒక నువ్వు ఒక నేను అంతే కదానిపించేది. 1998లో 'ఆదర్శాల అంచుల్లో' అనే మొదటి కథ ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురితమయినపుడు అపుడు ఆ పుస్తకాన్ని పట్టుకుని నేను పడిన ఆనందం ఇంకా నా కళ్ళలోనే మెరుస్తూనే ఉంది. ఆ కథను చదవమని ఎందరిని బలవంతం పెట్టానో ఆ జ్ఞాపకం ఇంకా గుండెల్లో పదిలంగానే ఉంది. చదివి స్నేహితులు నన్ను ప్రశంసించినపుడు ఎంతో ఆనందించాను. అలాంటి ఆనందాల కోసం కొన్నాళ్ళు కథలు రాసాను. ఆ తర్వాత రచన ఒక సామాజిక బాధ్యత అని తెలుసుకుని రచనా విధానంలో మార్పులను తీసుకునివచ్చి రచించాను. నా రచనలన్నీ ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, నవ్య, కథాకేళి, రచన, ప్రజాధ్వని, మనదేశం, నేటినిజం తేజ, మయూరి, చిత్ర, నది, అరుంధతి, కదలికమనలో తేజోప్రభ, ఆశ, మూసీ, స్వప్న, ఇలా ఒక్కటేమిటి అనేక పత్రికలు చిన్న, పెద్ద పత్రికలు తేడా లేకుండా నన్ను ఎంతో ఆదరించాయి. నా భావాలకు విలువనిచ్చి ఈ రోజు నేను రెండవ సంపుటి తెచ్చే స్థాయికి తీసుకుని వచ్చాయి. ఆ పత్రికల యాజమాన్యానికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అలాగే కొన్ని కథలు బహుమతులను సంపాదించాయి. ఆ సంబంధిత న్యాయనిర్ణేతలకు కృతజ్ఞతలు. నా కథల సంపుటికి ప్రముఖ కథకులు, కథా పరిశోధకులు అయిన వేదగిరి రాంబాబుగారిని ముందుమాట రాయమని అడగగానే ఎంతో పని వత్తిడిలో ఉన్నా ఆసాంతం చదివి అమూల్యమయిన ముందుమాటను అందించడంతోపాటు వీటికి కథానికలుగా పేరు మార్పిడి చేసారు. వారికి నా కృతజ్ఞతలు. కథల పట్ల వారికున్న జిజ్ఞాస, ఆవేదన నన్ను ఎంతో ఆలోచింపజేసి, నా కథానికల స్థానం ఎంతవరకో తెలుసుకోవాలని వారికి ముందుమాటకు అందించాను.



మనిషి ఎంతగా కీర్తి పతాకాన్ని వినువీధుల్లో ఎగరేసినా కూడా నేలను మరిచి పోకూడదని, ఎంతగా నేలపై దిక్కులేకుండా ఉన్నా దేహానికి ఆకాశమయిన తలను దించకూడదనేది నా అభిమతం. ఆత్మగౌరవం అనేది మనిషి జీవితానికి వేదికలాంటిది. ఆ వేదికను వేడుకగా తీసుకుంటే మిగిలేది కేవలం ఆత్మలేని శరీరం మాత్రమే! ఆ వేడుకల్ని నేను కథలుగా మలచాను. కాలం ఎవరికోసం ఎదురుచూడకుండా తన పని తాను చేసుకుపోయే తత్త్వవేత్త. ఆ తత్త్వవేత్త వేళ్ళను అదుకుని మనం నడుస్తూనే మెల్లగా చేతులు విడిపించుకుని దారి తప్పిపోతూ ఒక కప్పుకింద పుట్టి పెరిగినా బద్ధ శతృవులై జీవిస్తూ, జీవితకాలం గడిచినా ఒక్కరినైనా మనస్ఫూర్తిగా అభిమానించలేకపోతున్నాం. బతుకు నిడివి తగ్గింది. కానీ మనిషి ఆశలు పెరిగిపోతున్నాయి. నేను నడిచే దారిలో ఎన్నో సమస్యలు నా కంటపడుతూనే ఉంటాయి. ఇంటిముందుకు వచ్చే ఆకుకూరల బండి నుండి రాత్రి కనుమరుగయ్యే వీధి వాకిలి వరకు నన్ను అనేక భావాలు, అనుభవాలు తడుతూనే ఉంటాయి. వాటన్నింటిని కాగితంపై ఉంచాలనే నా ఆలోచన. కానీ అనుకూలించిన మేరకు మాత్రమే కథలు రచించాను.

ఈ కథానికలకు 'అడ్డా' అనే పేరును నిర్ణయించేను. ఇందుకు కారణం లేకపోలేదు. నేను కంప్యూటర్ క్లాసు నుండి ఇంటికి రావాలంటే బస్సు అనుకూలంగా ఉండేది. అలా రోజూ దాదాపు నెలన్నర కాలంపాటు అక్కడ నిలబడటం ఆ పక్కనే ఉన్న 'అడ్డా'లో రోజు కూలి చేసేవారు జీవితాలను, వారి భాషను నిశితంగా పరిశీలించాను. ప్రతిరోజూ ఇంటికి వచ్చి "అయ్యో పాపం" అనుకునేదాన్ని. ఒకరోజు ఈ విషయాల్ని ఒక కథగా ఎందుకు రాయకూడదు అనిపించింది. అంతే కథకు శ్రీకారం చుట్టాను. అప్పట్లో 'అల' అనే పత్రిక ఏ మాండలికం అయినా పర్లేదని కథల పోటీని పెట్టేరు. వెంటనే ఈ కథను పంపేను. ఈ కథానిక సాధారణ ప్రచురణకు ఎంపిక అయింది. నాకు ఎంతో ఆనందం. నా కథానికకు ఒక పరిపూర్ణత ఏర్పడిందని భావించేను. అలా మాండలికాన్ని మార్చి రాసిన తొలి కథ 'అడ్డా' కథను చదివిన వారు ముఖస్తంగా, పత్రికాముఖంగా నన్ను ఎంతో ప్రశంసించేరు. అందుకే ఈ కథానికల సంపుటికి 'అడ్డా' అని పేరు నిర్ణయించేను. ఈ స్ఫూర్తితోనే 'బతుకుమోపు' అనే కథానికను రచించేను. అదికూడా 'చిత్ర' పత్రిక వారు సాధారణ ప్రచురణకు స్వీకరించేరు.

జీవితం నిత్యం నిర్దిష్టంగా ఉండాలని భావించేవారిలో నేను ఒకదాన్ని. ఇంట్లోనే కాదు, బయట కూడా ఒక అన్యాయాన్ని, ఒక అబద్ధాన్ని సహించే మనస్తత్వం లేకపోవడం రచయిత్రిగా నన్ను ఈ స్థాయికి తీసుకురావడానికి తోడ్పడిందని నమ్ముతాను. ఒకచోట ఎవరైనా చనిపోతే వారింటికి పరామర్శకు వెళ్లినా చిన్నతనం నుండి నా దృష్టి వారి

మాటలపై ఉండేది. ఆస్తులు, బట్టలు పంపకాలు, బంగారం కోసం ఏడ్వడాలు, శాపనార్థాలు పెట్టుకోవడాలు నన్ను కదిలించేవి. మనిషికి ఏమి కావాలని ఎవరూ తెలుసుకోలేరా అనే విషయం నన్ను వెంటాడేవి. మోసం, నమ్మకద్రోహం, అబద్ధం, అనుమానం, నిందలు వేయడం, అవహేళన చేయడం, కులమతాలు, ధనిక పేదలు తేడాలు చూపి మాట్లాడటం లాంటి మనస్తత్వాలు చూస్తుంటే నాకు సమాజంలో చాలామంది మానసికంగా మరణించారనే అనిపిస్తుంది. ఉన్నట్లుండి మనలో ఎవరైనా చనిపోతే ఒక్కరైనా స్వచ్ఛంగా కన్నీరు పెట్టించలేని జీవితం జీవితమే కాదనిపిస్తుంది. ఎవరో ఎందుకు వినడానికి వింతగా ఉన్నా నేడు భర్త పోతే భార్యకు ఏడుపురాదు. భార్య పోతే భర్తకు బాదే ఉండదు. సమాజం కోసం బాధపడినట్లు నటించిన జీవితాలు నా అనుభవంలో ఎన్నో చూసాను. బహుశా రంగస్థలం, వెండితెర మీద కన్నా మహానటులు సమాజంలో ఉండిపోయారేమో అని కూడా అనిపిస్తుంది. స్నేహమంటారు. అబద్ధాలు చెబుతారు. ప్రేమ అంటారు. నమ్మించి, అనమానించి నిందలు వేస్తారు. ఇలాంటివి ప్రత్యక్ష్యంగా చూసి నేను మనిషిపైనే నమ్మకం కోల్పోయిన పరిస్తితులెన్నో నా జీవితంలో.. ఇలా నన్ను బాధంచిని, కదిలించిన ప్రతి విషయాన్ని అక్షరీకరించాను. కాకుంటే కథాపరంగా కొన్ని సంఘటనలు అవసరమయినంత మేర చేర్చాను. అక్షరాన్ని నమ్ముకున్నాను. అక్షరం నా ఆత్మబంధువుగా, సాహిత్యం నా సహచర్యంగా మార్చుకున్నాను. ప్రముఖ కథకులు శ్రీ వేదగిరి రాంబాబుగారు అన్నట్లు ఇంకా మంచి కథలను, కథానికల్ని రాయడానికి ప్రయత్నిస్తాను.. నా వద్ద ఇంకా కథానికలు ఉన్నా ఒక్క ఇరవై కథలు మాత్రం గ్రంథ రూపంలో తీసాను.

ఏ కళ అయినా పెళ్ళి తర్వాత ఆగిపోతుందనేది చాలామంది మాట. కానీ నా జీవితమే పెళ్ళితో ఆరంభమయ్యింది. వివాహం తర్వాత దురదృష్టవశాత్తు గాత్రాన్ని కోల్పోయిన నన్ను ఎంతో ఓదార్చి, నాలో ఒక అలవాటుగా ఉన్న సాహిత్యాన్ని జీవితం మార్చి, నన్ను నన్నుగా మిగిల్చి, నాకు ఒక దిశను, దశను చూపిన మా అత్తగారికి మామధ్య భౌతికంగా లేకున్నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ముఖ్యంగా 'అంకితం' అనేది గ్రంథంలో మన వ్యక్తిత్వాన్ని తెలియజేసేదిగా భావిస్తాను. అలాంటి ఆలోచనతోనే అమ్మను మరిపించి అత్తమ్మగా ఆదరించిన అత్తగారు "సుశీల అమ్మాళ్"గారికి ఈ నా గ్రంథం అంకితం చేయడం సముచితంగా భావిస్తున్నాను. ఆమెకు తగ్గ తనయునిగా నన్ను, నా సాహిత్యాన్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న 'శ్రీవారి'కి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

డబ్బు జీవించడానికి అవసరమే! దానిని ఎవరూ కాదనలేరు. కానీ, డబ్బే జీవితమనుకోవడం మాత్రం చాలా విచారించాల్సిన విషయం. కోట్ల ఆస్తి ఉన్నా క్యాన్సర్



బారి నుండి మనిషిని కాపాడలేము. విదేశాలకు పరుగులు తీసినా కూడా జీవిత కాలాన్ని కాస్తంత పెంచగలవే తప్ప తగ్గించి జీవితాన్ని ఇవ్వలేవు. ఆ సత్యాలన్నీ కళ్ళముందు చూసినదాన్ని. మానవత్వం ఒకటే మన వెంట వస్తుందనే నిజాన్ని తెలుసుకున్న దాన్ని. కనుక ఏ పని అయినా, ఏ రచన అయినా ఒక బాధ్యతగా తీసుకుని చేస్తాను. రచన అనేది పదికాలాలు నిలబడటం అనేది ఒకవైపు ఉంచితే, రచన ద్వారా మన వ్యక్తిత్వం కోల్పోకూడదని మాత్రం జాగ్రత్త తీసుకుంటాను. 'కలం' అనేది నా దృష్టిలో ఒక నిశ్శబ్దమయిన ఆయుధం. ఆ ఆయుధాన్ని ఇష్టమొచ్చిన రీతిలో ఉపయోగించకుండా ఇష్టపూర్వకంగా ఉపయోగించాలనేది నా అభిమతం.

జీవితం మనం అనుకునేలా ఎపుడూ ఉండదనేది అందరికీ తెలిసిందే! కానీ ఒకప్పుడు 'శేషుబాబు' (తెలికిచెర్ల శేషగిరిరావు) అనే పేరుతో సరదాగా కథలు రాసే నాన్న, ఒక చిన్న కవిత రాసినా చదవమని విని ఆనందించే అమ్మ, నా సాహితీ జీవితాన్ని చూడలేకపోయారే అని ఎప్పుడూ బాధిస్తూ ఉంటుంది. తప్పదు. అందర్నీ కోల్పోతే కానీ అందలం కనిపించదన్నట్లు నేను ఏ అందలం ఎక్కకున్నా నా అడుగులు కూడా నాకు మాత్రమే మిగలడం నేడు నేనున్న నా స్థితి! ఎన్ని అనుకున్నా ఒక్కటి మాత్రం నిజం! ఇది పోటీ ప్రపంచమయినా పరుగులు తీయడం, నేను చేయలేని పని, నా దృష్టిలో గెలవడం అంటే ఎవరి మనసులు వారు గెలవడమే! ఓడిపోవడం అంటే మరొకర్ని బాధించి, అవమానించడమే!. నడుస్తున్న దారిమొత్తం పూలే ఉంటాయనుకోవడం ఎంత భ్రమో, మొత్తం ముళ్ళే ఉంటాయనుకోవడం కూడా అంతే! జీవితం జీవించడం కోసమే! ఆ జీవించడమే ఎలాగో తెలియని ఈ సమాజానికి స్వయంశక్తిని మించిన ఆయుధం లేదని తెలియజేయడమే నా ఆశయం!

అక్షర దోషాలు లేకుండా అందించి, నా కథానికల్ని గ్రంథరూపంలో అందించడం ఒక వ్యాపార దృక్పథంలా కాకుండా ఒక బాధ్యతగా స్వీకరించిన పాలపిట్ట యాజమాన్యం శ్రీ గుడిపాటి గారికి కృతజ్ఞతలు. పుస్తకాలు స్వయంగా ముద్రించుకోవడం అనేది ఎంత కష్టమో ఎవ్వరికీ తెలియనిది కాదు. కాకుంటే పుస్తకాన్ని ముద్రించుకున్న కవి, రచయిత ఎవరైనా పుస్తకం అందుకున్న వారినుండి అమూల్యమయిన అభిప్రాయాలు పంపితే చాలు ఇంతవరకు పడిన కష్టనష్టాల్ని మరిచిపోగలుగుతాము. ఆలోచించండి!

**– శైలజామిత్ర**

# కథాక్రమము

1. ప్రేమాంజలి ........................................................ 15
2. సరికొత్త సూర్యోదయం ........................................ 22
3. ప్రేమ శిఖరాల మీద...! ........................................ 29
4. బతుకు ఒక కలైతే...? ........................................ 37
5. కాల గమనంలో... .................................................. 44
6. కలల సరస్సు ........................................................ 51
7. జాతర ...................................................................... 60
8. ఉష్...! .................................................................. 67
9. బతుకు 'మోపు' ...................................................... 75
10. గాజు గుండె ........................................................ 87
11. పిచ్చుకగూళ్ళు ...................................................... 95
12. అమ్మ ...................................................................... 101
13. జీవితానికి ఆవలిగట్టున .......................................... 110
14. కర్తవ్యం ................................................................ 116
15. "అడ్డా" .................................................................. 124
16. నిర్ణయం ................................................................ 130
17. సూర్యోదయం ........................................................ 136
18. శిథిల చిత్రాలు ...................................................... 141
19. పనిపిల్ల .................................................................. 149
20. పగటి కల .............................................................. 156

శైలజామిత్ర సాహితీ విశేషాలు .......................................... 163



# ప్రేమాంజలి

భర్త వీధిలోకి వెళ్లినప్పటినుండి ఏదో కాస్త అలజడిగానే వుంది అంజలికి. మనసుపెట్టి ఏ పనీ చెయ్యలేకపోతోంది. తలనొప్పి అంటున్నా పసిదాన్ని కాస్తంత మాటలతో ఊరడించలేకపోయింది. కొడుకు త్వరగా ఇంటికి వచ్చినా ఎందుకొచ్చావని, ఇంత తొందరగా రావడానికి కారణం ఏమిటని కూడా అడగలేకపోతోంది. అడగకపోయినా చెబుతున్నా వినిపించుకోలేకపోతోంది. ఒక వైపు పాలు పొంగుతున్నా, కుళాయిలో నీరు కిందపోతున్నా ఏమాత్రం సహించలేని అంజలికి ఆ శబ్దాలు వినిపిస్తున్నట్టే లేదు.. పోస్టుకార్డు వచ్చినా పరుగున వెళ్లి తీసుకునే అంజలి ఆ రోజు కొరియర్ తన పేరున వచ్చినా అందు కోవాలని కూడా అనుకోలేదు.

వీధి గదిలో వున్న సోఫాలో కూర్చుంది అన్యమనస్కంగా. అలా అలా కళ్లముందే వెళ్లిపోతున్న వాహనాల్ని తీక్షణంగా గమనిస్తోంది. పడుతూ, లేస్తున్న భిక్షగాడు తను పదే పదే ఎందుకు పడుతున్నాడో గమనించే స్థితిలో లేదు.

"అమ్మా! ఈరోజు గాజులషాపుకు వెళదామన్నావు...?"

"రేపు వెళదాంలేమ్మా"

"నిన్న కూడా అలానే అన్నావు కదామ్మా... ఎల్లుండి స్కూల్లో డాన్సు ప్రోగ్రాం వుందిగామ్మా.. గాజులు కావాలని ఖచ్చితంగా చెప్పారు..." అంది కూతురు కాస్త మూతి ముడుస్తూ.

"తప్పకుండా రేపు వెళదాం.." అంది మారు మాట్లాడనివ్వకుండా అంజలి.

ఇంటిముంగిట తోపుడు బండివాడు ముంగిళ్లను అంగళ్లుగా మార్చే ప్రయత్నంలో

వున్నాడు. ఒకచోట బిడ్డలకు ఆంగ్లంలోనే ఎలా పలకాలో చెప్పి దాన్తో వెంటనే లబ్ది పొందాలనే ప్రయత్నంలో వుంది ఓ తల్లి.

ఉన్నట్లుండి దూరంగా ఒక వింత శబ్దం... అందర్నీ ఉలిక్కిపడేలా చేసింది. అంజలికి మాత్రం గుండె దడ మరింతగా పెంచేలా చేసింది.

ట్రాన్స్‌ఫార్మర్ పేలిందేమో...

బాంబుగాని పేల్చలేదు కదా..?

యాక్సిడెంట్ కాదు కదా...

ఏమో ఏ నిమిషంలో ఏమవుతుందో ఏమీ చెప్పలేకపోతున్నాం పిన్నిగారూ...! అనే వ్యాఖ్యలతో అందరూ కాకున్నా కొంతమంది శబ్దం వచ్చిన దిక్కుగా బయలుదేరారు. వారికంటే నాలుగు అడుగులు ముందుగా అంజలి.. వుండనే వుంది. వారిలో ఎవరూ అంజలిని పట్టించుకునే స్థితిలో లేరు. ఎందుకంటే వుండడానికి అంజలి పదేళ్లుగా అదే వీధిలో వుంటున్నా పెద్దగా స్నేహాలుగానీ, పరిచయాలుగానీ పెంచుకోవడానికి ఇష్టపడలేదు. ఈ ఇంట్లో అంజలి అనే ఆమె వుందని, ఆమెకు ఇద్దరు పిల్లలని తెలుసుగానీ వివరాలు ఎవరూ కనుక్కోలేదు అనే కన్నా కనుక్కునే అవకాశం తాను ఇవ్వలేదనే చెప్పాలి. ఒకవిధంగా తనకంత తీరిక కూడా లేదు.

పిల్లల్ని చూసుకోవడం ఒక ఎత్తైతే...

భర్తను కాపాడుకోవడం ఒక ఎత్తైంది.

***

"ఏమయిందటరా?"

"ఎవరో పానీపూరీ తింటున్నాడట. పక్కన స్నేహితునితో మాట్లాడుతూ... అంతలో ఎవరో వ్యాన్‌లో రావడం. తుపాకీతో కాల్చడం, చంపేయడం వెంటనే వచ్చిన వ్యాన్‌లోనే వెళ్లిపోవడం జరిగిందట. పాపం అందరూ ఒకటే భయపడుతున్నారు అసలెందుకు చంపారో.. ఏమో"

"మన ప్రాంతంవాడైతే కాదుగదా!"

"ఏమోరా.. తెలియడంలేదు.. బాడీ మొత్తం రక్తసిక్తం"

"నువ్వు అక్కడే వున్నావా"

"అవును. నేను అక్కడే వున్న బుక్‌షాప్‌లో మా పాప రఫ్‌బుక్ అడిగితే కొని తీసుకెళదామని ఆగాను.. అంతలో"

"నువ్వెక్కడికి? అక్కడికేనా?"



"అవునురా"

"వద్దురా.. కాస్సేపాగితే పోలీసులు.. అనవసర ఎంక్వైరీలు.. తెల్లవారితే ఫొటోతో సహా పేపర్లు లేదా ఇప్పుడే టీవిలో చూపిస్తుంటారు. పోయింది ఎవడో అయితే మన ప్రాణాలు తీస్తారు.. జాగ్రత్త"

"ఓకె... నువ్వన్నది నిజమే. నేను అటుగా వెళ్లనులేరా"

ఆ మాటలు వింటున్న అంజలికి ఒకవైపు కన్నీరు ఎగసిపడుతుంటే పమిటచెంగుతో అద్దుకుంటూ చుట్టుపక్కలా తననెవరైనా గమనిస్తున్నారేమోనని బిడియంగా చెప్పులు కూడా లేకుండా విసవిసా నడుస్తోంది.

నడిచీ నడిచి ఆ శబ్దం వచ్చిన ప్రాంతానికి రానే వచ్చింది. చుట్టూ ఇసక వేస్తే రాలనంత జనం.. ఏ ఉపద్రవం వచ్చినా ఏమాత్రం సాయపడని బొమ్మల్లాంటి జనం.. చెక్కల్లా నిలబడి చూస్తున్నారు. అంతలోనే పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టెయ్యడం.. అందరినీ పంపేయడం.. చేస్తున్నారు. అక్కడున్న ఒక పోలీసుకు మాత్రం అంజలిని చూసి ఏదో సందేహం ఏర్పడిందో ఏమో... 'ఏమ్మా.. అతను మీకు కావాల్సినవాడా?" అడిగాడు.

ఇక అప్పటిదాకా అదిమిపెట్టి వుంచిన కన్నీటిని ఆపుకోలేకపోయింది. ఒక్క ఉదుటున ఏడ్చేసింది. ఆమె పరిస్థితిని గ్రహించిన అక్కడి పోలీసులు దారి ఇచ్చి చూస్తావా? అనడిగారు. అడగటం వెంటనే ముందుకు ఉరికి చూసి అమ్మయ్య!! కాదండీ మావారు కారండీ... కారు... మా వారు కారు అంటూ మళ్లీ ఏడ్చేసింది.

"పో... పోమ్మా.. ఊరికే మీకు మీరే పరేషాన్ అయి మమ్మల్ని పరేషాన్ చేస్తారు. ఇగో మీ మగడు ఏం చేస్తాడు?"

"ప్రైవేట్ కంపెనీలో"

"మరి సచ్చినోడు నీ మొగుడని ఎందుకనుకున్నావు?"

" మరి మరి రెండు రోజుల నుండి ఇంటికి రాకుంటే"

"రాకుంటే పోలీసు కంప్లయింట్ ఇవ్వు.. సెల్‌ఫోను వుంటే దానికి కొట్టు.. ఏడున్నాడో తెలుస్తుంది. నా కొడుకు ఏడున్నడో ఏందో...? పెండ్లాలను ఫికర్ చేస్తరు. అంటున్న మాటలు వింటున్న అంజలి సిగ్గుతో కుమిలిపోయింది. తనకు డిగ్రి వరకు చదువుండీ ఇంట్లోనే వుంటూ తన ఉనికి ఎవ్వరికీ తెలియకుండా బతికింది. ఈరోజు వాళ్లు పోలీసులే కావచ్చు. కానీ నేలబారు దానిలా పలకరించడం చాలా బాధను కలిగించింది.

ఎంత పొమ్మన్నా కొందరు అక్కడక్కడే తనకు తెలిసినవారు చూసి అదేమిటి

అంజలిగారు ఇలా బయటకు రావడం ఏమిటి? అలా ఏడవడం ఏమిటి తన భర్త అనుకోవడం ఏమిటి? అసలు తన భర్త ఏ పని చేస్తుంటాడు? ఎందుకిలా పరుగెత్తుకు వచ్చింది అనే అనుమానాలు కొత్తగా ఆ కాలనీలో బయలుదేరాయి. అందరూ చూస్తున్నారనే విషయం తెలిసిన అంజలి మరింతగా సిగ్గుపడి ఇంట్లోకి చేరింది.

అంజలికి పెళ్లయి 12 సంవత్సరాలు గడిచిపోతోంది. తను మధ్యతరగతి కుటుంబంలోంచి రావడంతో తన పెళ్లికూడా ఏదో మొస్తరుగా జరిగింది. జీతం అంటే పన్నెండేళ్లక్రితం రెండువేల జీతం ఇప్పుడు ఎనిమిదివేల రూపాయలు. తొమ్మిదో తరగతి చదువుతున్న కొడుకును ఆరో తరగతి చదువుతున్న కూతుర్ని తన తాహతుకు మించి ఇంగ్లీషు మీడియం కాన్వెంటుకు పంపుతూ చాలీ చాలని జీవితాన్ని గడుపుతోంది. అదీకాకుండా పిల్లల కోరికలు జీన్స్ ప్యాంటు కావాలని, అదే డ్రస్సుకావాలని కూతురు, సంవత్సరంలో అడుగడుగునా వచ్చే పండగలకు బట్టలు కొనలేక, అలాగని మానలేక, తనకంటూ ఒక మంచి చీరైనా కట్టుకోవాలనే ఆశ చావని సాధారణ గృహిణి ఆమె. భర్త ఇంటికొస్తే చాలు అది కావాలి ఇది కావాలి అంటూ విసిగిస్తూ భర్త సమీర్‌ను నిత్యం అడగటం, భార్య, పిల్లలు కనీస కోరికలు తీర్చలేక, వారనే మాటలు తట్టుకోలేక, అప్పులుచేయడం, అలవాటుగా మారింది. చినుకు చినుకూ గాలివాన అయినట్లు ఆ చిన్న చిన్న అప్పులే వడ్డీలతో కలిసి పెద్ద ముప్పుగా మారడం, తీర్చడానికి తన జీతం సరిపోకపోవడం, ఎక్కడ ప్రెషర్ ఎక్కువైతే అది తప్పించుకోవడానికి మరో అప్పుచేయడం అనేది నిత్యజీవన కార్యక్రమంగా మారింది. ఇలా పెరిగి పెరిగి అప్పులకు వడ్డీలు కూడా కట్టలేకుండా పోయేసరికి ఇంటిమీదికి వారంతా రావడం తెల్లవారినుండి రాత్రివరకు అప్పులవారే విసిగించడం దైనందిన కార్యక్రమంగా మారింది. మరికొందరైతే ఇస్తావా? లేదా? అని దబాయించే స్థితికి రావడం జరిగింది. చివరికి అది కాస్త లక్షల మీదికి రావడంతో ఇస్తావా? లేదా నిన్ను బతకనీకుండా చేయాలా అనే స్థితికి కూడా వచ్చింది. ఒకరోజు నలుగురైదుగురు ఇంటికి రావడం చెయ్యిచేసుకోవడం, అసభ్యకరంగా మాట్లాడటం కూడా జరిగింది. దాంతో అంజలికి కోపంతో..

"చూసారా? అప్పులు చేసి ఎంతదూరం తీసుకువచ్చారో...?"

"ఇంత దూరం వచ్చింది మీ మూలంగానే కదా?"

"మా మూలంగానా? పిల్లలు వారికంటూ కొన్ని ఆశలుంటాయని మీకు తెలీదా? అంత మాత్రం జ్ఞానం లేదా?"

"నువ్వు సర్ది చెప్పచ్చుగా.. నువ్వు కూడా వాళ్లతో పాటు నగలని, చీరలని విసిగించావుకదా? అందుకు కూడా నాకే జ్ఞానం వుండాలా?"

"అవును మరి. మా పుట్టింటివారు ఇచ్చిన నగలన్నీ వ్యాపారం చేస్తానని తీసుకుని



అమ్మేసారు కదా...! అందుకే అడిగాను. తప్పా?"

"తప్పే. పిల్లలంటే వారికి నా పరిస్థితి తెలియక అడిగారు. కానీ నీకేం పోయేకాలం? నా ఆదాయం, నాకున్న అవస్థ అన్నీ తెలిసీ నిత్యం అడిగావు కదా? ఇది ఒప్పెలా అవుతుంది?"

"పోనీలెండి.. అంతా నాదే తప్పు. అందుకేగా వాడు నాకేసి చూసి అసహ్యంగా మాట్లాడాడు. మీకేమయినా వినిపించిందా? అసలు చదువూ, సంపాదనా లేని మిమ్మల్ని చేసుకోవడమే నేను చేసిన పెద్దతప్పు"

"అవునులే... నువ్వు మహా ఐ.ఏ.ఎస్. చదివావు కద నీకు మరో ఐఏఎస్ చదివినవాడు వచ్చి చేసుకోవడానికి. నేను బతికుండగా మీకు నా విలువ తెలియదే. నా అంతట నేనో, లేక అప్పులవాళ్ల ద్వారానో ఛస్తే తప్ప నీకు నా విలువ తెలియదు.." అంటూ విసవిసా వీధిలోకి వెళ్లిపోయాడు. అంతే ఆ మాటని బయటకు వెళ్లి ఇప్పటికి వారం గడుస్తోంది. ఇంటికి రాలేదు. అలాగని ఫోను చేస్తుంటే తీయడం లేదు. తనూ చేయడం లేదు. అంటూ తలుచుకుని కళ్లనీళ్లు తడుచుకుంటుండగా.. తలుపు చప్పుడయ్యింది. సమీర్ వచ్చాడేమోననుకుని ఒక్క ఉదుటున లేచి తలుపుతీయగానే ఎదురుగా కామేశ్వరి! పక్కింటి ఆంటీ.

ఒక్కక్షణం ఉలిక్కిపడి కళ్లు తుడుచుకుంటూ "రండి.. ఇప్పుడే ఉల్లిపాయలు తరుగుతూంటే..." అంటూన్న మాట తేలిపోతున్నదని తనకే అర్థమవుతోంది.

"ఏమీలేదమ్మా... ఇందాకట్నించి గమనిస్తున్నాను. నువ్వేదో చాలా కంగారులో వున్నావు. అక్కడ ఎవరో చనిపోతే హైరానాపడి వెళ్లి చూసొచ్చావు. ఇప్పుడేమో కళ్లనీళ్లు పెట్టుకుంటున్నావు. ఏదో తెలుసుకోవాలని ఆత్రం కాదమ్మా. మీ అమ్మలాంటిదాన్ని.. ఏదో బిడ్డగా అనుకుని నీ బాధ ఏంటో తెలుసుకోవాలని వచ్చానమ్మా" అంది ఖచ్చితంగా.

"అబ్బే.. ఏమీలేదాంటీ" అని ఎంత నచ్చచెబుదామన్నా కన్నీళ్లు వచ్చేయటంతో ఇక ఆపై ఆపుకోలేకపోయింది.. జరిగినదంతా చెప్పుకొచ్చింది. "అందుకే ఆంటీ నేను ఎవ్వరితో ఎక్కువగా కలవను. మీరు షాపింగ్‌కని నన్ను పిలుస్తారు. నా దగ్గర డబ్బు ఉండదు. ఆ మాట చెప్పలేను. అలాగే మీతో పాటు ఏ ఫంక్షన్‌కు హాజరవ్వలేను. ఎందుకంటే మీకున్నంతగా నగలూ, చీరలూ నాకు లేవు. ఎవరితోనైనా మాట్లాడితే మీకు ఇది వున్నాయా? అది వున్నాయా అనే టాపిక్ రావడం, నేను ఏమీ చెప్పలేకపోవడం వంటివి జరుగుతాయేమోనని" అంటూ ఆగింది అంజలి.

"అంజలీ.. మధ్యతరగతివారిని పీడించే సమస్య అప్పులే. వాటి నుండి బయటపడలేక, సాయంచేసే వారేకాదు, కనీసం పలకరించే దిక్కులేక ఇలాంటి నిర్ణయాలు

వారికి వారే తీసుకుంటుంటారు నువ్వేకాదు నేనూ నీలానే మావారి అప్పులతో బాధపడి చివరికి నేను కూడా ఉద్యోగం చేసి మెల్లమెల్లగా పిల్లల్ని చదివించి ఈరోజు ఒక్కొక్కరు సెటిల్ అయితే ఇప్పటికి ప్రశాంతత దొరికిందమ్మా... నువ్వింకా చిన్నదానివి. అన్నీ వాటంతటవే సర్దుకుపోతాయి. అలాగని ఇద్దరూ ఒకరినొకరు ఉదయం నుండి తిట్టుకుంటే తీరుతాయా? దేనికి గానీ ఇద్దరూ కూర్చుని సమస్య నుండి బయటపడడానికి ప్రయత్నించాలి. కానీ మీరిలా పోట్లాడుకోవడం మరో సమస్యగా మారుతుంది. ఇకపోతే పదిమందితో కలిసి మాట్లాడే అలవాటు మనల్ని మనం సరిదిద్దుకునే అవకాశాన్నిస్తుంది. అదీకాక, వారు వేసుకున్నవన్నీ మనం వేసుకోవాలని... వారు అడిగిన ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పాలని నిత్యం భయపడుతుంటే జీవితమంతా నరకప్రాయమవుతుంది. ఎందుకంటే ఒకరికి నచ్చినది మరొకరికి ఎప్పటికీ నచ్చదు కనుక. కాబట్టి నువ్వేం దిగులు పెట్టుకోకు. నీవల్ల ఇంటి వాతావరణం దెబ్బతింటుంది. పిల్లలు జాగ్రత్త" అంటూ కామేశ్వరి అంజలి ఇచ్చిన కాఫీ తాగి ఇంటికి వెళ్లింది.

కాస్త కుదుటపడిన మనసుతో అంజలి తలుపు వేసుకుని లోపలికి వచ్చి.. నిద్రపోతున్న పిల్లల మధ్య చోటు చేసుకుని ఇద్దరిపై చేయి వేసుకుని నిద్రపోయింది.

***

ఉదయం లేచీలేవగానే... తలుపు దగ్గరున్న పేపరు చేతిలోకి తీసుకుని ఉలిక్కిపడింది. "చనిపోయిన వ్యక్తిని తన భర్తేమోనని అనుకుని కంటనీరు పెట్టిన మహిళ" ఆ వార్త తన ఫొటోతో సహా... ఒక్కసారిగా వొళ్లంతా చల్లగా అయిపోయింది. నోట మాట పెగలటం లేదు. అలా కూచుండిపోయింది అంజలి.

ఇక ఫోన్ల మీద ఫోన్లు... తోబుట్టువుల నుండి, స్నేహితుల నుండి, తెలిసిన బంధువుల నుండి వస్తూనే వున్నాయి. అంజలికి ఏమీ తోచడం లేదు. అలా పడుకుంది. అన్యమనస్కంగానే పిల్లల్ని స్కూళ్లకు పంపింది. ఇక ఏంచెయ్యాలో తెలియక కూర్చున్న సమయంలో... తలుపు చప్పుడు. ఏదో భయం! ఎవరో.. ఏమడుగుతారో? అనుకుంటూ తలుపు తీయగానే కనబడిన భర్తను చూసి ఏడుపు ఆపుకోలేకపోయింది.

"ఊరుకో అంజూ... నేను వచ్చేసాగా"

"పొరపాటయ్యిందండి. నేను నిన్న కంగారుగా..." అనేంతలోనే

"నాకు తెలుసు. నేను ఉదయమే పేపర్లో చూసాను. చదివాను"

"మీరు ఇన్నాళ్లూ ఎక్కడున్నారు?"

"ఇంట్లో వుంటే నిరంతరం ఈ అప్పులగోల అని స్నేహితుని గదిలో ఈ ఊర్లోనే ఉన్నాను. అయినా నేను మిమ్మల్ని వదిలి ఎక్కడికి వెళ్లగలను చెప్పు?"



"నన్ను క్షమించండి. అనవసరంగా గుట్టుగా సాగే మన జీవితాన్ని రోడ్డుమీదకు లాగాను"

"అంజూ... నువ్వు చేసిన తప్పేమీలేదు... అందులో అందరికీ ఏమి కనబడుతోందో నాకు తెలియదు. నాకు అనవసరం కూడా. నాకు మాత్రం నాపై నీకున్న ప్రేమే కనబడింది. ఎంత ప్రేమను ఈ రొటీన్ జీవితంలో పోగొట్టుకుంటున్నానో అనిపించింది. ఎవరో ఏదో అన్నారని బాధపడడానికి మనం ఒకరి కోసం బతకటం లేదు. మనం ఆవేదనలో వుంటే ఓదార్చే గుణం లేకుండా వుండే వారికి మనల్ని ప్రశ్నించే హక్కు కూడా లేదు. ఇంత ప్రేమను నాపై గల నిన్ను ఎన్నో మాటలని, నేను చేసిన తప్పుకు నిన్ను వేరొకరి చేత కూడా అనిపించినందుకు నిజంగా తలదించుకుంటున్నాను. నన్ను క్షమించు. ఉన్న అప్పులను ఎలాగోలా తీర్చడానికి ఈరోజు నుండే ప్రయత్నిస్తాను. మిగిలిన జీవితాన్ని ఉన్నదానిలో జీవిస్తూ మనకోసం మనం సంతోషంగా జీవిద్దాం... జీవించినంత కాలం కన్నీళ్లకు స్వస్తి చెబుదాం. సరేనా" అంటూ దగ్గరకు తీసుకోగానే... అంజలి మరింత చేరువయ్యింది.. ప్రేమతో.

*"కథాకేళి" మాసపత్రికలో 2009 సంవత్సరం బహుమతి పొందిన కథ*

# సరికొత్త సూర్యోదయం

“మధూ...! మధూ...!” అంటూ గోడ అవతల నుండి సుజాత ఆంటి గొంతు వినబడింది మాధవికి...

“ఏంటి ఆంటీ?” అంటూ చదువుతున్న పేపర్ పక్కనే పెట్టి వెళ్లింది మాధవి.

“ఏమీలేదమ్మా... ఏదయి నా పనిమీద వున్నావా? పని ఏదయినా వుంటే చేసుకోమ్మా... పర్వాలేదులే.. మా అబ్బాయి అమెరికా నుండి నాకు నెక్లస్ పంపాడు. అది నీకు చూపుదామని అంతే” అంటూ చేతిలో వున్న నెక్లస్‌ను చూపింది.. ముఖం అంతా ఆనందంతో నిండిపోగా.

అది గమనించిన మాధవి “చాలా బావుంది ఆంటీ... మీకయితే ఇంకా బావుంటుంది...” అంది నవ్వుతూ చేతులోకి తీసుకుని చూస్తూ..

“దీని ఖరీదెంత అనుకుంటున్నావు?” అడిగింది అదో ఆనందంతో.

“నాకు తెలియదాంటీ... నేనెప్పుడూ ఇంత బంగారాన్ని కొనలేదు. మీరే చెప్పండి” అంది నవ్వుతూ.

“డెబ్బై అయిదు వేలటమ్మా... అదీ నా కోడలికి తెలియకుండా పంపాడు పిచ్చి నాగన్న... వాడికి నేనంటే ఎంత ప్రేమో” అంది మరింత మురిసిపోతూ సుజాత.

“అలాగా...” అని ఇంకే వివరాలు అడగకపోవడంతో “నీకో విషయం తెలుసా..? అసలు నా కోడలికి మా అబ్బాయి మా ఇంటికి రావడం కూడా ఇష్టం వుండదు. ఇక్కడకొచ్చినా వారం కూడా వుండనివ్వదు. మొన్నటికి మొన్న నన్ను పుణ్యక్షేత్రాలకు పంపుతానంటే ఎందుకు ఆవిడకు ఆరోగ్యం బాగుండదు. మనతో పాటు తీసుకెళదాములే



అంటోంది. అయినా అవన్నీ మా వాడు పట్టించుకోడులే...” అంటున్న ఆ మాటలు ఆగవని గ్రహించిన మాధవి “ఆంటీ.. ఏమనుకోకండి. మావారు పిలుస్తున్నట్లున్నారు. నేను మళ్లీ కలుస్తాను!” అంటూ బయటపడింది.

“ఏంటో దాదాపు డెబ్బై ఏళ్లున్న సుజాతమ్మకు కొడుకుపై ప్రేమ వుండటం సహజమే. కానీ, కోడలిని ఆడిపోసుకోవడం అనేది అనవసరం. అయినా వీరు మారరా? ఆరోగ్యం బాగుండదని తనతో తీసుకెళతానంది కానీ పంపొద్దు అనలేదుకదా? బంగారంపై అంత ఇష్టత ఎందుకో అనుకుంటూ సగం చదివి వదిలేసిన పేపర్‌ను చేతిలోకి తీసుకుంది మాధవి.

సామాన్యంగా ఆడవారందరికి బంగారంపై మోజు వుంటుంది కానీ... మాధవికి చిన్నతనం నుండి అస్సలేమాత్రం ఉండేది కాదు. తాను పుట్టి పెరిగింది మధ్యతరగతి కుటుంబంలో... ఆరుగురు సంతానం మధ్య పెరగటం వల్లనో మరో కారణమో తెలియదు కానీ మాధవికి దేనిమీదా పెద్దగా మక్కువ వుండదు. అందుకే ఎపుడూ, ఏదో కొనుక్కోలేదని ఎపుడూ బాధపడదు కూడా. తలుపు వేసినా కుడా సుజాత ఆంటి వేరెవరికో తనకు కొడుకు నగ ఇచ్చిన సంగతి కోడలు మనస్తత్వం గూర్చి చెబుతున్న మాటలు వినబడుతూనే ఉన్నాయి. వీరు మారరు అనుకుని మాధవి తన భర్త ఊరి ప్రయాణానికి బ్యాగ్ సర్దడానికి లోపలికి వెళ్లింది.

“మధూ.. అన్నీ సర్దావా? పోయినసారి నువ్వు సాక్స్ పెట్టలేదు. నిన్ను నమ్ముకుని నేను తెల్లవారేసరికి నా పరిస్థితి చాలా చిరాకుగా మారింది. సరే ఏం చెయ్యను? పాతవే వేసుకుని బయటకు వెళ్లిన నేను రూమ్‌కు వచ్చేటపుడు కొత్తవి కొనాల్సి వచ్చింది. అనవసరంగా డబ్బు వేస్టయింది. తర్వాత నల్ల ప్యాంటుమీద ఆ గోల్డు కలర్ షర్ట్ పెట్టకుండా గ్రీన్ షర్ట్ పెట్టావు.. ఛీ.. నలుగురిలో సిగ్గేసిందనుకో...” అంటూ ఏవేవో మాధవి చేసిన తప్పుల్ని పొరపాట్లను చెబుతూనే వున్నాడు.

ఆ మాటలకు అడ్డు తగులుతూ.. “మీకేం కావాలో మీరే ఉదయం బయటపెట్టేస్తే నేను సర్దేస్తాను కదా...” అంది మెల్లగా మాధవి.

“అంతా నేనే చూసుకుంటే తమరేం చేస్తారట? కూర్చుని తింటారా? అందరూ అంటున్నారు ఏంటి? ఈ రోజుల్లో కూడా నీ భార్య అంత చదువుకుని ఇంట్లోనే వుంటోందా? నిజంగా నిన్ను మెచ్చుకోవాలి... నీ అంత మంచివాడు ఎక్కడ దొరుకుతారు అని... నువ్వేమో.. ఏదో ఉదయం పిల్లలికి కాస్త వండి పెట్టడానికి కూడా ఎంతో అలసిపోయినట్లు ఫీలవుతూ... కనీసం భర్త ఊరు వెడుతున్నా... బ్యాగ్ సరిగా సర్దడానికి కూడా ఓపిక లేకుండా టీవి చూస్తూ కాలక్షేపం చేస్తున్నావు. అయినా నిన్ననీ ఏం లాభం? మీ నాన్నను

అనాలి. ఎందుకూ పనికిరానిదాన్ని నాకు అంటకట్టాడు" అంటూ విసుగుతో భర్త మూర్తి మాటలు పడుతూనే మౌనంగా వుండకుండా...

"అలాంటపుడు పెళ్లయిన కొత్తలోనే ఇలా అని వుంటే నేను కూడా సంపాదనలో పడి ఉండేదాన్ని. ఇప్పుడు మీరు రాత్రిదాకా పనిచేయమంటే నావల్ల కాదు. అయినా మీకు కావాల్సింది అనాల్సింది ఏదో మనసులో ఉంచుకుని మీరిలా సందర్భం లేకుండా మాట్లాడటం మంచిది కాదు" అంది మాధవి కాస్త కోపంగా.

"మాటకు మాట.. బాగా నేర్చావు.. మూడుపూట్ల తిని నీడ పట్టున ఉంటున్నావు కదా...!" అంటూ తిన్న చేతిని మాధవి కొంగుకే తుడుచుకుని బయటపడ్డాడు మూర్తి.

ఇక ఆపై ఇంకేమీ మాట్లాడలేకపోయింది. మాధవి. ఏంటి? తాను తిన్నది... అతను పెట్టింది? అని కాస్సేపు ఆలోచిస్తే పెదవులపై విరక్తిని సూచించే నవ్వొకటి విరిసింది. మగవాడు అనడం ఆడవారు పడటం అనేది కాలం ఎంత ఆధునికంలోకి పరుగులు తీస్తున్నా తప్పటం లేదు. నాగరికత అంటూ ఏదైనా వుంది అంటే స్త్రీ కూడా సంపాదించడం... సరే.. అంటూ అంతలో కాలేజికని వెళ్లిన పిల్లలు రావడంతో వారి పనిలో పడింది మాధవి.

అంతలో పక్కింటి ఆంటీ... సుజాత మళ్లీ పిలవడంతో.. ఏమయిందో అనుకుంటూ ఏంటి ఆంటి? అడిగింది పక్కనే వున్న తలుపును తీస్తూ...

ఏమీలేదమ్మా... ఇందాకా నువ్వు మీవారితో ఏదో తగువులాడుతున్నట్లున్నావు.. వినబడిందిలే... మగాళ్లు అంతేనమ్మా.. ఈరోజు మీ అంకుల్ చాలా సౌమ్యంగా కనబడుతున్నారే కానీ పెళ్లయిన కొత్తలో ఆయనా అంతే.. అయినదానికి, కానిదానికి ఒకటే గొడవ... ఛ..ఛ.. చాలా పడ్డానమ్మా... అయినా మాటకు మాట అస్సలు నేను నీలా ఇచ్చేదాన్ని కాను... అలా మౌనంగా పడి వుండేదాన్ని... అంటున్న ఆమె తనను పొగుడుతోందో, తెగుడుతోందో తెలియనట్లయింది మాధవి పరిస్థితి.. అయినా ఊరుకోకుండా... "నేను మాటకు మాట ఇవ్వటం లేదాంటీ... మరీ మా నాన్నను తిట్టడమెందుకని అన్నానంతే..." అంది మెల్లగా

"అదే, అలానే మన పుట్టింటివారిని అనడమే వారికి అలవాటు.. చదువుకున్నావు కదా ఎలా పడతావులే? అయినా ఏ ఊరయినా వెళితే, నీకోసం కనీసం చీరయినా తెస్తారా?" అంది ఆరా తీస్తూ...

"అపుడపుడూ ఆంటీ.. అయినా నాకు వాటిమీద పెద్దగా ఇష్టముండదు. ఉన్నాయి కదా... చాలు అనిపిస్తుంది. ఏదో సరదాగా నవ్వుకుంటూ గడిపేయాలనిపిస్తుంది ఆంటీ.. కానీ... ఈ మగవారు భార్యతో కలిసి సరదాగా సమానంగా మాట్లాడితే తామేదో



తగ్గిపోయినట్లు ఫీలవుతారు" అంది మాధవి.. కాస్త నిరాశ ధ్వనించే స్వరంతో.

"మా కాలాల్లో ఎంతో భయపడి చచ్చేవారం అనుకో... వారు కళ్లతో చెబితే దాసీల్లా పనిచేయాల్సిందే... కాదు కూడదు అన్నానో... ఇక అంతే, పుట్టింటికి పంపేవారు. అయినా మేము నోరెత్తకుండా ఇప్పటిదాకా వుంటున్నాం కూడా... ఇక సరదానా.. అలాంటి మాటలే వుండేవి కావు... ఏదో ఇప్పుడంటే పెద్దాడు పెళ్లయాక వాడింటికి వెళితే సినిమాలు, గుళ్లూ గోపురాలు అంతే... అయినా నాకోడలుందే అమ్మో" అని మొదలెట్టగానే... "ఆంటీ అబ్బాయి పిలుస్తున్నాడు మళ్లీ మాట్లాడతాను" అంటూ లోనికి రాబోయింది. అయినా ఆపి.. "ఆగు... అసలు విషయం చెప్పడం మరిచాను. మా అబ్బాయి ఎల్లుండి వస్తున్నాడు. నేను, మీ అంకులూ, కోడలూ అందరూ కాశీ వెళుతున్నాం" అంటూ ఆనందం అంతా ముఖం నిండా వెల్లివిరియగా చెప్పింది సుజాత.

పాపం.. ఈ పెద్దవారు.. చిన్న విషయానికే ఎంత ఆనందపడతారో అనుకుంటూ "అలాగా ఆంటీ.. వెళ్లండి... వెళ్లండి.. మీరెప్పటి నుండో కాశీ వెళ్లాలని అనుకుంటు న్నారు... ఇన్నాళ్లకు కుదిరింది. వెళ్లండి ఆంటీ" అంది ఆనందంగా.. మాధవి.

"సరేనమ్మా... నువ్వేదో పని వుందన్నావు కదా... చేసుకో.. నేను అబ్బాయికి చేగోడీలు అంటే ఎంతో ఇష్టం.. రాగానే నేను చేతికి ఇచ్చాననుకో.. అమ్మా... నాకోసం ఎంత కష్టపడిచేసావే అంటూ నా భుజాల చుట్టూ చేతులు వేస్తూ మరీ చిన్నపిల్లాడివై పోతాడనుకో..." అంటూ ఆనందంగా లోపలికి వెళ్లింది.

సుజాతకు నవ్వు వచ్చింది. ఆవిడ సరదా చూసి... ముచ్చటేసింది కూడా... చిన్నతనంలోనే అమ్మపోయింది కానీ... ఉండి వుంటే అమ్మ కూడా ఇలాగే వుండేదేమో... అనుకుంది మాధవి లోపలికి వస్తూ... మళ్లీ చిన్న చిన్న వంట పనులలో పడింది.

ఇలాగే దాదాపు పదిహేను రోజులు గడిచాయి. మూర్తి ఇంటికి వచ్చేరు. ఉన్న దాంట్లోనే సంసారం గడిపింది. ఎంతో సరదాగా కాశీ వెళ్లిన సుజాతాంటీ కూడా తిరిగి వచ్చింది. కొడుకు, కోడలు, మనవలు, మనవరాళ్లతో ఇల్లు చాలా సందడిగా వుంది. విషయం మూర్తితో చెప్పింది కూడా. విన్న మూర్తి "ఏం? నీకూ వెళ్లాలని వుందా? మనకు ఇప్పుడేం కుదురుతుంది? పిల్లలు బాధ్యతలు అంటూ వుంటాయి కదా...! నీకు అంత ఇష్టంగా వుంటే చెప్పు. ఏదో ట్రావెల్స్ ద్వారా పంపేస్తాను" అంటున్న మాటల్లో వెటకారం మాధవిని ఎంతో బాధించింది. అయినా మాటకు మాట పెంచడం ఇష్టంలేక ఊరుకుంది.

***

"అమ్మాయి...! మాధవీ?"

"చెప్పండి ఆంటీ... ఎలా జరిగింది ప్రయాణం? మీరు రావడం నాకు వారం

క్రితమే తెలుసు కానీ మీరేదో హడావిడిగా వున్నారని పలకరించలేదు. అందరూ వెళ్లారా ఆంటీ?" అంది యథాలాపంగా పలకరిస్తూ... మాధవి.

"వెళ్లారమ్మా... కానీ నీకు ప్రసాదం ఇద్దామని వచ్చినప్పటినుండి ప్రయత్నిస్తున్నా... ఏదీ సమయం వుంటేగా? పసిపిల్లలు కదా.. జాగ్రత్తగా చూసుకోవాలి మరి... దానికి తోడు పనిపిల్ల ఇప్పుడే మానేయడం మరింత ఇబ్బందిగా వుంది" అంటూ సంజాయిషీ ఇచ్చుకుంది సుజాత.

"అబ్బే... మరేం పర్లేదు ఆంటీ. నేను చూస్తున్నాను కదా!" అంటూ అందుకుంది.

ఇక అప్పటినుండి మొదలు పెట్టింది. తానెలా ప్రయాణం చేసిందో.. దర్శనం ఎంత డబ్బు పెట్టి ముందుగా ఏ కష్టంలేకుండా తన కొడుకు ఎలా చూసుకున్నాడో అని చెప్పడం ఆరంభించింది. తను కొనుక్కున్న చీరలు.. తన కోడలికన్నా ఎంత రేటు తక్కువగా వున్నాయో చెప్పి బాధపడింది కూడా... తన కొడుకు కొందామనుకున్నా... తన కోడలు ఎలా అడ్డు తగిలిందో కూడా చెబుతూనే ఉంది. ఆ మాటలకు అడ్డు తగులుతూ... మరి కాశీలో ఏదో మనకిష్టమయిన తినుబండారం వదిలేస్తారుటగా... మీరేం వదిలేసారాంటీ?" అంటూ అడిగింది మాధవి.

"మరి ఎందుకు వదిలేయలేదూ... నేను నా కిష్టమైన బెండకాయ వదిలేసాను. ఎందుకంటే ఇందులో ఒక మతలబు ఉంది. మీ అంకుల్‌కేమో ఇష్టం ఉండదు. ఆ కూర వండుకున్నప్పుడల్లా అంకుల్‌కు మరో కూర వండాలి. అలాగని నేను వండుకోకుండా వుండను. అందుకని ఇలా ఏదో ఒకటి చేస్తే తప్ప నేను మానలేనని ఈ నిర్ణయం తీసుకున్నాను" అంది తన తెలివిని ప్రదర్శిస్తూ సుజాత.

సుజాత తెలివికి, ముందుచూపుకు చిన్నగా నవ్వుకుంటూ "పోనీలెండి... మంచిపని చేసి ఒక పెద్ద పనిని తప్పించుకున్నారు." అంది.

"నా కోడలు సంగతి అడగవేం? తనేం వదలదటమ్మా... మేము మళ్లీ వచ్చినపుడు వదిలేస్తాం అత్తయ్యా... ఈసారికి ఇలా కానివ్వండి. అంది ముఖంమీదే. అంటే ఈసారి మీరు రావద్దనే కదా అర్థం? అంతమాత్రం తెలియదనుకుందా ఏంటి? తనలాగా ఇంగ్లీష చదవలేదు... ఈవిడకేం తెలుసులే అనుకుని ఆ పిల్ల నా కొడుకుతో ఇంగ్లీషులో మాట్లాడు తుందమ్మా... అవన్నీ నామీదే... నాకు తెలియదనుకుంటోంది. ఆ మాత్రం ముఖ కవళికలు పట్టలేనా ఏంటి? అంది కళ్లజోడు సరిచేసుకుంటూ... సుజాత.

ఆవిడ మాటలు వింటూంటే జీవితాన్ని తరచి చూసిన వృద్ధాప్యం కంటే మాధవికి పసితనం కనబడింది. "బాల్యం వృద్ధాప్యం" ఒకటే అనే మాట స్ఫురిస్తోంది. ఒక వస్తువును నాదంటే నాదనే మనస్తత్వం కనబడుతోంది. ఎలాగోలా తప్పించుకుని లోపలికి వచ్చింది.

***

"మధూ... ఏం చేస్తున్నావ్?" అనే మూర్తి మాటలకు ఉలిక్కిపడి లేచి "ఇప్పుడే నిద్ర పట్టిందండి.." అంది మెల్లగా.

"మధూ... మొన్న మీ అన్నయ్య వాళ్లు మీ అమ్మ తాలూకు డబ్బును ఇచ్చారు కదా? ఏం చేసావు" అడిగాడు.. కాస్త తీవ్రంగానే.

"అవును... అది తీసుకోవడం కొన్ని బాకీలు తీర్చగా మిగిలింది పదివేలు అంతే. అది చిన్నదాని పేరు మీద డిపాజిట్ చేసాను. అయినా ఆ విషయం మీకు మొన్ననే మీరు అడగకముందే చెప్పానుగా..." అంది గుర్తు చేయాలని ప్రయత్నిస్తూ.

"చెప్పావులే... కానీ ఇప్పుడు దానికి పదివేలతో ఏమంత అవసరం వుంది? నేను ఏదైనా అవసరం వుంటే ఇస్తాగా... నువ్వు వీలయితే ఉదయం నాకు పదివేలు ఇస్తే.. నాకు అర్జంట్ పని పడింది. తర్వాత వారంలోగా నీకిస్తాను" అన్నాడు నిజాయితీగా మూర్తి.

"ఛ... ఏం మాటలండీ ఇవి... డబ్బు అనేది ఒక ఇంట్లో నీది నాది అంటూ రెండు రకాలు వుండవు. మనది అంతే. మీకంతగా అవసరం వుంటే రేపే ఇస్తాను. ఇదేమయినా అప్పా? మళ్లీ వారం ఇవ్వడానికి.. మీరు పడుకోండి.. ఏంటో ఇందాకటి నుండి అలా ఆలోచిస్తున్నారు" అంది మాధవి నిద్రపోవడానికి ఉపక్రమిస్తూ.

ఆమాటలకు మురిసిపోయిన మూర్తి– "అవునూ... నిన్న నువ్వు తలనొప్పి అన్నావు తగ్గిందా" అడిగాడు అనునయంగా తలపై చెయ్యివేస్తూ.

"తగ్గింది.. టాబ్లెట్ వేసుకున్నాను" అంది మాధవి ముక్తసరిగా.

"పర్లేదు పట్టమంటావా... రేపు తప్పకుండా డాక్టర్ దగ్గరకు వెళదాం. సరేనా.. నాకెన్ని పనులున్నా నిన్ను ముందు అక్కడికి తీసుకెళ్లిన తర్వాతే" అంటూ ఏవో మాటలు ఎంతో బాధ్యతగా మాట్లాడాడు మూర్తి. ఇలాంటి మాటలు ఏదైనా డబ్బో లేక అమ్ముకో వడానికి నగో ఇచ్చినరోజున వినిపిస్తూనే వుంటాయి.

ఆ మాటలకు మాధవి ఏమీ స్పందించలేదు. ఒక్కటి మాత్రం అనుకుంది. ఇక రెండు రోజుల వరకు తనకు ఎలాంటి సతాయింపు వుండదని. మనుషుల వారి మధ్య అనుబంధం లేకపోవడంలో కొత్తదనం లేదు. కానీ ముఖాలు కూడా రూపాయినోట్లుగా మారిపోతుంటే ఎవరికోసం బతకాలో... ఎందుకోసం ఇంకా బతకాలో అర్థం కావడం లేదనిపించింది మాధవికి. రాను రాను తన ధోరణిలో ఎంతో మార్పు తనకే కనబడుతోంది. ఎందుకిలా వున్న కాస్త జీవితాన్ని నరకం చేసుకుంటారో తెలియని స్థితిలో వుంది. తాను పడుకుందో లేదో తెలియని మూర్తి మధూ... మధూ.. అంటూ రెండుసార్లు పిలిచాడు.

మాధవి నిద్రలో లేకున్నా పలకాలని లేక పలకలేదు. తనకు ఒకటే ఆలోచన. తనకెంతకాలం ఇలాంటి ఈ జీవితం?

ఒకవైపు కాశీకి వెళ్లినా ఇష్టమైన కూరల్ని వదిలి వచ్చేబదులు సాటి మనసుకు నిత్యం కష్టం కలిగించే గుణాలు ఒక్కొక్కటి వదలచ్చు కదా? నిత్యం కోడల్ని పరాయివ్యక్తిగా చూస్తూ నిందలు వేసేతత్వానికి నీళ్లు వదిలేయవచ్చుగా? అలాగే డబ్బే ప్రధానంగా భావించే మూర్తిలాంటివారు భార్యకు కూడా మనసుంది, ఆమె ఒక వస్తువు కాదు అనే భావానికి నీళ్లు వదిలేయవచ్చుగా? “వీరికి మనసుండదా? మరమనుషుల్లా ప్రవర్తించే వీరి తీరులో మార్పు వస్తుందా? ఒక సూర్యోదయాన్ని, ఒక సూర్యాస్తమయాన్ని ఆకుల కదలికలను, పక్షుల అరుపులను, పసిపిల్లల ఆటలను గమనించలేని జీవితాలు ఇలాగే వుంటాయి మరి” అని అనుకుని వచ్చే సూర్యోదయానికై ఎదురుచూస్తూ నిద్రాదేవి ఒడిలోకి జారుకుంది... మాధవి.

*(ఆంధ్రభూమి దినపత్రికలో )*



# ప్రేమ శిఖరాల మీద...!

పరిచయం...

కాస్సేపు మాట్లాడటమా?

లేక కనబడినపుడల్లా మాట్లాడటమా?

మాట్లాడుతూనే వుండటమా?

అదికాస్త పెరిగితే అదే ప్రేమా...? ఈ ప్రేమంటే ఎందుకో ఒక రకమైన భయం నాకు. ఎందుకంటే అందులో స్వచ్ఛతలేని ప్రేమలు చాలా కనబడుతున్నాయి. నిలకడలేని ప్రేమలు కనబడుతున్నాయి. టైంపాస్ అనే ప్రేమలు, ముందు ప్రేమ, వెనకేమో ఇదో న్యూసెన్స్ అని చులకనగా మాట్లాడుకునే ప్రేమలు, అవసరానికి ప్రేమ, జీవితంలో అనుకున్నది సాధించడానికి ప్రేమ, డబ్బుకోసం ప్రేమ, బలవంతపు ప్రేమ ఇన్నింటిలో చిక్కుకున్న ప్రేమ ఒక్కసారిగా నాకు నాకే స్వచ్ఛంగా అందాలనుకోవడం పిచ్చికదూ! వీటిల్లో నన్నేది ఆక్రమిస్తుందో అని భయం నాకు. అయినా వద్దనుకుంటే రాకుండా వుండడానికి, కావాలనుకుంటే దొరకడానికి ప్రేమ అంగట్లో దొరికే వస్తువు కాదు కదా? ఒక అనుభూతి అంతే... అలాంటిదే నాకూ ఎదురైంది. ఇది ఎందుకు నా ముందు నిలబడింది. దాన్ని వద్దనుకుందామన్నా, పట్టించుకోనట్లు వుందామన్నా అసలు మనసు మరలనని మొరాయిస్తున్నంత ప్రేమ నెలా దాచుకోను? తప్పదు ప్రేమకు దాసోహం అవ్వకూడదనుకుంటూనే అయిపోయాను. నన్ను నేను మరిచిపోయేంతగానే కాదు నా చుట్టూ బంధాలు, బాధ్యతలు మరిచిపోయేంతగా... లోకం ఏమనుకుంటుందో.. ఎలాంటి ముద్ర వేస్తుందో అని తెలుసుకోలేనంతగా... జీవితం ఏమవుతుందో అని గుర్తించలేనంతగా... నన్ను నేనే అద్దంలో చూసుకోలేనంతగా.

వయసులో ఉన్నాను కనుకేమో ఈ మార్పులు అనుకున్నాను. అందుకు నేనే నిలువెత్తు సాక్ష్యమై నిలబడి వున్నాను. దారిలో శబ్దం వినిపిస్తే చిరాగ్గా చూసే నేను చిరునవ్వుతో చూస్తున్నాను. ఎవరు నన్ను కాదని మాట్లాడినా భరించలేని నేను ఆ మాటను అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఏం సాధించాను ఈ జీవితంలో అని ఆవేదన చెందే నేను సర్వ సంపదలూ నా సొంతమైనట్లే వున్నాను. ఆకలిని, అపజయాన్ని, అవమానాల్ని అన్నింటినీ అవలీలగా జయించాను. కనబడే ప్రతి వస్తువు కొనే అలవాటు నుండి దూరమయ్యాను. అలంకరణపై మోజు తగ్గించాను. నన్ను నేనుగా నిలుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. కోపం, ఆవేశం, అవివేకానికి స్వస్తి పలికాను. ఇప్పుడు వింటున్నాను. కనులారా ప్రతీదీ చూస్తున్నాను. కంటినిండా నిద్రపోతున్నాను. అన్నం అంటేనే చాలా దూరంగా వుండే నేను అన్నంలో పరమాత్మను చూస్తున్నాను. పేదరికాన్ని పలకరిస్తున్నాను. భిక్షగత్తె ఆవేదనల్ని వింటున్నాను. వానలో తడుస్తున్నాను. ఎండంటే చాలాదూరం పారిపోయే నేను ఎండకే గొడుగునవుతున్నాను. చలికి చలించకుండా చన్నీళ్లనే ఆహ్వానిస్తున్నాను. ఇంటిముందు చెత్తడబ్బా కూడా ఒక అందమైన ఆకారంలో కనిపిస్తోంది. ఆలస్యమయినా పనిమనిషిపై కోపం దిగమింగుకుంటున్నాను. నాకంటూ కొత్త ప్రపంచాన్ని ఇన్నాళ్లూ పోగొట్టుకున్నానా అని అనిపించింది. అలా అన్నీ నేనే అయి జీవిస్తున్నాను.

ఇవన్నీ ఏమిటి? ఈ మార్పులన్నీ ప్రేమవలననే అనుకుంటున్నాను. ఉన్నట్లుండి ప్రపంచమంతా ఎంతో అందంగా కనిపిస్తోంది. అంతలో ఫోను మోగింది... నాకయితే గుండె కొత్తగా కొట్టుకుంటోంది. ఒకరోజు మామూలుగానే తను విశాల్‌ను చూసింది. కానీ తన చూపులో ఏదో కొత్తదనం వుందనిపించింది. దాంతోపాటు సన్నగా నవ్వు... ఎందుకు నవ్వాడు? అర్థం కాలేదు. అడుగుదామంటే ఏదో జంకు. బాగోదేమో... తనంతట తాను మాట్లాడితే అదేంటి ప్రత్యేకంగా విశాల్‌తో మాట్లాడుతోంది? అని అక్కడున్న అందరూ అనుకుంటారేమోనని భయం... తప్పదు కదా! అనుకుంటూ సరిగ్గా పదిరోజుల కిందట కాలేజీలో జరిగిన సంఘటనను గుర్తు చేసుకున్నాను. ఎందుకంటే నాలో ఇంత ఆనందానికి కారణం అదే కనుక.

"హల్లో..." అనే విశాల్ పలకరింపు... "నన్నేనా?" అన్నట్లు నా చూపు

"మిమ్మల్నేనండి... మీ పుస్తకంలోంచి నిన్న ఈ పేపరు క్లాసులో పడిపోయింది"

"థ్యాంక్సండీ..." అంటూ ఆ పేపర్ తీసింది. అసలు పేపరేంటి? తన పుస్తకంలోంచి పడటమేంటి? అది నా పేపరేనని తనకెలా తెలుసు? అనే సందేహాలతో పేపర్‌లోకి చూసింది. అంతే తన కళ్లను తానే నమ్మలేకపోయాయి. అక్షరాల వెంట కళ్లు పరుగులు తీసాయి. గుండె వేగం హెచ్చింది. "కీర్తీ! నిజంగా నేను ఊహించుకున్న రూపం నీలో వుంది. గత సంవత్సరంగా నిన్ను చూస్తూ దూరంగానే వున్నాను. కానీ ఈ మధ్య ఎందుకో చెప్పడం, నాలోని ప్రేమను తెలియజేయడం మంచిదనిపించింది. సమాధానం నువ్వు వెంటనే ఇవ్వమని నేను కోరను. ఎందుకంటే నీకూ ఆలోచన అనేది వుంటుంది కదా? నిదానంగా నీ అభిప్రాయాన్ని తెలుపుతావని ఆశిస్తూంటాను. అలాగని ఒక్కమాట కాదని మాత్రం చెప్పకు. తట్టుకోలేను. అలాగని చనిపోతానని మాత్రం చెప్పను. ఎందుకంటే నన్ను ప్రాణంగా చూసుకునే తల్లి, చెల్లి ఉన్నారు. వారిని వదిలి నేను ఎక్కడికీ వెళ్లలేను. నేను నీ సెల్ ద్వారా నా విన్నపాన్ని తెలపవచ్చు. కానీ నా దృష్టిలో పేపరులో అక్షరాలకు ఎంతో విలువ. నాకు ఉత్తరం అంటే ఇష్టం. పాటలు వినడం, హాస్యభరితమైన సినిమాలు చూడటం ఇష్టం. ఇందులో తప్పులుండవు. ఉండేవి రెండే... అవి నీకు ఇష్టం లేకుంటే నా ప్రేమ, ఏమాత్రం పరియయం లేకుండానే నువ్వు అనే నా సంభోదన మాత్రమే" ప్రేమంటే ఏమిటో సినిమాలు చూపుతున్నాయి. పుస్తకాలు తెలుపుతున్నాయి. కానీ నాకు తెలిసి ప్రేమంటే అమ్మ.. ఆ తర్వాత తననే నమ్ముకుని తనతోనే లోకమనే భార్య... ఉంటాను. విశాల్" ఒక్కసారిగా అంతటి వానలో చెమటలు పట్టాయి. తనలో ప్రేమ వుంది. బాధ్యత వుంది. అయినా ఇలా ఉన్నపళాన అడగటం ఇబ్బందిగానే ఉంది. కానీ... తనే నిదానంగా చెప్పమన్నాడు కదా? ఈ విషయం ఎవరికి చెప్పాలి? అమ్మో ఇంకేమయినా ఉందా? ఫ్రెండ్సంతా ఏడిపించరూ? అమ్మకు చెపితే? ఎలా వుంటుంది? కోప్పడుతుందా? అసలెలా తీసుకుంటుంది? ఎప్పుడూ అమ్మ తనను కోప్పడలేదు. ఎంతో స్నేహంగానే ఉంటుంది. అలాంటపుడు అమ్మకు తెలియకుండా ఈ విషయాన్ని దాచడం అంత మంచిదికాదేమో.. నిజమే కదా? అనుకుని నిద్రబోయను నిశ్చింతగా...

***

ఎపుడూ లేవనంతగా తొందరగా ఆ రోజున నిద్రలేచాను. అమ్మతో ఎప్పుడు తీరిగ్గా మాట్లాడే సమయం వస్తుందా అని ఎదురుచూసాను. కానీ అవకాశం కోసం, సమయం కోసం ఎదురుచూడటం అంత మంచిది కాదనిపించింది. అమ్మకూడా నన్ను గమనిస్తోంది. ఎపుడూ సహాయం చేద్దామంటూ వంటింటి ఛాయలకు కూడా రాని తాను ఆ రోజు ఏకంగా అమ్మకు సాయం చేసేయడం, వంటగదిని శుభ్రం చేయడం లాంటి పనులు నాకే తెలియకుండా నాకు నేనే కొత్తగా కనిపిస్తున్నాను. అమ్మ కూడా చిరునవ్వుతో నన్ను చూస్తోంది. అంతా పని అయిపోయాక అన్నం తిన్నాననిపించి నేను నా గదిలోకి వెళ్లి పడుకున్నాను. నా వెంటే అమ్మ కూడా రావడం ఆశ్చర్యం వేసింది. "కీర్తీ! ఏమ్మా? నీకు డబ్బు కావాలా? అంటే ఎక్కడికైనా స్నేహితులతో వెళ్లాలా" అంది నవ్వుతూ అమ్మ.

"అబ్బే అదేం లేదమ్మా.. నీతో ఒక విషయం మాట్లాడాలని...?"

"మాటలా నాతోనా? ఏ విషయమే?" అంటూ కంగారుగా అడిగింది అమ్మ.

ఇక మాటలతో ఏ పని వుందంటూ ఏకంగా ఉత్తరమే అమ్మ చేతిలో పెట్టింది కీర్తి. అది చదివి ఒక్క క్షణం మౌనంగా వుండిపోయింది.

"కీర్తీ? విశాల్ ఏ క్లాసు చదువుతున్నాడు?"

"బి.ఇ. ఫైనలియర్ అమ్మా"

"నీకు పరిచయం ఉందా?"

"లేదమ్మా... చూసాను కానీ.. పరిచయం అయితే లేదు అంటే మాట్లాడటం అనేది ఎపుడూ జరగలేదు" అన్నాను.

"ఇంకా తన గురించి నీకేం తెలుసు చెప్పు?"

" నాకు తెలిసి తనపేరు ఏ విషయంలోనూ నాకు వినబడాలని గానీ, తాను కూడా ఏదో ఎవరో గుర్తించాలని ప్రయత్నించడం కానీ జరగలేదు" అన్నాను.

"అయితే నువ్వు ఏమనుకుంటున్నావు కీర్తీ?"

"నాకేమీ అర్థంకాకే నీకు చూపానమ్మా... కాకుంటే ఫ్యామిలీ అంటే ఇంత శ్రద్ధ చూపేవారు జీవితం పట్ల కూడా ఎంతో అవగాహన కలిగి వుంటారు కదానిపించింది. అదీకాక తల్లి, చెల్లి అంటే ఎంతో విలువిచ్చేవారు భార్య పట్ల కూడా.." అని పూర్తిచేసేంత లోపే అమ్మ కలుగజేసుకుని "మొదట అలానే అనిపిస్తారు. తర్వాత వారి వారి నిజ స్వరూపాలు బయటపడతాయి. మన ఈ విషయాల్లోనే కాస్త జాగ్రత్తగా వుండాలి" అంది దగ్గరకు తీసుకుంటూ.

నీ ఇష్టం అమ్మా. నాకయితే ఎలాంటి అభిప్రాయం లేదు. అందుకే సమస్యను నీ దగ్గర వుంచేను. ఇక నిర్ణయం కూడా నీదే.  కానీ నువ్వు ఏదైనా పరిష్కారం చూపుతావే మోనని నీకు చెప్పాను.

ఆ మాటలు విన్న అమ్మ ఎందుకో అడ్రసు వైపు చూసింది.

***

"ఇది విశాల్ ఇల్లేనా?"

"అవును.. మీరెవరు? మీకు విశాల్?" అంటూ సందిగ్ధంగా ఆగింది యశోదమ్మ.

"నా పేరు సుమతి. నేను కీర్తి అమ్మను"

"కీర్తి అంటే..?" మళ్లీ సందిగ్ధం.

సమాధానంగా ఉత్తరం చూపించింది సుమతి.

ఉత్తరం ఆసాంతం చదివిన యశోదమ్మ. నవ్వుతూ "ఒరేయ్ విశాల్? అంటూ గట్టిగా పిలిచింది.



"అమ్మా.. ఏంటి?" అంటూ వచ్చిన విశాల్‌కు ఒకటి రెండుసార్లు కీర్తితో వచ్చిన సుమతిని గుర్తుపట్టి ఒక్కక్షణం తటపటాయించాడు.

"ఈ వుత్తరం నువ్వు రాసిందేనా?"

"అవునమ్మా"

"సంతోషం... అయితే మీ అత్తగారికి నమస్కారం చేయి"

"అమ్మా...!"

"తప్పేముందిరా...? నీకు చదువు ఒక కొలిక్కి వచ్చింది. ఆ అమ్మాయి ఎంత గొప్పదో నువ్వు రాసిన ఆ ఉత్తరాన్ని వాళ్ల అమ్మకు ఇచ్చినపుడే అర్థమయ్యింది. ఇంకెందుకు ఆలస్యం? ఏమంటారండీ సుమతిగారూ...?"

"నిజమే... కానీ మా గురించి"

"అవసరం లేదండీ... మీ ప్రవర్తనలోనే మీ గుణం అర్థమయ్యింది. ఆస్తిపాస్తులు మాకేమీ లేవు. అలాగని మీకూ లేవని అనుకుంటాను. మాకు విశాల్, దీప్తి ఇద్దరు పిల్లలు. కానీ..." అంటూ ఆగింది యశోదమ్మ.

"సుమతిగారూ.. మీర ఇంత కరెక్టుగా అమ్మాయికి ఉత్తరం రాగానే వేరే విధంగా కాకుండా, అలాగని అల్లరీ కాకుండా మా ఇంటికి వచ్చి ఎంతో సంస్కారవంతులనిపించు కున్నారు. అలాంటిది నేను మీ దగ్గర ఏమీ దాచలేను. అందుకే చెబుతున్నా. నేను షణ్ముగం అనే వివియస్ కాలేజి ప్రిన్సిపాల్ గారి రెండో భార్యను. అదీ నన్ను పెళ్లి చేసు కుంటే తన ఉద్యోగం పోతుందని నన్ను పెళ్లి కూడా చేసుకోలేదు. అయితే నాకేమీ తక్కువ చేయలేదు..." అని పూర్తి చేసేంతలోపే "వస్తానండీ. నేను నా నిర్ణయాన్ని మీకు ఆలోచించుకుని చెబుతానంటూ" లేచి నిలబడింది.

***

అసలేం జరిగిందో నాకు తెలియదు కదా.. ఆ రోజు కాలేజీకి వెళ్లగానే విశాల్ నా క్లాసు ముందు నిలబడి మీతో మాట్లాడాలి ఒక్కసారి అలా వస్తారా? అనగానే నేను షాక్ అయ్యాను. అయినా తప్పదని సరేనని ఆవరణలో ఒకచోట నిలబడ్డాను.

"జరిగినదంతా విన్నాను. నాకేమీ తోచలేదు. మరి మీ అమ్మ మా గురించి ఏమనుకుందో తెలియదు కానీ, అలా వెళ్లిపోవడం మాత్రం నాకు, చెల్లికి చాలా బాధ వేసింది" అంటూ ఆవేదన చెందడం నాకు ఎక్కడో చిన్నగా బాధే కలిగింది. పాపం అనిపించింది.

"సరే! ఇప్పుడేం చేద్దాం?" అంటూ చూసిన కీర్తి చూపులకు.. "ఇప్పుడు మీరేం చెయ్యకండి. అమ్మ బాధపడితే మేము తట్టుకోలేము. నా పట్ల నీ అభిప్రాయం చెబుతావే మోనని..."

"అంటే అమ్మను వదిలి రమ్మనా మీ అభిప్రాయం?" సూటిగా అడిగాను.

"అలాకాదు... మీ అమ్మను ఒప్పిస్తావేమోనని.."

"విశాల్ గారూ! మీ అమ్మ మీకెంతో నాకు మా అమ్మ అంతే. ఆమె బాధపడినా నేను సహించలేను. తనను బాధపెట్టినేనేమీ చెయ్యలేను. అలాగని మీరంటే ఇష్టంలేక కాదు. మీకంటే మీ సంస్కారం నాకెంతో నచ్చింది. అలాగని నేను అమ్మను దాటి రాలేను. నాన్న ఎపుడో చిన్నప్పుడే పోయారు. అప్పటి నుండి నాలోనే తన ప్రపంచాన్ని చూసుకుని బతికింది. నన్ను ఒక బిడ్డలా కాకుండా తన స్నేహితురాలిలా ప్రవర్తించింది. ఆమెకు నేనే లోకం" అంటూ కంటతడి అడ్డురాగా ఇక నిలబడలేక క్లాసులోకి వెళ్లిపోయాను.

క్లాసులో కూర్చున్నా ఏంటో తెలియని అలజడి నన్ను చుట్టుముడుతోంది. చెట్టుకింద అచేతనంగా కూర్చున్న విశాల్‌ను చూస్తుంటే నాకు ఎందుకో ఓదార్చాలనే వుంది... కానీ ఇక అక్కడ కూర్చోలేకపోయాను. వెంటనే ఇంటిదారి పట్టాను. వెనుకగా తాను రావడం నా చూపులను దాటిపోలేదు. కానీ నేను వెనక్కు తిరగలేదు. తనతో మాట్లాడడానికి ప్రయత్నించలేదు. నాకెందుకో అవసరం అనిపించలేదు.

***

"అమ్మా! కాఫీ తాగావా?" అంటూ లోనికి వచ్చిన నన్ను చూసి "అప్పుడే వచ్చావేం"టని తన చూపులతోనే ప్రశ్నించింది అమ్మ.

అందుకు సమాధానంగా కాఫీ కలుపుకు వచ్చి నేను ఎందుకు వచ్చానో అమ్మకు చెప్పాను. ఏమీ మాట్లాడకుండా కాఫీ తాగింది. అలా అమ్మ మౌనంగా వుండటం నాకేమీ నచ్చలేదు. ఏదైనా చెప్పచ్చుగా అనిపించి "అమ్మా అలా మౌనంగా వుంటే ఎలా, ఏదైనా మాట్లాడు" అంటూ నేనే చెప్పడం మొదలుపెట్టాను. "అమ్మా! నువ్వెందుకు అలా వున్నావో నాకు తెలియదు. ఒకటి మాత్రం నిజం. నిన్ను కాదని నేనే పని చేయను. అలాగని నేనేమీ భయపడటం లేదు. ఏదో ఉబుసుపోకకకు మాట్లాడటం లేదమ్మా. తనకు తన అమ్మ ఎంత ముఖ్యమో నాకు నువ్వు అంతకంటే ఎక్కువ ముఖ్యం. సరేనా?" అన్నాను.

"కీర్తి.. నీకు విశాల్‌పై అభిప్రాయం?"

"అమ్మా.. అదీ..."

"కీర్తీ.. నా ప్రశ్నకు సమాధానం కావాలి. ఇద్దరిలోనూ అమ్మ ప్రేమ ఉంది. ఇద్దరిలోనూ బాధ్యత ఉంది. నీకు విశాల్‌పై ప్రేమ ఉంది. కానీ తప్పుకాదమ్మా... నాకు అభ్యంతరం అంటూ ఏమీ లేదు. ఆ ఇంటి వాతావరణం కూడా ఎంతో బావుంది. నేను మంచిరోజు చూసుకుని వెళ్లి ఖాయం చేస్తాను... సరేనా?" అంది నవ్వుతూ.

***



ఇక నాకు ఎంతో ఆనందంగా వుంది. విశాల్ మనస్తత్వం ఎంతో నచ్చింది. తల్లిని గౌరవించేతత్వం నచ్చింది. అయినా తనకు ఎన్ని సెల్‌ఫోన్లున్నా ఉత్తరం అంటే నచ్చే తత్వం మరీ నచ్చింది. నిజమే నాకూ ఉత్తరం అంటేనే ఇష్టం అనుకుంటూ కాలేజీ మేగజైన్‌లో వున్న విశాల్ ఫొటోను ఒకసారి చూసుకున్నాను. ఉదయం తాను పెట్టిన బిక్కముఖం గుర్తొచ్చి నవ్వుకున్నాను. కానీ నన్నే గమనిస్తున్న అమ్మని గమనించలేకపోయాను.

***

రాత్రి పన్నెండు గంటలయినా అమ్మ నిద్రపోకపోవడం నాకు ఆశ్చర్యం వేసింది. అడిగేటంత చనువు, ధైర్యం వున్నాయి కానీ, ఇప్పుడెందుకో అడగాలంటే కాస్త బిడియంగా వుంది. అయినా మెల్లగా కిటికీ గుండా చూసాను. ఏదో సీరియస్‌గా రాయడం గమనించాను. ఇంత రాత్రివేళ ఏమయింటుందా అనిపించినా ధైర్యం చేసి అడగలేకపోయాను.

***

ఉదయం ఆరు గంటలయ్యేసరికి అమ్మ తయారవుతోంది. ఎక్కడికి అని కూడా అడగలేకపోయాను. ఇక అమ్మే కలగజేసుకుని "చూడు కీర్తి... నేను అలా నా స్నేహితురాలి ఇంటికి వెళుతున్నాను. రావడం ఆలస్యం అవ్వచ్చును. డైనింగ్ టేబుల్ మీద టిఫిను ఉంది. అలాగే అన్నం కూడా వేళకు తిను. తలుపు తెరిచి వుండగా నిద్రపోకు. బై.." అంటూ కదిలింది.

అమ్మ వెళ్లగానే నేను మళ్లీ మరిచిపోతానేమో అని తలుపు గడియపెట్టుకున్నాను. బ్రెష్ చేసుకుని కాఫీ తాగుతూ టీవి ఆన్ చేసాను. బోర్... పుట్టినరోజు శుభాకాంక్షలంటూ తెలుగును ఒక ప్లాస్టిక్ డబ్బాలో వేసి ఆడిస్తున్నట్లు వారి మాటలు వికారం పుట్టాయి. ఆపేసి పేపర్ అందుకున్నాను. ఏమిటో అన్నీ కన్నీటి గాథలే... ఆత్మహత్యలు, హత్యలు, వికృత చేష్టలు, ఇంతే... అలా తిరగేసి కాఫీ కప్పు అక్కడున్న టేబుల్ మీద పెట్టి అమ్మ టేబుల్ దగ్గరకు వెళ్లాను. రాత్రి సంఘటన గుర్తొచ్చింది. అవును అమ్మ ఏం రాసి వుంటుందా? అనుకుంటూ ఆసక్తిగా టేబుల్ డ్రా తీసి చూసాను కదా అక్కడేమీ నాకు కనిపించలేదు. ఒక వారగా డైరీ కనబడింది. బహుశా ఈ డైరీనే రాస్తూ వుండి వుంటుందని వెంటనే చేతిలోకి తీసుకున్నాను. నా చిన్నప్పటి సంగతులు చాలా రాసుకుంది. తర్వాత నిన్న రాసిన పేజీని తిప్పాను.

చదివాక నా కళ్లు ఆశ్చర్యంతో మరింతగా పెద్దవయ్యాయి.

చాలా రోజుల తర్వాత యశోదను కలిసాను. తనకు ఇద్దరు పిల్లలని తెలుసుకానీ

విధి మూలంగా అక్కడికి వెళ్లి చూడాల్సి వచ్చింది. పిల్లలూ బుద్ధిమంతులే. అన్నయ్యకు పెళ్లయిందని తెలిసి కూడా మరో పెళ్లికి అంగీకరించిన, అసలు పెళ్లే చేసుకోకున్నా అన్నయ్యతోనే వుండిపోయిన యశోదను చిన్నతనంలో అమ్మ, వదినలతోపాటు నేను అసహ్యించుకున్నాను. కానీ ఆమె సంస్కారం నన్ను ఎంతో ఆకట్టుకుంది. పిల్లల పెంపకం కూడా ఎంతో క్రమశిక్షణతో ఉంది. ప్రేమ ఎంత గొప్పదో ఆమె ఇంట్లో అన్నయ్య నిలువెత్తు పటం నాకు తెలిపింది. నేను డబ్బున్న వ్యక్తినే పెళ్లి చేసుకున్నాను కానీ డబ్బు మాత్రమే నాకు మిగిలింది. ప్రేమ అనే పదం కూడా నా జీవితంలో చూడలేదు. అదేమన్నా కాస్త మిగిలితే నా కూతురులో వుంది. ప్రేమించిన వ్యక్తిని కూడా కాదనగలిగే ప్రేమను పొంద గలిగాను. అందుకో కానుక ఇవ్వాలనిపిస్తోంది. అందుకే విశాల్‌తో వివాహం చేయాలను కుంటున్నాను. ప్రపంచంలో ఎంత సంపాదించినా, ఎన్ని కీర్తి ప్రతిష్టలు సంపాదించినా ప్రేమ దొరకని వాడు నిరుపేదే. తనకు కలలా అనిపించిన ప్రేమ ఇపుడు నా కూతురును వరించింది. అవును విశాలమైన హృదయం కల విశాల్ నా అల్లుడు. ఉదయమే యశోదను కలవాలి.

***

అమ్మ డైరీ చదివిన నేను ఎంతో ఆనందపడ్డాను. కానీ విశాల్ పెళ్ళి కూడా చేసుకోని ఒక తల్లికి బిడ్డా? ఆలోచనలో పడిపోయాను...

*(ప్రతిధ్వని-2009)*



# బతుకు ఒక కలైతే...?

ఉదయ్ ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఏంటి? ఈ సమాజం ఇలా అయిపోతోంది...? ఏ ఒక్కరికీ మరొకరితో కుదరటం లేదు. ఉదయం నుండి రాత్రి పడుకునేంతవరకు ఎవరిని తూలనాడుదామా? ఎవరిమీద నిందవేద్దామా? ఎవరిని దుర్భాషలాడుదామా? ఎవరి మనసును గాయపరుచుదామా? అనే ఆలోచనలే... తనకు తానే తన చుట్టూ గిరిగీసుకుని ఆ గిరిలో మంటవేసుకుని జీవిస్తున్నాడే నేటి మానవుడు? ఎలా...? తనకు ఎన్నో ఆలోచనలు, వారందరినీ ఆపేయాలని... ఒక్కసారిగా అందరినీ అదిరించి కంట్రోల్‌లో పెట్టుకోవాలని... కానీ ఎలా తను సామాన్యుడే... తన మాట ఎవరు వింటారు? తనకంటూ ప్రత్యేకంగా ఉనికంటూ లేదు... ఏదో చాలీచాలని జీతంతో ఎంతో కష్టంగా జీవితాన్ని నెట్టుకుని వస్తున్నాడు. తనను ఎవరు మాట్లాడమంటారు? మాట్లాడాలని వున్నా ఏం ప్రయోజనం? అనుకుంటూ పక్కకు తిరిగేసరికి ఎదురుగా నవ్వుతూ ఒక వ్యక్తి కనిపించాడు. ఉలిక్కిపడ్డాడు ఉదయ్. "ఎవరండీ మీరు..?" అడిగాడు మెల్లగా.

"నేనెవరైతే ఏమిలే... నువ్వేంటీ మరీ దీర్ఘంగా ఆలోచించేస్తున్నావు...?"

"అసలు మీరెవరో తెలియకుండా ఎలా మాట్లాడాలి?"

"నేను ఎవరో చెబితేనే గానీ నువ్వు నాకు సమాధానం ఇవ్వవన్నమాట"

"అంతేగా మరి... ఎవరివో... అసలు నా మేడ మీదికి ఎలా వచ్చావో... రావడంతోటి మర్యాద కూడా లేకుండా నువ్వు నువ్వు అంటూ ఈ ఏకవచన ప్రయోగ మేమిటో... నాకేమీ అర్థం కావటం లేదు" అన్నాడు చిరుకోపంగా ఉదయ్.

"నేను నీలాంటి మనిషినేగా.. లేకుంటే నేను మీ నాన్నలాంటివాడిననుకో"

"అమ్మో... మా నాన్న లాంటివాడివా? వద్దులే...! నాకు మా నాన్నంటే చాలా భయం"

"ఎందుకో?"

"మరి... ఉన్నన్ని రోజులు తిట్టి తిట్టి అలసిపోయేవాడులే"

"ఉన్నన్ని రోజులు అంటున్నావు.. ఇప్పుడు లేరా..?"

"లేరు... మా నాన్న పోయి నిన్నటికి రెండేళ్లు గడిచిపోయింది"

"అలాగా.. పాపం.. బతికిపోయాడు" అన్నాడు మెల్లగా.

"అదేంటి బతికిపోవడమేంటి? పోయాడంటుంటే"

"అదే లేవయ్యా... పోవడమంటే మనుషులకు బతికినట్లేగా... బతికి ఉన్నంత కాలం ఏం బతుకుతారయ్యా... నిత్యం అశాంతితో, ఆశలతో ఒకరి ముఖం వారు చూసుకోకుండా ఎంతగా బాధపడతారో... అని"

"అది సరే! నువ్వెవరు చెప్పనేలేదు"

"అమ్మో చెప్పేదాకా వదిలేలా లేవే... సరే నేను దేవుడ్ని"

"దేవుడా? అంటే నీపేరు దేవుడా లేక నిజంగా.."

"నువ్వెలా అనుకున్నా పర్వాలేదయ్యా"

"ఏంటో! నీ మాటలు, వాలకం అన్నీ కొత్తగా వున్నాయి"

"కొత్తదనం అంటే మీకు సంతోషమే కదా?"

"మీకంటే?"

"మీ మనుషులకు"

"అంటే నువ్వు కొంపదీసి నిజంగా దేవుడివి కావు కదా?"

"కొంపదీయకుండానే నేను దేవుడిని"

"ఏ దేవుడివి?"

"నీకు ఏ దేవుడు కావాలేంటి?"

"నాకు వెంకటేశ్వరుడు, కాదు, కాదు ఉండు ఇలా ఒక్కసారిగా అడిగితే ఎలా చెప్పాలి? ఆలోచించుకోనీ... ఆ! నాకు సుబ్రమణ్యేశ్వరుడు కావాలి"

"అబ్బో.... ఏంటో ఆయనగారి గొప్పదనం...?"

"అలాగని గొప్పేంలేదులే... నాకు కుజదోషం వుందట. అందుకు మా బామ్మ సుబ్రమణ్యస్వామిని పూజించరా... ఆ దోషం కాస్త తగ్గుతుంది అంటే... ఇంతకీ నువ్వు సుబ్రమణ్యేశ్వరుడివి కావా?"

"నువ్వే దేవుడనుకుంటే అదే అనుకో"

"హమ్మయ్య! నాకెంత అదృష్టమో... నువ్వు నా దగ్గరకు ఎందుకొచ్చావు?"

"ఏం నేనెక్కడికెళ్లాలో కూడా నువ్వే చెబుతావా?"

"అలా కాదులే.. సామాన్యంగా అరణ్యాలలో తపస్సు చేసేవారికి కనబడతారేగానీ నాలా ఏమాత్రం పూజ కూడా చేయని నాకెందుకు ప్రత్యక్షమయ్యావని సందేహం అంతే"

"అందుకే మీ మానవులతో బాధ.. పిలుస్తారు పోనీ కదాని అంతదూరం నుండి వస్తే నువ్వు ఎందుకొచ్చావని అడుగుతారు".

"వద్దులే స్వామీ! ఇక అడగనులే! ఇంతకీ నీకు నేను నచ్చానా?"

"నువ్వేంటి అందరూ నా బిడ్డలే! నాకందరూ నచ్చుతారు"

"అలా కాదూ ప్రత్యక్షమయ్యావు కదాని"

"అంటే నువ్వేదో సమాజం గూర్చి ఆలోచిస్తున్నావని"

"అవును.. నేను సమాజం గూర్చి ఆలోచిస్తున్నానని నీకెలా తెలుసు? అమ్మో! నువ్వు నిజంగా దేవుడవే..."

"హమ్మయ్య ఇప్పటికైనా నమ్మేవు కదా?"

"స్వామీ! అయితే నేను కొన్ని ప్రశ్నలు నిన్ను అడగవచ్చా?"

"మరి నీకు తెలియనిదేముంది...? అన్నీ తెలుసు. అయితే పుట్టినప్పటినుండి చచ్చిపోయేదాకా మాకు ఈ బాధలెందుకు? సమాజంలో అందరూ సమానమే కదా? ఒకరు తక్కువ, మరొకరు ఎక్కువ అని తేడాలెందుకు చూపావు?"

"బాధ అనేది లేకపోతే ఇక జీవితపు విలువ ఎలా తెలుస్తుంది? చేదు తింటేనే తీపి విలువ తెలుస్తుంది. నేను జన్మను సమానంగానే ఇచ్చాను కదా? డబ్బున్నవాడు ఆకాశంలోంచి ఊడిపడేలా... పేదవాడు చెత్తనుండి పుట్టేలా చేయలేదు కదా? పుట్టే ప్రతి ఒక్కరూ తల్లిగర్భం నుండే పుడతారు. చనిపోయే ప్రతివాడు శ్మశానానికే వెళతారు. ఈ మధ్యలో బాధలు, ఆవేదనలు, ఇవన్నీ మీరు అత్యాశకుపోయి తెచ్చుకుంటే మధ్యలో నన్నెందుకు అంటారు? కేవలం పుట్టుక, గిట్టుక మాత్రమే నావి. ఒకరు ఎక్కువని, మరొకరు తక్కువని మీరు నిర్ణయించుకుంటున్నారు. నా దృష్టిలో కులమతాలు, వర్గాలు, వర్ణాలు, ధనిక పేదలు లేవే...?"

"నిజమే కానీ మరి స్వామీ నువ్వు కొందరిని నల్లగా కొందరిని తెల్లగా పుట్టిస్తావు. కొందరు అందంగా, మరికొందరు అందవిహీనంగా వుంటారు. అది నీ తప్పే కదా?"

"నలుపు తెలుపులు ఆయా వాతావరణ ప్రభావం పైన ఆధారపడి వుంటాయి.

మరికొందరికి తినే ఆహారం మీద, జీవించే విధానం మీద కూడా రంగు ఆధారపడి వుంటుంది. ఇక అందం అంటావా? అక్కడ చూడు అడుక్కుంటోంది కదా ఆ అమ్మాయిలో అందం లేదంటావా? చిరిగిన దుస్తుల మధ్య, తైల సంస్కారం లేని జుత్తు మధ్య, స్నానం లేని ఆ శరీరం అలా కనబడుతోంది, ఒక్కసారి ఆ అమ్మాయిని నా కళ్లతో చూడు. ఎంత అద్భుతంగా వుందో... నీకు తెలుసా? అందం అనేది ఎదుటివారిలో ఎప్పుడూ వుండదు. చూసే కళ్లల్లో అందం వుంటే ప్రతీదీ అందంగానే కనబడుతుంది. చూసే కళ్లలో కోపం వున్నా, అసహ్యం వున్నా అసలు ఆ అమ్మాయి అయినా, అబ్బాయి అయినా చూడడానికి కానీ, మాట్లాడడానికి గానీ మనకు నచ్చదు. అసలు అందం అనేది ఆత్మకు సంబంధిం చింది. మంచితనానికి అందం వుండదు. చెడ్డతనానికి ప్రత్యేకమైన రూపం వుండదు. అవన్నీ మనకు మనమే తయారు చేసుకుంటున్నదే... ఇవన్నీ మీకిచ్చిన విజ్ఞానంతో మీరు చేసుకుని తప్పంతా నాదంటారేంటయ్యా..?" నిజమే కాదనను కానీ.

"నేను చూడు, చిన్నప్పటినుండి మా నాన్న కష్టపడి సంపాదించుకున్నా ఒక్క రూపాయి కూడా నా చేతిలో నిలబడలేదు. ఎప్పుడూ పేదరికమే. నా స్నేహితుడు ఎపుడూ సంతోషంగా వుంటాడు. వాడి నాన్నకేమో సొంత ఇల్లు, వాతావరణం, నేనేం పాపం చేసాను?"

"నువ్వు చేస్తున్న పాపం ఇదే... నాకు కావాలనుకుని నువ్వు కోరుకోవడంలో తప్పులేదు. నా స్నేహితుడు మాత్రం చాలా బాగున్నాడనుకుంటూ బాధపడటం తప్పేకదా? తర్వాత నీకు, నీ స్నేహితునికి ఇద్దరికీ ఉన్న తేడా ఒకటే అది ఏంటంటే దైవభక్తి.. నీకు ఏదైనా కావాలనుకున్నప్పుడు నన్ను ఆశ్రయిస్తావు. అదే నీ స్నేహితుడు నిత్యం ఏమీ కోరకుండానే నన్ను పూజిస్తాడు. ఇక నీ దగ్గర డబ్బులు నిలవటం లేదని అంటున్నావు. నీకు ఒకప్పుడు అవసరానికి మించిన డబ్బును నేను మీ నాన్నకు ఇచ్చాను. అది తనేం చేసాడు? తాగి తందనాలాడేడు. మీ అమ్మను కించపరుస్తూ మరో స్త్రీకోసం వెంటబడ్డాడు. వున్నదంతా ఆమెకు ఇచ్చి కుటుంబాన్ని వీధిలో వుంచాడు. ఒక్కసారి నువ్వు ఆలోచించు నీ స్నేహితుడి తండ్రి తన కుటుంబాన్ని ఎంతగా గౌరవంగా నడుపుకువస్తున్నాడో... అదీ కాక పేదవారికి దానం, లేనివాడికి కాస్తంత తిండి, బట్ట ఏనాడైనా ఇచ్చావా? ఆలోచించు."

"ఆ! నువ్వు వాళ్లనే వెనకేసుకొస్తున్నావు... నేను కిందటి వారం నీకు పాలాభిషేకం చేయించాను. అయినా నా ప్రమోషన్ రాలేదు"

"ఇప్పుడర్థమయ్యిందా నేను చెప్పేది. నీ ప్రమోషన్ కోసం నాకు పాలాభిషేకం చేసావేకానీ నాపై భక్తితో కాదు. అలాగని నిన్ను నిత్యం పాలభిషేకం చేయమని నేను అడగటం లేదు. మనస్ఫూర్తిగా ఒక్క రెండు నిమిషాలు నా కోసం కళ్లు మూసుకుని ధ్యానిస్తే చాలు... నేను పొంగిపోతానే. అలాంటిది అప్పుడు నేను రెండు కొబ్బరికాయలు



కొట్టాను. ఇపుడు పాలాభిషేకం చేసాను అనడం ఏమీ బాగోలేదు. ఇదేమన్నా న్యాయమా చెప్పు!"

"మరి మనిషికి మనిషికి గొడవలు పెట్టావు. ఒకరినొకరు తన్నుకుంటున్నారు. అధికారం కోసం చంపుకుంటున్నారు. రక్తపాతాలు సృష్టిస్తున్నావు. వరదలు, దారిద్ర్యం అన్నీ నువ్వే సృష్టిస్తున్నావు. తెల్లవారితే మోసం, అబద్ధం, అన్యాయంతో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్నావు. నువ్వు మాత్రం రాయివై హాయిగా కూర్చుని వింత చూస్తున్నావు స్వామీ ఇది నీకు న్యాయమా...?"

"మొత్తానికి మనిషివి అనిపించుకున్నావయ్యా! నా సృష్టిలో నేను అనే దాన్ని ఒక్క మనిషిలోనే చేసానేమో అనిపిస్తుంది. ఈరోజు జరుగుతున్న గొడవలు, చంపుకోవ డాలు, రక్తపాతాలు మోసాలు, అబద్దాలు, అన్యాయాలు అన్నీ మీలోని కోరిక అనేది చేయిస్తోంది. ఒకరికి అధికార దాహం. ఒకరికి కీర్తి దాహం, ఒకరికి డబ్బు దాహం ఇలా ఒక్కొక్కరికి వుండటం వలన మిమ్మల్ని మీరే హింసించుకుంటున్నారు. ఎంతో అద్భుతమైన ప్రేమను మీ మధ్య సృష్టించాను. కానీ మీరు ఆ ప్రేమను త్యజించి దానికి కూడా ఒక వికృతరూపాన్ని కల్పించుకున్నారు. శరీరాల మధ్య ఆకర్షణే ప్రేమ అనుకునే స్థితికి వచ్చి అనుమానమనే జబ్బును తెచ్చుకుని మీకు మీరే బాధపడుతున్నారు. అందుకే నేను భగవద్గీతలో చెప్పాను. వచ్చేటప్పుడు నీవేమీ తేలేదు. పోయేటప్పుడు ఏదీ నీ వెంట రాదు, ఎందుకయ్యా నీకీ ఆరాటం అని చెబుతూనే వున్నాను. కానీ మీరు వింటున్నారా? అసలు దేవుడు మీకు గుర్తున్నాడా? మీ ఆశలు తీర్చుకోవడానికి నన్ను ఓ పావును చేసారు. మీరు చేసే మోసంలో వాటాగా ఏదో నా హుండీలో పడేస్తున్నారు. వాటిని కూడా మీరే మోసంతో కాజేస్తున్నారు. నాకు అడగకునా బంగారు కిరీటం నాకు చేయిస్తారు. మీరే మళ్లీ దాన్ని తీసి గిల్టుది పెట్టి దాన్ని కాజేస్తారు. ఇది మీ మనుషులకు న్యాయమా?"

"అసలు మనుషులకు కోరికను నువ్వే పుట్టిస్తావు. చెడ్డతనాన్ని నువ్వే పుట్టిస్తావు. ఆవేశాన్ని, ఆనాలోచనాన్ని, అత్యాశని, అన్నీ నువ్వే కలిగించి మళ్లీ బాధపడుతుంటే చూస్తూ ఆనందిస్తావు. పచ్చని కుటుంబాల్ని నేలపాలు చేస్తావు. పచ్చని పంటల్ని వరదలకు అప్పగిస్తావు. తల్లి ఒకచోట, బిడ్డనొకచోట చేసి వారి జీవితాలతో ఆడుకుంటావు. పైగా ఇవన్నీ మీరు చేస్తున్న పాపాలు వచ్చే జన్మలో చీమగానో, భిక్షగాడిగానో పురుగుగానో పుట్టిస్తావు. అదేమిటంటే మాచేతే ఏ పాపం చేసుకున్నాడో కదా అని అనిపిస్తావు. పాప పుణ్యాలు సృష్టించేది నువ్వే. పాపాత్ములు అని వెలివేసేది నువ్వే. నీకంటే కపటం ఎవరికి వుందిలే స్వామీ...?" అన్నాడు ఉదయ్ కోపంతో.

ఉదయ్... మనిషికి చావు పుట్టుకలు సహజమేనని నువ్వు ఒప్పుకుంటున్నావా?"

"ఒప్పుకుంటున్నాను"

"అలాగే మంచి చెడులు, ఆశ నిరాశలు ఇవన్నీ కూడా సృష్టికి పగలూ రాత్రిలా వుండాలి కదా? ఒక్క పగలే వుంటే సృష్టి వుంటుందా? అలాగే ఒక్కరాత్రే వుంటే బావుంటుందా?"

"బాగోదు"

"అలాగే ఒక వాహనం వుంటే అందులో నడిపేవాడు లేకుంటే ఎలా నడుస్తుంది? అలాగని అందరూ కూర్చుంటామంటే జీవితం ఎలా గడుస్తుంది? ప్రతి మనిషికి మెదడు ఒకటే కానీ కొందరు వారి వారి ఇష్టప్రకారమే వారు ఎంచుకున్న మార్గం ద్వారా వెళుతున్నారు తప్ప నేను వెళ్లమని చెప్పటంలేదు కదా? మీకు మంచి చెడులు తెలపడానికి తల్లిదండ్రుల్ని సృష్టించాను. మీరేం చేస్తున్నారు? మీ అంతట వారు మీరయ్యాక తల్లిని తండ్రిని అంటే దైవసమానుల్ని వీధిలోకి గెంటివేసి మీ ఆనందాన్ని మీరు చూసుకుంటుంటే ఒక జీవితకాలం మీకోసం కష్టపడిన వారెంతగా బాధపడతారో ఊహించారా? అన్ని జన్మలకన్నా మానవజన్మ ఎంతో అపురూపమైంది. మీరు మాట్లాడగలరు. మీరు నవ్వగలరు. అద్భుతంగా ప్రేమించగలరు. పాడగలరు. ఇంతెందుకు నేను ఎలా వుంటానో మీకెవరైనా చెప్పారా? మీకు మీరే ఎంతో చక్కగా నాకో రూపు కల్పించి పూజించడం లేదా? ఇలాంటివి సృష్టిలో ఏ ప్రాణి అయినా చేస్తోందా? అందుకే మీరెలా వుండాలనుకుంటే అలా వుండేలా ఏర్పాటు చేసి ఆనందంగా ప్రకృతిలో విహరించగలిగేలా చేసిన నాకు మీరు ఇచ్చిన కానుక ఏమిటి? ఇక వరదలు నేను ఇచ్చానా? మీకు మీరే మీ మేధస్సును పెట్టి ఆనకట్టలు కట్టుకున్నారు. అలాగే ఎండలు మీకు మీరే ఎంతో నీడనిచ్చే చెట్లను నిర్మూలిస్తున్నారు. రాజుల కాలం నుండి పగలు, విద్వేషాలు, అంతా మీదే కావాలనే ఆశను పెంచుకుని మీలో మీరే విధ్వంసాలను, శతృవులను ఏర్పరచుకున్నారు. భాష మీరే కనుక్కున్నారు. భాషాపరంగా విడిగా వుండాలని కోరుకున్నారు. బట్టలు, నగలు, మేడలు, అంతస్తులు, అంతేకాకుండా గాలినిసైతం మీరున్న గదిలో దాచుకున్నారు మీ మేధతో... అదే మేధను పేదరికం లేకుండా చేయడానికి ఉపయోగించారా? నేను మీకిచ్చిన ఆలోచనాశక్తితో ఏరోజైనా మీకు మీరు న్యాయం చేసుకున్నారా? వేరొకరికి ఉపయోగించాలనుకున్నారా? ఇంతెందుకు నీకు మీ అమ్మ అన్నం కంచంలో పెట్టిందనుకో... నువ్వు తినకుండా నేలపై పారేసి అందుకు నువ్వే కారణమని అమ్మని అనడం ఎంత హాస్యాస్పదంగా వుందో అర్థం చేసుకో..."

"సరేలే దేవుడా! తప్పంతా మాదే... ఒప్పుకుంటున్నాను. కానీ నేను దేవుడిని ఎలా అవ్వాలో చెప్పవా?"

"నువ్వా దేవుడివా? నేను ఇందాకే చెప్పాను. దేవునికి ప్రత్యేకంగా రూపం వుండదని.. మీ రూపును నేను దిద్దానో లేదో కానీ, నా రూపు మాత్రం మీరే తీర్చిదిద్దారు.



నాకు అక్కడి వాతావరణాన్ని అలవాట్లను బట్టి నాకో పేరును పెట్టారు. ఒక్కోరోజు ఒక్కో విధంగా పూజిస్తున్నారు. నాకో ఆలయాన్ని కట్టిస్తున్నారు. నిత్యం ధూపదీప నైవేద్యాలతో నన్ను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. పైగా నాకు కులాన్ని మీరే సృష్టించారు. కొన్ని కులాల్ని నేను రానివ్వనని కొందరిని దూషిస్తున్నారు. కొందరిని వెలివేస్తున్నారు. నాకు చాలా ఆవేదనగా వుంటుంది. అంతా నా సృష్టేకదా? నేను చేసిన లోపమేమిటి? అందరిలోనూ ఒకటే రక్తం.. ఒకటే కన్నీళ్లు... ఒకటే ఆనందం... ఒకటే శరీరం అన్నీ ఒకేలా ఇచ్చానే... మీకు మీరే కులాన్ని ఏర్పరుచుకుని వేరయితే ఒక కంట కన్నీరు మరో కంట పన్నీరు ఎలా భరించగలను..? ఇక నువ్వు దేవుడవు అవ్వాలంటే నన్ను మీరు తయారు చేసినట్లు ఉండక్కర్లేదు. మనిషిగా ఒక గొప్ప ఆయుధం నీకిచ్చాను అదే మనసు. ఒక్క మనసుతో మీరు ఎన్నో ప్రయోజనాల దూరంలో వున్న వ్యక్తిని గానీ, వస్తువుగానీ, ఆఖరికి మీరనుకునే దేవుడిని గానీ మీ చెంత చేర్చుకోగలుగుతారు. ఆకలన్నవారికి అన్నం పెట్టే చేతుల్లో వున్నాడు దేవుడు. ఆదరించే ప్రతి మనసులోనే దేవుడే వున్నాడు. ఓర్పులో, నేర్పులో, ఎదుటివారిని నొప్పించని మనస్తత్వంలో, నవ్వులో, సహాయంలో అని పూర్తి చేసేంతలో ఉదయ్.. ఉదయ్... అని తట్టి లేపుతున్నట్లు అనిపించింది. ఉలిక్కిపడి లేచి.. కాస్సేపు తన చుట్టూ కలయజూసుకుంటూ కాస్సేపయ్యాక... ఇంతవరకూ తాను కన్నది కలని తెలుసు కుని అలాగే కూర్చుండిపోయాడు ఉదయ్.

"ఏమయిందిరా? ఉదయ్... కలగన్నావా.. రాత్రి మేము వచ్చేసరికే నువ్వు నిద్రపోతున్నావు. ఇక లేపడం ఎందుకని మేము శబ్దం లేకుండా నిద్రపోయాము" అన్నాడు రఘు.

"అవునురా! రాత్రంతా ఏదో ఆలోచించి పడుకుండిపోయాను కలలో... దేవుడు వచ్చి ఎంతోసేపు మాట్లాడాడు"

"ఈ వయసులో కలలో దేవుడు రావడమేమిటిరా... ఏ ఐశ్వర్యరాయో, బిపాసాబసో రావాలిగానీ ఇదేంటిరా నీకు బుర్ర చెడిందా ఏంటి?" అన్నాడు రాజు నవ్వుతూ.

"వద్దురా! అలాంటి ఆలోచనలు వద్దు. మనం ఎంతగా వయసులో వున్నా ఒక పద్ధతి అనేది ఒకటి వుండాలి. ఆలోచనా విధానంలో ఒక క్రమం వుండాలి. ఇప్పటినుండైనా జీవితాన్ని క్రమపద్ధతిలో తీర్చిదిద్దుకోవాలి. అని మనసులో అనుకుంటూ స్నేహితులను చూసి నవ్వాడు.

కలవచ్చినా కలగా భావించకుండా ఉదయ్ తన జీవితాన్ని మార్చుకోవాలని అనుకున్నందుకు పైన దేవుడు గనక విని ఉంటే చాలా సంతోషించే వుంటాడు!!

***

# కాల గమనంలో...

"కాలం"

ఏంటీ కాలం?

ఎక్కడి నుండి వచ్చింది?

అసలు దీని ఉద్దేశ్యం ఏమిటి?

ప్రపంచం అంతా ఆవేదనతోనూ, అరాచకాలతోనూ, అంతుచిక్కని రహస్యాలతోనూ, అర్థంలేని ప్రశ్నలా అతలాకుతలం అవుతూంటే తన పని తాను చేసుకుపోతున్న కాలం తీరు ఎవరికీ అంతుపట్టడం లేదు. ఈ కాలం దైవమా? అందరినీ శాసించే అధికారమా? అందరినీ సక్రమంగా నడిపించాలనే ఆశయమా? ఏ మూల ఏం జరుగుతున్నా, క్షణంలో ఎన్ని మార్పులు వస్తున్నా, చిరునవ్వుతో కదిలిపోతున్న ఈ కాలం ఎవరు ఉద్దేశించి నిర్దేశించబడిందో తెలియదు. దీనికి రూపం లేదు. రంగు, రుచి, వాసన అసలే లేవు. ఉన్నదల్లా ఒక్కటే అందరినీ అక్కున చేర్చుకోవాలనే.. ఈ కాలానికి చిరునామా ఏమిటో...

ఇది జరిగి దాదాపు పదిహేను సంవత్సరాలు దాటుతోంది. కానీ ఇంకా ఇప్పుడే జరిగినట్లుంది. ఆ అనుభవాలు తాలూకు జ్ఞాపకాలు నన్నింకా అంటి పెట్టుకునే వున్నాయి. ఆనాటి జీవితం ఇప్పట్లోలా లేదు. ఇప్పుడంటే నాకంటూ ఒక జీవితం, బాధ్యతలు వున్నాయి. అప్పుడు బొత్తిగా అమాయకురాలిని...

ఇంతలో "మమ్మీ! మమ్మీ!" అంటూ సుధ పిలుపు...

నా ఆలోచనలలోంచి ఉలిక్కిపడ్డాను "ఏంటమ్మా" అంటూ..



"నేను వెళ్ళొస్తాను..." అంది నవ్వుతూ, కాస్త మోడరన్‌గా నిలబడి.

"అదేంటే... ఆ అవతారం? అయినా రాత్రి వేళ వెళ్లకపోతేనేం సుధా! ఒక పక్క నాన్నగారు నిన్ను ఎక్కడికీ పంపొద్దని నాకు చెప్పారు. పోనీ కదా చిన్నపిల్లవి ఏదో సరదా పడుతున్నావని అదీ కాలేజీ సెలవులని పంపితే ఇలా తయారవ్వడం నాకేదో భయంగా ఉంది. అసలు నువ్వు ఎక్కడికీ వెళ్లకు. మీ నాన్న వచ్చాక అడిగి వెళ్ళు నీ ఇష్టం" వచ్చి నట్టు చెయ్యి అన్నా కాస్త కోపంగానే.

"యూ మమ్మీ! నువ్వొక పాతకాలం దానివి, నీకేం అర్థం అవుతుంది నా బాధ? డాడీ మరీనూ... ఛీ మరీ మమ్మల్ని బొమ్మలనుకుంటున్నారేమో... ఒకసారి విద్య వాళ్లింట్లో చూడండి ఎంత ఫ్రీగా వుంటారో మీకు తెలియదు. ఇంకొకళ్లను చూసి నేర్చుకోరు" అంది సుధ. చేతిలో వున్న హాండ్‌బ్యాగ్‌ని ఎదురుగా వున్న సోఫాలో పడేస్తూ కోపంగా.

అది విన్న నాకు నవ్వొచ్చింది. "నిండా నలభై ఏళ్లు కూడా లేవే నాకు... అప్పుడే నన్ను పాతకాలం దాన్ని చేసేసావు. సరే నీ మాటకే వద్దాం.. పాతయినా, కొత్తయినా మనుషులకు మూడేసి కాళ్లూ, రెండు నోర్లు, వాతావరణంలో మార్పులు, మనిషి ఆలోచన లలో తేడా, సూర్యచంద్రుల గతుల్లో మార్పులు వచ్చాయా తల్లీ?" అన్నా.

ఆ పై మాటలు వినబడలేదు పైగా ఎవరో స్నేహితురాలు వచ్చినట్లుంది. ఏదో సీరియస్‌గా డిస్కస్ చేస్తోంది. వాళ్లిద్దరూ ఏం అనుకున్నారో ఏమో మొత్తానికి నాకు అనుకూలంగా మార్చుకుని "ఇప్పుడు వెళ్లనా" అంది కాస్త దిగులుగా.

దాని బుంగమూతి చూస్తే నాకు నవ్వొస్తోంది. అయినా తమాయించుకుని "డబ్బులు సరిపోతాయా లేకుంటే ఈ వందా వుంచు" అన్నాను దాన్ని సంతోషపెట్టాలని.

అయిష్టంగానే తీసుకుంది. డబ్బు దగ్గర ఎవ్వరూ కోపం చూపించరు అదీ ఈ కాలం పిల్లలు మరీనూ... అనుకుని తొందరగా వచ్చేయండి. రోజులు అస్సలు బాగోలేవు అన్నాను గేటు దాకా సాగనంపుతూ.

***

సుధను చూస్తుంటే నాకు నేనే గుర్తొస్తున్నా. ఆ అల్లరి, సైకిళ్లపై ఒకచోటకు అని చెప్పి మరోచోటకు వెళ్లటం, ఇష్టం లేకుంటే ఏ వస్తువయినా విసిరేయడం, ఇష్టమయినవేవయినా చేస్తే ఇంట్లో వున్నవాళ్లకు సరిపోతుందో లేదా అనుకోకుండా అన్నీ నా స్నేహితురాళ్లకు ఇచ్చేయడం, అమ్మ కోప్పడితే అన్నం తినకపోవడం, ఇలా ఒక్కటేమిటి!! ఎన్నో.. ఎన్నెన్నో.. జీవితం అంతా చాలా తొందరగా గడిచినట్లుంది. అదో అంకం. అంతే..

నేడు ఈ సుధా అంతే.. ఇపుడు నేను కోప్పడినట్లే అమ్మ ఒకప్పుడు నన్ను, నా

అల్లరిని తిడుతూ వుండేది. ఇప్పుడు నేను అంతే తేడా... కాకపోతే ఒకటే ఆశ్చర్యం!! అప్పుడు నాకు పర్వాలేదనిపించింది. ఇప్పుడు ఎందుకు అనిపించడం లేదో అనేదే... అర్థం కావటం లేదు. వీళ్లకున్నంత తెలివి నాకెక్కడిదీ? అనుకుంటూంటే నిజమేనని పించింది.

అప్పుడు సరిగ్గా పదిహేడవ ఏడనుకుంటా.. ఇలాగే... కాలేజికి వెళుతూ దారిలోనే కాలేజి వాళ్లు కొంతమంది ఈ రోజు కాలేజీ లేదు బంద్ అని చెప్పడం, అదే అదనుగా తీసుకుని ఇప్పుడు ఇంటికెళ్లి ఏం చేస్తానులే అనుకుంటూ అరుణ ఇంటికి వెళ్లడం జరిగింది. వాళ్లింట్లోనూ ఎవ్వరూ లేరు.. ఇంకేంటి ఒకటే పాటలూ.. ఒకటే గోలా.. నేనే కాదు నాతో పాటు ఎనిమిది మంది దాకా...

పెద్దగా పాటలు పాడటం.. గట్టిగా మాట్లాడటం అలవాటు వున్న నన్ను అందరూ కోప్పడతారు. నాకు ఎంత తొందరగా కోపం వస్తుందో అంత తొందరగా పోతుంది కూడా. అలాగే అరుణ వాళ్ల నాన్న రావటంతో "అరె... అదేంటి అలా వున్నారు? ఒంట్లో బాగాలేదా" అని అడిగాను.

అంతలో వారి నాన్న కాబోలు వచ్చారు... రావడంతోటే మా అందరినీ చూడటం, అందులో నేను అక్కడున్న ఎత్తైన బల్లపై కూర్చున్నానేమొ మరింతగా అతని కళ్లల్లో పడ్డాను. వెంటనే అక్కడ్నించి దూకాను. అతను ఆ మాత్రం శబ్దం కూడా భరించలేకపోడేమో నన్ను తేరిపారి చూసి ఒక విధంగా చిరాగ్గా ముఖం పెట్టారు. నేను భయపడ్డట్టే నా స్నేహితురాలు అరుణ వచ్చి "మా నాన్న వచ్చారు నువ్వు అల్లరి చెయొద్దు" అని చెప్పడం జరిగిపోయింది.

"అది సరే... మీ నాన్న ఏంటి నల్లటి బట్టలు వేసుకున్నాడు?" అన్నాడు కాస్త గట్టిగానే..

దాంతో మిగతా స్నేహితురాళ్లందరూ నా వాగుడు భరించలేక నన్ను తీసుకుని బయటపడ్డారు.

***

"అమ్మా... అమ్మా?"

"ఏంటే నీకు అసలు కాలేజీ లేదటగా.. ఎక్కడికి వెళ్లావు?" అడిగింది అమ్మ. ఎప్పట్నించో అడగాలనుకుని ఎదురుచూస్తున్నట్లు.

"ఆ!! అవును, అరుణ ఎప్పట్నించో నన్ను పిలుస్తోంది. అయినా నేనొక్కదాన్నే కాదు నా ఫ్రెండ్స్ అందరూ వెళ్దాం... కావాలంటే దీపను అడుగు అన్నా ధైర్యంగా.

"మళ్లీ వాళ్ళని అడగడం దేనికి? నిన్నడిగానుగా చాలు, అయినా ఏళ్లు వస్తే



సరిపోతుందా బుద్ధి వుండద్దూ..." అంది అమ్మ కాస్త కోపంగానే.

ఇక ఆ మాటలు నేనేం పట్టించుకోలేదు. నా దృష్టంతా అరుణ వాళ్ల నాన్న వేసుకున్న బట్టల మీదే వుంది. ఆ మాటలు అమ్మను అడగాలనీ వుంది. మారు మాట్లాడకుండా కాళ్లు కడుక్కుని అన్నం ముందు కూర్చున్నా.

"రాజీ... నువ్వు చిన్న పిల్లవు కాదు... ఎక్కడపడితే అక్కడ తిరగడానికి... మీ నాన్నకు తెలిస్తే ఏమవుతుందో నీకు తెలియనిది కాదు... బాగా చదువు... సరేనా.. నేనిలా మాట్లాడుతూంటే నువ్వు అలా రాయిలా కూర్చుంటావేంటే..." అంది గద్దిస్తూ.

దాంతో ఉలిక్కిపడ్డ నేను "అదేం లేదమ్మా... చదువుకుంటున్నాను. కాకపోతే ఈ రోజు మరీ బలవంతం చేస్తే..." అంటూ ఆగాను.

"అమ్మా.. మరి అరుణ వాళ్ల నాన్న అయ్యప్పదీక్ష తీసుకున్నారని చెప్పింది. అయ్యప్ప అంటే ఎవరు? నాన్న ఎపుడూ వేసుకోలేదే?" అని నా సందేహాన్ని వెలిబుచ్చాను.

"అయ్యప్పదీక్షా!! అయ్యప్ప అంటే అతనో భగవంతుడు కొందరికి అలా వేస్తామని మొక్కులు వుంటాయి. నాన్నకు అసలు దేవుడు ముందు కూర్చోవడమే ఇష్టం వుండదు. ఇక... అయ్యప్ప దీక్ష అంటే అస్సలు వినరు కూడా. మనం చేసే ప్రతి పనీ సక్రమంగా వుంటే అదే దైవం అంటూ వుంటారు. ఆఖరికి నేను పూజ చేస్తున్నా ఏదో నా ఇష్టం అని వదిలేస్తారే తప్ప... నాతో కూర్చోవడం లాంటివి చేయరు... ఒక్కొక్కరి జీవిత విధానం ఒక్కోలా వుంటుంది" అంది చివరగా..

నాకు అమ్మచెప్పిన సమాధానం నచ్చలేదు. అసలు ఆ విషయం గూర్చి ఎందుకంతగా ఆలోచిస్తున్నానో కూడా తెలియటం లేదు. మామూలుగా కాలేజీకి వెళ్లిన నాకు అరుణ కనబడి, "ఆ రోజు సాయంత్రం వాళ్లింట్లో పూజ వుందని, నాకు తెలియదు అన్నావుకదా చూద్దువుగాని రా" అంది. అదే విషయం మా అమ్మతో చెప్పాను. మా అమ్మ కూడా పూజ కదా వెళ్లు అని పర్మిషన్ ఇచ్చింది కూడా. నాకు ఈ విషయంపై ఎందుకింత ఆసక్తి కలుగుతుందో తెలియదు. త్వరగా వెళ్లాలి అనుకుంటూ బయలు దేరేంతలో మా నాన్న ఎదురవడం, ఇప్పుడు ఎక్కడికే అని అడగటం జరిగింది. విషయం విన్న నాన్న నవ్వుతూ నువ్వెందుకే పెద్ద ఆరిందాలా. ఆ పాట్లేవో మీ అమ్మ పడుతుందిలే. అయినా నువ్వు చదువు మానేసి ఇలా పూజలు వ్రతాలు అంటూ కూర్చుంటే ఇక అయి నట్టే... వెళ్లు చదువుకో అని చెప్పడం క్షణాల్లో జరిగిపోయాయి.

ఇక ఆ మాటలు విన్న నాకు ఎందుకో ఎంతో నిరుత్సాహం కలిగింది. ఒకసారి మా అమ్మవైపు చూసాను. అమ్మ ఏం అర్థం చేసుకుందో ఏమో "పోనీలెండి.. పాపం వెళ్లాలని బయలుదేరిందిగా మధ్యలో ఆపుతారెందుకు?" అంది.

ఆ మాటలకు ఒకసారి మా అమ్మవైపు చూసి "నీకలా చెప్పిందా? అసలు నువ్వెలా నమ్మేవే దాని మాటలు? దానికి తెలిసిందల్లా అల్లరి చేయటం, దాని పనులు కూడా నీ మీదే పడేసి నిన్ను విసిగిస్తున్న దానికి ఉన్నట్లుండి ఆ భక్తి ఏంటి? అన్నీ వేషాలు" అన్నాడు తండ్రి.

దాంతో నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. "నేనేం అబద్దాలు చెప్పడం లేదు. కావాలంటే నా స్నేహితులెవరినైనా అడగండి. అయినా ఎవరయినా దేవుడిపూజ అని అబద్ధం చెబుతారా?" అన్నాను కాస్త కోపంగానే.

ఆ మాటలో నాన్నకు నిజం కనబడిందేమో "సరే... జాగ్రత్తగా వెళ్లి త్వరగా రావాలి తెల్సిందా?" అన్నారు. భగవంతుడు అక్కర్లేదు ఎవరి ఖర్మ వారిదే.. అని అనుకుంటాం కానీ నాన్నకూ భక్తి ఉంది అనుకుంటూ చెప్పడమే తరువాయి వెంటనే బయలుదేరాను.

***

"ఎంత ధైర్యం వాడికి? నాకు రావాల్సిన టెండర్ వాడు కాజేస్తాడా? నా సంగతి వాడికింకా తెలియదేమో... వాడిలాంటి చవటను కాను నేను. సరే... మాటలు అనవసరం వాడి మీద ఒక కన్నేసి వుంచు... మర్యాదగా వాడికై వాడు నాకు ఆ టెండర్ అప్పగించాడా సరే... లేకుంటే నా సత్తా ఏంటో చూపిస్తా" అంటూ కోపంగా ఊగిపోతున్నాడు ఆ అయ్యప్ప దీక్షలో వున్న అరుణ తండ్రి రాఘవయ్య.

"అది కాదు సార్! అతను పిల్లలు గల వాడని అందరూ అంటున్నారు" అంటున్నాడు పక్కనే చేరిన ఎవరో అతని అనుచరుడు కాబోలు మెల్లగా...

"అయితే ఏంటట? వాడికి అంత స్తోమత లేకపోతే బిజినెస్ మానేసి ఏదో చిన్న వుద్యోగం చేసుకోమను. అయినా ఈ మాట ఎవరన్నారు?"

"ఎవరో అంటే నేనెందుకు అంటాను సర్... మీ గురువుగారు దీక్షితులు గారే సర్"

"ఓహో.. అందరూ నాకు నీతులు చెప్పాలనుకుంటున్నవారే... అయినా నా నిర్ణయం మారదు ఆఖరికి ఆ దేవుడే దిగి వచ్చి చెప్పినా సరే... నేను వినను. సరే నాకు పూజకు వేళయింది. రాత్రి వీలయితే ఫోను చెయ్యి" అంటూ స్నానానికి వెళ్లారు రాఘవయ్య.

నాకు ఆశ్చర్యమేసింది. అయ్యప్ప దీక్ష అంటూ అతను మాట్లాడే మాటలు నాకు నచ్చలేదు. ఒకపక్క దేవుడిని నలభై రోజులు పాటు ధ్యానం చేస్తూ ఆలోచనా విధానం మార్చుకోకబోతే ఎలా? అనుకుంటూ ఎదురుగా అరుణ కనబడేసరికి తనతో పాటు పూజలో కూర్చున్నాను. పడిపూజ పేరుతో ఆ అమరిక ఒక్కో మెట్టుకూ ఒక్కో దీపంతో



అలంకరణ చూడడానికి ఎంతో కన్నుల పండుగగా ఉంది. భక్త జనులు అయ్యప్పను స్మరిస్తూ పెద్దగా నినాదాలు చేస్తున్నారు. నాకు మాత్రం ఇందాక జరిగిన వారి సంభాషణ మీదే వుంది. అసలు ఇతనికి టెండర్ రాకపోతే అవతలి వ్యక్తిని ఏం చేస్తాడో? ఈ విషయం అవతలి వ్యక్తికి ఎలా చేరుతుంది? పైగా పిల్లలు వున్నారు అనే మాట నన్ను మరింతగా కలిచివేస్తోంది ఆ సమయంలో.

అంతవరకూ ప్రశాంతంగా భక్తిమయంగా ఉన్న ఆ ప్రాంతం ఒక్కసారిగా మంటలలో చిక్కుకుంది. అప్పటిదాకా అక్కడ కూర్చున్న వారంతా భయంతో పరుగులు తీస్తున్నారు. ఒక్క నిమిషం నాకు అర్థం కావటం లేదు. ఇక్కడేం జరిగిందో తెలియకుండా అటు ఇటు చూస్తున్నాను. ఇంతలో ఎవరో తెలియదు నన్ను చేయి పట్టుకుని పైకి లేపి బయటకు లాగారు. అప్పుడు తెలిసింది ఆ ప్రాంతం అంతా షాట్ సర్క్యూట్ అయ్యిందని... కొందరు ఒళ్లు కాలిన బాధతో అరుపులు పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా అరుణ వాళ్ల నాన్న కోసం అంబులెన్స్ వచ్చింది. పాపం రాఘవయ్య సగానికి పైగా కాలిపోయాడట.. అనే మాట నాకు ఆశ్చర్యాన్ని కలుగజేసింది. "పాపం కష్టపడి నలభైరోజులు దీక్ష తీసుకుని పూజ చేస్తుంటే ఇలా జరిగిందేమిటి?" అనుకుంటూ అరుణను కాస్సేపు ఓదార్చి ఇంటి ముఖం పట్టాను.

విషయం అంతా విన్న అమ్మ "అయ్యో! అలాగటే!! ఏ తప్పు చేశాడో!! ఆ భగవంతుడు అలా శిక్షించాడు" అంది చెంపలు వేసుకుంటూ.

"తప్పు చేస్తే నిజంగా దేవుడు శిక్ష వేస్తాడామ్మా?" అని అడిగాను. అమ్మకు దగ్గరగా కూర్చుంటూ...

"అంతే కదా మరి. నువ్వేదీ మనసులో పెట్టుకోకు... చదువుకో... అసలు ఈ విషయం నాన్నకు చెప్పకు... ఏ దేవుడు కరుణించాడో నీకేమీ కాలేదు... వెళ్లమ్మా.. కాస్త తిని చదుకో..." అంటూ తలపై చెయ్యి వేసి దగ్గరకు తీసుకుంది.

రాత్రంతా నాకు నిద్ర రాలేదు. ఎందుకు ఈ మనుష్యులంతా ఇలా వుంటారు? అసలు ఈ భక్తి అంటే ఏంటి? భక్తి పేరిట జరుగుతున్న మోసాలకు అంతం లేదా? డబ్బు డబ్బు అంటాం ఒకర్ని మోసం చేసి, ఒకర్ని ఏడిపించి తెచ్చుకున్న డబ్బు ఎంతకాలం నిలుస్తుంది? ఇదే శాశ్వతమా? మనుషులు తనకు తానే సృష్టించుకునే ఈ డబ్బుకు ఇంత విలువ ఎందుకు ఆపాదిస్తున్నారు? చివరకు అందరూ బంగారం, డబ్బుతోనే లోకం అనుకుంటే మనిషికి మనిషి ఏమవుతాడు? ఈ రక్త సంబంధాలు ఏమవుతాయి? ఈ ప్రకృతి కూడా ఆగ్రహించే పరిస్థితి వస్తున్న నేటి పరిస్థితులు ఎప్పుడు మారుతాయి? లాంటి ఎన్నో ప్రశ్నలు నా మదిలో ఊపిరి ఆడనివ్వలేదు. అలాగని ఈ ప్రశ్నలు అమ్మను

అడిగామా అంతే “ఏంటీ పిచ్చి? బుద్ధిగా చదువుకో” అంటుంది. అందుకే నేను అనుకున్నాను ఎప్పుడో ఒకప్పుడు వీటికి సమాధానాలు నాకు దొరక్కమానవని...

ఏది ఏమయినా ఒక్క సందేహం మాత్రం నన్ను వెంటాడింది. ఒక ప్రత్యేకమైన దుస్తులు వేసుకుని నలభైరోజులు మడితో దైవారాధన చేసిన రాఘవయ్య భక్తుడా? మనం నిత్యం చేసే మంచిపని, మంచి ఆలోచనే దైవం అనుకునే నాన్న భక్తుడా? ఒక పక్క అర్థం అవుతున్నట్లే వుంది. మరో పక్క అర్థం కానట్టూ ఉంది.

* * *

కాల గమనంలో ఎన్నో ఏళ్లు గడిచిపోయాయి. పరిస్థితులలో మార్పు లేదు. దైవ ప్రార్థనలలో భక్తి లేదు. తప్పుచేస్తే చేసే ముడుపులాంటి ఈ పూజలు పెద్ద ఎత్తులో జరుగుతూనే వున్నాయి. ప్రతి పండగకు దైవాన్ని మోస్తూ ఊరేగింపులు జరుగుతూనే వున్నాయి. గుడిలో, బడిలో కూడా రక్తపుటేరులు ప్రవహిస్తూనే వున్నాయి. ఎక్కడా ప్రశాంతత లేదు. ఎక్కడా దైవత్వం లేదు. ఇవన్నీ చూసి చూసి భయపడ్డాడు కాబోలు దేవుని రూపంలానే రాయిలానే నిలిచిపోయింది. ప్రకృతి మాత తన స్థితిని మరచిపోయి చేసే ప్రవర్తనతో పాపాలు నేల రాలుతూనే ఉన్నాయి. గ్రహాలు గతులు తప్పుతున్నాయి.

ఇంత జరుగుతున్నా, మనిషిలో మార్పు లేదు. ఏ పరిస్థితులు ఎలా వున్నా, కాలంలో మార్పు లేదు. జనన మరణాలలో తేడా లేదు. తల్లిబిడ్డల మమకారానికి మచ్చలేదు. అనుకుంటూండగానే “మమ్మీ” అంటూ సుధ చేయి నాపై పడగానే ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నాను. సృష్టి వున్నంతకాలం బంధంతో కూడిన ఈ బాధ్యత తప్పదు అనుకుంటూ...

*('నేటి నిజం' ప్రత్యేక సంచిక)*



# కలల సరస్సు

ఆలేఖ్య నగరానికి వచ్చి సరిగ్గా ఈ రోజుకి నెలయింది. హాస్టలు, తోటి రూంమేట్స్ అంతా పరిచయం అయ్యారు. అయితే చనువు లాంటిదేదీ ఇంకా ఎవ్వరితోనూ ఏర్పడలేదు. అలాగని తను ప్రయత్నించలేదు కూడా. ఒకవిధంగా తనకు అవసరం లేదనుకుంది. తన ముభావాన్ని గమనించి ఎవరికీ ఎక్కువ మాట్లాడాలనిపించలేదు కూడా. ఉద్యోగంలో తృప్తి అనేది లేదు. ఎందుకంటే ఆలేఖ్యకు అనుకున్న జీవితం వేరు. తానేమో లెక్చరర్ అవ్వాలని తనకెన్నో ఆలోచనలుండేవి. కానీ నేడు తల్లిదండ్రుల బలవంతంమీద ఇంజనీరింగ్ చేసింది. దాదాపు 75 శాతం తెచ్చుకుంది. చావలేక బతకలేక కనీసం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లేకుండా బిపిఓగా పనిచేస్తూ కాలం వెళ్లదీస్తోంది. రాత్రంతా ఉద్యోగం చేసి, పగలంతా నిద్రపోతూ దాదాపుగా జీవితమే తలక్రిందులుగా వేలాడుతున్నట్లుగా ఉంది. తన రూంమేట్ చక్కగా లెక్చరర్‌గా పనిచేస్తుంది. సాయంత్రం అయిదు గంటలకల్లా రూంకు వస్తుంది. స్నానం చేస్తుంది. పాటలు వింటూ కాలక్షేపం చేస్తుంది. తనని చూస్తే ఎంతో అసూయ లాంటిది అలేఖ్యకు కలుగుతుంటుంది. ఎందుకంటే రమ రాగానే తను బయలుదేరే సమయం వస్తుంది మరి... రాత్రంతా పని తలుచుకుంటేనే జుగుప్సగా అనిపిస్తుంది అలేఖ్యకు.

“హల్లో ఆలేఖ్యగారూ! టీ తాగారా?”

“వద్దు... నాకు అలవాటు లేదు. మధ్యాహ్నం లేవగానే ఒకసారి ఎదురుగా ఉన్న క్యాంటీన్‌లో తాగాను. మళ్లీ అంటే నాకు ఇష్టం లేదు. అదీ హాస్టల్‌లో టీ నాకు నచ్చదు” అంది అలేఖ్య.

"ఎందుకు నచ్చదు? రోజూ నేను తాగుతానే! బాగానే ఉంటుంది! పైగా ఈరోజు ఇలాచి వేసారు చాలా బావుంది తాగండి!!" అంటూ బలవంతంగా ఇచ్చింది రమ.

ఇక తప్పనిసరిగా తాగి రమ ఎంత చనువుగా మాట్లాడినా తాను ఎందుకో తనతో సరి సమానంగా మాట్లాడలేకపోతోంది. ఎందుకో? అనుకునేలోగానే.

"మీరు ఎక్కువగా మాట్లాడరా?" అంది రమ నవ్వుతూ.

"అదేం లేదు. రాత్రంతా అలసిపోతాను కదా! నిద్ర మూలంగా"

"మీదేవూరు?"

"తిరుపతి"

"మరి అక్కడ నుండి ఈ ఉద్యోగం కోసం ఇక్కడికి వచ్చేరా?"

అదే ఆలేఖ్యకు అసహ్యం. ఇక ఇలా అన్నీ అడుగుతారు. తన విషయాలేవీ ఎదుటివారితో చెప్పుకునేటంత గొప్పవి కావు. ఒకవేళ చెబితే మొత్తం చెప్పాలి. ఇక అక్కడ్నించి అన్నీ అనుమానాలే! తనను చూసే జాలి చూపులు తనకు నచ్చవు. జీవితం అంటే ఒక పోరాటంలా భావించి తాను ముందుకు పోతోంది. ఇలాంటి ఆలోచనలతో ఉన్న ఆలేఖ్యను "హల్లో... ఏ లోకంలో ఉన్నారు?" అడిగింది రమ భుజంపై చేయి వేస్తూ..

ఉలిక్కిపడిన ఆలేఖ్య "లేదు... లేదు నా విషయాలన్నీ తర్వాత చెబుతాలెండి! ప్రస్తుతం టైమ్ అయిపోతోందిగా" అంటూ తప్పించుకుంది.

అంతలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లావణ్య ఆఫీసు నుండి రావడం ఎదురుగా అలేఖ్య బయలుదేరడం ఒక్కసారిగా జరిగాయి. లోనికి వస్తూనే ఒక్క భారమైన నిట్టూర్పు విడిచి "అబ్బ! ఈవిడ వాలకం నాకు అస్సలు నచ్చదు" అంది అక్కడే ఉన్న క్యాన్‌లోంచి నీరు తీసుకుని తాగుతూ.

"నచ్చడం నచ్చకపోవడం ఏంటి లావణ్యా! ఏదో తన తీరు అలాంటిది. ఏంచేద్దాం. కొందరు త్వరగా ఎదుటివారితో కలవరు. మెల్లమెల్లగా అలవాటవుతుందిలే!" అంది రమ నవ్వుతూ.

"ఇపుడు అలవాటు కాకుంటే మనకొచ్చే నష్టమేమీ లేదులే! మొదటిరోజు నుండి గమనిస్తున్నా. మనం ఈ గదిలోనే ఉంటూ దాదాపుగా నెల్లాళ్లు గడిచింది. ఏమయినా మాట్లాడిందా? ఎంతసేపు ఆ ఇంగ్లీషు నావెల్స్ ఎదురుగా పెట్టుకుని కూర్చుంటుంది. మనం మాట్లాడినవన్నీ మాత్రం వింటూ ఉంటుంది. తన విషయాలు ఏవీ చెప్పదు" అంది లావణ్య చిరుకోపంతో.

"అదే నేను అనేది, కొందరంతే! నేను కూడా ఇందాక చాలాసేపు మాట్లాడించాను



కానీ ఒక్కటి గమనించాను తాను ఉండుండి ఎక్కడో ఆలోచిస్తుంటుంది. అది నేను గమనించాను. ఏమో తన ఫ్యామిలీ ఎలాంటిదో? తనకున్న బాధలేమిటో" అనేలోగానే 'పోస్ట్' అంటూ ఆలేఖ్య పేరున ఒక లెటర్ ఇచ్చి అక్కడ పనిచేసే అమ్మాయి వెళ్లిపోయింది. అందుకున్న రమ ఆలేఖ్య సూట్‌కేస్ మీద పెట్టింది. కానీ లావణ్య మాత్రం చేతిలోకి తీసుకుని "రమా! ఈ ఉత్తరం చదువుదామా" అంది.

"ఛీ ఛీ అవేం బుద్ధులు? అది పద్ధతి కాదు. వద్దు" అని మళ్లీ అక్కడే పెట్టింది.

"పో! అసలు పద్ధతులు నాకెందుకు? చదివితే తనేంటో మనకు తెలిసిపోతుంది. అంటూ రమ ఎంత వద్దన్నా వినకుండా ఉత్తరాన్ని మెల్లగా తెరిచింది.

ఆలేఖ్యా.

ఎలా ఉన్నావురా? నువ్వు ఇంటినుండి వెళ్లినప్పటి నుండి నేనే కాదు నాన్న కూడా ఎంతో బెంగ పెట్టుకున్నారు. నీకేం తక్కువ చేసామని ఇలా మిమ్మల్ని వదిలి వెళ్లిపోయావు. ఆపాటి ఉద్యోగం ఇక్కడ రాదంటావా? వారం నుండి నేను, మీ నాన్న నీకు ఫోను చేస్తూనే వున్నాము. నువ్వు తీయడం లేదు. దాంతో ఇలా ఉత్తరం రాస్తున్నాను. అదీకాకుండా నువ్వడిగిన ఎన్ఐఐటి సర్టిఫికెట్, దాంతో ఇంకా ఏవో ఉన్నాయి అవన్నీ కూడా పంపుతున్నాను. చూసుకో... ఏదో పెద్దవారం కదా కనీసం పెళ్లయ్యేవరకైనా మా కళ్లముందు ఉండచ్చుకదా? ఏమి చేసినా నీ మంచి కోసమే చేసాము అమ్మలూ... అలా కాదు మా అభిప్రాయాలు నీపైన చాలా వరకు రుద్ది విసిగించాము అంటే మమ్మల్ని క్షమించు... ఒక్కసారి ఇంటికి వస్తావు కదూ! నువ్వెంత ఫోనులో మాట్లాడమన్నా, నాకు ఉత్తరం రాయడమే ఇష్టం.

ఇట్లు

మీ అమ్మ

అనే వుత్తరం చదవగానే లావణ్య రమకు అందించింది. ఇద్దరూ చదివాక ఒక్కసారి ముఖాలు చూసుకున్నారు. ఆ ఉత్తరంతో పాటు ఆలేఖ్యవి కొన్ని సర్టిఫికెట్లు కూడా ఉన్నాయి.

"అంటే ఈ ఆలేఖ్యగారు ఇల్లు వదిలి వచ్చారన్నమాట" అంది లావణ్య వ్యంగ్యం తోచే స్వరంతో...

"అందుకే చదవద్దన్నది.. మనకెందుకే? ఎవరి బాధలు వారి కుంటాయి. నువ్వు ఆమె పట్ల కోపం తగ్గించుకుని జాలిగా చూడు. నీవు ఇన్ని మాటలు మాట్లాడనే మాట్లాడవు. నువ్వు ముందు ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా అతికించు. మనం చదివామంటే బాధపడచ్చు. ఉన్న బాధలు చాలక ఇదొకటి చేరుతుంది" అంది చేతిలోంచి అందుకని అక్కడ జాగ్రత్తగా పెట్టింది.

"అంతలా బాధలుంటే మనతో పంచుకోవచ్చుగా రమా! అలా ఉండటం ఎందుకు? మనం ఫ్రెండ్సే కదా?" అంది లావణ్య.

"మనం తన స్నేహితులమని నమ్మకం కలిగించాలి కదా?"

"నమ్మకం కలిగంచడం అంటే సినిమాలోలా పాటలు పాడాలా? వీధి పక్కన ఎవరో భిక్షగాళ్లకు, అనాథలకు సేవచేస్తూ కనిపించాలా?" అంది నవ్వుతూ.

ఆ మాటలకు రమకు కూడా నవ్వు ఆగలేదు. "భలే మాట్లాడతావే... లవ్... కొన్ని ప్రశ్నలకు సమాధానాలుండవు. మనం అన్నీ చూస్తూ ఉండటమే అంతే!"

ఆలేఖ్య వచ్చి తెల్లవారు ఝామున పడుకోవడం గమనించింది రమ. దిండు ఎక్కువ ఎత్తు అలవాటేమో... పుస్తకాలు దిండు కింద పెట్టుకుని పడుకుంటుంది. ప్రతిరోజు. అది గమనించిన రమ "ఇదిగో ఈ పిల్లో కూడా నువ్వే పెట్టుకో... నాకు పిల్లో లేకుండానే పడుకోవడం అలవాటు" అంది అందిస్తూ... ఎంతగా ఆలేఖ్య వద్దన్నా తన తలకింద అమర్చింది రమ... దాంతో థ్యాంక్స్ అంది నవ్వుతూ. ఎపుడు నిద్రపోయిందో తెలియదు. ఆలేఖ్య ఫోను కనీసం పదిసార్లయినా రింగవుతూనే ఉంది. కానీ అస్సలు మెలకువ లేదు కదా గాఢనిద్రలో ఉంది. ఎందుకో పక్కనే ఉన్న టాబ్లెట్ రేపర్‌ను తీసి చూసింది రమ. అది స్లీపింగ్ పిల్ అని తెలిసిపోయింది. దాంతో ఇక లేవదని గ్రహించిన రమ ఇందాక వచ్చిన కాల్‌కు తను ప్రయత్నించింది. ఏదో నిద్రపోతోందయినా చెబుదాము అనుకుని. కానీ ఫోను నుండి మాట విన్నాక రమ అలా నిశ్చేష్టురాలయింది. పక్కనే ఉన్న లావణ్య కూడా ఫోను అందుకుని అలానే ఉండిపోయింది. కాకుంటే "చెబుతామండీ. తను ఇందాకే ఆఫీసు నుండి వచ్చి నిద్రపోతోంది." అని పెట్టేసింది.

"ఇపుడేం చేద్దాం రమా?"

"లేపాలి... తప్పదు కదా? ఇదేమీ చిన్న విషయం కాదు కదా?"

"మరి తనేమో స్లీపింగ్ పిల్ వేసుకుని నిద్రపోతోంది. లేస్తుందంటావా?"

"లేపాలంతే! మనలో ఎవరో ఒకరు లీవ్ పెట్టాలి. తప్పదు"

"అమ్మో... మాకసలే మంత్ ఎండింగ్... మా హెచ్ఓడీ చంపేస్తారు, నేనయితే పెట్టలేను" అంది ఖచ్చితంగా లావణ్య.

"ఇక నేనయినా పెట్టాలి! తనను కనీసం ఊరికైనా పంపాలి. కోపాలేవయినా ఉన్నా మనం సర్ధిచెప్పగలగాలి. సరే! నేనే ఫోనుచేసి ఏదో ఒకటి చెబుతాలే మా కాలేజికి... అని బయలుదేరాలని భుజాన వేసుకున్న హ్యాండ్‌బ్యాగ్ మంచంపై పడేసింది రమ.

"కానీ... ఇపుడెలా లేపాలి? లేపి విషయాన్ని ఎలా కూల్‌గా చెప్పాలి? అనేదే భయంగా ఉంది అంటూండగానే ఆలేఖ్య ఒక వైపు నుండి మరోవైపుకు కదిలింది నిద్రలో..



అదే అదనుగా భావించిన రమ అలేఖ్యగారూ! అలేఖ్యగారూ! అని పిలిచింది. ఆలేఖ్య కళ్లు తెరవకుండానే 'ఊ' అంది.

"మీరు లేవండి"

"బయలుదేరుతున్నారా? ఓకే... లేస్తాను మీరు కీస్ బెడ్ మీద పెట్టి వెళ్లండి. డోర్ వేసుకుంటానులే" అంది కళ్లు తెరవకుండానే.

"లేదు. ఆలేఖ్యా! మీరు ఒక్కసారి లేవాలి!"

ఎపుడూ ఏమీ అనని రమ నుండి ఆ మాట వినేసరికి తాను ఇన్ని రోజులున్నా ఎపుడూ ఒక్కసారి తట్టి లేపి కీస్ ఇక్కడ పెడుతున్నాం అని వెళ్లిపోతారు. అలాంటిది ఈరోజు ఏమైందబ్బా అనుకుంటూ దుప్పటి తొలగించి లేచింది. ఏమిటి అంటూ..

"మరి... ఇందాక మీరు నిద్రపోతుంటే చాలాసార్లు మీ ఫోను రింగయింది. మీరేమో అక్కడున్న టాబ్లెట్ రేపర్‌ని చూస్తే స్లీపింగ్ పిల్ వేసుకొని నిద్రపోతున్నారు. దాంతో నేను ఎత్తాను. ఏదయినా అర్జెంట్ కాల్ ఏమోనని. కానీ తర్వాత విషయాన్ని విన్నాక నాకు మనసు ఆగక మిమ్మల్ని లేపాను. విషయం ఏమిటంటే..."

"చెప్పండి... ఏంటి విషయం?"

"మీ నాన్నగారు పోయారట" అని వినగానే అలానే ఉండిపోయింది. ఆ తర్వాత రమ నిన్న తనకు ఉత్తరం రావడం తాము చదవడం అన్నీ చెప్పేసింది. ఏమీ అనుకోకండి.. ఈరోజు మీతో నేను ఉంటాను. మీకేదయినా సహాయం కావాలంటే అనగానే ఒక్కపెట్టున గట్టిగా ఏడ్చేసింది రమను పట్టుకుని.

"ఊరుకోమని నేను చెప్పలేను ఆలేఖ్యా! ఎందుకంటే ఇది తీరని బాధ. నాకు ఊహ తెలిసినప్పటినుండి అమ్మానాన్న ఎవరూ లేరు. అందుకే ఆ బాధ నాకు తెలుసు. కానీ ఊరుకోండి. ముందు ఊరికి బయలుదేరండి. ఎదిగిన కూతుర్ని చూసుకోవాలని మీ అమ్మ ఎంత బాధపడ్డారో కానీ కనీసం ఇప్పుడు వెళ్లి ఆమెను మనసారా ఓదార్చండి! మీరు తప్ప ఆమెకు ఎవరున్నారు?" అంది ఓదార్చుతూ!

"లేదు రమా! నేను తప్పుచేసాను. నాకిష్టంలేని చదువుతో కొన్నాళ్లు, తనకిష్టంలేని కాలేజీలో చదివిస్తూ కొన్నాళ్లు, జీన్స్ వేసుకోవద్దని, జుట్టుకి క్లిప్ పెట్టద్దని ఇలా నన్ను చాలా వరకు ఆంక్షలు విధించి, అప్పటికీ భరిస్తున్నా తనకు ఇష్టంలేని వరసకు బావైన ఒకతన్ని తీసుకొచ్చి తనకు పెళ్ళి కూడా చేస్తున్నారని అందుకే... నన్ను నాకే కాకుండా చేసారనే పిచ్చి కోపంతో వారి నుండి తను దూరంగా వచ్చేనని తలుచుకుంటూ, ఇక నేనెవరికోసం బతకాలి? ఉద్యోగం ఇష్టం లేకున్నా వారికోసమే చేస్తున్నానని, నెలనెలా డబ్బు కూడా పంపుతున్నానని చెబుతూ తన తండ్రి తన మూలంగానే చనిపోయివుంటారని

అనుకుంటూ ఆలేఖ్య చాలాసేపు ఏడ్చింది.

రమకు జాలి వేసింది. అక్కడే వున్న లావణ్య కూడా ఓదార్చి "నేను త్వరగా రావడానికి ప్రయత్నిస్తానని" చెప్పి ఆఫీసుకు వెళ్లిపోయింది.

"ఊరుకోండి ఆలేఖ్యా! నాకు తెలిసి అంత చిన్న విషయానికి మీ నాన్నగారు పోయివుండరు. అనవసరంగా మనసును మరింతగా పాడుచేసుకోకండి ప్లీజ్! ముందు లేచి ముఖం కడుక్కొని బయలుదేరండి! అంతకన్నా ముందు మీ అమ్మతో ఓదార్పుగా మాట్లాడండి. మీరు వస్తున్నట్లు తెలియజేయండి!!" అంది బాధ్యతగా రమ.

తను చెప్పినట్లే అమ్మకు ఫోనుచేసి ఏడుస్తూనే ఓదార్చింది. తాను బయలుదేరు తున్నట్లు కూడా చెప్పింది. "రమగారూ! మీరు కూడా కాలేజీకి బయలుదేరండి. ప్రస్తుతం పర్లేదు నేను వెళతాను లెండి" అంది కళ్లు తుడుచుకుంటూ.

"కాలేజీ నేను ఒక్కరోజు వెళ్లకపోతే ఏమి అవ్వదు లెండి! నేను మీతోనే ఉంటాను." అనడంతోటి ఆలేఖ్యకు ఆశ్చర్యం వేసింది ఇలాంటి ఫ్రెండ్స్ కూడా ఉంటారా? అని... పైకి మాత్రం థ్యాంక్స్" అంది. వెంటనే హైదరాబాద్ టు తిరుపతికి ఫ్లైట్‌లో బయలుదేరే దాకా తనతోనే ఉంటూ ఓదార్చుతూ ఆలేఖ్యకు తోడుంది రమ.

ఇల్లంతా శోక సముద్రంలో మునిగినట్లుంది. ఆలేఖ్యకు అమ్మా అని నోరారా పిలవడానికి కూడా తనకు అర్హత లేదనుకుంటోంది. ఎలా పలకరించాలో కూడా తెలియ కుండా పక్కనే కూర్చున్న కూతుర్ని చూసి ఒక ఉదుటున వాటేసుకుంది "అమ్మలూ! అంతా అయిపోయిందే" అంటూ!

అలేఖ్యకు కన్నీళ్లు ఆగటం లేదు. ఇక తల్లి ఇందిర సంగతి ఎలా చెప్పాలి? ఇద్దరూ ఒకరినొకరు ఓదార్చుకున్నారు.

"ఎలా జరిగిందమ్మా" అడిగింది అలేఖ్య

"ఏదో నా తలరాత అలా తగలడింది. ఉదయం మామూలుగానే లేచారు. కాసిని మంచినీళ్లు పెట్టమన్నారు. ఏదో గుండెలో నలతగా ఉందంటే నేను ఈ ఎండలకే గాబరా అయివుంటుందని నీళ్లు వేడిచేసి తెచ్చేలోగానే ఆయన మనకు దూరమై పోయారమ్మా.. డాక్టరు గుండెపోటు వచ్చిందని చెప్పేరు. అంతగా గుండెపోటు వచ్చేలా ఏమి ఆలోచించారో నాకేమీ అర్థం కావడం లేదు. అని కన్నీరు మున్నీరవుతున్న తల్లికేసి చూస్తూ తన మూలం గానే నాన్న ఆలోచించి గుండెపోటు తెచ్చుకున్నారని అనుకుంటూంటే అలేఖ్యకు దుఃఖం ఆగటం లేదు. నేనే తప్పుచేసాను. నాన్న మాట విని ఇంతవరకు జీవితాన్ని దాదాపుగా సర్దుకుని గడిపానే! కేవలం ఒక్క పెళ్లి విషయంలోనే సర్దుకోలేకపోయాను. నాన్న చెప్పినట్లు బావ మంచివాడే! సంపాదన, ఆస్థిపాస్తులు అన్నీ ఉన్నాయి. కానీ తనకు నచ్చకుండా



ఎలా చేసుకోవాలి? ఆ ఒక్క దానికే కదా నాన్నతో నాకు తేడా వచ్చింది. ఆ మాత్రం అర్థం చేసుకోలేకపోయారా? అనుకుంటూ తనలో తానే కుమిలిపోతూ... నిశ్శబ్దంగా ఉన్న ఇంటిని పూర్తిగా కలియజూసింది. ఏంటో ఈ జీవితం అంతా శూన్యంగా అనిపించింది. ఎవరెవరో వస్తున్నారు. అమ్మను ఓదార్చి వెళుతున్నారు. ఎవరు తనకు ఏమవుతారో కూడా ఆలేఖ్యకు తెలియటంలేదు.

ఒకామె వరసకు మేనత్తవుతుందేమో ఏమో... విసవిసా వచ్చి "ఇదిగో ఆలేఖ్యా! ఇక నువ్వే అమ్మను కళ్లల్లో పెట్టుకుని చూసుకోవాలి. దానికా లేక లేక పుట్టిన పిల్లవి. కిందటి నెలలో మీ బావ శశాంక్‌ను నువ్వు చేసుకోనన్నావట. వాడికేం తక్కువ? చెప్పు. నెలకు డెబ్బై వేల రూపాయల జీతం. చూడడానికి కాస్తంత నల్లగా ఉంటాడు అంతేగా. అయినా మగాడికి కలరేంటి? సంపాదనే అందం. వీటన్నింటికి తోడు బుద్ధిమంతుడు. ఈ కాలంలో తెలిసిన సంబంధాలను చేసుకోవడమే ఉత్తమం. మనిషి ఎలాగూ పోయేడు. కనీసం నాన్న పోయిన సంవత్సరంలోనైనా పెళ్లి చేసుకో! ఏంటి?" అంది ఖచ్చితంగా.. పైగా అయినవాడైతేనే రేపు మీ అమ్మను కూడా ఇంట్లో ఉంచుకుంటాడు ఏమంటావు? నీకు తెలియదని చెబుతున్నాను. పెద్దదాన్ని. నేను మాటి మాటికి నీతో ఇలా మాట్లాడలేను కదా? ఏమంటావు ఆలోచించు. మేమేదయినా చేసామంటే అందుకు ఒక అర్థం ఉంటుంది. ఏమంటావు? నిండా అరవై ఏళ్లు లేవు పాపం! ఏ బాధ మింగేసిందో వాడిని" అని తలచుకుని ఏడ్చింది... ఆలేఖ్య మాత్రం ఏమి చేయగలదు? తండ్రి పోయాడనే బాధ కడుపులో తిప్పుతున్నా మరోవైపు తనమూలంగా ఆలోచించి పోయాడేమోననే అనుమానంతో మరింతగా దిగులు పడుతోంది. ఒకవేళ అమ్మ తనను అదే మాట అంటే తనెలా తట్టుకోవాలి? అనే భయం కూడా కలుగుతోంది. ఏది ఏమయినా అమ్మను తనతోపాటే ఇక ఉంచుకోవాలని నిర్ణయించుకుంది. అంతలో..

మేనత్త సుశీల వచ్చి "ఆలేఖ్యా! జరిగిందేదో జరిగిపోయింది. ఇక మిగిలింది నీ జీవితం. మీ నాన్న ఎందుకు మా శశాంక్‌ను చేసుకోమన్నాడో మాకు తెలియదు. స్వయంగా ఇంటికి వచ్చి నిన్ను నా ఇంటి కోడలిగా చేసుకోమ్మని అడిగాడు. అన్నయ్యంతట అన్నయ్యే అడగటంతో, నాకు కాదనడానికి ప్రత్యేకమైన కారణం ఏమీ కనబడలేదు. అందూ నువ్వేమీ కొత్తకాదు. కానీ నువ్వేమో బావను చేసుకోనని అలిగి వెళ్లిపోయావని చెప్పి బాధపడ్డాడు పాపం! నీకు బావంటే ఇష్టం లేకపోవచ్చు కాదనను. కానీ ఇంటినుండి వెళ్లిపోవడం ఎందుకు? ఆడపిల్లవి అలాంటి పనులు చేస్తే కన్నవారు ఎలా తలెత్తుకుని బ్రతుకుతారో చెప్పు?"

"మరి నేను వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాను. అడ్రస్ కూడా ఇచ్చాను అత్తయ్యా" అంది ఏడుస్తూ.

"కాదని ఎవరన్నారు? నువ్వేదో తప్పు చేసావని, నువ్వు కానిచోట్ల ఉంటున్నావని ఎవరు అనలేదు.. కానీ నువ్విలా చేసిఉండకూడదు అనడమే అంతే! ఇపుడైనా పర్లేదు. నీ ఇష్టప్రకారమే ఏదయినా జరుగుతుంది. కాకపోతే... అన్నయ్య మాటను ఒకసారి ఆలోచించు. సరేనా? అమ్మను మాత్రం వదిలి వెళ్లకు. లేదా నువ్వు అసలు హైదరాబాద్‌కు వెళ్ళకు" ఉండనా మరి! నా నెంబర్ నీదగ్గర ఉందిగా... అవసరమైతే చెయ్యి" అని వెళ్లిపోయింది.. ఆలేఖ్యకు సుశీల సంస్కారం ఎంతో నచ్చింది. తనే ఎవరినీ అర్థం చేసుకోలేకపోయిందేమో అనిపించింది. వెంటనే నాన్నగదిలోకి వెళ్లింది. తనపేపర్లు, పుస్తకాలు అన్నింటిని తడిమి చూసుకుంది... కానీ నాన్న డైరీ లో ఒక రంగు కాగితం ఎందుకో ఆకర్షించింది. వెంటనే అందుకుని చదివింది... తలుపు వారగా వేసి...

డియర్ రఘూ... అంటే రాఘవేంద్రరావుని రఘు అని చాలా దగ్గరవారు పిలుస్తారు. మరిచిపోయే ఉంటావు నేను హేమను రాస్తున్నాను. ఎలా ఉన్నావు అనడం అనవసరం ఎందుకంటే నువ్వు బాగానే ఉంటావు. ఉండటానికి ఇల్లు, చేతినిండా డబ్బు, నువ్వు చెప్పినట్లు వినే నా భార్య. అంతా బాగానే ఉన్నాయిగా! కానీ నేను మాత్రం ఏమీ లేకుండా ఉన్నాను. కనీసం ఈ మధ్య ఫోను కూడా తీయడం మానేసావు. నేనంటే నీకు మోజు తీరిపోయిందేమో కాదనను. కానీ నీకో కొడుకున్నాడు. వాడిపై నీ శ్రద్ధ తగ్గితే మాత్రం నేను ఊరుకున్నా, వాడు ఊరుకోడు ఎందుకంటే వాడు నీకు పుట్టినా నీ పోలికలు ఒక్కటీ లేవు. అంతా నా పోలికలే! అందుకే ముంబాయి నుండి వాడొచ్చాడు కనీసం నీ ఇల్లు వాడిపేరున రాస్తే నిన్ను నమ్ముకున్న నాకు వాడికి ఒక దారి కనబడుతుంది. నువ్వేమో ఇంటిని, నీ ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌ని అన్నీ నీ కూతురు పేరు మీద రిజిష్టరు చేయించావని లాయర్ దామోదరం ద్వారా తెలిసింది. ఇది అన్యాయం. అది నీ కూతురయితే వీడు నీ కొడుకు కాదా? అందుకే మర్యాదగా నువ్వు ఆస్తిలో వాటా సరిసమానంగా పంచావా సరే! లేకుంటే నీ ఇంటికి వచ్చి ఇన్నాళ్ల మన వ్యవహారం నీ భార్య ఎదుటే బట్టబయలు చేస్తాను. కోర్టుకు వెళతాను కూడా అవసరమైతే! చేసేవన్నీ చల్లగా చేసి తీరా ఆడపిల్ల ఎలా బతుకుతుంది అని నువ్వనడం నాకు ఏమాత్రం నచ్చలేదు. "నగలు చేయించానుగా" అన్నావు. అవి "నాకు". మరి మన కొడుక్కి? ఇప్పటికే నీ కూతురికి నీ వైఖరి నచ్చక నిన్ను వదిలి వేరే ఊరికి వెళ్లిపోయిందని తెలిసింది. ఈ విషయం తెలిస్తే శాశ్వతంగా మిమ్మల్ని వదిలి వెళ్లిపోయినా ఆశ్చర్యపడక్కర్లేదు. ఆలోచించుకో... ఒక్కటి మరిచిపోకు... మేము ఆడిన మాట తప్పము. నీకు నెల రోజులు సమయం ఇస్తున్నాము.

ఇట్లు...
హేమలత.



చదివిన ఆలేఖ్యకు ఒక్కసారిగా చెమటల్లు పట్టాయి. ఏమీ తోచలేదు. ఒక్కసారిగా తండ్రిపట్ల ఆవేదన, దుఃఖం పెరిగిపోయాయి. నాన్న ఇలాంటి తప్పు కూడా చేసాడా? అని ఆలోచించడానికే మనసు ఒప్పుకోవడం లేదు. నిత్యం హుందాగా గంభీరంగా ఉన్న తను కూడా ఇలాంటి తప్పిదాలు! అంతే! అందరూ మనుషులే! కానీ ఒక విధంగా ఆలేఖ్యకు తృప్తిగా ఉంది. తన మూలంగా నాన్న పోలేదని! కాకుంటే అమ్మతో కలిసి ఈ ఊరులో ఉండటం మాత్రం కుదరదని... వీలయినంత త్వరలో అమ్మను తనతో తీసుకెళ్లిపోవాలని... వెళ్లగానే నాన్న ఆలోచనమేరకు బావనే చేసుకోవాలని ఆ ఉత్తరం ఇక అమ్మ కంట్లో పడకూడదని ముక్కలు చేసింది. ఇంతకన్నా అమ్మదృష్టిలో తను దోషి అయినా పర్లేదనుకుంది. జీవితమే ఒక కలల సరస్సు.. వీటికి ఆనకట్ట వేయలేకపోతే నిత్యం బాధపడుతూనే ఉండాలనే నాన్న మాట గుర్తొచ్చి, తనను వెదుక్కుంటూ అపుడే అక్కడకి వచ్చిన అమ్మను దగ్గరకు తీసుకుంది.

*('మనదేశం' పత్రికలో ప్రచురితం - మార్చి, 2009)*

# జాతర

అవును... ప్రశాంత్ చచ్చిపోయాడు... కాదు కాదు నేనే చంపేసాను. ఒకప్పుడు లోకాన్ని నిరంతరం తన రాక్షసత్వంతో నమిలి నమిలి, మానసికంగా హింసించిన నరకాసురుణ్ణి చంపిన అమ్మవారులాగా, నన్ను నానా రకాలుగా హింసించి, నన్ను జీవచ్ఛవంలా చేసిన, నిరంతరం చేస్తున్న ప్రశాంత్‌ను నేను నిర్దాక్షిణ్యంగా చంపేసాను. సమాజం కోసం ఎన్ని మాటలు అన్నా పట్టించుకోకుండా, పిల్లల జీవితాలు ఏమవుతాయో అనే భయంతో ఎదురు చెప్పకుండా వున్న నేను ఇంటికంటే, పిల్లల జీవితాలకంటే నాకు జైలు లేదా ఉరి అయినా సంతోషమేనని నేనే చంపేసాను. ఆశ్చర్యం... నాకింకా చంపాలని వుంది. మళ్లీ లేస్తాడేమోనని భయంగా మళ్ళీ మళ్ళీ చంపాలని వుంది. అయినా నా చుట్టూ ఎవరెవరో మాట్లాడుకుంటున్నారు. చచ్చిపోయాడని... అయ్యో! ఎంతపని చేసింది అని... అసలు ఇది ఆడదేనా? తన పసుపు కుంకుమ తనకు తానే నేల రాసుకుందాని... కనీసం బిడ్డలనైనా గుర్తుంచుకుందాని... ఇంతచేసి ఎలా కూచుందో చూడు దయ్యంలా... ఇలాంటివారిని ఉరి వెయ్యాలని... ఆడజాతికే చెదరని మచ్చని... ఎన్నో ఎన్నెన్నో మాటలు ఇంకా పనిచేస్తున్న నా చెవులకు వినబడుతూనే వున్నాయి. అయినా నాకయితే ప్రశాంత్ చనిపోయాడనే మాట గొంతులో అమృతం పోసినట్లుగా వుంది. ఎవరేమంటున్నా నేను అనుకున్నది సాధించాను అనే ధైర్యం నాలో పెరిగిపోతోంది.

"ఎంత పని చేసావే... పిచ్చిదానా? నీలా అందరూ అనుకుంటే లోకంలో ఎవరు బతికి ఉంటారమ్మా... నువ్వు నాతో నిత్యం చెబుతున్నపుడల్లా నేను ఓపిక పట్టమని, చెప్తూనే వున్నా కదే... ఇప్పుడు చూడు నీ పిల్లలు ఎక్కడుంటారే? నేను నాన్నా ఎంతకాలమని బతుకుతాము? ఇలా నువ్వు అర్థాంతరంగా జైలుకు వెళ్లిపోతే నేనెలా బతకాలే? కుటుంబానికి అప్రతిష్ట తెచ్చావు కదే! అంటూ అమ్మ దేవమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నా నాకు బాధకలగటం లేదు.

"ఏయ్ సుమా! ఏంటే ఈ పని? మొగుడ్ని చంపడం గొప్పనుకుంటున్నావా? ఇపుడు నీ పిల్లల గతేంటి? నీకేమయినా పిచ్చిపట్టిందా? వాడు మొగాడే కొడతాడు తిడతాడు, కొన్నాళ్లాగితే వాడే దారికొచ్చేవాడుగా... ఇప్పుడు మేము ఎలా తలెత్తుకు తిరగాలి? పలానావాడి చెల్లెలు ఇలా మొగుడ్ని చంపిందని అందరూ అనుకుంటే రేపు మా పిల్లల బతుకు ఏమవ్వాలి? ఎంత పని చేసావు?" అంటూ అన్నయ్య ఈసడింపు.

"అది కాదు సుమా! నువ్విష్టపడే చేసుకున్నావు కదా? ఇద్దరూ ప్రేమించుకున్నారు కదా...? అదేంటి ఇలా చేసావు. అయినా నేను అపుడే చెప్పాను కదే సుమా! ప్రశాంత్ నువ్వనుకున్నంత మంచివాడు కాడే అని.. అప్పట్లో నువ్వు ప్రేమలో వున్నావు నీకేమీ అర్థం కాలేదు. అయినా ఎంతటి వెధవనైనా చంపేస్తారా సుమా...? నీకు ఆలోచన రాలేదా? ఇపుడు పసిపిల్లలు ఎలా బతుకుతారే?" అంది పక్కనే కూర్చుని భారతి.

"ఇంతలా మాట్లాడుతున్నా అలా మూగెద్దులా కూర్చుంటావేంటే? చేసిందంతా చేసి ఇపుడిలా ప్రవర్తించడానికి సిగ్గు లేదూ! నీ తర్వాత పెళ్లికావాల్సిన చెల్లెలుంది. అసలే నువ్వు ఎవరితోనో వెళ్లిపోయావని దానిని పెళ్లి చేసుకోవడానికి ఎవరూ రావటం లేదు. ఇప్పుడిక ఇలా వింటే ఇంకేమయినా వుందా? నీ లాంటివారు పుట్టే కన్నా చచ్చినా పీడా విరగడయ్యేది... పాపిష్టిదానా!" అన్నాడు విసుగెత్తిపోయిన తండ్రి.

అన్నీ విన్నా తనకు తాను చేసింది తప్పనిపించడం లేదు. పోలీసులు వచ్చారు. వారి పని వారు చేసుకుపోతున్నారు. తనని జైల్లో పెట్టారు. విషయం ఒప్పుకోవడం మూలంగా పెద్దగా వాదోపవాదాలతో పనిలేక శిక్ష వేసారు. అయితే సుమ తన భర్తతో పడిన బాధలు తెలిసాక శిక్షాకాలం తగ్గించి ఐదేళ్లు మాత్రమే వేసారు. విషయం తేలిగ్గానే తేలిపోయింది. ఇక మిగిలిందల్లా పిల్లలు అమ్మకు తప్పదు అనుకుంది.

అలా అనుకుందో లేదో... ఎదురుగా అమ్మ, చెల్లి.

"నిన్నిలా చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోందే. నీ పిల్లల్ని ఐదేళ్లు చూసుకోవడం నాకేమీ బరువు కాదమ్మా. కానీ నువ్వు బయటకొచ్చిన తర్వాతైనా లోకం నిన్ను బతకనిస్తుందా! పిల్లల్ని తల్లి బతకనిస్తుందా? నీ జీవితం ఇలా అయిపోతుందని కలలో కూడా అనుకోలేదే!" అంది ఏడుస్తూ.

"అమ్మా.. ఏడవకు.. ఊరుకో అవతల సౌండ్ వస్తే పోలీసులు పొమ్మంటారు" అంది చిన్నకూతురు దివ్య.

"లేదులేవే... అడ్వకేట్ ప్రసాద్ మనకు బాగా ఎరిగున్నవాడే. మీ నాన్నకు చిన్నప్పుడు స్టూడెంట్. అతను నన్ను కాస్సేపు మాట్లాడుకోమని పర్మిషన్ ఇచ్చేడు. నేను మీ నాన్నకు కూడా రమ్మన్నాను. కానీ దీని ముఖం చూడనని భీష్మించుకుని కూర్చున్నారు" అంది తల్లి దేవమ్మ కన్నీరు తుడుచుకుంటూ.

"అక్కా! బావను పోగొట్టుకున్నప్పటినుండి నువ్వేమీ మాట్లాడటం లేదు. కనీసం గట్టిగా ఏడ్వనైనా ఏడువక్కా! అలా మౌనంగా వుండకు నాకేంటో చాలా భయంగా వుంది". అంది కళ్లనీళ్లు పెట్టుకుంటూ.

"నిజమే... దివ్యా.. నేను ఇక మాట్లాడాల్సిందే! నేను పుట్టినప్పటినుండి ఇప్పటిదాకా నేను దురదృష్టజాతకురాలినని నన్ను వెలివేసి చివరికి నా కంచం, చాప, దుప్పటి, నా బట్టలు దూరంగా పెట్టినపుడే గట్టిగా ఏడవలేకపోయాను. ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ ఉన్నప్పుడు పొరపాటున నాన్న కంట్లో పడినప్పుడు తిట్లు, దెబ్బలతో నా ఒంటిని తూట్లు పొడిచినపుడు ఏడవలేకపోయాను. దేవతలాంటి అమ్మను నా పుట్టుకకు విపరీర్థాలు తీసి నాన్న అమ్మను కొట్టి నిత్యం చంపుతున్నప్పుడు నేను ఏమయిందో తెలియక ఏడవలేకపోయాను. చదువనేదే అవసరం లేదని నన్ను పూర్తిగా ఇంటిపని చేయిస్తుంటే, నాకు నేనే చదివి కష్టపడి మార్కులు తెచ్చుకుని ఆ సంగతి చెప్పాలనుకుంటే వినిపించుకునే వారేలేనప్పుడు ఒంటరిగా కూర్చుని ఏడవలేకపోయాను. నాలో అందం లేదని, నల్లగా వుంటానని నిరంతరం ఇంట్లో అంతా బాధపడి నన్ను అవమానపరుస్తున్నప్పుడు నాకు ఏడుపు రాలేదు. నాకోసం ఎవరొచ్చినా నేను పనికిరానిదాన్నని, బస్టాండ్‌లో పాటలు పాడి సంపాదిస్తుందిలే అని నిత్యం నాన్న హేళన చేస్తున్నపుడు నాకు కన్నీరే రాలేదు. పెళ్ళి పేరిట రెండో పెళ్లివాడిని, కాలు కన్ను లేనివారిని తీసుకొచ్చి నీ ముఖానికి వీరే ఎక్కువ అని అన్నపుడు నేను ఏడవనేలేదు. కానీ, పసితనం నుండి ప్రేమ ముఖమే ఎరగని నాకు ప్రశాంత్ కనబడి నాకోసం చచ్చిపోవడానికి కూడా సిద్ధమే అంటే నేను మురిసిపోయాను. గాల్లో తేలిపోయాను. నాకు జీవితముందని గర్వపడ్డాను. నన్నూ ప్రేమించేవారున్నారని మురిసిపోయి నా సుఖాన్ని ఏమాత్రం సహించలేని అమ్మ, నాన్నలకు నేను ఎందుకు భయపడాలనే ఆలోచన నాకు కలిగి నన్ను నన్నుగా ప్రేమిస్తున్న ప్రశాంత్‌తో జీవితాన్ని సంతోషంగా గడపడానికి వచ్చాను. మొదట ఏడాది బాగానే వుంది. రెండో సంవత్సరం నుండి మొదలయ్యింది నా బాధ. అనుమానం, ఏదో మాట అనడం, పాతవేవో తవ్వి నా శీలాన్ని శంకించడం ఎక్కువయ్యింది. వాడొక మృగం. వాడికి శరీరంతోనూ, మనసుతోనూ ఆడుకోవడమయితే తెలుసుకానీ ప్రేమించడం మాత్రం తెలియదని, ప్రేమంటూ నా శరీరంకోసమే వెంటపడ్డాడని తెలుసుకోవడానికి నాకు ఒక సంవత్సరం పట్టింది. కనబడి పలకరించిన ప్రతి ఆడదాన్ని అలానే ప్రేమిస్తాడని, ఒక్కొక్కరికి ఒక్కో టైము కేటాయిస్తాడని, అసలు వాడికి ఆరేళ్ల అమ్మాయి నుండి అరవై ఏళ్ల వరకు ఏ స్త్రీనైనా కామాన్ని తీర్చే ఒక యంత్రంలానే చూస్తాడని, నాకు ఏడాది గడిచేదాకా, తనమూలంగా మోసపోయిన ఒక స్త్రీ చెప్పేదాకా తెలియలేదు. అయినా ఏరోజుకారోజు మారకపోతాడా అనే ఆలోచిస్తూ వుండిపోయాను. కానీ ఆలోచనే పొరపాటయ్యింది. నా జీవితాన్ని నా చేజేతులారా నేనే పాడుచేసుకున్నానని తెలుసుకున్నాను. అప్పటికే ఇద్దరు పిల్లలు. వారికోసమైనా జీవించాలని తాపత్రయపడ్డాను. నేనే కోల్పోయిన జీవితాన్ని వారికి అందివ్వాలని అపురూపంగా చూసుకున్నాను. కానీ, వ్యవహారం పూర్తిగా శృతి మించిపోయింది. ఆఖరికి ఈ బిడ్డలు కూడా తనకు పుట్టలేదనే నిందతో వీధంతా అరిచి గోల చేసాడు. చివరికి నన్ను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలని తన స్నేహితునితో మాట్లాడటం నేను అనుకోకుండా వినడం జరిగింది. అది ఎలా అని తెలుసుకోలేక పోయాను. కానీ ఎన్నడూ లేనిది నాకు రాత్రి రెండు గ్లాసుల పాలు తెచ్చి ఇద్దరం ఇక మీదట నుండి చక్కని జీవితాన్ని గడుపుదాం అన్నపుడే నాకెందుకో అనుమానం కలిగింది. పాలగ్లాసులో ఒకటి రంగు కొద్దిగా మారి వుండటం గమనించాను. నేనే మాటల్లో పెట్టి గ్లాసులు మార్చాను. అంతే దెబ్బకు చచ్చాడు. అయినా నాకు ఏడుపు రావడం లేదు. నాకు రాదు కూడా. వాడు తీసుకున్న గోతిలో వాడే పడ్డాడు. అంటూ విరగబడి నవ్వుతోంది.. నవ్వుతోంది... నవ్వుతూనే వుంది.

***

సుమకు ఎందుకో చాలా భయం వేసింది. తనకంతా అయోమయంగా వుంది. పాపం! అక్క ఎంతగా ఆవేదన చెందిందోకదాని మొదటిసారిగా తన మనసుకు అనిపించింది. తల్లి దేవమ్మకు కన్నకూతుర్ని ఇంతగా క్షోభ పెట్టామా అని తెలుసుకుని కుమిలిపోయింది. సుమ జీవితం ఇలా అయిపోవడానికి కారణం తల్లితండ్రులుగా మేమే కదా అని ఆవేదన చెందింది. మౌనంగా ఇంటిదారి పట్టారు. కానీ ఇద్దరి మనసులు మాత్రం అల్లకల్లోలంగా వున్నాయి.

"అమ్మా! అక్క పిల్లల్ని మాత్రం తక్కువగా చూడకండమ్మా" అంది మెల్లగా బాధను దాచుకుంటూ..

సమాధానంగా ఏమీ చెప్పలేకపోయింది దేవమ్మ.

***

"ఊ... చెప్పు... ఎందుకింత లేటు?" అంది అపరకాళిలా రంకె వేసింది సంధ్య.

"నిజం సంధ్యా... ఈరోజు స్టాఫ్‌లో చాలా మంది లీవ్‌లో ఉన్నారు. దాంతో పని ఎక్కువయ్యింది" కావాలంటే.. శివాజీని అడుగు.

"మధ్యలో ఆ వెధవెందుకు? చెప్పు... ఉదయం నేను ఫోను చేసినపుడు నీ సెల్ ఎందుకు ఎంగేజ్‌లో వుంది? ఎవరితో మాట్లాడుతున్నావు? ఆడా మగా? ఆడయితే ఎంతకాలం నుండి పరిచయం? నిన్నటి నీ సెల్‌లో ఇప్పుడే వచ్చేస్తున్నా అని ఎవరికి మెసేజ్ ఇచ్చావు? ఎక్కడికి వెళ్ళేవు?" చిట్టా విప్పింది.

"అబ్బా... సంధ్యా... అర్థం చేసుకోవే... ఉదయం రాజేష్ మాట్లాడాడు. చాలా కాలమయిందని కాస్సేపు మాట్లాడాను. వాడికే నేను ఇంటికి రావాలా? ఆఫీసుకు వస్తావా అని మెసేజ్ ఇస్తే వాడికే అలా సమాధానం ఇచ్చాను. అయినా సంధ్యా నువ్వనుకున్నంత నీచుడ్నికాను నేను. నాకు కావాలంటే మా అన్నయ్యను అడుగు... లేదా మా ఇంట్లో ఎవరినైనా అడుగు అన్నాడు బ్యాగ్‌ను పక్కన పెడుతూ... శ్రీనివాస్.

"నీ గురించి మీవాళ్లు ఎందుకు నిజం చెబుతారు? ఎవరి బిడ్డ వారికి ఎలాంటి వాడైనా గొప్పోడే కదా?" అయితే మొన్న మీకు ఆ గీత ఎందుకు ఫోను చేసింది?"

"అదేంటి సంధ్యా అలా మాట్లాడతావు? ఆరోజు నేను తలనొప్పని ఇంట్లో వుండి పోతే బాస్ ఏదో ఫైల్ అడిగితే నా కబ్బోర్డ్ కీస్ ఎక్కడ పెట్టావు అని అడిగింది. అంతే.. ఆ విషయం ఆరోజే అపుడే చెప్పాను కదా?" అరిచినంత పని చేసాడు శ్రీనివాస్.

"ఏమో? ఆ ఫోనులో ఏమి మాట్లాడుకున్నామో నాకేమయినా వినిపించిందా ఏమైనానా? మీరు ఏది చెబితే అది వినాల్సిందే కదా?" అంది లోపలికి వెళుతూ.. సంధ్య.

"నోర్ముయ్.. బుద్ధిలేకుండా మాట్లాడకు. నోటికి వచ్చిందల్లా మాట్లాడటం నీకు అలవాటయింది." అని కాస్త కోపంగా అనే లోగానే సంధ్య కోపంలో చేతికందిన ఫ్లవర్‌వాజ్‌ను భర్త మీదకు విసిరింది. దాంతో నుదిటికి పెద్దదెబ్బే తగిలింది. వెంటనే ఆసుపత్రికి వెళ్లాడు. కట్టుతో ఇంటికి వచ్చి ఇంత దెబ్బ తనకు తగిలినా సరే కనీసం సారీ అయినా చెప్పకుండా "ఇక ఆ గీత దగ్గర నుండి పరామర్శలు వస్తాయేమో" అనడం శ్రీనివాస్ భరించలేకపోయాడు.

"సంధ్యా నువ్విలా ప్రవర్తించడం ఏమైనా బావుందా? కనీసం నేను ఒక మనిషిననీ కూడా నీకు కనబడటం లేదు. నేనేమయినా నిన్ను అన్నానా?" అడిగాడు ఉదయం లేచి ఆవేదనగా...

"తలకు దెబ్బేగా తగిలింది? నేనేమీ చంపలేదుగా! సంతోషించండి" అని విసురుగా అని వెళ్లటంతో శ్రీనివాస్ అహం దెబ్బతిని అయితే సంధ్యా ఇక మనం కలిసి వుండలేం.. విడిపోదాం" అన్నాడు కోపంగానే.



"పీడా వదిలిపోయింది. ఆ పనిచేయి... అంటే నువ్వు ఆ గీత ముందుగానే తయారయ్యారన్నమాట. నన్ను అడ్డు తొలగించుకోమని అదే చెప్పిందా? అలాగే అయి వుంటుంది" అంది గిన్నెలు నేలపై పడేస్తూ.

"సంధ్యా నీకు పిచ్చా? గీతకు పెళ్లయింది. ఇద్దరు పిల్లల తల్లి. నాకు సీనియర్. ఆవిడ నన్ను తమ్ముడు అంటుంది. తెలుసా? నీకు ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తున్నాయో నాకయితే అర్థం కావటం లేదు" అయినా నీతో నాకు మాటలేంటి? ఛీ...ఛీ... రానురాను నాది పాడుజన్మ అయపోయింది" అనుకుంటూ బయటపడ్డాడు శ్రీనివాస్.

***

"సంధ్యా..." "సంధ్యా..."

"ష్.. ఏంటా అరుపులు.. ఇంట్లో ఎవ్వరికీ చెవుడు లేదు. మెల్లగా మాట్లాడు" అంది సంధ్య ఏ మాత్రం మర్యాద లేకుండా.

"నేను నిన్ను కట్నం కోసం వేధిస్తున్నానా? నిన్ను చంపేస్తానని రాత్రి కిరోసిన్ డబ్బా కొన్నానా? నాతోపాటు నోరే లేని అమ్మను కూడా ఇరికించి కేసు పెడతావా? ఎంత ధైర్యమే నీకు..? లేని మాటలు నిలబడతాయనుకోకు" అన్నాడు కోపంగానే.

"నేను ఆడదాన్ని లేని మాటలు మాట్లాడతానని లోకమే కాదు చట్టం కూడా నమ్మదు. మేము ఏడిస్తే మీకు పుట్టగతులుండవు. కట్నంకేసు పెడితే కనీసం ఏడేళ్లు జైలుగోడలమధ్య కుళ్లి కుళ్లి చావాల్సిందే..." అంటూ విరగబడి నవ్వుతోంది సంధ్య.

"అవును... ఎక్కడైనా ఆడవారికి న్యాయం జరగాలని ప్రభుత్వం కొన్ని చట్టాలు తెచ్చింది... అంతేకానీ నీలాంటి వారికి కాదు... అదీ నేను చెబుతా అవసరమైతే మినిష్టర్‌ను కలుస్తా నా నిజం ఏ ఒక్కరికైనా వినపించకుండా వుండదు"

"నిజం ఎవడికి కావాలి శ్రీనివాస్. నేను ఏది చెబితే అదే చట్టం. గృహహింస నేరంకింద నీ సిగరెట్టుతో నేను కాల్చుకున్నా అంటూ ఒంటిని చూపుతుంటే శ్రీనివాస్ కళ్లు తిరిగిపోయాయి. నీకు తగిలిన ఆ దెబ్బకూడా నాపై నువ్వు కిరోసిన్ పోస్తుంటే నేను ప్రాణరక్షణకు తోసాను నువ్వు ప్రమాదశాత్తు పడ్డావని ఇప్పటికే అన్నీ చెప్పాను. మీకోసం జైలు గోడలు ఎదురుచూస్తున్నాయి అంటూ నవ్వుతున్న తీరు చూస్తుంటే నిజంగానే చంపేయాలన్నంత కోపం వచ్చింది. కానీ అప్పటికే చెయ్యి దాటిపోయింది. పోలీసులు గృహహింస కేసు కింద శ్రీనివాస్‌ను తన తల్లితో సహా అరెస్టు చేసారు. వెంటవెంటనే సంధ్య ఆవేదనను విషయం ఏమిటో కూడా తెలియకుండా మహిళా సంఘాలు సంధ్యకు న్యాయం చేయాలని వారి పనిని వారు చేసుకుపోతున్నారు. టీవీలలో సంధ్యపై చర్చ కూడా జరుగుతోంది. అలాంటివారిని ఉరి తీయాలి. లేదు లేదు కాళ్లు చేతులు నరికి

పోగులు పెట్టాలి అంటూ మహిళలు తమ తమ ఉనికిని వారు చాటుకుంటున్నారు.

బాధల కోర్వలేక సుమ జీవితం అర్థం లేనిది అయితే, చట్టాల్ని దుర్వినియోగం చేసే సంధ్య లాంటివారు లోకంలో లేకపోలేదు... అయితే పురుషుల వల్ల స్త్రీలు బాధలు పడుతున్నారనేది ఎంత నిజమో, అదేవిధంగా ఒక కోణంలోంచి గమనిస్తే పురుషులు కూడా స్త్రీల మూలంగా ఎంతో నరకం అనుభవిస్తున్నది కూడా నిజం. అయితే న్యాయం వున్నా లేకున్నా, ఇలాంటి రెండు రకాల జీవితాలు జైలు గదుల్లో జీవితాల్ని వెళ్లదీస్తున్నదీ నిజమే... తప్పులు రెండు చోట్ల జరుగుతున్నా శిక్షమాత్రం ఒకరే అనుభవిస్తున్నది నిజమే..!! ప్రస్తుతం మనం జీవితంలో జీవం లేదు. జాతరలో బలిపశువుల్లా వున్నాము. ఏ వేటకు ఏ ప్రాణం బలి అవుతుందో అర్థం కాని తీరులో వుంది.

వీళ్లు బతికున్న శవాలు. వీరు చేజారిపోయిన జీవితం కోసం మళ్లీ పుడతారు. అపుడు మనుషులుగా కాదు.. ఆయుధాలై పుడతారు. నిరంతరం వేటాడుతూనే వుంటారు. అవును సమాజ ఉద్ధరణ కోసం మనసుల కంటే ఆయుధాలే ముందు ముందు అవసరమోమో!!

*(2010లో- అభ్యుదయ ఫౌండేషన్ (కాకినాడ) వారి ఆధ్వర్యంలో ద్వితీయ బహుమతిగా 1500 గెలుచుకున్న కథ)*



# ఉష్...!

జీవితానికి.. జీవించడానికి ఏమిటి సంబంధం....?

జీవితం ఒకవరం అనుకుంటాము మనం!.. మరి జీవించడం....?

జీవితానికి, జీవించడానికి తేడా వాస్తవికతా?

జీవితం అందరిది.. జీవించడం కొందరిదే...

అది శరీరంతోనా....? లేక మనసున్న మనిషితోనా....?

సన్నని తుంపర...! రివ్వున గాలి....! టేబుల్‌పై ఎంతచదివినా అర్థం కాని ఆధ్యాత్మిక గ్రంధాలు...! చేతిలో వేడిగా కాఫీ...! ఎదురుగా ఖాళీ కుర్చీ... కాదు కొంతసేపు తన ప్రాణాన్ని మోసిన కుర్చీ...! కలగలిపిన తనలో తెలియని భావాల కెరటాలు....!!

ఒకప్పటి హిందూమహాసముద్రమంత విశాలంగా, ప్రశాంతంగా, చిన్న చిన్న అలల్లాంటి అనుభూతులతో, ఏ ఒక్కరినీ మోయడానికి ఇష్టపడని హృదయంతో.. నిశ్శబ్ధంగా... ఒక మువ్వలా.. కిసుక్కుమనే చిన్నినవ్వులా... ఉండే జీవితం...!

నేడు జీవించడం మొదలు పెట్టేక... ఉవ్వెత్తున ఎగసిపడే కెరటంలా... రాక్షసి అలలతో.. మృతదేహాలతో, తిమింగలాలతో... సొరచేపలతో.. గుచ్చుకుంటున్న సొరంగం...!

ఇంటిముందు ఒక వైపు చేయి విరిగిన కుర్చీలో కూర్చుని ఆలోచిస్తోంది నీలిమ.. తన గురించికాదు.. తనకంటే వేగంగా సాగుతున్న జీవితాన్ని గురించి...

అక్కడ చెట్టుకింద చీకట్లో ఎవరు నిలబడ్డారు...? ... మనోహర్....!

అవును... మనోహరే...!

ఉదయం ఆరుగంటలకు బయలుదేరి కళ్ళనిండాకోపంతో. గుండెనిండా ఆవేశంతో మనసునిండా అసహనంతో ఇప్పుడే రావడం...!

కుర్చీలోంచి లేచింది... ఏదైనా ఇవ్వాలని..

తన అవసరం ఏమీ లేదన్నట్లు తానే వంటింట్లోకెళ్ళి కాఫీకాచుకోవడం గమనించి "ఇక అక్కడ ఏమిటి? ఎందుకు? అని అడిగే అవసరం లేదని గ్రహించి లేవడానికి ఇక ప్రయత్నించలేదు.

"ఏంటి...? అలా కూర్చున్నావు?"

"ఇంకేమి చెయ్యాలో తెలియక" అంది మెల్లగా

"ఇది వరకటిలా వుండలేవా?"

"ఉండడానికే ప్రయత్నిస్తున్నాను"

"చూడు నీలూ! నీకు విషయం ముందే చెప్పకపోవడం నాతప్పే" కానీ...

"పర్వాలేదు మను.. ఇందులో నీ తప్పంటూ ఏమీలేదు.. అంతా నాదే తప్పు...!"

"అని నేను అనలేను కదా! చిన్నప్పటినుండి అమ్మకు సీతంటే ప్రాణం తన అన్నయ్య కూతుర్ని చేసుకుంటానని ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇప్పుడు నీతో పెళ్ళయిందని చెబితే ఆమె ఆరోగ్యం తట్టుకోగలదో లేదో అని ఈ పెళ్ళికి ఒప్పుకోవాల్సివచ్చింది. అయినా నేనుప్రేమించింది నిన్నే కదా నీలూ.. నీకెందుకింత బాధ" అన్నాడు చాలా సింపుల్‌గా

"ప్రేమా...? అదెక్కడుంది మనూ! ప్రేమకు మనసేకాదు శరీరం కూడా అవసరం. ఎందుకంటే నిన్ను ప్రేమిస్తున్నానని నన్ను తాకకుండా వుండలేవు కదా! ఆ ఫలితమే కదా నేనే మోసే ఈ ఎనిమిది నెలల కడుపు... మరి నువ్వనుకున్నట్లుగా పెళ్లేకదా! ప్రేమ లేదు అన్నా అందుకు శరీరమే అవసరం. ఆ అవసరంతో బిడ్డల్ని కంటుంది. అప్పుడు బిడ్డలే కదా అని బయటకు విసిరేయలేం.. ఆమెకు పుట్టిన బిడ్డలు వారసులు... నా బిడ్డలు అనాథలు అంతేగా...?"

"చూడు నీలూ!ఏదో పెళ్ళిచేసుకుని దానికి నామూలంగా బిడ్డలు పుట్టినంత మాత్రాన నా ఆస్తి అంతా వాళ్ళకు రాసేస్తానా? నీ వాటా నీకు వుండనే వుంటుంది. అందులో అనాథలవడానికి అవకాశమేముంది? నువ్వు అనవసరంగా మాట్లాడుతున్నావు నీలూ!"

"నిజమే! నా మాటలన్నీ అనవసరమే! నేను కూడా మా అమ్మ ఎప్పటినుండో మా బావతో నా పెళ్ళి చేయాలనుకుంటోందని వేరే అతనితో, అమ్మ చెప్పిన అతన్ని పెళ్ళిచేసుకుని, వారితో పిల్లల్ని కంటే మీకేంటి బాధ? అంది తీక్షణంగా... నీలిమ

"అదెలా కుదురుతుంది?"



"మరి ఇదెలా కుదురుతుంది?"

"చూడు నీలూ! వితండవాదం వద్దు... జరిగిందేదో జరిగిపోయింది. ఇకపై జరిగేది ఆలోచించాలి. నిన్ను ప్రేమించాననేది ఆరోజు కాదు జీవితాంతం చెప్తున్నా చెబుతాను. నిన్ను నేను ఎప్పుడూ తూలనాడను. తక్కువగా చూడను. అయితే నువ్వు నేను పదిరోజుల వరకు ఎటైనా అంటే మీ పుట్టింటికి వెళ్లిరా.. కడుపుతో వున్నావుకదా కాదనరులే... సరేనా!"

"చూడు... మనో... ఇప్పుడు నీవన్నమాటలు నేనంటే నువ్వేమంటావో నాకు తెలుసు.. నేను ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎక్కడికీ వెళ్లలేను. అలాగని మాటతప్పిన నీతో వుండలేను కూడా... ఇంట్లో వారిని కాదని నీ వెంట వచ్చినందుకు నాకు చాలా బాగా గుణపాఠం చెప్పావు. చాలాసంతోషం... గాలిలో నడిచే నీకు, కాలంవెంట నడిచే నాకు చాలా వ్యత్యాసం వుంది. ఇక నాకు నువ్వేమీ చెప్పకు.. నేను నమ్ముకున్న కాలమే నాకు సమాధానం చెబుతుంది.. అంటూ నీలిమ ఒకవైపు ఆవేదన పడుతుండగానే... మనోహర్ బయటకు నడిచాడు కోపంగా. కాస్సేపు అలాగే కూర్చుండిపోయింది నీలిమ. తాను ఎంతో ఆశతో తనజీవితాన్ని గూర్చిన అందమైన కలలతో ఉంటే మధ్యలో మళ్ళీ మనోహర్‌కు పెళ్ళేంటి? అయితే నేనేంటి? నా జన్మకు ఇక అర్థమేంటి?

తాను, పావనీ, రజనీ, అనూరాధా అందరితో కలిసి రాత్రనక, పగలనక, అల్లరిచేస్తూ, సినిమాలు చూస్తూ, ఇంట్లో అమ్మ తిడుతున్నా అవేవీ పట్టించుకోకుండా స్నేహితులని, పార్కులని, పిక్‌నిక్‌లని ఎంతో ఆనందంగా గడిసేవారం. ఒక్కోసారి సెకండ్‌షోకి అమ్మ ఎంత వద్దన్నా, వెళ్ళి ఒకవైపు వాన మరోవైపు ఆటో దొరకక మేము ఒక వారగా నిలబడితే దారిలో వెళుతున్న పోలీసు జీపు ఆగి మా గురించి ఎంక్వయిరీ చేసి మమ్మల్ని ఇంటిదగ్గర దింపితే నాన్న కొట్టిన దెబ్బలు ఇంకా గుర్తున్నాయి. రజనీ వాళ్లింట్లో ఎలాగోలా డబ్బుసంపాదించి పిక్‌నిక్‌లంటూ వెళ్లి ఒకరోజంతా రాకుంటే అమ్మ కొట్టిన చెంపదెబ్బలు ఇంకా ఎలా మర్చిపోగలను? నిత్యం జీవితాన్ని ఒక ఆటగా చేసి నవ్వుతూ, గడిపే ఆరోజులు మళ్ళీ కావాలనుకుంటే వస్తాయా? అప్పుడే ఒక సినిమా థియేటర్‌లో మనోహర్ పరిచయం కాస్త ప్రేమగా మారి అదే దూకుడుతో ఇంట్లోవారు కుదిర్చిన పెళ్లిని కాదని పీటలమీదనుండి పారిపోయి ఏదో సినిమాటిక్‌గా పెళ్లిచేసుకుని అప్పటికేదో సాధించానని మురిసిపోయి, నన్ను ఎంతో కష్టానికి ఓర్చి ఎన్నో అబద్ధాలు ఆడి, నాకు మనోహర్‌కు పెళ్ళి చేసిన నా మిత్రబృందానికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?

ఈరోజుల్లో ప్రేమల్ని నమ్మకూడదమ్మా.. మగవారు వారి అవసరం తీరేదాకానే ప్రేమ కబుర్లు చెప్పి, తీరా మోజుతీరాక వదిలేసి మా అమ్మ చెప్పిందే నేను వింటాను అనే అవకాశవాదులు. అంటూ అమ్మ నా చెవిలో ఇల్లుకట్టుకుని పోరినా వినని నాకు సరిగ్గా

ఏడాదికాకుండానే నా పెళ్ళి నా జీవితం ఒక గాలిపటంలా చేసి సరిగ్గా అమ్మ చెప్పినట్లే మోసం చేస్తాడని అనుకోలేదు. ఇప్పుడెలా? ఎవరినుండి ఓదార్పుకోరాలి? ఏముఖం పెట్టుకుని ఇంటికి వెళ్ళాలి.? అనుకుంటూ యధాలాపంగా మనోహర్ వదిలి వెళ్లిన బ్యాగ్‌ను చూసి, అందులో తనకు కాబోయేభార్య సీత ఫోటో వుంటుందేమో. ఎలా వుంటుందో చూద్దామనే జిజ్ఞాసతో తెరచిచూసింది. తాను అనుకున్నట్లే ఒక ఫోటో వుంది మనోహర్ పక్కన సీతను చూసి ఉలిక్కిపడింది. ఈ సీతా! ఒకే స్కూల్లో చదువుకున్నా పెద్దగా స్నేహంలేకున్నా తన క్లాస్‌మేట్. ఎపుడూ మౌనంగా వుండేది. మేము అల్లరి ఎంత చేస్తున్నా తన పని తాను చేసుకుంటూ పోయేది. మేమెప్పుడైనా ఏడిపిస్తే చిరునవ్వు సమాధానంగా ఇచ్చి వెళ్లిపోయేది. అలాంటి సీత ఈ రోజు ఈ రావణాసురుడికి భార్యగా ఒప్పుకుందా? అంతా అయోమయంగా వుంది నీలిమకు.... కాదు... దీనికేదో పరిష్కారం చూడాల్సిందే. నన్ను కొంతకాలం ఎటైనా అంటే మా ఇంటికి వెళ్లమంటాడా? చెపుతా. అనుకుంటూ నిద్రపోయింది రాత్రి పదకొండు కావటంతో...!!

జీవితంలో ప్రతి ఉదయం సూర్యోదయమే అయినా జీవితంలో మాత్రం ఒక్కో ఉదయం ఒక ప్రశ్న అయితే, ఒక్కో ఉదయం సమాధానం అవుతుంది. ఒక ఉదయం వేదనయితే మరో వుదయం ఆనందం అవుతుంది. ఒక్కో ఉదయం సమస్య అయితే, మరోఉదయం పరిష్కారమవుతుంది. అలా ఈ ఉదయం నీలిమకు పరిష్కారం దొరకుతుందేమో.. అనుకుంటూ నీలిమ ఉదయమే తయారయింది. ఇంటి చిరునామాను ఒక్కసారి చూసుకుంది. చిరుచీకట్లు ఇంకా తేరుకోకముందే బయలుదేరింది. సరిగ్గా ఒక ముప్పావుగంట వరకు ఇంటిని వెదికి వెదికి చివరకు చేరుకోలిగింది.

తలుపు తెరవడంతోటి కనబడ్డ నీలిమ సీతకు ఒక ప్రశ్న అయింది. ఇదేమిటి నీలిమ మా ఇంటికి వచ్చింది? అనుకుంటూనే నువ్వు నీలిమవు కదూ? అడిగింది ఆశ్చర్యంగా..

"అవును.. నువ్వు సీతవు కదూ!" అడిగింది అంతకంటే ఆశ్చర్యంగా.

"నువ్వు ఇలా ఇక్కడికి..."

"నాకర్ధమయిందిలే.. నేను ఇక్కడికి ఎందుకు వచ్చాను? నాకేం కావాలి అని నువ్వు ఆశ్చర్యపోతున్నావుకదూ! అసలు ఆ ప్రశ్న నేను నిన్ను అడగాలని వచ్చాను. ఎందుకంటే ఇది నా భర్త వున్న ఇల్లు ఇది. తను పెళ్లి చేసుకున్నాక ఎప్పటికప్పుడు నన్ను తన ఇంటికి తీసుకెళతాను అన్నాడు. కానీ తీసుకెళ్ళటంలేదు. నాకా నెలలు నిండుతున్నాయి. పురిటికి పుట్టింటికి వెళదామా అంటే అపసవ్యంగా జరిగిన మా ప్రేమ వివాహనికి పురుడుపోసేటంత ఆధునికులు కారు మా అమ్మ నాన్నలు. ఇక నాకు ఆరోగ్యం బాగుండటం లేదు. కనీసం నేనే ఇంటికి వచ్చి మా అత్తగారికి మామగారికి క్షమాపణలు చెప్పి ఇక్కడే ఉండిపోదామని వచ్చాను. అనుకోకుండా నువ్వు ఎదురయ్యావు, అబ్బ.. కాస్త మంచినీళ్ళివ్వవా? అయినా నువ్వు ఎందుకు ఇక్కడున్నావు? నువ్వేమయినా వీరికి చుట్టానివా? నాకేమీ ఈ ఇంటి వాతావరణం సరిగా తెలియదు. నువ్వెవరో నీకు వీరేమవుతారో తెలియదు" అంటూ అనేలోగానే 'సీతా' అంటూ అపర మన్మధునిలా కిందికి వస్తున్న మనోహర్ గుమ్మంలో నీలిమను చూసి కాస్త తొట్రుపడ్డాడు.

"అలా నిలబడిపోయారేం? రండి మీ భార్య నీలిమ వచ్చింది. మాట్లాడుతూ వుండండి నేను కాఫీలు తెస్తాను అంటూ లోపలికి వెళ్ళింది సీత.

సీత అలా కూల్‌గా అనడం చెమటలు పట్టించాయి మనోహర్‌కు..

"ఏంటి ఇలా వచ్చావు? నేను ఏమి చెప్పాను?" అంటున్న అతని మాటలు విని నేను నీ భార్యను. అందుకే మన ఇంటికి వచ్చాను. మీరు చెబుతున్నట్లే నేను పుట్టింటికి వెళ్ళచ్చు. నాఖర్మకు వారిని బాధించడం ఇష్టంలేక ఇలా నిర్ణయం తీసుకున్నాను. ఎందుకంటే నా బిడ్డకు చిరునామా కావాలిగా. రేపు వాడిని అనాధలా పెంచలేను కదా! అందుకే అంటున్న నీలిమను చూస్తున్న మనోహర్ తల్లితండ్రులు అలా శిలావిగ్రహాలయ్యారు. ఎవరంటూ.?

విషయం విని, పెళ్ళికి సంబంధించిన ఫోటోలు చూసి మనోహర్ తల్లితండ్రులు ఇది నిజమా అన్నట్లు మనోహర్ వంక చూసారు. మనోహర్ మౌనమే వీరికి సమాధానమయ్యింది. వారికి ఏమీ తోచడంలేదు.

"మీకు ఇదే పని పదిరోజులక్రితం చేసివుంటే మరో అమ్మాయినవి బాధపెట్టేవారము కాదు కదా అనుకోవచ్చు. తర్వాత అంతకంటే మనోహర్‌పై నాకున్న నమ్మకం. ఏరోజో ఒకరోజు నన్ను మీకు పరిచయం చేస్తాడేమో అనే నమ్మకం. కానీ రెండు రోజులనుండి నేను అనుభవించిన నరకం ఏ స్త్రీ అనుభవించకూడదు ఆంటీ. అలా బాధపడ్డాను. మా అమ్మకోసం పెళ్లి చేసుకున్నానని తనంటే నేను కూడా మా అమ్మకోసం ఒకపెళ్లి ప్రేమకోసం ఒక పెళ్లి చేసుకుంటే సంఘం ఒప్పుకుంటుందా? నేను ఇంటినీ ఇరవైఏళ్ళు పెంచి పెద్దచేసిన అమ్మానాన్నలని వదులుకుని కేవలం ఒక సంవత్సరం పరిచయం వున్న వ్యక్తితో రావడం ఎంత పొరపాటో ఇప్పుడే అర్ధమయ్యింది. నేనే ఒంటరిదాన్నయితే తప్పుకునేదాన్ని కానీ నా కడుపులో మీ వంశాంకురం పెరుగుతోంది. అందుకే మీ దగ్గరకువచ్చాను. మీరు నాకు చేయాల్సిన సహాయం ఒక్కటే. బిడ్డను కన్నంతవరకు నాకు నీడనివ్వండి. తర్వాత మీకు మీ బిడ్డను అప్పగించి మీ నిర్ణయం మేరకు బతకగలను. అప్పుడు నా బిడ్డకు తల్లి తండ్రి ఇద్దరూ ఉంటారు. అనేసరికి ఆడపిల్ల అంత ఆవేదనగా గుమ్మంలోకి వచ్చి మాట్లాడటం తట్టుకోలేకపోయారు ఆ తల్లితండ్రులు. రామ్మా... నువ్వు అనుకున్నట్లే ఇక్కడ వుండచ్చు అంటూ వెళ్లిపోయారు.

సీతలో తాననుకున్నట్లు ద్వేషం ఏమీ కనబడలేదు. ఒక స్నేహితురాలిలానే ప్రవర్తించింది. వేళకు అన్నీ అందించింది కూడా. ఇంట్లో ఎక్కడా లోపంలేదు. కానీ మనోహర్ కాస్త తెలివిగా ప్రవర్తించి వున్నట్లైతే ఇంత జరిగేది కాదు కదా అనిపించింది. గొడవలు ఒకరినొకరు మాటలు అనుకోవడం జరగకపోవడంతో నీలిమ ఎంతో ఊపిరిపీల్చుకుంది. కాలం రెండు నెలలు వెంటనే గడిచిపోవడం నీలిమ మగబిడ్డకు జన్మనివ్వడం జరిగింది. అందరికీ ఆనందమే ఒక్క నీలిమకు తప్ప. తర్వాత తన జీవితాన్ని గూర్చి ఆలోచన తప్ప మారేదీ తనను దాటిపోవడం లేదు. సీత ఎంతో మంచిది. పాపం నేను వున్నవాళ్లు ఒక్క మాటకూడా అనలేదు. స్వతహాగా ఎంతో మితభాషిణి. తన పని చేసుకుపోవడంతప్ప మరేదీ తెలియని మనిషి. తర్వాత తాను ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో? నా బిడ్డను తన బిడ్డలా చూసుకుంటుందా? లేక? అమ్మో ఆ ఊహే భరించలేకపోతోంది నీలిమ. అయినా ఏదో నమ్మకం.. సీతపై.. సీత స్వభావంపై.

రోజులన్నీ ఒకేలా వుంటాయి. కానీ రోజులపై ఆధారపడివున్న జీవితాలు మాత్రం ఒకేలా వుండవు. ఏరోజు మన పాలిట శతృవు అవుతుందో, ఏరోజు మనపాలిట ఆప్తమిత్రువు అవుతుందో తెలియదన్నట్లు అప్పటికే నెలరోజులు పూర్తయి ఇక బయటపడాలని నిర్ణయించుకోగానే సీత అనారోగ్యం పాలయ్యింది. ఇక చేసేవారు లేక నీలిమ సీతను కంటికి రెప్పలా కాపాడుకుంది. దాంతో మరో నెలరోజులు గడిచిపోయాయి. నీలిమకే ఆ ఇంటిని వదిలిపెట్టాలంటే మనసొప్పడంలేదు. ఆ ఇల్లు ఆ వాతావరణం అంతా నిశ్శబ్దంగా వుంది. ఇక మనోహర్ తల్లి జానకమ్మకు దిగులు పట్టుకుంది. ఎవరికి ఏ న్యాయం చేయాలో తెలియని స్థితిలో వుంది. మనోహర్ ఒక్క విషయం చెప్పివుంటే ఈపాటి నిశ్చితార్థం కాకుండా వుండేది కదాని వాపోతోంది. చిన్నప్పటి నుండి తన అన్నకూతుర్ని చేసుకుంటానని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ధ్యేయంగా పెట్టుకుందే కానీ పిల్లల ఇష్టాఇష్టాలను గమనించే స్థితిలో లేకపోయింది. ఇప్పుడు ఒకవైపు ఇద్దరు భార్యలున్నా, లోకం ఆడిపోసుకుంటుంది. ఒకవైపు ఇద్దరూ ఆడపిల్లలే ఎవరికి అన్యాయం చేయలేకపోతోంది. ఎవరిని కాదనలేకపోతోంది.

గౌతమీ ఎక్స్‌ప్రెస్ దారుణంగా యాక్సిడెంట్ అయిందనే వార్త వినగానే ఒక్కమాటున ఉలిక్కిపడింది నీలిమ. కారణం అర్జెంట్‌పనంటూ మనోహర్ రాజమండ్రికి బయలుదేరడమే. ఇల్లంతా శోకసముద్రంలో మునిగిపోయింది. వెంటనే నీలిమ సంఘటనా స్థలానికి బయలుదేరింది. అక్కడ కొనప్రాణంతో వున్న మనోహర్‌ను దగ్గరుండి హాస్పిటల్‌లో చేర్పించింది. దురదృష్టవశాత్తు ఒక కాలు పూర్తిగా తీసివేయాల్సివచ్చింది. మనిషి ప్రాణాలతో బయటపడినా జీవచ్ఛవమే అనుకుంటూ జానకమ్మ ఏడుపు ఆగటంలేదు. ఇక అందులో మూడునెలల దాకా మనోహర్‌కు తానే ఒక కాలులా అయి, తల్లిని మరిపించింది నీలిమ. చంకలో



చేతికర్రతో అడుగులు వేస్తున్న మనోహర్‌ను చూస్తూ విలవిలలాడింది వీరి మనసు. తానెందుకు బతికాడో అర్థంకాని స్థితిలో మనోహర్ తనను తానే నిందించు కుంటున్నాడు. అంతా కుదుటపడింది ఇల్లంతా కొన్ని నష్టపోయినా ఒక దారిలోకి  వచ్చింది ఆరునెలల తర్వాత తన కొడుకు చిన్న చిన్న మాటలతో అందరినీ అలరిస్తున్నాడు. అయినా తప్పదు తనకంటే తన కొడుకుకు ఇల్లు కావాలి. అమ్మ నాన్న కావాలి అనుకుంటూ తెల్లవారితో బయలుదేరాలని నిర్ణయించుకుంది నీలిమ.

ఒకప్పుడు ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు కడుపులో కొడుకును మోస్తూ తెల్లవార గానే ఈ ఇంటికి వచ్చింది. మళ్ళీ ఆరునెలల తర్వాత మరో తెల్లవారు ఝామున ఎక్కడి కెళ్ళాలో తెలియకుండా బయలుదేరింది. మరో వైపు సీతకూడా బయలుదేరిందనే విషయం ఎవరూ ఊహించివుండరు. ఒక్కసారిగా ఇద్దరూ రూమ్ నుండి బయటకు రాగానే ఎదురు పడేసరికి. ఉలిక్కిపడిన నీలిమ ఎదురుగా సీత "ఎక్కడికి? అంటూ" అని ప్రశ్నించింది.

"ఏమో తెలియదు సితా! వచ్చిన పని అయిపోయింది. నాబాబును నువ్వు బాగా చూసుకుంటావనే నమ్మకం నాలో పూర్తిగా వుంది. నాలో ధైర్యం వుంది. తెగింపువుంది. అవి చాలు నేను బతకడానికి అనిపిస్తుంది".

"నువ్వెక్కడికి బయలుదేరావు సీతా?" అడిగింది నీలిమ.

"నాలోనూ నీకున్న లక్షణాలన్నీ వున్నాయి నీలిమా! నువ్వు నాకంటే ఎక్కువగా మాట్లాడతావు. నాకంటే ఎక్కువ ఆలోచిస్తావు. అంతే తప్ప నాలో ఏమీలేదనడానికి కూడా ఆస్కారంలేదు. కాలేజీలో వున్నప్పుడు నీవంటే ఏంటో తెలుసుకోవాలని కూడా అనిపించలేదు. ఎందుకంటే నువ్వు నాకు నచ్చలేదు. కానీ ఇప్పుడు నువ్వు మాకోసం ఎంతగా కష్టపడ్డావో నాకు తెలియనిదికాదు. నీలో నిలువెత్తు మానవత్వం చూసాను. మనోహర్ కు నేను కాబోయే భార్యనైతే నువ్వూ భార్యవు కదా? అలాంటప్పుడు నీకెందుకు శిక్ష పడాలి? బిడ్డకు తల్లివైన నిన్ను నాకు పంపాలనిపించడం లేదు నీలిమా. అందుకే నేనే పుట్టింటికి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను. ఆ భగవంతుని దయవల్ల మాకు ఇంకా పెళ్ళికాలేదు. అందుకే....

"త్యాగమా సీతా!"

"కానేకాదు... నాకు ఒకవిధంగా తప్పించుకోవడమే.. ఎందుకంటే నేను కుంటి వాడితో కాపురం చేయలేను. " అనే మాట పూర్తికాకుండానే సీతా! అంటూ గట్టిగా అరిచింది జానకమ్మ

"ఎందుకంత అరుస్తారు? నేను ఉన్నమాటే చెప్పాను. నాకు మనోహర్ నచ్చలేదు. తన కుంటితనం అస్సలు నచ్చలేదు. నాకు భర్తన్నా, కొన్ని ఊహలున్నాయి. ఆశలున్నాయి.

అంతేకానీ ఇలా నాకంటే ముందు పెళ్లిచేసుకున్నవాడు, కాలు పోగొట్టుకున్నవాడు బతకడానికి నా మనసు అంగీకరించడంలేదు. నేనేమీ త్యాగంచేసి వద్దనటంలేదు. తన మాటనిలబెట్టుకోవాలని అత్త, చెల్లెలి ఇంట్లో తన కూతురుంటే రక్షణ వుంటుదని మానాన్న, వారి ఆశల్ని, ఆశయాల్ని నెరవేర్చుకున్నారే తప్ప నాకంటూ మిగిలిందేమీలేదు. ఇది నేను ఈరోజు తీసుకున్న నిర్ణయం కాదు. ఎపుడైతే నీలిమ భార్యనంటూ ఇంటికి వచ్చిందో అప్పుడు తీసుకున్న నిర్ణయం. ఈనా నిర్ణయం ఎపుడో మా నాన్నకు చెప్పాను కూడా. నన్ను గుండెల్లో దాచుకునే తల్లితండ్రులున్నారు. ప్రేమించినంతనే ఏదో పాడుపనిచేసిందని ఇంటినుండి గెంటేసే తత్వం కాదు మా వాళ్ళది. అందుకే నేను వెళుతున్నాను.

"అంటే ఇది నీ ఆఖరు నిర్ణయమా?" అడిగింది జానకమ్మ

"నిర్ణయం అనేది ఒక్కటే వుంటుంది దానికి ఆఖరు, మొదలు అనేది వుండదు. అంటూ బయలదేరింది. సీత... బయట కూతురుకోసం నిలబడ్డ అన్నయ్యను చూసి జానకమ్మకు అంతా అర్థమయ్యింది. ఇక ఏమీ మాట్లాడలేక చూస్తుండిపోయింది.

ఎంతపని చేసావమ్మా....! చిన్నప్పటినుండి బావ బావ అంటూ బావకోసమే బతికావు కదమ్మా! ఇప్పుడిలా...!

నిజమే నాన్నా! నవ్వన్నది... నేను బతికిందే బావకోసమేనని తెలుసు. కానీ నా పెళ్లి నాటికే తనకు ఒక భార్య కూడా వున్నదన్న విషయం కనీసం తల్లితండ్రులకు కూడా చెప్పకుండా నన్ను పెళ్లిచేసుకోవడం, ఏమీ అనుకోకు మా అమ్మ కోప్పడుతుందని చేసుకున్నాను. అనీ నీలిమతో బావచెప్పడం, అన్నింటికీ మించి నీలిమ ప్రెగ్నెంట్‌గా వుండటం, ఇవన్నీ చూసాకే నాకు అర్దమయ్యింది ప్రేమ ఇద్దరికి సంబంధించిదని. అదీ బావతో నీలిమే వుండాలి. ఎందుకంటే తనలో ఎంత చిలిపితనంవుందో అంత ఓర్పు వుంది. నేను బాగోలెకున్నా, బావ నడవలేకున్నా రాత్రిపగలు కనిపెట్టుకుని వుంది. అంత మంచి మనిషికి బయటకు పంపండం నాకెందుకో ద్రోహం అనిపించింది. నాన్నా....!! నాకు నువ్వున్నావుగా నాన్నా... నావాడు కాకున్నా నా మనసునిండా బావ వున్నాడుగా నాన్నా" అంటూ కన్నీటిని కనబడనీయకుండా తండ్రి ఎదపై దాచుకుంది. సీతంలో అలనాటి సీతమ్మే కనిపించింది.

*(జాగృతి పోటీలలో సాధారణ బహుమతి పొందిన కథ)*



# బతుకు 'మోపు'

"ఏందయ్యా.. అట్ట గూకున్నవు..? బువ్వ తినరాదే! పొద్దుగాలనుండి సూత్తున్న నీ తీరు. కడుపుకు కూసింత తినమంటే తినకుంటివి.. ఏమయిందంటే ఏమీ చెప్తలేవు.. గిట్టుంటే నీ పానం బాగుంటదా?" అంది లచ్చిమి గిన్నెలన్నీ తోమి ఒకచోట బోర్లిస్తూ...

"తింటనే.. జర్రాగు ఆ నర్సింహులు అయిదరాబాదు పోయిండు. తిననీకి ఇంటి కొస్తననె. పొద్దుగాల పైసలు తెత్తనని పోయినాడు ఇప్పటిదాకా మడిసి కానరాలే.." అన్నాడు పంచె మరింత గట్టిగా కట్టుకుంటూ రంగయ్య...

"నర్సింహులు అయిదరాబాదు పోయిండా.. ఆడికి పైసలు ఎవురిత్తరయ్యా.. ఆడసలే తిక్కోడు.. నవ్వు ఆడ్నెందుకు పంపినవు..?

"గిదే ఇసువంటి మాటలంటవనే నీ కాడ ఆడి ఇసయం అప్పటిసంది చెప్పలే.. పట్నంలో ఈరిగాడు కాడికెల్లి పైసలు తీసుకొని ఇత్తనాలు తెస్తనన్నడు. గే సూత్తున్న.."

"ఆడు పొయింది అయిదరాబాదు  అంటుంటివి. గప్పుడే రానీకి కూసంత దూరంకాదయ్యా.. రానీకి పొద్దుగాలైతది.. నువ్వు బువ్వతిను.. అయ్యో... నీకా ఆలోచనలేకపోయే.." అంటూ అన్నం పెట్టిన పళ్ళెం ముందుకు తోసింది.

"మరి నర్సింహులు వస్తనన్నడే"

"ఆ! ఆడు వస్తన్నడు.. నువ్వేమో సూస్తున్నవు.. బాగుంది యవ్వారం.. బుర్రలేనోళ్లు ఇద్దరు ఒకతాన చేరి పరేషాన్ చేస్తుండ్రు..."

"లచ్చిమీ... ఈ సారైనా వానలు పడితే మంచిగుండే... పత్తి ఇత్తనాలు ఈసారైనా చేతికొస్తే నీకు పుసైలతాడు, పట్టుచీర తెచ్చిత్తనే..."

"గా ముచ్చట మన పెండ్లయిన కాట్నించి చెప్తుండవు. నువ్వు సెప్పినకాడ్నిండినాకు ఎదురుసూడుడే సరిపోయినాది. గప్పుడు ఒక పాలి మనకు మస్తు పైసలొచ్చినయి యాదున్నదా..? అప్పుడేమో కొనకుండా అప్పులంటివి.. మిగిలిన పైసలు నీ పానం మంచిగలేకుంటే అయిపోయె.. గప్పటిసంది పంట చేతికి రాలే.. నాకు బంగారపు పుస్తెలతాడు రాలే.. ఏందో! ఆ గోయిందమ్మ సూసినవా? మస్తు పైసలు జమచేసింది. దాని మగడు ఏడ్నించి పైసలు వచ్చినా వచ్చినా పెండ్లాం చేతికే ఇస్తడు.." అంది నూకలనుండి రాళ్ళు గాలిస్తూ...

"ఈపాలి పైసలు రానీయే... నీకే ఇస్తమ.. ఏమంటున్నా" అనే మాటలకే ఏదో చేతినిండా పంటవచ్చి డబ్బులొచ్చినట్లు మురిసిపోయింది లచ్చిమి.

"అయ్యా.. అంటూ కొడుకు యాదయ్య వచ్చాడు

"ఏందిరా! పిలగా మంచిగ సదువుతున్నవా? పదోకలాసు పాసయితివి గందా?"

"అయినా! నాయనా నేను మా దోస్తు శేఖరు లెక్క ఇంటర్ సదువుతా...!"

"మనకేల యాదయ్యా... మస్తు  పొలముంది.. నాకా పానం మంచిగుంటలేదు. సదువుకున్నోడు పొలంకాడికి పోతే మస్తు పైసలు వస్తయి.." అన్నాడు ఆనందంగా

"ఇయాల రేపు పదోకలాసు సదువు సరిపోదయ్యా.. గందుకే ఇంటర్ సదువుతా.. నన్ను పంపీ.. పట్నంలో ఉద్యోగాలొస్తయి.. ఈనేల కాడ నేను పనిచెయ్య.. నీ లెక్క ఆకాశం దిక్కు సూసుకుంటూ కూకుంటే నా బతుకు నీలెక్కనే అయితది..

"పైసలేడివిరా.. అందురూ సర్కారు పనికి పోతే పంటలేమిగావాల? నాకా అచ్చరం రాకపాయె.. గందుకే నీకు సదువుకాడికి పంపినా... గంతే.. మనసువంటోల్లకు సదువులు దేనికయ్యా...? పోపో.. పండుకో... పొద్దుగాల లేసి పొలంతానికి పొవాల.."

***

"అన్నా.."

"వస్తివా! నర్సిమ్మా.. ఆ ఈరిగాడు పైసలిచ్చిండా..?

"నువ్వేమో ముప్పై వేలు ఇస్తడంటివి.. ఆడేమో నాకాడ పైసలెవ్వు. బిడ్డ పురిటికి ఆయంత పైసలు కర్సు అయినయి. గిప్పుడు నా తాన పదేలు.. ఇగ పట్టు.. అని ఇచ్చిండె.. నేను గవైన వచ్చినయిగందా అని ఆ పైసలతోనే ఇత్తనాలు వచ్చినకాటికి తెచ్చినా..." అంటూ తెచ్చిన విత్తనాలు మూట గట్టి రంగయ్య చేతికిచ్చాడు.

"గిదేంది నర్సిమ్మా... మనది మూడెకరాలపొలం.. ఇవి ఏడ చాలతయి. ఒక్క ఎకరం కూడా రావాయే. సరే. గిప్పుడే దుర్గమ్మ పురిటికి రావాల్నా.. నా తలరాత గట్లుంది.."



అంటూ ఆ వచ్చిన విత్తనాల్నే కిందపరిచి గాలికి పెట్టాడు రంగన్న...

"గిదేంది తమ్మీ.. గంత దూరం పోతే పైసలు గింతే ఇచ్చిండా? ఆళ్ల పరేషాన్‌లు మనకేల? గట్టిగా అడిగేదుండే... మనం గిట్ల మెత్తగుంటే ఆడు గట్టనే సేత్తడు..." అంటూ గయ్యిమంది లచ్చిమి..

"అట్టగాదక్కా... ఆడు మొదుల్లో లేవనే... నేను ఆడ్నే గూకుంటే ఈయంత ఇచ్చిండు.. మాల్లా పదిరోజులల్ల ఇస్తడంట.. ఇగసరే.. మల్లాపోతాంలే అని వచ్చినా"

"మల్ల మల్ల పోనీకి పక్కీదా... అయిదరాబాదు.. ఆ నా కొడుకు మల్లగిట్ల నాకండ్లల్ల పడాల.. పానందీస్తా.. ఆడి ఇసయం ఇయాల్టిది కాదు తమ్మీ.. పైసలకాడ ఆడంతే.. నాలుగు తన్నేటోళ్ళుంటే దాపెట్టుకున్న పైసలు బయటకొస్తయి. అయినా గాడినని ఏం లాభం? మా మామ మంచిగలే.. ఆడెట్టాంటోడో తెల్వకనా? చేతులల్ల పైసలుంటే సాలు.. అడిగినోడికి అడగనోడికి పంచుడే పంచుడు.. సీ.. ఆడి నోట్ల మన్నుబడ..."

"ఇంకా ఈడ్నే కూకుంటివి.. ఈయంత సద్దితిని నేలను దున్ని రాంౖడి.. ఇయాల ఈ ఇత్తనాలు ఎండకు పెట్టి రేప్పొద్దుగాల పొట్టుదీసి ఏస్తే ఇగ వాన వచ్చేనాటికి భూమిలో కుదురుకుంటయి. ఆ బాంచెన్ ఈరిగాడితానికి మన యాదయ్యను పంపుంౖడి.. ఆయంత జాతర నాటికి ఏస్తే సరిగ్గుంటది" అంటూ చేటలోని బియ్యాన్ని కాస్త పంటికిందకు పడేసుకుని లోపలికెళ్ళింది లచ్చిమి.

***

"ఏంది రంగయ్యా.. పొలంమీదికా..?" రాములయ్య అడిగాడు

"ఆ! జర్రంత భూమిని దుక్కిదున్నుదామని"

"ఆనల్లేవు.. ఎంతగనం సేసినా పంట ఏడికెల్లివస్తది రంగయ్యా..? పోయిన నెల నాను పల్లీలు ఏసినా.. ఒక సుక్క వానలే.. సర్కారోళ్లు అప్పుడింత అప్పుడింత నీళ్ళు ఇడిసినా సరిపోతలే.. నోరులేని మనసంటోల్లు అడిగినా నీళ్ళు వదుల్తారా ఏంది? ఇగ ఆ పంటకు నీరు లేకపోయే.. భూమిలో ఇత్తనం పురుగు పట్టె.. ఏందో! మన బాదలు ఎవురికెరుక? అప్పుచేసి ఇత్తనం తెస్తి.. ఇత్తనాలు, ఎరువులు పోంగ నాకాడ 40వేల రూపాయలు అప్పుమిగిలె. ఏడికెల్లించి తేవాలె.. ఇగ సూసి ఇసం తాగల్ల గంతే.. అనుకుంటూ యడ్లను ముందుకురికించాడు. లచ్చమయ్య..

తెల్లబోయిన రంగయ్య ముఖం చూసి మామా... ఆడు సెప్పిందంతా ఇడిసేయ్.. ఏమంటున్నా.. ఆనల్లేని ముచ్చట నిజమే.. ఆడి కట్టాలు నిజమే. గట్లని పొలం ఉన్నోళ్లు గట్ల భూమిని ఇడిసేస్తే భూమి బీడువారిపోదాంట.. ఏమో నీ అదురుస్టం బాగుంటే నువ్వు ఇత్తనం ఏసేనాటికి ఆవ వస్తదేమో.. ఎవురికి తెలుసు? గదంతా ఇడిసినా నవ్వు

ఏ సేది కాసిన్ని ఇత్తనాలే గందా? నువ్వేం ఫికరు పెట్టుకోమాక.. ఏమంటున్నా...” అంటూ ధైర్యం చెప్పేడు నర్సింహ.

“యాదయ్యా.. నువ్వు ఓపాలి ఈరిగాడితో పోను మాట్లాడు.. నాకాడ పోను ఉంది గనీ. ఎట్ల ఒత్తల్లో ఎరుకయితలే.. నీకు సదువు వచ్చుగందా.. ఈరిగాడి నెంబరు గిండ్లనే ఉంది. జర పోను మాట్లాడు.”

“ఏమనడగాలన్నా”

“గంగ మాత్రం తెలవదా యాదయ్యా! నీసదువులో మన్నుబడ...!

“సదువుల సెల్లుఫోను ఎట్ల వొత్తల్నో, ఎట్ల మాట్లాడాల్నో చెప్తరా న్నా.. బలే మంచిగ మాట్లాడతావు.. ఇటీ.. అంటూ ఫోను తీసుకుని

“మామా నేను యాదయ్య.. పైసలు ఎప్పుడిస్తవని మా అయ్య అడగమనె.. ఆ! మరి ఇత్తనాలకు ఆనలొత్తన్నాయి గందా.. సరే... ఉంటా మల్ల.. కట్టతానికి రావల్నా..? గట్టయితే సరే..”

“ఏమనె ఇత్తాననెనా!” నర్సింహ ఆత్రంగా

“లక్ష్మీరం మబ్బుల కట్టతానకి రమ్మనే.. ఆడ ఇత్తననె...”

“సరేతీ.. మీనాయన నెత్తిన పాలుపోసె... గీ ముచ్చట మీ నాయనకు సెప్పతీ...”

***

“ఏంది కిట్టయ్యా.. పల్లీలపంట ఏడదాక వొచ్చిందో?”

“ఏడది రంగన్నా... గింజ పురుగు బట్టె... పంట చేతికొత్తదని మా అయ్యతాన 50 వెయ్యిల పైసలు అప్పు తెచ్చిన, పంటపాయె.. పైనెల వడ్డి ఏడ్నించి తేవాలె..”

“అన్నా.. నే చెప్పిన.. ఆయంత తనలు సూసి పైసలు తే మావా అని ఇన్నడా.. యంబడే పొయిండు తెచ్చిండు.. నాతాన బంగారమన్నా లేకపోయే.. ఇయ్యనీకి.. పొయిన పంటకే గవన్నీ పట్నం తీస్కపోయి అమ్మిండు..” కోపంగా అంది గౌరమ్మ..

“గరే..సీ.నీ నోట్ల మన్నుబడ..! ఇప్పుడు ఇసయం పానం మీద కొచ్చినాది.. ఆయంత ఆలోచన లేకుండా గప్పుడే చెప్పినా... గప్పుడే సెప్పిన.. గదే ముచ్చట ఊకే సెప్పబట్టినావు.. రంగన్న మావా.. నీ చెల్లె మస్తు ఉషారుంది. ఇయాల రేపు మస్తు నెత్తి తింటున్నది.

“ఊకో కిట్టయ్యా.. ఆడోల్లు గంతే.. పరేషాన్ అయి గట్టనే వర్లుతరు.. నువ్వాకో.. ఇప్పుడు ఏందయ్యా దారి? నాను కూడా రేపు పొద్దుగాల మబ్బులో పత్తి ఏద్దామను కుంటున్నా.. ఏమయితదో అనుకుంటే మనం ఈడ్నేకూగోవాల.. లేకుంటే సర్కారోల్లకాడికి పోదాం తీ...అనగానే.. ఉలిక్కిపడిన కిట్టయ్య..



“నువ్వాకో అన్నా.. ఆళ్ళు మనకేడ చేస్తరు? పంటలన్నీ పాడయితానే ఉన్నయి.. మనబోటి రైతులంతా సత్తనే వున్నరు. ఈ పక్క సూసినోడు లేడాయే.. టివిలల్ల, పేపర్లల్ల వస్తు చెప్తురు సచ్చినోడికి లక్ష ఇస్తమని.. పొయిన నెల్ల రాములయ్య సస్తే ఇస్తమనిరి ఏడిచ్చిరి?

“గట్టనా... రాజయ్య చెప్పిందు ఇచ్చిరని... ఇయ్యలే...?

“ఇచ్చినరా? ఏడిచ్చిరన్నా.. పాపం ఆడిపెండ్లం ఆడికి పోతే మల్లా రా మల్లారా తిప్పిరి.. ఆ ఆడమడిసికి పానం మంచిగలే.. ఎంతగనం ఆడి సుట్టు తిరుగుతది? ఆయంత తమ్మునికి చెప్పి సర్కారు దావఖాన కాడ పండె. అది దావఖానా అన్నా.. మనూర్ల పందులుగాని గట్ల పండవు.. గంత గలీజు. డాక్టరమ్మలు, అయ్యలు మస్తున్నరంట గాని దగ్గరికి పోతే చిట్టిఏడ? తీసకరాపో.. అని ఎల్లగొట్టిరంట.. నీకీడేం పని మీ ఊరుకు పో అన్నరంట ఈ పట్నం ఆడి బాబుగాడి జాగీరాన్నా.. బద్మాష్ గాళ్లు.. సదువయితే సదివిరి దేనికి? మన్నుల ఎయ్యనీకా? మందులియ్యకుంటే పోయేన్నా.. మంచి ముచ్చట లేకపోయె.. గప్పటి సంది ఆమె ఇంటికాడ్నే పండి ఆయంత ఆ పిలగాన్ని పంపిందంట..40 వెయ్యిల రూపాయలు పైసలు ఇచ్చిరంట.. ఆ పిలగాడు ఆళ్లు లచ్చ చెబితిరా గందా అడిగితే.. ఎక్కువ తక్కువ మాట్లాడితే ఆయంత గుంజుకుంటాం అన్నరంట.. ఇక ఇంట్ల కొచ్చి పంటల అప్పు పైసలు ఇచ్చి ఇంటికి వచ్చిండు.

“గిప్పుడు ఆళ్లు ఈడ్నే ఉన్నరా?”

ఏడున్నరన్నా.. వాళ్లకాడున్న భూమిజాగ అమ్మి పోరికి ఆయమ్మ తమ్మునికిచ్చి గిట్ల లగ్గం సేసె. గిప్పుడు ఆడమనిసీ ఈడేదుంది పట్నం పోయెనంట.. ఇండ్లపని సేద్దామని.. నీలమ్మ గుప్పుడే నాకాడ అనె.. గా ముచ్చట ఇడిసిపెడ్తే గాయంత పైసలు మడిసి పావకుండా ఇయ్యచ్చుగాన్నా..”

“ఓ ఆన్నో.. కిట్టన్నా.. ఏడున్నవే..? పొద్దుగాల నుండి మస్తు ఎదుకలాడినా.. ఓ వదినమ్మా.. గిట్లరా... ఓయబ్బో మస్తు పని సేసినావులేగానీ.. రా. నీకోసానికని గాజులు తెచ్చినా.. అన్నకు అంగీ తెచ్చినా..” అంటూ సరదాగా తీసి చూపింది కిట్టయ్య చెల్లెలు నీలమ్మ.. నల్లని చొక్కా, తెల్లని చుక్కలు కిట్టన్నకు చాలా నచ్చింది..

“ఎట్లుందన్నా.. మంచిగుందానా..?”

“మస్తుంది చెల్ల.. పైసలేడివే.. అయినా మాకేమిటికే? నీపానం మంచిగలే చెల్లా.. నీ దవాఖానాకు దాపెట్టిన పైసలు ఖర్చుచేస్తుంటివా ఏంది?”

“మాకేమింటికే... నీలమ్మా... నువ్వు తీసుకుంటివా? అడిగింది వదినమ్మ

“ఓ తిస్కున్నావదినా నేనేమో పచ్చవి తీస్కున్నా.. నీకేమో ఎర్రని తెచ్చినా. నీ

ఒంటి తీరుకు మంచిగొద్దయని..."

"ఓ నీలమ్మా.. దసరా అంతా నీకాడ్నే వుందా ఏంది? నవ్వుతూ పలకరించాడు రంగయ్య..

"ఓ నువ్వా రంగన్నా.. మస్తు బక్కగైనావులే.. యాదొస్తలే... వదినమ్మ మంచిగుందా? రారాదన్నా.. చాన్నాళ్లాయె మా ఇంటికాడికొచ్చి...!"

"వస్తమ్మా... వస్త ఈ పంటల ఫికర్లే సరిపోతన్నయమ్మా.. ఆ ఇసయమే.. మీయన్న అప్పటి సంది ముచ్చటలు పెడుతున్నం... ఆ భగమంతుడు ఈపాలైనా మంచిగ చూస్తే నీకు సీర పూలు తీసుకొని వస్తనమ్మా.. ఏంది పండగంత మీ ఇంటికాడ్నే వుందా ఏంది?

"లేదన్నా.. వదినమ్మ ఇచ్చిన పైసలే దాచిన పాపం వదినమ్మ ఎన్నడూ ఏమీ కొనదన్నా అందకే తెచ్చినా... నీకేం కావలన్నా చెప్పన్నా.."

"వదినమ్మ కొరకు గాజులు తెచ్చే చెల్ల నాకున్నది.. అంతకంటే ఏమిగావాల్న తల్లీ.. నువ్వు మంచిగుండాల.. గంతనే..."

***

"కిట్టయ్యా.. నీ చెల్ల గట్లుందేంది? నెలరోజుల కింద సూసినా మంచిగుంది. ఇప్పుడిట్ల. ఏమయిందో చెప్పవు.."

"ఏమంటవు రంగన్నా.. దాని కిస్మత్ మంచిగలే.. మగడు మంచోడు.. చెల్లను పానంగా చూస్తుండే.. ఆడికీ పెండ్లికి నేను భూమిజాగ చాన ఇచ్చిన.. ఆయంత అంత చెల్లకు కట్నంలెక్క ఇచ్చి లగ్గం చేసి పంపిండె. ఇగ భూమిలేక ఆడేడో పట్నంల కాంప్లెక్సులు కడతారే ఆడ పనికి కుదిరుండె. ఒగనాడు ఆనకు గోడ మస్తుగ నానిండె. మబ్బుల లేచి నీళ్లు కొట్టేకి గా పోరడు మిందికి ఎక్కిండు. గోడ కూలె. ఇగ ఆడికి ఆడే పోయిండు. గప్పటి సంది నా చెల్ల గాజులు కొనుడు.. అందురికి ఇచ్చుడు.. గిదేంది గిట్లయిందని దావఖానాకు తీస్కపోయిన.. నెత్తి ఖరాబయిందని గోలీలిచ్చిండు. గప్పటిసంది మంచిగ కాలేన్నా.. కట్టిన నాకొడుకు మంచిగుండు.. నాతాన మస్తు పైసలయినయి. చెల్ల మంచిగ కాలే.. ఇగ గట్టనే తిరగతావుంటది. ఇదో ఆడ ఇండ్లు కట్టే తానికి పొయి ఆడ పెద్దొల్ని కాల్మొక్కినా.. పైసలిమ్మని.. ఆనాకొడుకులు నీ బావ తాగి పడితే నాకేందిరా నీ..మ్మ అంటా మస్తు గలీసు మాటలు అనిండె..అసలన్నా.. నా బావకు తాగేదే తెల్వదన్నా.. ఈ డబ్బుండే నాకొడుకుండే రాజ్యం అయిపోయినాది.. ఆడకూతురికి అన్నాయం చేస్తే బాగు పడతరాన్నా.. థూ.."

"ఊకో కిట్టయ్యా.. మేమంతా లేమా ఏంది. నీకు చెల్లయితే నాకు కాదా ఏంది? పిల్లలు లేకపోయేగందా? మారు మనువు సెయ్యి మంచిగయితది. ఇయాల రేపు ఇయన్నీ



మమూలే. సరే. నేను పొతున్న.. మబ్బుల లేసి ఆయంత గింజలు జల్లుతాన్నా.. నువ్వేం ఫికరు పడమాకు.. నీకు పంటలేకున్నా నా ఇత్తనం కాసినా నీకు పైసలు ఇత్తా తీ.. లేకున్నా నా పెండ్లాం కాడ జర్ర బంగారుంది ఆయంత అమ్మి చెరిసగం చేసుకుందాం ఏమంటున్నా.. ఊకో.. చెల్లను ఆడ ఈడ పంపక.. నే మల్లొత్త.. ఉందునా..."

***

అనుకున్నట్లే గింజలన్నీ పొద్దున్నే పొలం పై జల్లాడు.. తృప్తిగా పొలాన్ని చూసుకుని ఇంటికి వచ్చాడు.. అప్పటికీ ఈరిగాడు అనుకున్న సమయానికి డబ్బు ఇవ్వడం దాంతోకూడా వేరుశెనగ, పత్తి పంటను వేయడం జరిగింది..

తెల్లవారి లేవడం ఆకాశం కేసి చూడటం.. ఆరోజుయినా వానవస్తే బావుంటుందని అనుకోవడం.. వానచుక్కైనా లేక రాత్రి రావడం.. ఇలా ఒకరోజు కాదు.. నెలలు గడిచి పోతున్నాయి.. ఒకరోజు ఉదయం టీ తాగుతున్నాడు రంగయ్య.. ఈరిజనం అంతా పరుగులు తీస్తున్నారు.. ఉలిక్కిపడిన రంగయ్య... "ఒరేయ్ యాదయ్యా.. ఏమాయెరా.. జనం గట్ల ఉరుకుతురు జర లేచి సూసిరారాదురా" అన్నాడు అరుగుపై నిద్రపోతున్న యాదయ్యను లేపుతూ..

తండ్రి మాట వినబడిన యాదయ్య ఉలిక్కిపడి నిద్రలేచి కూర్చున్నాడు.. "ఏమయిందయ్యా..." అంటూ..

"ఏమోగదా.. గిప్పుడే నే చూస్తున్న.. ఓయ్ ఏడికే.. లచ్చిమీ"

"ఉండయ్యా... నాకయితే ఏందోగున్నది.. ఎవురికి ఏమయిందోఏమో.. నేను పొయి సూసొస్తా.."

"ఏడికే.. నువ్వు గూకో.. నేను పొయ్యొస్తా.. ఆడ ఏమయిందో ఏమో.. నేనొచ్చినంక నువ్వు పోదూ తీ... అంటూ అక్కడే తగిలించి వున్న చొక్కా వేసుకుని బయలుదేరాడు.

***

"అమ్మా... కిట్టయ్య, సచ్చిపోయినాడే... పురుగులమందు తాగిండంట. అనే మాట వినగానే రంగయ్య ఆ! అంటూ అక్కడే చతికిల పడ్డాడు.. లచ్చిమి ఏయమ్మో ఏమయిందిరా నాయనా... ఇంతలోనే ఇంత కట్టం ఏల వొచ్చిందిరా అన్నా.. ఏమయిందే బిడ్డా.. అంటూ గుండెలు బాదుకుంటూ పరుగులు పెట్టింది..

ఊరిజనమంతా అక్కడే వున్నారు. ఎవరికి తోచిన రీతిలో వారు మాట్లాడుతున్నారు. పోలీసులంతా చేరారు.. పోలీసులను చూడగానే.. ఆ ఊరిజనాలు "ఇగో పోలీసన్నలు వచ్చిండ్రు రాండ్రన్నా.. సూడండి.. మావోల్లంతా గిట్ల సచ్చిపోతాంటే మీ కండ్లకు మంచిగుందాన్నా... పైసలు కావాలని వత్తే ఆ పెద్దోల్లు లెవ్వు పొమ్మనిరి.. ఇయాలేమో

సూడనీకి వచ్చిండ్రు.." అంటూ పెద్దగా ఏడ్చింది రాజమ్మ..

"మేము కేసు పెట్టాము.. ఇలా ఎందుకు జరిగిందనేది తెలుసుకొని.. అని పూర్తిచేసేంతలోనే..

"ఏందయ్యా.. కేసులు పెట్టిండేది? మీరు ఇచారించేది.. మూడ్నెల్ల కాడ్నించి ఆయన్న పంటలేక మస్తు పరేషాన్‌ల వుండె.. ఎన్నడు మాకొరకు వచ్చిరయ్యా.. ఎల్లచ్చన్లంటరు.. మీలో మీరే తన్నుక చస్తరు మధ్యల మమ్ముల పరేషాన్ చేస్తరు.. మా కడుపుల మన్నుపోస్తే మీకేమొత్తదయ్యా.. పానం మంచిగలేకున్నాగాని పంటమీదికే బతుకుతుంటిమి గందా అంటే వరసకు అక్క అయిన రాజమ్మ శోకాలు పెడుతూనే వుంది.

"ఆమాటలన్నీ మమ్మల్నెందుకంటారమ్మా... మేము మంత్రులం కాము... పోలీసులం.. మాకెవురూ ఓటెయ్యరు తెలుసా.."

"ఎవురైతే ఏందయ్యా... నువ్వు వాడి ఎంట తిరుగుతవు. ఆడునీ యంబడి తిరుగుతడు.. మీరు మీరు మంచిగనే వుంటరు.. మధ్యల మాకే...

"మొన్నటికి మొన్న సాయిలు పోయె.. ఎల్లయ్య, తిప్పయ్య, యాదగిరి, మైసయ్య, శీనయ్య, రాములయ్య, కిట్టన్న మొత్తానికి ఈ రెండు నెలల. ఎనిమిది మంది పానాలు పోయినయి. ఈ పైసలమింద మన్ను బడ.. మా బతుకుల ఖరాబు చేస్తున్నది.. ఎల్లయ్య అయితే ఎనిమిది ఎకరాల వ్యవసాయమున్నా పది బోర్లు ఏసిందు.. ఏడ? ఒక్క సుక్క నీరు పడెనా.. లే.. లచ్చలల్ల పైసలు పోయే.. ఆడికి నీరులే.. పైసలు లెవ్వు.. మస్తు అప్పులపాలయ్యె.. ఆ ఫికరుకు పానం ఖరాబయే... కనీసానికి దావఖానాకు తోల్కపోనీకి క్యూడా పైసలెవ్వు.. ఇగ సూస్కో అన్నా. మస్తు పరేషాన్ అయ్యిండె. ఆయంత పురుగుల మందు తాగి పానం పోయినంక గూడ తీస్కపోనీకి పైసలు లేక అందురూ ఇలాఇంత ఏసుకొని పంపినం.." అంటూ కళ్లు తుడుచుకుంది రాజమ్మ..

"ఎవురో మంత్రంట వచ్చిరంట" అనే మాట వినగానే అందరూ గుమిగూడారు.. ఎవరికి తోచిన బాధలు వారు చెప్పుకున్నారు. అన్నీ విన్న ఆ మంత్రి ఆ! అవునమ్మా మీకు అన్యాయమే జరిగింది.. మీ గురించి మేము మాట్లాడతున్నాం. పోయిన ఒక్కోరైతు కుటుంబానికి మేము లక్షరూపాయలు ఇస్తున్నాం"

"ఏడిస్తురన్నా.. గప్పటిసంది ఇట్లనే టివిల కాడ సెప్పుడు పేపర్ల రాసుడు గంతేగదాన్నా మా తానికి పైసలు ఎవురిచ్చిరి..?

ఆ మంత్రి ఇక ఏమీ మాట్లాడలేకపోయాడు. సరేమ్మా... అలాగని మీరంతా సంతకాలు పెట్టిఇవ్వండి.. ముఖ్యమంత్రితో నేను మాట్లాడుతా... సరేనా.. మీరందరూ



ఆ సంవత్సరంలో పోయినవారు.. పోయిన సంవత్సరంలో మీకు ఎవరెవరికి డబ్బు అందలేదో పేపర్‌మీద రాసి ఇవ్వండి.. వారందరికి డబ్బు వచ్చేలా నేనుచేస్తాను. అంతేకాకుండా ఈ ఊర్లో ఏం జరిగినా మేమే చూసుకుంటాం... అంటూ వారిని వారి ఆవేదనను కాస్త అతిగానే మాట్లాడి అక్కడ్నించి వెళ్లిపోయారు.

మళ్లా కాస్సేపటికి ఎవరో కార్లో దిగారు.

"ఎవురక్కా.. ఇప్పుడు వచ్చినోల్లు" మణెమ్మ అడిగింది అమాయకంగా

"ఎవురో పెతిపచ్చం మోల్లంట" ఈశ్వరమ్మ సమాధానం

"ఈళ్ళేమన్నా సేత్తరంటావాక్కా"

"జనులారా! మీకు మేమున్నాం. అధికార పార్టీవాళ్లు మీకేమీ చెయ్యరని మీకీపాటికే అర్థమయివుంటుంది. రైతుల ఈ విధంగా ఆత్మహత్యలుచేసుకుంటుంటే మన దేశ పురోగమనం ఏమవ్వాలి? రైతు దేశానికి వెన్నెముక లాంటివాడు. కానీ నేడు రైతుసోదరుల జీవితాన్ని చక్కదిద్దడానికి మేము ముందుకొస్తాం.. అధికారపార్టీ మిమ్మల్ని చిన్నచూపుచూస్తోంది. మృతుల కుటుంబాలకు లక్షరూపాయలు అనడం ఏమీ బాగోలేదు మేము రెండు లక్షలివ్వమని ఆదేశిస్తాం. రైతున్న చిన్న చూపు చూడటం తగదు.. అని ఆ సదరు ప్రతిపక్షపార్టీ మాజీ మంత్రి అనడం చుట్టూ భజనసంఘం జైజైలు కొట్టడం లాంటివి నాటకీయంగా జరిగిపోయింది. కెమేరాలు వారికి కావాల్సిన ఫోటోలు తీసుకున్నారు. పేపర్లనిండిపోయేంత న్యూస్ ఆహారం దొరికింది. ఛానెల్లకు ఒకరోజుకు సరిపడా తిప్పితిప్పివేయడానికి విషయం దొరికింది.. కానీ ఇక్కడ వీరికి మాత్రం మిగిలింది మళ్ళీ పోరాటమే..

"అక్కా ఆళ్ళుఎందో చెప్తురు. నీకేమయినా సమజయిందా?"

"ఏమో చెల్లా.. నాకేం ఎరుక? ఏందో రెండు లచ్చలు అనేటిది మాత్రం జర సమజయింది.. ఇగ ఆ యంబడి ఏం వొర్లినారో, ఎమ్టికి గంత బిగ్గరగా చెప్పిరో సమ జయితలే"

"రాజమ్మ వొదిన మస్తుటివిల పడ్డది చూస్తివిలే"

"అవ్.. మల్ల. మస్తు పడ్డది.. కిట్టయ్యసావును గూడ మస్తుసార్లు చూపిరక్కా"

"ఆడి పెండ్లం పాపమక్కా మస్తు ఏడస్తుందిలే.. ఎట్ల బతకతదో ఏమో"

"నిజమే.. మడిసేపోయినంక లచ్చరూపాయలేమయినా పోయినా మడిసిని తీస్కస్తదా ఏంది? ఏదో ఆ ఆడమనిషికి అసరా అయితయి గంతే..

రంగయ్య కేమీ తోచడంలేదు.. నీలమ్మ ఏడవలేక ఏమి జరిగిందో కూడా తెలియక కూర్చున్నతీరుకు గుండె తరుక్కుపోతోంది.. కళ్లవెంబడి నీళ్ళు ధారాపాతంగా కారి

పోతున్నాయి. అరె నిన్న సాయంత్రమే మాట్లాడుకున్నాం మరో సాయంత్రానికి శవంగా మారిపోయిన కిట్టయ్యను చూస్తుంటే ఒకవిధంగా విరక్తిలాంటిది కలుగుతోంది..

***

"అయ్యా.. కాస్త ముద్దతిను.. అంటూ సంగటిని ముందు పెట్టింది లచ్చిమి

"ఆ ముద్దను తీసుకుని లచ్చిమీ ఆ తల్లి తిండిలేక మగన్ని పోగొట్టుకుని ఆడబిడ్డ పిచ్చిముఖం నీకు కనిపిస్తలేదా? ఆళ్ళు గట్లుంటే ఎట్లనే తినేది? ఆడదానివి గాదే.. ఫో పోయి ఆ నీలమ్మను తోల్కొనిరా.. జరంత తినబెట్టు.. ఆ గౌరమ్మ పక్కనే గూకో.. శరంలేదే.. నీకు తిననీకి." అని లచ్చిమిని కోప్పడ్డాడు రంగయ్య.

"నాకు తెల్వదా మామా... గప్పటిసంది గౌరితానే గూకున్నా గిప్పుడే పీనగెల్లినంకనే నూకలు పొయ్యిమింద పెట్టిన నీకంటే ముందే గౌరమ్మకు బువ్వ తీసిపెట్టిన ... నీలమ్మకు చాయ్ తాగించినా.. ఆయంత ఆ ఇల్లంత అలికినా.. సాయానికి ఒక్కరు రాలే.. ఆపేపరోల్లకాడ, చేరి ఏందో ఏందో వర్లుతాంద్రు... టివిలో పడనీకి మస్తు ఉరుకుతురు.."

విషయం అర్ధమయన రంగన్న ఊకో లచ్చిమీ... ఫికర్ల మస్తు మాటలంటి మనసులో ఏమీ పెట్టుకోమాక.. ఏం మడుసులో ఏందో... పల్లెలల్ల పంటలు బుగ్గి అయితన్నయని ఎరుకలేదా ఏంది ఈ మడుసులకు.. మడిసి సచ్చేదాంక ఎవురూ సూడరు.. పెట్టరు. ఆయంత పోంగానే ఏమయిందని అడగనీకి మస్తుమంది వస్తరు.. గదేంది గిదేంది? అని మస్తు పీక్కతింటరు. ఏందో మనకు ఈ జనమానికి బాగుపడే రాతలే.. మన బాద, ఆకలి అప్పులు, ఏడుపు పెతీ ఇసయం ఈ పెద్దోళ్లకు, పట్నంవోల్లకు వ్యాపారం అయిపోయే మనం ఉంటే ఏంది? సస్తేఏంది? ఎవురికి గావాల్నే? పంటలు మంచిగెల్లితే ధరపలకదు. ధరలుంటే పంట ఎల్లది... ఎవురికి తెలుస్తదే మన గుండె ఘోస... గిట్ల పంటల్లేకుంటే రేపు గిట్ల కరువొస్తదే.. గప్పుడు ఆ బలిసిన నా కొడుకులు పైసలు తింటరో ఏందో.. కానీ.. మాతాత అంటుండె.. "మడిసి ఆడి గొయ్యి ఆడే తవ్వుకుంటడురా సచ్చినంక ఏరోళ్ళు తవ్వుతారు" ... అది ఇదే అనిపిస్తది.. కానీ... కానీ భూమిని నమ్ముకున్నం. ఆమాతల్లి ఎన్నడైనా కరుణించకపోయేనా అని సూసుడే.. ఎవురొచ్చి పానం నిలుపుతరా? లే లే.. అంటూ ఎదురుగా వున్న నీలమ్మను అమ్మా... నీలమ్మా... ఇయాల్టినుండి నీ అన్న నేనుండ నిన్నిడిచి నేనేడికి పోను. నీకాడనే వుంట.. నువ్వు మంచిగ ఈడ్నే వుండమ్మా... ఆయంత మాతోపాటే తిని పండు... ఆపై ఆ భగమంతుడు ఎట్ల దారి చూపితే గట్ల... అంటూ ఓదార్చేడు..

అమ్మా గౌరమ్మా.. కిట్టయ్య ఎంత పనిచేసినాడు తల్లి.. మిమ్ముల నట్టేట ముంచినాడు గంద.. నిన్ననే నేనన్నా.. కిట్టయ్యా... నువ్వే ఫికరుపడమాక నాపెండ్లం



తాన జర్రంత బంగారం వున్నది అది గిట్ల అమ్మి నీకు పైసలిత్తారా అని. రేత్రికి రేత్రికి ఇట్టెందుకు చేసినాడో నా మాటమీదికెల్లి నమ్మకం లేకుండెనో ఎందో. అంటూ బాధపడ్డాడు రంగయ్య...

***

గౌరమ్మా... నీకు సర్కారోల్లు పైసలిచ్చిరా?

"ఏడన్నా.. ఊకే ఇయాలరా.. రేపు రా మస్తు పరేషాన్ చేస్తుంద్రన్నా"

"ఏమంటరు? అసలు ఇస్తరంటనా లేదంటనా"

"ఇస్తమనే అంటురు.. కానీ ఆళ్లకు ఇయ్యనీకి మనసొస్తలే"

ఇగ చెప్పనీకి ఏముందమ్మా... పెద్దోల్లుఇచ్చినా మనోల్లు మనదాకా రానిస్తారా ఏంది?

"ఎట్లన్నా అప్పులోళ్లు మస్తు లొల్లి చేస్తురు పైసలు లేకుంటే పాయె.. నువ్వు మంచిగున్నావు గందా రారాదు అంటా మస్తు గలీజు మాటలంటురన్నా" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"దొంగనా కొడుకులమ్మా.. మస్తు తిని బలిసినోళ్లు... నువ్వాకో.. మన పోచమ్మతల్లి కోపానికోస్తే ఆళ్ళు ఆకులు రాలినట్ల నేలరాలతరమ్మా... అమ్మతాన అందరూ ఒకటే.. ఇక ఇసయం తెల్వదు. మనతాన ఏమీ లేకున్నా పల్లెంతా కలిసి కూసింత అన్నం వున్నా కలిసి తింటం తల్లీ.. ఆళ్ళుకడుపునిండా తిండి వున్నాగానీ తినలేరమ్మా.. ఆళ్లలో పేముండదు. కలిసి తినే అదురుస్టం వుండదు. మనలో పేముంది. కట్టమొత్తే కలిసి తినేటంత ధైర్నం వుంది. ఆళ్ళకాడేముంది? రోగమొస్తే బతికించలేని పానంలేని డబ్బుతప్ప.. మనం మనసున్న మడుసులం తల్లి.. మనతాన కండ్లల నీల్లున్నాయి.. నవ్వేతానికి తోడుంది. మాటాడేదానికి ఇంకా మడుసులున్నారు. మనతాన మనసుంది.. చెల్లా.. మనసుంది.. మనకు ఏమున్నా లేకున్నా సాయం చేయనీకి మస్తుమంది వున్నరమ్మా... వున్నారు అంటూండగానే లచ్చిమి వచ్చి..

"మడుసులం మనం.. మాట్లాడతనం కనీసానికి. ఇది గావాల, అదిగావాల అని గదురుకోనో, ఆయంత కాళ్ళు పట్టుకోనో అడక్కతింటం. కానీ చెల్లా.. ఈ పాలి గొడ్డకు కూడా మేతలేకుండా సేసిరి తల్లి! నోరులేని పానాలు అయి.. తిననీకి తిండిలేక, తాగనీకి నీరులేక ఎండుతున్నయ్యమ్మా... పైసలు పైసలని మడిసి పైసలెంబడ పడి పాపం కూడ తెచ్చుకుంటున్నడు .. పాపం ఎంట తెచ్చుకుంటన్నడమ్మా...!! అంటున్న గౌరమ్మను పొదివిపట్టుకుని..

ఉలుకుపలుకులేకున్న గౌరమ్మాను చూస్తూ "ఇగో గౌరమ్మా.. నువ్వీడనే వుంటే

ఇట్లనే కండ్ల నీరు పెట్టుకుంటవు.. పద మా ఇంటితానికి.. ఈ వదినమ్మ వుండంగా నువ్వట్లుండకు బిడ్డా" అంటూ దగ్గరకు తీసుకుంది. బతుకు మోపు మనకుందని అందురూ అంటరు గానీ మనకు బతుకుమోపు కాదు గౌరమ్మా.. మనల్ని ఇట్ల కలకల పెట్టే ఆళ్ళ బతుకే మోపు.. అంది కళ్లొత్తుకుంటూ.. లచ్చిమి.

***

ఆకాశం ఎంతో అందమైనది. భూమి ఎంతో విశాలమైంది.. కానీ అవేవీ కళ్లతో ఆసాంతం చూడలేని జీవితాలు వీరివి.. కానీ పల్లెల్లో ఆకాశం భూమి రెండూ రెండు కళ్లలా నిత్యం కాపాడుతూనే వుంటుంది. ఈరోజు ఎలా వున్నా రేపటి ప్రపంచం మాత్రం ఆ అమాయకులదే... రైతన్నలదే.. ఇందుకు సందేహంలేదు.. ఆ సమయం ఎంతో దూరం లేదు... అవును ఎంతో దూరం లేదు.

*('చిత్ర' పత్రిక పోటీలలో 500 రూ.ల సాధారణ బహుమతి పొందిన కథ)*



# గాజు గుండె

మంచు కమ్మిన ఆకాశం.. ఎంతగా రగ్గులు కప్పుకుంటున్నా వీడని చలి... గడగడలాడుతున్న గుండె, ఒక చేతిలో సెగలు కక్కుతున్న కాఫీ... మరో చేతిలో అన్నయ్య ఖాళీ చేసిన కాఫీ కప్పు, ఎదురుగా తోడబుట్టిన అక్క చెల్లెళ్ళు.. ఆ పక్కనే విషయమేమిటో అర్థంకాని పసిపిల్లలుతో వాతావారణం బయట చల్లగా ఉన్నా, లోలోపల మాత్రం వేడిగానే ఉంది. మనుషులకు నీ, నా భేదాలున్నాయేమో కానీ, వాతావరణానికి లేదు. గాలి వీచినా, ఎండకాసినా వర్షం పడినా ఏదయినా అందరికీ సమానంగా పంచుతుంది. ఇందుకు కుల మత భేదాలుండవు. ధనిక, పేద, తారతమ్యాలుండవు. అందుకేనేమో తెరచిన కిటికీ గుండా చలిగాలి రివ్వున ఇల్లంతా విస్తరిస్తోంది.

ఎదురుగా అందరూ ఉన్నా, ఎవరికీ అర్థంకాని నిశ్శబ్దం అక్కడ తాండవిస్తోంది. అందరూ వంటినిండా ఏదో ఒకటి కప్పుకుని చలిని చాలా వరకు తమకు దూరంగా ఉంచాలని ప్రయత్నిస్తున్నారు. దూరంగా అలాంటి ప్రయోగం ఏమీ చేయకుండా ఎంతటి చలి అయినా తాను ఇప్పుడున్న పరిస్థితుల్ని మించి కాదు కద అనిపించేలా ఒంటరిగా ఆలోచిస్తూ, నిద్రపట్టకపోయినా నిద్ర నటిస్తూ, కంటిపై చెయ్యి వేసుకుని దీర్ఘంగా ఆలోచి స్తుందా అనికూడా తెలియకుండా మౌనంగా పడుకున్నాను నేను. ఎదురుగా నిన్నటిదాకా మాతో నవ్వుతూ పలకరిస్తున్న అమ్మ నేడు గోడపై నిర్జీవంగా... నా పని నేను చేసాను ఇక మీ జీవితాలు మీ ఇష్టం అనిపించేలా.. అందరినీ వదిలేసి తన బాధ్యతలు తీరిపోయాయన్నంత ధీమాతో కనిపిస్తోంది.

ఎలా లాగనీ జీవితాన్ని? ఎలాగోలాగ లాగటం సమస్యకాదు. తిండికి, బట్టకు, ఉండటానికి లోటనికాదు. కన్నపిల్లలు, కట్టుకున్నవాడు లేరని కాదు. అన్నదమ్ములు

ఆదరించరని కాదు. అక్కచెల్లెలు పలకరించరనికాదు. అమ్మ చూపినంత స్వచ్ఛమయిన ఆత్మీయత చూపే వారిక ఉండరని. తాను అమ్మగా తన స్థానాన్ని అర్థం చేసుకునేంతగా ఎవ్వరూ చెప్పేవారుండరని.. ఇందరున్నా తాను పడుతున్నమాసిక ఆవేదనను తెలుసుకుని ఓదార్చేవారుండరని మాత్రమే...

ఎవరెవరో వస్తున్నారు. కొందరు ప్రేమతో పలకరిస్తే.. మరికొందరు తప్పనిసరిగా పలకరించి వెళుతున్నారు. తప్పదు. ఇప్పుడు ఇక మిగిలేది ఇలాంటి ప్రవర్తనలే.. అమ్మద్వారా మాకేమి వచ్చిందోనని ఆరా తీసేవారే... ఒకవేళ ఏదయినా గొడవలాంటిది జరిగితే అదంతా విని ఇంటింటికి మోసుకెళ్ళి, కొన్నాళ్ళు కాలక్షేపం చేద్దామనుకునేవారు.. అంతా కలిపి నిజమైన నాటకాన్ని చూపిస్తున్నారు.

ఇంతలో "అమ్మా.. ఈ కాఫీ తాగమ్మా" అంటూ తన చిన్న చేతులతో తట్టి పలకరిస్తున్న నా కూతురు స్పర్శ ద్వారా ఏదో ఊరట. "ఇక నువ్వలా ఉండిపోతే తగదు లే... నీకు పిల్లలున్నారు వారి బాధ్యత నీ మీదుంది" అంటూ అమ్మ హెచ్చరిస్తున్నట్లే ఉంది.

"ఇకలే ప్రతిమా.. ఇలా ఎన్నిరోజులని తిండి నిద్రలేకుండా అలా ఉంటావు. తెలియనిదేముంది? దాదాపు మూడేళ్ళనుండి అత్తయ్యగారు జబ్బుతో మంచాన పడి ఏమాత్రం సుఖపడ్డారో నీకు తెలుసుగా... నిజమే.. బాధగానే ఉంటుంది. కానీ... తప్పదు... అందరూ ఎప్పుడో ఒకప్పుడు పోయినా మిగిలిన వాళ్ళు వాళ్ళకోసం బాధపడకపోతే ఇక రక్తసంబంధాలకు అర్థం ఏముంటుందని? అలాగని పిల్లల్ని కంగారు పెట్టేలా ఉండే వాళ్ళు నిన్ను చూసి బాధపడటం తప్ప ఏం చెయ్యగలరు? లే లేచి కాస్త ఎంగిలిపడు.. లేమ్మా.." అంది వదిన బాధ్యతగా...

"అమ్మా.. అక్కడ వేణ్ణీళ్ళున్నాయి. నువ్వు తీసుకో.. నాకేం పర్వాలేదు చన్నీళ్ళ యినా.." అంటున్న కొడుకును చూసి నా పరిస్థితిని ఎలా మార్చాలా అని ఎంతగా ఆలోచిస్తున్నాడా అనిపించక మానదు...

"బామ్మా..." అంటూ చంటిగాడి ఏడుపు.. ఉలిక్కిపడి లేచాను. ఎదురుగా వసరకు మనవలిద్దరూ ఒకే వస్తువుకోసం తీవ్రమైన పోరాటం చేస్తున్నారు.

"బామ్మా... నువ్వే చెప్పు... ఇది మానాన్న కొన్న బొమ్మకదూ." అంటున్నాడు బాబి

"అదేం లేదు.. మా పెదనాన్న నాకోసం తెచ్చారు" అంటుంది చిట్టి.

నాకు నవ్వొచ్చింది బాబిగాడి నాన్న అయినా చిట్టి పెదనాన్న అయినా ఒక్కరే. అయినా ఒకే మనిషిని రెండు రూపాల్లో తలచుకుంటూ ఈ బొమ్మ నాదంటే నాదని



వాదులాడుకోవడంలో, ఇంత చిన్నతనంలోనే నాది అనే భావం పెంచుకుంటున్న పిల్లల్ని ఏమీ అనలేక ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాను. మీరు నావాళ్ళనే భావంతో...

"బామ్మా... మరి నేనేమో చాలా బొమ్మలతో ఆడుకుంటే... మా ఇంటికి వచ్చి అవన్నీ పాడు చేసేస్తుంది చిట్టి అందుకే దాన్ని మా ఇంటికి రానివ్వాలంటేనే నాకు చెడ్డ చిరాకు..." అన్నాడు చిరాగ్గాముఖం పెట్టి బాబి.

"బామ్మా.. అన్నీ అబద్దాలే..." అని చిట్టి మొదలు పెట్టేసరికి నేను కోపంతో "అబ్బ...!! ఊరుకోండిరా నీ చెల్లెలే కదరా...!! చిన్నది ఏదయినా తప్పు చేస్తే నువ్వే సరిదిద్దాలి. చక్కగా ఇద్దరూ కలిసి ఉండాలి" అన్నాను పెద్దమనిషి తరహాలో...

ఇక్కడ చెప్పాల్సిన విషయం ఒకటుంది. నిండా నలభై ఏళ్ళుకూడా లేకుండానే నేను బామ్మనవడం నాకెంతో కొత్తగా ఆనందంగా ఉంది. అన్నయ్య మనవలు నా మనవలుగా అలా పిలవడం నాకు మళ్ళీ మళ్ళీ అలా పిలిపించుకోవాలని ఉంది. పిల్లలు అలా పిలుస్తూంటే నా బాధ్యత మరింతగా పెరిగినట్లుగా ఉంది. ఎందుకో నాకు మొదటినుండి పిల్లలతో కాలక్షేపం అంటే తగని సరదా... వాళ్ళతో కాస్సేపు మాట్లాడినా, మొక్కలలో కాస్సేపు కూర్చున్నా, నాకెంతో రిలీఫ్‌గా ఉంటుంది.

ఇంతలో ఏదో పనిమీద కాబోలు పక్కింటి అమ్మాయి పిలుపు... "ఆంటీ.." అంటూ అదీ నన్నే అని తెలుసుకున్న తర్వాత మెల్లగా వెళ్ళాను... ఏంటా అనుకుంటూ..

"ఆంటీ... ఒక్కసారి త్వరగా రారా... మా అమ్మకు కడుపులో నొప్పి విపరీతంగా ఉండటం. నాకేదో భయంగా ఉందాంటీ.." అంది కంగారుగా....

నేను వెంటనే మా వదిన వైపు చూసాను. అసలు ఆ అమ్మాయి నాకంటే మా వదినకే ఎక్కువ పరిచయం. ఎందుకంటే అది మా అన్నయ్య ఇల్లు కావడంతో.. అయినా వదిన ఏమీ ఎరగనట్లు లోనికి వెళ్ళిపోయింది.. నేనెందుకో అలా వెళ్ళలేకపోయాను. "పదమ్మా..." అంటూ బయలుదేరేంతలో.. "ఇదిగో ప్రతిమా... అత్తయ్యా పోయి మూడురోజులు కాలేదు... మైల... అలా మరో ఇంటికి వెళ్ళకూడదు.." అన్న మరో వదిన మాటలు వినిపించినా... నేనెందుకో ఆ మాటలకు పెద్దగా విలువ ఇవ్వలేదు... నాకు తోచినట్లుగానే వెళ్ళిపోయాను.. అక్కడ ఆవిడ పేరు కామాక్షి కాబోలు... అప్పటికే ఎవరో వచ్చి "కామాక్షీ... ఎలా ఉందమ్మా" అంటూ పలకరిస్తున్నారు. నేనూ వాళ్ళతోపాటే ఆమె పక్కనే చేరాను.. వెంటనే డాక్టరును ఫోను చేసాము.. అక్కడున్న ఒక జనరల్ ఫిజిషియన్ రావడం, "ఇలా ఎప్పటినుంచీ వస్తోంది.. అలా వస్తున్నప్పుడు ఎలాంటి టాబ్లెట్స్ వాడేవారు ఎంత డోసేజ్ వాడేవారు?" లాంటి రొటీన్ ప్రశ్నలు వేసారు. అతనేదో టాబ్లెట్స్ రాసివ్వడం, ఇందుకు కూడా తగ్గకపోతే బెటర్ హాస్పటల్‌లో చేర్చండి అని

ఉచిత సలహా ఒకటి పడేసి ఫీజు రెండువందలు తీసుకుని తానొచ్చిన పని అయినట్లు వెళ్ళిపోవడం జరిగింది.

వాళ్ళు అంటే వారి అమ్మాయి ఉష కూడా ఎంతో కంగారుగా ఆమెని హాస్పటల్‌లో చేర్చారు. నాకు తెలిసి అక్కడ అంతగా మెడికేషన్ జరగదు. అయినా ఆ మాట అని వీళ్ళ నెందుకు మనం బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో ...దాదాపు మా వయసున్న కామాక్షిని ఒకసారి పలకరించి నేను సెలవుతీసుకున్నాను.

"ప్రతిమా...! ఏమయిందే...?" అడిగింది అక్కయ్య...

"ఏదో కడుపులో నొప్పిట... పాపం ఎంతో బాధపడుతుంది..." అన్నాను మామూలుగా.

"అపెండిసైటిస్ ఏమో..." అంది అక్క మళ్ళీ....

"ఏమో.... టెస్టులు అవీ చేస్తున్నారు. అక్కడ వసుంధర, గీత ఆంటీ వాళ్ళందరూ ఉన్నారులే... వాళ్ళు చూసుకుంటారు... అందుకే వచ్చేసా... మరీ ఎక్కువమంది ఉంటే తనకేం జరిగిందో అని తానే కంగారు పడుతుంది అన్నాను..." అంతలో ఎక్కడి నుంచి వచ్చిందో మా వదిన "ఇదిగో ప్రతిమా... నువ్వు అలా వెళ్ళకూడదు.. ఈ హడావిడిలో గమనించలేదేమో కానీ, ఆ వసుంధర నిన్ను గమనిస్తే... తల్లిపోయి రెండ్రోజులు కాకుండా మైలతో అందరిళ్లూ తిరుగుతోందని ప్రచారం చేస్తుంది. లేకుంటే నేను వెళ్ళలేకనా?" అంది.

"అదేంటి వదినా వాళ్ళ అమ్మాయేగా మనల్ని పిల్చింది..." అన్నాను ఆశ్చర్యంగా..

"సరేలే... ఉష చిన్నపిల్ల... తనకేం తెలుసు? ఇవతల నేను చెబుతున్నా వినకుండా నువ్వే వెళ్ళావు...." అంది తన మాట వినలేదన్న కోపం ధ్వనించే స్వరంతో... వదిన..

నేను ఆ మాటలేవీ పట్టించుకోకుండా మంచంపై నడుము వాల్చాను... ఇంతలో మళ్ళీ "ఆంటీ..." అంటూ తలుపు చప్పుడు.. వెళ్ళొద్దన్నా నేను వెళ్ళాను... ఇదీ ఇంత రాత్రివేళ. అనుకుంటూ... తలుపు తీసాను.

"ఆంటీ! నాకు ఏదో భయంగా ఉందాంటీ.. రాత్రిపూట అమ్మతో ఒక్కదాన్ని ఉండలేకపోతున్నాను. నాతోపాటూ మీరు కూడా హాస్పటల్‌లో ఉంటే..." అంటూ ఆగింది.

వెంటనే మా వదిన కల్పించుకుని "చూడమ్మా... మేము మైలలో ఉన్నాము. రాకూడదు" అంది ఖచ్చితంగా...

నాకెందుకో కాస్త బాధ అనిపించింది. పాపం...! చిన్నపిల్ల.. అనిపించింది.. నా ఆలోచనను గమనించిందేమో" ఆంటీ... కాదనకండి.. వసుంధర... గీత ఆంటీలు కూడా రాలేమన్నారు" అంది దీనంగా... ఆమాటతో నా గుండె కలచివేసింది... నేనింకేమీ



ఆలోచించకుండా పదమ్మా.. అన్నాను.. బయలుదేరుతూ..

"ఇదిగో ప్రతిమా... మీ అన్నయ్య కోప్పడతారు మరి.." అంది కాస్త గట్టిగా వదిన.

"వదినా.. ఊరుకో... పాపం .. ఎవ్వరూ లేరంటోంది.. ఈ సమయంలో ఇవి అవసరమా..?" అంటూ ఆ అమ్మాయి వెంట బయలుదేరాను.

నొప్పి తాలూకు రిపోర్ట్లు వచ్చాయి. వెంటనే కాకున్నా ఎప్పటికైనా ఆపరేషన్ చేయాలన్నది వారి విషయం. అది విన్న నేను "ఏమ్మా ఉషా... మీ మామయ్య ఎవరో ఈ ఊరిలో ఉన్నారన్నావు. మరి వాళ్ళకేదయినా తెలిపావా?" అడిగాను..

"లేదాంటి. వాళ్ళకు మాకు అసలు మాటల్లేవు.." అంది విచారంగా

"మాటల్లేకుంటే మాత్రం ఇలాంటి సమయంలో కూడా రాకుండా ఉంటారా? ముందు నువ్వైతే ఫోను చెయ్యి" అని ఫోను తీసాను నెంబరు చెప్పు అంటూ...

"వద్దాంటీ.. ఇందాకే చేసాను.. వీలయితే రేపు వస్తామని చెప్పారు" అంది. కాస్తంత దిగులు నిండిన స్వరంతో. పరిస్థితి అర్థమయిన నేను పెద్దగా మాటలు పెంచడం ఇష్టం లేక "సరేలేమ్మా... నేను ఉన్నాను కదా...!! అన్నాను భుజం చెట్టూ చెయ్యి వేస్తూ...

రాత్రంతా నేనెంత ధైర్యం చెప్పినా ఆ అమ్మాయి హాయిగా నిద్రలేకపోయింది. నాకు మాత్రం ఒక పక్క ఆలోచన, ఆవేదన, రెండూ కలగలసినట్టి తెలియని భావమేదో పట్టిలాగుతోంది. రాత్రంతా నిద్రపోకుండా పడుతున్న ఉష ఆవేదన నాకెంతో బాధ కలిగించింది. ప్చ్....! ఏం జీవితాలో... అనిపించింది. రాత్రి చాలా సేపయిందేమో.. అక్కడున్న మంచంపై అలా వాలగానే.. నాకు, ఉషకు కూడా నిద్రపట్టేసింది. సరిగా రెండు గంటల ప్రాంతంలో "అమ్మా.. అమ్మా..." అంటున్న ఉష గొంతు వినబడి ఉలిక్కిపడి నిద్రలేచాను. అక్కడున్న పరిస్థితిని చూసి నాకు కాస్త కంగారు కలిగి చుట్టూ డాక్టర్స్ నర్స్‌లు అందరూ చేరివుండటంతో అయోమయంగా లేచి నిలబడ్డాను. ఆ అమ్మాయికి ఆసరాగా వచ్చి అలా నిద్రపోతున్నందుకు నాలోనేనే సిగ్గుపడ్డాను. కాస్త ముందుకు కదిలి..

"సర్.. ఏమయింది సర్?" అని అడిగాను.. అంతే వాళ్ళు చెప్పిన మాటతో నాకు ఒక్కసారిగా కళ్ళు తిరిగినట్లయింది.. "షి ఈజ్ ఇన్ కొలాప్సింగ్ స్టేజ్" అరె.. ఇదేంటి ఇంతలో.. నిన్నటిదాకా ఆపరేషన్ చేస్తే బతుకుతుందని చెప్పారే... అదేంటి ఇలా మళ్ళీ వేరే మాట.. ఇదే మాట నేను అడిగేసాను ఉండబట్టలేక..

"మేడమ్.. మీరు ఆమెకు ఏమవుతారు? అని అడిగాడు.. నా దూకుడు చూసి చాలా దగ్గర అనుకున్నాడేమో

"ఏమి అవను సార్.. కాకుంటే మాకు నైబర్స్..." అన్నాను.. మెల్లగా..

"ఓహో.. అయితే ఇలా రండి.." అంటూ తన రూములోకి తీసుకెళ్ళి "కూర్చోండి" అన్నాడు డాక్టర్. నేను సందిగ్ధంగా కూర్చున్నాను. ఏం చెబుతాడో ఏమో అనుకుంటూ..

"కానీ ఏంటి సర్.. చెప్పండి!" అన్నాను ధైర్యంగా..

"వాళ్ళు పెద్దగా ఆమెపై ఇంట్రస్ట్ చూపటంలేదు.." అన్నాడు డాక్టర్ అక్కడున్న నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ..

విషయం కాస్త అర్థం అయ్యి, అవ్వని నేను "అంటే ఆమెకు ఆపరేషన్‌కు ఒప్పుకోవడం లేదా?" అన్నాను కాస్త వివరంగా...

"అంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆమెకు మెడికల్‌గా ఏమీ చెయ్యకండి.. మా దగ్గర అంత స్తోమత లేదని అన్నారు." మెల్లగా చెప్పాడు డాక్టర్.

"మరి ఆమె..?"

"చెప్పలేము... ఈ రాత్రి గడిస్తేగాని ఏ విషయాన్ని అంచనా వేయ్యలేము" అనేలోగానే... 'డాక్టర్' అంటూ పెద్దగా అరుపు వినిపించింది... దాంతో నేనూ ఆ అరుపు వచ్చిన గదిలోకి పరుగు తీశాను. ఏది జరగకూడదనుకున్నానో అదే జరిగిపోయింది.. కామాక్షమ్మ చనిపోయింది. "ఆంటీ... అమ్మపోయిదాంటీ..." అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ పిల్లను ఎలా ఓదార్చాలో నాకు అర్థంకాలేదు. అమ్మ పోయి వారం రోజులు కావడంతో నాకూ అమ్మ గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళ తిరిగాయి. విషయం ఎలా చేరిందో ఏమో... వాళ్ళందరూ ఒక్కరొక్కరూ రావడం మొదలు పెట్టారు. నాకెందుకో నేను అక్కడుండటం అనవసరం అనిపించింది. మెల్లగా వాళ్ళతో మాట్లాడుతున్నట్లే మాట్లాడుతూ బయటపడ్డాను.. భారమైన గుండెతో...

ఇంటికి రాగానే... ఒక్కసారిగా మూకమ్మడిగా నాపై దాడి జరిపారు.. "అసలెందుకు వెళ్ళావు..? నీకేమి అవసరం? అమ్మపోయి వారంకాకుండానే నువ్వెళ్లి మరొకళ్ళకు సాయం చేస్తావా? నీకసలు బాధవుందా? ఎవరైనా ఏమనుకుంటారు? కూతురయి అసలు ఏమాత్రం లేదని ఆడిపోసుకోరా? ఇంతా చేసి ఆమెను కాపాడగలిగావా? పోనే పోయింది. ఆవిడ మామూలుగానే జబ్బు మనిషి. నేనెంత చెబుతున్నా నా మాటకు గౌరవం ఇచ్చావా.. అంతలా పెత్తనాలు చేస్తున్నావు... అందుకే నీ మొగుడు నిన్ను నిత్యం తంతూ వుంటాడు అంది" అక్కసుతో వదిన... ఇన్ని మాటలు పడినా ఆ మాటను పడలేక "వదినా నా జీవితం నా ఇష్టం... నేను ఎప్పుడైనా నీ ఇంటికి వచ్చినా మొగుడు కొడుతున్నాడనో, తిడుతున్నాడనో నీకు చెప్పి బాధపడ్డానా? ఎందుకు అనవసరంగా నోరు పారేసుకుంటావు? ఆ అమ్మాయి ఎంతో కష్టంతో వస్తే మనంచేసే సహాయం అంతమాత్రం కూడా లేకుండా ఏం బావుంటుంది?" అంటూ అక్కడినుంచీ లోపలికి వెళ్ళిపోయాను...



ఆ తర్వాత తలో ఒకరు తలో రీతిలో తిట్టుకున్నారు. వదిలేసా... నాకు మంచి అని తోస్తే నేను చేయడం, అందరి నోట్లో పడటం నాకు కొత్తకాదు. మనసంతా ఏదో భారంగా ఒంటరిగా అనిపించింది.

అందరూ భోంచేసి ఒక వారగా పడుకున్నాము. అంతలో ఒకటే తలుపు చప్పుడు... మళ్ళీ వాళ్ళే అయి ఉంటారు.. "అమ్మా ప్రతిమా... నీకోసమే అయివుంటుంది. కామాక్షమ్మ పోయిందిగా.. ఏడవటానికి తోడూకావాలేమో" అంది హేళనగా వదిన. ఆమాటలు విన్న నాకు ఎంతో బాధ కలిగి నేను ఉన్న చోటునుండీ కదలలేదు... తప్పనిసరిగా వదిన వెళ్ళి తలుపు తీసింది.. తలుపు తెరిచీ తెరవడంతోటే "మీ ఇంట్లో ప్రతిమ ఎవరు?" అని అడిగారు. అది విన్ని నేను ముందుకు వెళ్ళి నేనే అన్నట్లుగా నిలబడ్డాను. "మీరేనా ప్రతిమంటే...?" అంటూ "అయినా మీ అమ్మగారు పోయి వారం కూడా కాలేదు. మీరెందుకూ మా అమ్మను చూడటానికి వచ్చారు? ఎందుకంటే చనిపోయినవారింటి నుండీ ఎవరైనా వస్తే అవతల వాళ్ళుకూడా చనిపోతారట.. మీరెందుకు వచ్చారు? ఏమి మేములేమా? మా చెల్లెలు పిలిస్తే అదేదో చిన్న పిల్ల... దానికేం తెలుసు? తను పిలిస్తే మీరు వచ్చేయడమేనా" అని అడుగుతుంటే నాకు నోటమాటరాలేదు.. ఒక్క నిమిషం ఆశ్చర్యపోయాను.. ఇలా కూడా మనుషులు ఉంటారా..? అంటూ అయినా బయట పడకుండా...

"మరి మీరెందుకు రాలేదు?" కోపంగా అన్నాను.

"అలా అడిగే హక్కు మీకెక్కడిది?" అంటూ దాదాపు అరిచినంత పని చేసాడు. నాకేం మాట్లాడాలో తోచలేదు..

"అయితే మీ అమ్మను నేను చంపానా?" అన్నాను.

"అందుకు ఆలోచన ఎందుకు?" మళ్ళీ అరిచాడు.

"మరి డాక్టర్ అలా అనలేదు... 24 గంటల్లో ఆపరేషన్ చేయాల్సిన అపెండిసైటిస్ ఆపరేషన్ అసలు నా దగ్గర డబ్బులేదు.., అని మీరు చెప్పడం వల్లేనని నాకు చెప్పారే..." అన్నాను నేనూ అంత పెద్దగొంతుతోనే..

దాంతో తట్టుకోలేని వాళ్ళూ ఏవేవో మాటలు అంటున్నారు.. నన్ను శాపనార్థాలు పెడుతున్నారు. నాకేమీ తోచడంలేదు. ఒక పక్క వదిన, మరో పక్క వాళ్ళు నన్ను ఆ రోజంతా తిట్టడమే ధ్యేయ్యంగా పెట్టుకున్నారు.

***

ఏంటి జీవితం..? ఎందుకీ ఆలోచనలు? ఈ గమ్యస్థానం ఎక్కడిది? భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను ఒకే క్షణంలో ముద్ద చేసి నేను కలుపుకున్నా నాకు

ఒంటరితనం బావుంది. నాతోపాటు నా ఆలోచనలు అనంతంగా తేలిపోతున్నాయి. ఒకరు ఒకచోట. మరొకరు మరోచోట, అనేది మనం నిర్ణయించడమే.. ఈ అనంతకాల ప్రవాహంలో ఎవరికి ఎవరు లేకున్నా ఆవేదనే... అందరికీ అందరూ ఉన్నా అనుమానమే.. మనసులు కలవని ఎందరు ఎదురుగా ఉన్నా ఎవ్వరు లేనట్లే... ఒకరికి సాయమొకరికి ద్రోహం అయితే సాయం ఎందుకు... ద్రోహమే చేస్తుంటే బావుంటుందేమో!..

ఇది మా తరం.. మా జీవితం...? సంపాదన యుగం..? రాబోయేది కరువు యుగం... ఏది ఎలా వున్నా... మానవత్వం కోల్పోతున్న ఈ మానవులు వున్నంత కాలం.. ఏ యుగమైనా మనల్ని ఆదుకునేది ఏముంటుంది? అనిపించింది..

రాబోయే జీవితాన్ని తలుచుకుంటూ... బామ్మా...! అంటూ ముద్దు ముద్దుగా దగ్గరకు చేరుతున్న నా మనవల్ని దగ్గరకు తీసుకున్నా ఇక రాబోయే రోజులు తలుచు కుంటూ... వారికి ఇక ఇంతటి ఆదరణ దొరుకుతుందా అనే సందేహం కలిగిందేమో నన్ను గట్టిగా పట్టుకుని నా ఒడిలోకి చేరారు ఆత్మీయంగా..

జీవితం పట్ల భయం భయంగా ఉన్న నేను.. గోడపై చిరునవ్వులొలకపోస్తున్న అమ్మను తలుచుకున్నాను, ధారగా వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ.....

*('రచన' మాసపత్రిక)*



# పిచ్చుకగూళ్ళు

మిట్టమధ్యాహ్నం కావొస్తున్నా, ఎడతెరిపిలేని వర్షం ఒకవైపు, స్వైరవిహారం చేస్తున్న ఈదురుగాలి మరోవైపు, వాతావరణం బీభత్సంగా ఉన్నా అటక మీద వున్న కాస్తంత ఖాళీ స్థలంలో ఓపిక వున్నా లేకున్న ముక్కుకో గడ్డిపోచో, దారపుముక్కో దానికేది కనపడితే దాన్ని కరుచుకుని పిచ్చుక తన గృహనిర్మాణ కార్యక్రమంలో ఎంతో శ్రద్ధను కనబరుస్తోంది. ఆ పిచ్చుక కట్టుకునే ఆకట్టడంలో శ్రమతో పాటు నమ్మకం కూడా వుండటం విశేషం. బయట వీధి దీపస్తంభాలు, వృక్షాలు అన్నీ మనిషి ఆశల్లా కుప్పకూలి పోతున్నాయి. వాటిన్నిటి మధ్య రాఘవ తనకున్న రెండు గదులలో కూర్చీలో కాళ్ళు రెండు పైకి పెట్టుకొనే ఒకవైపు కళ్ళలో కన్నీళ్లు, మరోవైపు కూర్చి కిందుగా వరదనీరు, ఒకదానికి ఒకటి పోటీపడుతుండగా దిగులుగా కూర్చున్నాడు. అల్లకల్లోమవుతున్నా వాతావరణం రాఘవ మనసుకుతో బుట్టువులా గోచరిస్తోంది.

ఎందరు ఎలావున్నా, ప్రపంచం ప్రశ్నలా కనబడుతున్నా, ఆకలి మాత్రం తన పని తాను చేసుకుంటూ, పలకరించుకుంటూ పోతుంది. ఆకలి అల్లరిది. ఎందరున్నా, ఎంతగా పని ఒత్తిడి వున్నా, ఒకమారు తలెత్తి తనవైపు చూసేలా చేసుకోవడం దాని ప్రత్యేకత. ప్రస్తుతం రాఘవ పరిస్థితి అలానే వుంది. నీళ్ల ప్రవాహంలా కళ్లెదుట కనపడుతున్నా తాగడానికి గుక్కెడు నీళ్లు లేని దుస్థితి. రాత్రి తెల్లవార్లూ ఏమిచెయ్యాలో తెలియని మనస్థితి. అంతకంటే నీళ్లలో కొట్టుకుపోతే బావుండేదేమో... నిన్న చనిపోదామని ప్రయత్నిస్తే దారే దొరకని నిరాశ. నేడు చనిపోవడానికి ఎదురుగా ఎన్నో అవకాశాలున్నా బతకాలనే ఆశ, ఒక్కరోజులో ఎంతమార్పు? లేదు ఎలాగైనా నిజాయతీగా బ్రతకాలనే అభిప్రాయం... చేసిన తప్పులన్నీ గుర్తుకొస్తుంటే క్షమించమని దేవుణ్ణి ప్రార్థన... ఇవన్నీ

క్షణాలలో జరిగిపోతున్నాయి. చిమ్మచీకటి, నీటి హోరు, కొట్టుకుపోతున్న మనుషుల హాహాకారాలు, నేలకూలుతున్న వింత చప్పట్లు. ఒక్కొక్కటి రాఘవను వాస్తవంలోకి తీసుకొస్తున్నాయి.

రాఘవ సీతారామయ్య, జానకమ్మలకు ఒక్కగానొక్క కొడుకు కావడంతో అందరికీ ఎంతోముద్దు. అడిగిందల్లా ఇవ్వటం తల్లిదండ్రులుచేస్తే... అనుకున్నదంతా సాధించడం రాఘవ తనగొప్పదనంగా భావించాడు. తానుచేస్తుంది తప్పో, ఒప్పో తెలుసుకోలేనంతగా పెరిగిపోయాడు. చదువు కొద్దో గొప్పో అబ్బినా, వారికున్న ఆస్తి, అంతస్థులు చదువు విలువను తెలుసుకోలేనంతగా చేస్తాయి. కాలక్రమంలో రాఘవకు పెళ్లి అవ్వడం, తల్లిదండ్రులు రాఘవకు కష్టసుఖాల్ని గూర్చి ఏమాత్రం తెలపకుండానే చనిపోవడంతో జీవితం పట్ల ఏమాత్రం అవగాహన లేని రాఘవ వున్నదంతా వ్యసనాలకు ఖర్చుపెట్టడం ద్వారా తనకు నిలువ నీడకూడ లేకుండా చేసుకున్నాడు. ఇప్పుడు జీవితం విలువ తెలుసుకున్నా, చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కళ్లముందు వర్తమానం ఆగమ్యంగా వుంది. పలకరించే దిక్కులేదు. ఆడంబరాలకు ఖర్చుపెట్టినప్పుడు తనతో వుండి ఆనందాన్ని పంచుకున్నవారందరూ మాములుగా సహజంగానే తప్పుకుంటున్నారు. వారం రోజుల నుండి ఉద్యోగం అంటూ తనకున్న సర్టిఫికెట్లు తీసుకొని ప్రయత్నిస్తుంటే తనకు ముందే వున్న పేరు తెలుసుకున్నవారే అక్కడా వుండడంతో నిరాశే మిగులుతోంది. దాంతో ఇక బతకడం వృథా అనుకున్న రాఘవ చనిపోదామని ప్రయత్నించి సులువుగా చనిపోయే మార్గం తెలియక ఆ చావులో కూడా ఆనందాన్ని వెతుక్కున్న రాఘవ అంత సాహసించలేకపోయాడు. ఇప్పుడు ప్రకృతి సృష్టిస్తున్న బీభత్సంలో ఎలాగైనా బతకాలనే ఆశతో పొరాడుతున్నాడు. మెల్లగా నీరంతా మోకాలు లోతుకుచేరుకుంటున్నాయి. అయినా ఏదో ఆశ, మెల్లగా కుర్చీ మీద లేచి నిలబడ్డాడు. ఇన్నాళ్లు దేవుడు అనేవాడు ఒకడు వున్నాడని తెలుసుకునే అవసరం రాకున్నా చేతులెత్తి మొక్కుకున్నాడు. ఎలాగైనా ఈ గండం నుండి బయటపడాలని, చావో బతుకో తేల్చుకునే ప్రయత్నం మొండిగా చేస్తున్నాడు. ఒక్కసారి ఇంటి బయట చూసాడు. ఆ చూడడంలో కుర్చీ పక్కకు ఒరగడం, నీళ్లలో రాఘవ పడిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. బలవంతంగా ఈదుకుంటూ బయటపడ్డా, ఆ పోరాటంలో ఏదో ఆధారం దొరికింది. అదేదో తెలియదు. దాన్ని పట్టుకునే వదలకుండా ఇంటి కప్పు పైకి ఎక్కాడు. బతుకుతానని హామీ లేకున్నా బతికే అవకాశం దొరికిందని మాత్రం తెలుస్తోంది. అలా ఎంతసేపు వుండిపోయాడో తెలియదు. తెల్లవారింది. నీటి ప్రవాహం ఆగలేదు. కళ్లముందు కొట్టుకు వస్తున్న శరీరాల్ని చూస్తూ భరించలేకపోతున్నాడు.

ప్రభుత్వ సహాయం సహకారాలు తనదాకా రావడం లేదు. ఒకపక్క ఆకలి, మరో పక్క దాహం, వాతావరణం ఇంత తేమతో వున్నా నోరు ఎండిపోతోంది... రాఘవకు



ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు... ఇలా ఒకటికాదు, మూడు రోజుల్నుంచి ప్రత్యక్ష నరకం చూస్తున్నాడు. కళ్లు తిరిగిపోతున్నాయి... గట్టిగా అరుద్దామన్నా ఓపికలేదు. ఎవరైనా వస్తారేమో... అని ఆశగా.. కళ్లు వెదుకుతున్నాయి. ఎవరొస్తారు తన పిచ్చిగాని.. ఇలాంటి వాతావరణంలో తాను ఇలా బతకడమే ఒక వింత. అలాంటిది ఈ నీళ్లలో ఎవరు వచ్చి తననెవరు ఆదుకుంటారు? ఎంతసేపని ఆ ఇంటిపై అలా పడుకుని వుండగలడు? తానైనా ఎంతకాలం వుంటాడు? ఇలా కృంగి, కృశించి, చనిపోవాల్సిందే... ప్చ్....!! బావున్నప్పుడు తానెంతమందిని బాధపెట్టాడు?

చదువు పేరు చెప్పి తల్లిదండ్రులకు అబద్ధాలు చెపుతూ... చదువుకుంటాడేమో... వారికి ఈ జన్మలో చదువులేదని తనకే చదువంతా వచ్చేయాలని తాపత్రయపడే తల్లిదండ్రులను ఎంతగా నమ్మించి మోసం చేసాడో.. ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది. తీరా పరీక్ష రిజల్ట్స్ వచ్చాక పరీక్షలో తప్పితే తల్లితండ్రులు ఎంతగా కృంగిపోయివుంటారో తెలుస్తుంది. ప్రేమ పేరుతో ఎందరో అమ్మాయిలకు మాయ మాటలు చెప్పి, పందాలు కాసి, అందులో నెగ్గడానికని చేసే ప్రయత్నంలో ఎన్ని మనుసులు బాధపడివుంటాయో అర్థం అవుతోంది. చివరికి వాళ్లు వెక్కి వెక్కి ఏడుస్తుంటే వారి అసహాయతను తలుచుకొని నవ్వుకున్న రోజులు, రాబోయే అలాంటి జీవితానికి పునాదులు వేస్తాయని తెలిసి వుంటే అలాంటి తప్పులు చేయకపోయేవాడేమో.., చిన్నతనం నుంచి మేనమామ కూతురే భార్యగా అందరూ అంటున్నప్పుడు... ఆవునంటూ ఆవునంటూ మాయమాటలు చెప్పి, చివరకు నాకు ఈ పెళ్ళి వద్దు నాకు అమ్మాయి నచ్చలేదని అన్నప్పుడు గాయత్రి ఎంతగా కృంగిపోయి వుంటుందో అర్థం అవుతోంది.. కట్నం కోసం కాలు లేకున్నా వాణిని పెళ్లి చేసుకుని... నిత్య కుంటిదానివంటూ, ఎందుకు పనికిరానిదానివంటూ, కట్నం ఇంకా తెమ్మని బెల్టుతో నిత్యం చావబాదుతున్నప్పుడు ఎంతో భవిష్యత్తు వున్న వాణిని ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన పాపానికి నిష్కృతిలేదని ఏడవడం తప్ప ఏం చెయ్యగలడు? పిల్లలు పుట్టని లోపం తనలో వున్నా ఆ విషయం బయటకు తెలియనీయకుండా భార్యను గొడ్రాలిగా చిత్రించి చిత్రవధకు గురిచేసినప్పుడు తల్లి కావాలని ఆ ప్రాణం ఎంతగా విలవిలలాడిందో..

భార్యను చనిపోయేలా చేసి ఏమీ ఎరగనట్లు.. తనకు వేరేవరితోనో సంబంధం వుందని పుకారు లేవదీస్తే కన్న కూతురి బ్రతుకు ఇంతగా దిగజార్చి నందుకు ఆ కన్నతల్లి గుండె ఎంత క్షోభకు గురైవుంటుందో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది.. ఆడవారిని వావి వరసలు లేకుండా హింసించి వేరెవరికైనా చెబితే నీ మీదే నింద మోపుతానని చెప్పి భయపెట్టినపుడు ఆ అమాయక మనసులు ఎంతగా బిక్కచచ్చిపోయి వుంటాయో గుండె కదలికల ద్వారా తెలుస్తోంది. తల్లి జబ్బుతో మంచాన పడితే సరైన వైద్యుల సంరక్షణలో వుంచకుండా ఒక పక్క బతకనీయకుండా, చావనీయకుండా క్షోభకు గురిచేసినప్పుడు ఆ

ముసలి ప్రాణం ఎంతగా కృంగిపోయిందో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఇప్పుడు గుర్తుకు వుస్తుంటే అమ్మా..., నన్ను క్షమించమ్మా... అని వేడికోలు వినబడుతుందేమోనని ఆకాశం వైపు నిర్వికారంగా చూడడం తప్ప ఏం చెయ్యగలడు? తండ్రి పేరు చెప్పి అప్పులు చేసి మోయలేనంత భారం ఆ ముసలిప్రాణం పై వేసి ఒక పక్క నింద, ఆ పై మోయలేనంత అప్పుల భారం వేసినప్పుడు ఆ హృదయం ఎంతగా తల్లడిల్లిపోయిందో... తెలుసుకుని క్షమాపణలు చెప్పుకుని కాళ్ళను కన్నీటితో కడుగుదామనుకున్నా ఆ అపురూపమయిన పాదాలు కనపడే వీలు లేకుండా పోయింది. ఇవన్నీ తలుచుకుంటూ హే... భగవాన్... నాకంటూ మళ్లీ బతుకుంటే నువ్వు బతకనిస్తే ఇవన్నీ విడనాడి జీవితమంతా ఒకరి సేవలోనే జీవిస్తాను. చావు పుట్టుకల విలువ తెలిసిన మనిషిగా సాటి మనిషి సన్మార్గంలో పెట్టడానికి శాయశక్తులా మానవాళికి తోడుంటాను. తోడున్న ప్రతి మనిషికి మానవ జన్మ విలువేంటో తెలుపుకుంటాను. అనుకుంటూంటేనే కళ్లు మూతలు పడుతున్నాయి. ఇక ఈ జీవితానికి ఇవే ఆఖరి క్షణాలు ఇంకా అంటూ వుంటేనే కదా తనను తాను తెలుసుకునే వాడవుతాడు...!! అనుకునేంతలోనే దబ్బున నీళ్లలో పడ్డాడు... ఒంట్లో వున్న కొద్ది ఓపికతో ఈదడం మొదలు పెట్టాడు. చేతికి, కాళ్లకు ఏవేవో తగులుతున్నాయి. అవి మానవ మృతదేహాలో, లేక జంతు కళేబరాలో అంతు చిక్కడం లేదు. నిన్న మొన్నటి వరకూ నవ్వుతూ, తుళ్లుతూ, ఒకరిపై ఒకరు తూలనాడుకుంటూ, దూషించుకుటూ... ఒకరి జీవితాన్ని మరొకరు నేలకూల్చాలని ప్రయత్నాలు చేస్తూ... ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ.... ఒకరికొకరు నిత్య శత్రువులై ఒకరి నాశనాన్ని మరొకరు కొరుకుంటూ బతుకును శరీరంతో నడిపిన వాళ్లే వారికి ఒక్కరోజులో ఇలా విగతజీవులుగా మిగులుతామని తెలియదు పాపం... వికృతంగా, వింతగా ఏ దేహం ఎవరిదో తెలియని రీతిలో పడివున్న తీరు ఎంతో భయంకరంగా వుంది. రాఘవ ఈదుతూనే వున్నాడు. ఆగకుండా బతకడానికి ప్రయత్నిస్తునే వున్నాడు. అలా ఆ ప్రయత్నంలో ఏదో ఒక చెట్టుకొమ్మలా చేతికి ఆధారం దొరికింది. దాన్ని మరింత గట్టిగా పట్టుకున్నాడు. అయినా ఒంట్లో ఓపికేది? ఆ పట్టు సడలిపోతోంది. ఒకవైపు శవాలను గుట్టలు గుట్టలుగా పేర్చి వాతావరణం కాలుష్యం కాకుండా తగలపెడుతూంటే... ఎక్క డుంది కులం, మతం జాతి భేదాలు? ధనిక పేద తారతమ్యాలు, నీది నాది అనే నినాదా లు... ఎక్కడున్నాయి? అని అనిపించకమానదు. ఒక్క నవ్వు, ఒక నువ్వు కలిసుంటే ఈ జీవితం ఎంత నూతనంగా వుంటుందో ఇప్పుడనిపించినా ఏం ప్రయోజనం?

అందుకే... మళ్లీ ఇంతటి దీనస్థితిలో కూడా స్వామీ... మళ్లీ నాకు బతుకంటూ దొరికితే కులమతాలకు అతీతంగా, ధనిక, పేద అనే తారతమ్యాలకు దూరంగా, నాది



నీది అని స్వార్థానికి ఆమడదూరంలో వుండి జీవిస్తాను... నాకొక్కసారి మళ్లీ జీవితాన్నివ్వవూ? అంటూ ప్రాధేయపడుతున్నాడు రాఘవ... కన్నీళ్ళతో...

ఆకాశంలో మళ్లీ మేఘాల కదలిక మొదలయ్యింది... అమ్మో...! మళ్లీ పడితే ఇంకేమయినా వుందా? ఒళ్లంతా చల్లగా అయిపోతోంది. ఇకచావు తప్పదని పట్టుతప్పిన చేతిని వదిలి నీళ్లలోకి వెళ్లిపోతూ కనిపించని దైవానికి మనస్ఫూర్తిగా నమస్కరిస్తూ తన చేతనయినంతగా ప్రయత్నించి చేతకాక పడిపోయాడు నిస్సహాయంగా... అంతలో సహాయకులు రావడం... కొట్టుకుపోతున్న రాఘవను గుర్తించడం పైకి తీసి రక్షించాలనే ప్రయత్నం చేయడం లాంటివి క్షణాల్లో జరిగిపోయాయి. ఎవరి హస్తం దగ్గరున్న ఆస్పత్రిలో చేర్పించిందో వారిలో ఏ దైవం వుందో తెలియదు కానీ... కొంతసేపటికి రాఘవ కోలుకున్నాడు.

తెల్లవారింది... ఒళ్లంతా పచ్చిపుండులా వుంది. ఒకవైపు దుఃఖం తన్నుకు వస్తోంది. చుట్టూ కలియజూస్తేనా అనేవారెవ్వరూ లేరు. ఎవరో ధర్మాత్మురాలు అది హాస్పిటల్ డ్యూటీయే కావచ్చు.. చేతికి ఒక బన్ను, టీ అందించి వెళ్లిపోతోంది. అలా వెళ్లిపోతున్న స్త్రీలో అమ్మ కనపడుతోంది. నువ్వు తప్పకుండా తినాల్సిందే అన్న ప్రేమ కనబడుతోంది. ఇక ఆసల్యం చేయకుండా బన్ను ముక్క టీలో ముంచుకు తింటూంటే తినడానికి ఆకలి ముఖ్యం కానీ తినే ప్రదేశం, పెట్టే చేతులు కావని అర్థం అవుతోంది. పక్కనే తినలేక తింటున్న ఒక వృద్ధురాలు పడే అవస్థ చూసి కాస్త ఓపిక తెచ్చుకొని నోటికి అందించి నీళ్లు తాగించినప్పుడు ఆమె పడిన ఆనందం ఆ కళ్లలో మనసుల్ని చదివితే వస్తుందో తెలపడానికి ఏ గ్రంథం సరిపోదేమో... ఎవరో పాప నాన్నా! నాన్నా! అంటూ చుట్టూ కలియజూస్తూ తననే నాన్న అనుకుంటూ దగ్గరకు వచ్చినప్పుడు నాన్న పేరుకున్న విలువ, నాన్న స్థానానికున్న ఆదరణ ఎక్కడా లేదేమో అని అనిపించకమానదు. ఆ పిలుపు విన్న ఆ పాప కోసం వాళ్ల నాన్న రావడం, పాపను అందుకోవడంతో మళ్లీ మనసు భారంగా అయింది. ఇక అలా పడుకోవడం ఇష్టం లేని రాఘవ తన లాగా ఇంకేవరైనా బాధపడితే కాస్తయినా సాయం చేద్దామనే సంకల్పంతో ముందుకు వెళ్లి మెల్లగా తన ఇంటికి బయలుదేరితే... అక్కడున్న నీరు కాస్త తగ్గడంతో లోపలికి వెళ్లడం ఏమాత్రం కష్టం కాలేదు. కాస్త ఓపిక తెచ్చుకొని పడిపోయిన వస్తువుల్ని సరిచేసుకుని అక్కడున్న సీలింగ్ వైపుకు తలెత్తి చూస్తే గత వారంరోజులుగా ఎంతో ప్రయాసకోర్చి ఒక్కో పుల్లా చేర్చి కట్టుకుంటున్న పిచ్చుక గూడు పూర్తి అయిందేమో.. కిచకిచ లాడుతూ పిల్లలతో ఎంతో ఆనందంగా వుంది... ఆ కిచకిచరావాలలో "ఓ మానవా! నీవు ఇంత అనుభవిస్తేగానీ, నీకు జీవితపు విలువ తెలియలేదా? సృష్టి వున్నంతవరకూ... మేము బతికున్నంత వరకూ ఒకేలా జీవిస్తాం..." అనే సందేశం వినబడింది.

ప్రతి జంతువూ తాను జీవించి వున్నంత వరకూ తన జీవితం ఇలానే వుంటుంది. అంతెందుకు? సృష్టిలో ప్రతి క్రిమి కీటకం ఏవైనా తన జీవితాన్ని ఒకేలా మలచు కుంటుంది... కానీ... ఇంత మేథస్సుండీ... ఇంతగా ఆలోచించే శక్తి వుండీ... ఏది కావాలో తెలుసుకుని అనుభవించే ధైర్యం వుండీ... జీవితపు విలువలు తెలుసుకోవడానికి ఇంత భీభత్సం జరగాలా అన్నట్లుంది. ఆ నోరులేని పిచ్చుకకు వుండే పాటి శ్రద్ధ, పట్టుదల వుంటే ఈ సృష్టిలో ఏ విపరీత పరిణామం జరగదేమో అనిపిస్తోంది. రాఘవకు తదేకంగా అలా చూస్తుంటే ఆ పిచ్చుక గూళ్లలో ఎంతో జీవిత పరమార్థం గోచరిస్తోంది. ఎగురుతున్న ఆ పిచ్చుకలలో నేర్చుకోవలసిన ఐక్యత కనపడుతోంది. ఇలా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో ఏదో రీతిగా విలువలు కాపాడుకునే ప్రయత్నానికై ఆలోచిస్తే... ప్రపంచం శాంతియుతంగా మారిపోతుందేమో... కరువు కాటకాలకు తెరపడుతుందేమో... మనిషి నాటకీయ జీవితానికి స్వస్తి పలుకుతుందేమో... ఏమో అనుకుంటున్నాడు.

చెల్లాచెదురైన మానవజీవితాలు, రోడ్లన్నీ చెత్తచెదారం, తల్లిని కోల్పోయిన వారు, తల్లి, తండ్రి, ఇద్దరూ కోల్పోయి బతుకు ఏంటో తెలియకుండా రోదిస్తున్నలోకం తెలియని పసిబిడ్డలు. కుటుంబాన్ని మొత్తం కోల్పోయి జీవచ్ఛవాల్లా నిలిచిపోయిన వృద్ధాప్యపు ఎదురుచూపులు, ఈ సృష్టి ఆగ్రహం ఏంటో తెల్సుకోలేని మూగజీవాల బయటపడని ఆవేదనలు, కళ్లకు కట్టినట్లున్న ఈ దృశ్యాల్ని గమనిస్తున్న రాఘవ ఇప్పుడు మామూలు మానవుడిలా లేడు. సృష్టి రహస్యాన్ని తెలుసుకున్న యోగిలా వున్నాడు. ఇలా ప్రతి విపరీతానికి అర్థాలు వెతక్కుండా జీవితాన్ని కొందరైనా తెలుసుకుంటే....!!!

'నవ్య' వారపత్రిక



# అమ్మ

గోదావరి నది లోతెంతో తెలియదు కానీ పగలు సూర్యబింబాన్ని, రాత్రి చంద్రబింబాన్ని తనలో దాచుకుంటున్నాననే గర్వం మాత్రం కనబడుతుంది. చుట్టూ జనం.. అలల కేసి చూస్తూ... కొందరు స్నానం చేస్తూ...మరి కొందరు నమస్కరిస్తూ.. కొందరు మాట్లాడుకుంటూ... మరికొందరు సేదతీరుతూ ఇలా చాలా మందితో గోదావరి పరవళ్ళు వినిపిస్తూనే వుంది. తన ఆవేదన తెలుపుకుంటూనే వుంది. తనలో నిక్షిప్తమై వున్న సంతతిని వాటి అల్లరిని తెలుపుతూనే వుంది... తన లోతు తెలియని వారందరికి తన గూర్చి చెబుతూనే ఉంటుంది. మరో వైపు కరుణను కడలిలో వదిలి వెళ్ళడానికి పొత్తిళ్లతోని బిడ్డను కన్న స్త్రీని అమ్మ అంటారేమో... కానీ కన్నబిడ్డను అలలకు అప్పగించడానికి వచ్చిన జాతిని ఏమంటారో, వీరికి జాతిలో ప్రత్యేకమైన పేరు వుందేమో తెలియదు. వచ్చి అందరిలానే అక్కడ కూర్చునట్లు కూర్చుని అలలకు దగ్గరగా ఒక చెత్త పేపరుపై బిడ్డను వుంచింది. మెల్లగా తనదారిన తాను వెళ్ళిపోయింది. పాపం! ఏ పాపం చేసిందో ఆ ప్రాణం కాస్సేపు గుక్కపెట్టిఏడ్చి, ఏడ్చి మెల్లగా ఏడుపు ఆపి చిన్నపాటి ఎక్కిళ్ళతో మృత్యువాడిలోకి అలల కౌగిలిలో సేదతీరింది.!!

***

ధనం విలువ ఎంత బాగుందో తెలిసినట్లే వుంటుంది కానీ, కొన్ని చోట్ల వెలకట్టలేమనిపిస్తుంది. ఖరీదయిన బంగళా, ఇంటినిండా నౌకర్లు, తినడానికి తాగడానికి ఎక్కువై ఎలా వృధా చేయాలో ఆలోచించే రీతిలో జీవితం, ఏది కావాలంటే అది వెంటనే కంటి ముందు ప్రత్యక్షమయ్యే రీతిలో జీవితం, కంటి ముందు కనిపించిందంతా తమదే

అనిపించే ధీమాతో ముందుకు కదిలే తీరు తెలిసి తెలియని వయసులో ఏదీ తప్పుగా అనిపించదు.

చిన్నూ"...

"చెప్పు.."

"ఇప్పుడు నాకు మూడో నెల.."

"అయితే నన్నేం చేయమంటావు.."

"నీకు తెలియదా? నన్ను ప్రేమించానన్నావు...?

"అవును ప్రేమించాను"

"మరి పెళ్ళి"

"మధ్యలో ఈ పెళ్ళి ఏంటి?"

"నువ్వు పెళ్ళి చేసుకుంటావనే నేను ఇంతగా నీకు దగ్గరయ్యాను"

"అది నీ తప్పు.. అందుకు నేనేం చేయాలో చెప్పు ఒక్క పెళ్ళి తప్ప"

"విషయం మానాన్నకు తెలిసింది. చాలా గొడవ చేసారు"

"ఇట్స్ క్వయిట్ నేచురల్.. ప్రతి ఇంట్లో గొడవ జరుగుతుంది"

"నువ్వు పెళ్ళి చేసుకుంటావని చెప్పాను"

"అలాగని నేను చెప్పానా?"

"చిన్నూ! నువ్వలా మాట్లాడకు.. నువ్వు కాదంటే నాకుచావే గతి"

"ఏయ్ ఫూల్‌లాగ మాట్లాడకు. నిన్ను చంపి నేను, నేను చచ్చి ఇంట్లో వారిని భాధపెట్టడం అవసనమా? ఇద్దరం ఎంజాయ్ చేసాము.. నువ్వు ముందే జాగ్రత్త పడాల్సింది. పరిస్థితి ఇంత దూరం ఎందుకు తీసుకు వచ్చావు?

సరే.. అయ్యిందేదో అయ్యింది. మా ఫ్యామిలీ డాక్టరున్నారు వారి దగ్గరకెళ్ళు.. నీ ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చు నేను భరిస్తాను. ఇంకా ఏదైనా అవసరం ఉంటే ఈ డబ్బు తీసుకెళ్ళు అంటూ రూపాయి నోట్ల కట్ట ముందు పడేసాడు.

అది చూసిన లావణ్య ఉలిక్కిపడి "చిన్నూ నేను నీలా సరదాగా నీతో సరదాగా నీతో తిరగలేదు. నేను మనస్ఫూర్తిగా ప్రేమించాను కాబట్టే నీతో తిరిగాను. నువ్వు ఎక్కడికి రమ్మంటే అక్కడకు వచ్చాను. ఈ రోజు నీ నిజ స్వరూపం చూసాక నేను నీలాంటివాటితోనా తిరిగిందని అనిపించి నాపై నాకే సిగ్గుగా అనిపిస్తోంది. నీకు డబ్బుంటే నాకు ఆత్మాభిమానం వుంది. నేను చేసిన ఈ పనికి తలదించుకుని ఇంటికి ఎలా వెళ్ళగలను? ఆడవారిని ఇలా అవమానించడం గొప్పనుకోకు.. నువ్విలా అంటావనే



ఆలోచన రాలేదు... తెలిస్తే ఇన్నాళ్ళూ నీతో తిరిగేదాన్ని కాదు చిన్నూ.. నువ్వేదో సరదాగా అంటున్నావు కదూ అని ఎంత బతిమిలాడినా సమాధానం రాకపోవడంతో విషయం అర్థం చేసుకున్న లావణ్య అక్కడ్నించి ఏడుస్తూ వెళ్ళి పోయింది.

కొంతకాలానికి లావణ్య ఇంట్లో వారు అన్న మాటలు భరించలేక ఆత్మహత్య చేసుకుందని తెలిసింది. ఆ కాస్సేపు బాధ అనిపించినా తర్వాత మరో సంబంధం రావడంతో మరచిపచోయి కొత్త జీవితాన్ని ప్రారంభించాడు.

***

స్మితా...! ఏమి చేస్తున్నావు... అవత పెళ్లివారు వస్తున్నారు. త్వరగా తయారవ్వు. అంటూ పార్వతమ్మ హడావుడి అంతా ఇంతా కాదు.. తెల్లటి మేని ఛాయ, పసిడి బుగ్గలపై చెదరని చిరునవ్వుతో లేచి తయారవడానికి ఉపక్రమించింది. ఖరీదయిన నగలు, ఇంటి ముందు కావల్సినన్ని కార్లు, నౌకర్లు... కళ్ళు చెదిరిపోయే రంగుల్లో పట్టుచీరలు, వాతావరణమంతా ఖరీదుగా అత్యాధునికంగా వుంది. కదలలేని స్థితిలో తండ్రి వున్నా, ఒకప్పుడు తాను సంపాదించిన డబ్బు అతన్ని.

నడిపిస్తోంది, ఒక్క అతన్నే కాదు కాల చక్రమే డబ్బుతో నడుస్తోందన్న మాట ఇక్కడి వాతావరణం చెబుతోంది. ఇక అంతటి అందానికి మరింత వన్నె అన్నట్టు అలంకరణతో స్మిత మరింత దీపంలా మెరిసిపోతుంది. పెళ్ళి కొడుకు పెద్ద వ్యాపారవేత్త కొడుకు. నెలకు లక్షకు పైగా సంపాదించే ఉద్యోగస్తుడు. అదీ బంగారమే. ఇకనేం జీవితమంతా బంగారుమయమే అనుకుంటూ పెళ్ళి కుదిర్చారు తల్లిదండ్రులు.. ఇన్ని ఉన్న చోట పెళ్ళి చేసుకోవడానికి ఎవరు మాత్రం ముందుకు రారు? అలాగే చదువు, సంస్కారం, వినయం, విధేయత, ఎదుటివారిని ఆకట్టుకునేరూపం ఇవన్నీ కలిపి తనను పెళ్ళి చేసుకోవడానికి రావడం ఆశ్చర్యంలేదు.

పెళ్ళి వాతావరణం ఆ ఇంట్లో నెల్లాళ్ళ క్రితమే వచ్చినా, పెళ్ళిరోజు మాత్రం మరింతగా ద్వగుణీకృతం అవుతోంది. భాజాభజంత్రీలతో

ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. పెళ్ళి ముగిసింది. డబ్బున్న వారంతా డబ్బును, కానుకలు సమర్పించి ఎవరి కంటెవారు తీసిపోరంటూ నిరూపించు కుంటున్నారు. డబ్బు డబ్బుతోనే మాట్లాడుతుందని, పదవులు పదవులతోనే మాట్లాడతాయని ఎవరి బాషలో వారు మాట్లాడుకుంటున్నారు, కనీసం ఫోన్‌లో మాట్లాడడానికి కూడా సమయంలేని మంత్రులు, పెద్దపెద్ద అధికారులందరూ ఫోన్‌లో పిలిచీ పిలవకుండానే హాజరయ్యారు.. వీరు మాకు చుట్టాలంటూ.. లేదు మాకు చుట్టాలంటూ వాదించి మరీ లేని చుట్టరికాన్ని కలుపుకుంటున్నారు. మాట్లాడడంలో మర్యాద లేకున్నా చాలా చక్కగా మాట్లాడతారంటూ

సర్టిఫికెట్లు సంపాదిందించు కుంటున్నారు. ప్రవర్తన బాగోలేకున్నా చాలా గొప్పవారనిపించు కుంటున్నారు. మొత్తం మీద కోట్ల రూపాయలకు మరో కోట్లరూపాయి నోట్ల కట్టలతో వివాహం జరిగింది. ఇక విందు కార్యక్రమం.. ఇంతున్నా.. శరీరమంతా బంగారపు పూత పూసినట్లున్నా నెలరోజుల నుండి తిండి ముఖమే ఎరగనట్లు ప్లేటు అందుకని ఇకపై దొరకదేమో అన్నంతగా ఎగబడి తినడం చూస్తే కరువంతా ఇక్కడే వుందా అనిపించకమానదు. ఒక వైపు పెళ్ళి జరుగుతున్నా పెళ్ళి పందిట్లో పదిమంది కంటే అంటే వారికి చాలా కావల్సిన వారికంటే ఎవ్వరూ లేరు. అంతా ఎక్కడికి వెళ్ళారాని అనుకోవడానికి అనుకోవడం అనవాయితే. కానీ అక్కడ భోజనాల దగ్గరకెళ్ళి చూస్తే వీరు పెళ్ళి చూడడానికి వచ్చారా తిండి కడుపునిండా తినడానికి వచ్చారా అన్నంతగా తింటూనే వున్నారు. ఒక వైపు క్యూ సిస్టమ్ నడుస్తున్నా అవన్నీ పక్కకు పెట్టి ఒకరి భుజాలపై నుండి మరొకరు తిండి కోసం ఎగబడుతూ... అడిగి వేయించుకుంటూ కడుపునిండా తిని అలవాటులేకున్నా ఐస్‌క్రీం కూడా తిని ఎట్టకేలకు అయ్యిందనిపించారు. భుక్తాయాసంతో వచ్చిన వారందరూ తమ బంగారాన్ని మరొక్కమారు తడుముకుంటూ తమను తమతో పాటు మోసేందుకు వచ్చిన కార్లలో వారివారి శరీరాల్ని పడేశారు.. ఒకరు స్వీట్లు బాగోలేవని, మరొకరు కూరల్లో జీడిపప్పు సరిగా వేయలేదని... అనుకుంటూ తమ దేహాల్ని తమ యధాస్థానాన్ని చేర్చడానికి బయలుదేరారు.

తదుపరి కార్యక్రమం కూడా బంగారంతోనూ.. తీసివేత కూడికలతోను జరిపేరు. పెళ్ళకొడుకు, పెళ్ళికూతురులో ముసి ముసి నవ్వులు లేవు. మురిపెంగా చూసుకుంటున్న అనవాయితీలు లేవు. ఎందుకంటే అతి డబ్బుతో నిండిన ప్లాస్టిక్ పెళ్ళిలా ఎలాగోలో పెళ్ళి ఘనంగానే చేసారు. పాపం ఎన్ని వున్నా ప్రేమనేది లేకుంటే ప్రక్కన ఉన్న మొగుడనే వాడు ఒక ఖరీదైన వస్తువే.. ఎంత అందం రాశిపోసినట్లున్నా భార్యనేది కేవలం షోకేస్‌లోని బొమ్మే.. తప్పదు మూడుముళ్లులంటూపడ్డాక కాపురం చేయాల్సిందే. లేకుంటే పరువు సమస్య బంగారం మరింత బంగారాన్ని కోల్పోతుంది. ఒక బంగళా మరో బంగళా, ఒక కారు మరో కారును కోల్పోతుంది. అవి కోల్పోకూడదనుకుంటే వారు సమాజంలో భార్యాభర్తలుగానే వుండి తీరాలి మరి. “స్మితా అనే దానికి అర్థం తెలికున్నా స్మితా అనే పిలుపు వినిపించింది. ఇక భర్తను పేరు పెట్టి పిలవాలా? లేక ఏమండీ... ఛీయాక్.. ఏమండీ ఏమిటి అప్పటికేదో మనం పనివారమా? అనే ఆలోచన రాగానే ఎదురుగా చూసేసరికి తన సందిగ్దాన్ని అర్థం చేసుకున్నట్లు “నన్ను ప్రకాష్ అని పిలుపు” అనే సమాధానం వచ్చింది. దాంతో ప్రాబ్లమ్ సాల్వ్ అయిందనుకుంటూ ఓకె ప్రకాష్ అని మాత్రం అనగలిగింది.

“నీ కోసం” అంటూ ఒక వజ్రపు టుంగరం వేలికి తొడిగాడు ప్రకాష్.



“నీ కోసం” అంటూ ఒక బ్రాస్‌లెట్ చేతికి తొడిగింది ఇందులో మీకేం తీసిపోను అన్నట్టుగా.. ఇద్దరి కళ్ళలో తృప్తి.. కనబడుతోంది.. బంగారాలు మార్చుకున్నారు.

“స్మితా! ఇప్పుడు మనం భార్యాభర్తలం.. మనలో ఏ దాపరికం ఉండకూడదు. ఇంతవరకు మనమంటే మనకు ఏమి తెలియదు. ఏదో పెద్దవారు చేసారు.. మనం వారికి, వారి పెద్దరికానికి విలువిచ్చి పెళ్ళి చేసుకున్నాం. అలాగని నువ్వు నచ్చకని కాదు నచ్చావు.. మన జీవితాలలో అనుకోని సంఘటనలు, బాధపడిన సంఘటనలు ఏవైనా వుంటే చెప్పుకుందాం.. అందులో మన తప్పున్నా, ఒకరినొకరు క్షమించుకుందాం. ఇకపై జీవితాన్ని స్వచ్ఛంగా సంపూర్ణంగా జీవిద్దాం. అన్నాడు ప్రకాష్‌జ

ఆమాటలకు ఉలిక్కిపడింది స్మిత. అంటే నాకంటూ బాధపడిన సంఘటనలు ఏవీ లేవు... ముందునువ్వు చెప్పు. తర్వాత నేను చెబుతా అంది తెలివిగా.

“సరే... తప్పకుండా నేనే చెబుతాను. నేను మా ఇంట్లో ఆఖరు వాడిని చాలా ముద్దుగా చూసుకున్నారు.. ఇక

అన్న వదినలతో సహా నాకేది కావాలంటే అది సమకూర్చారు. కానీ ఒక రోజు నేను కాలేజీలో ఫ్రెండ్స్‌తో పార్టీకని వెళ్ళి బిల్లు చేసాను. అంటే దాదాపు 50 వేలదాకా చేసాను. నాకు తెలియలేదు ఫ్రెండ్స్ అంటే హాట్ డ్రింక్స్ కదా అందుకని.. ఉదయం ఎప్పుడూ తిట్టని మా డాడీ తిట్టారు.. దాంతో నేను నాలుగురోజు ఇంట్లోంచి నా స్నేహితుని ఇంటికి వెళ్ళిపోయాను, అక్కడ చాలా బాగా చూసారు కాకుంటే పదివేల దాకా ఆ ఇంట్లో ఇచ్చానులే. ఆ తర్వాత మా అన్న నా గురించి అక్కడికి రావడం బతిమాలి తీసుకెళ్ళడం జరిగింది. తర్వాత నాకు ఉద్యోగం వచ్చింది... డాడీకి బోలెడు ఆస్తులున్నాయి నాకు ఉద్యోగమేమిటి అనుకున్నా... అదేమాట చెప్పి రిజైన్ చేద్దామనుకుంటే అక్కడ ఎండీ డాడీ స్నేహితుడని తెలిసింది. నా మనసులో మాట విన్నాక మా డాడీ ఏమన్నారో తెలుసా? మనకు ఉద్యోగాలు అవసరంలేదురా కానీ సంఘంలో స్టేటస్ వుండాలి కదా అని అన్నారు. దాంతో తప్పని సరిగా ఉద్యోగం చేస్తున్నాను, నేను చాలా ఖర్చులు చేస్తాను.. నాకు బాగుంది అనిపిస్తే వెంటనే ఏ వస్తువైనా కొనేస్తాను. కొత్తఇల్లు, కొత్త కారు, నిరంతరం నాతోనే వుండాలని ఆశయం. అంటూ ఊహాలోకంలో తేలిపోతూ చెప్పుకున్నాడు.

ఇక చెప్పాల్సిన వంతు స్మితకు వచ్చింది. తప్పదు కదా అనుకుంటూ నాకేమీ మొండితనం, పట్టుదల,పెంకితనం లేవు.. కాకుంటే వున్నదానిలో ఎప్పటికప్పుడు చాలా ప్రశాంతంగా వుండాలనుకుంటాను.. మా డాడీకి కూడా ఆస్తులకు కొదవలేదు. నేను అడగకుండానే అన్ని సమకూర్చుతారు. అందుకే నేను డాడీని అడిగే అవసరం రాలేదు. నా ప్రాణ స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళి రెండు రోజుల్లో వస్తానని నాల్గురోజులు ఉన్నాను.

అదొక్కటే నేను చేసిన పొరపాటు. దాంతో డాడీ నాపై ఏవేవో ఊహించుకుని భయపడ్డారని తర్వాత మమ్మీ చెబితే తెలిసింది. ఆ తర్వాత కూడా నన్ను నమ్మి చాలా స్వేచ్ఛను ఇచ్చారు. ఉన్నన్ని రోజులు సంతోషంగానే గడిపాను. తర్వాత అంటూనే కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్న స్మితను చూసి వారి పుట్టింటిని వదిలివేయాలని ఆవేదన పడుతుందేమోనని ప్రకాష్, దగ్గరగా వచ్చి స్మితా! ఇప్పుడేమయింది? నేను లేనా అంటూ ఓదార్చాడు.

***

వాతావరణం చాలా భారంగా వుంది. ఒకవైపు స్మిత తల్లిదండ్రులు, మరోవైపు ప్రకాష్ తల్లిదండ్రులు అంతా విచారవదనంతో వున్నారు. రెండోసారి కూడా స్మిత మృతశిశువుకు జన్మనివ్వడం వారిని శోక సముద్రంలో ముంచెత్తింది.. దుఃఖం కదుట పడ్డాక మెల్లగా ప్రకాష్ తల్లి అంది... "అసలు అమ్మాయిలోనే లోపం వుందేమో..." మెల్లగా.

అది విన్న స్మిత తల్లి "లోపం ఎప్పుడు ఆడపిల్లలో వుండదు.. అబ్బాయిల్లోనే వుంటుంది. పెళ్ళికి ముందు ఎవరెవరితోనో తిరిగే అలవాటుందని తెలిసింది కదా ఆ అలవాటు ఇప్పుడిలా చూపుతుందేమో" అంది..

"అలాంటపుడు మీ అమ్మాయిని ఎందుకిచ్చారో"

"పెళ్ళయ్యాక తెలిసింది లేకుంటే బయటకు గెంటేవారం"

ఇలా ఒకరినొకరు మాటలను ఈటెల్లా విసురుకుంటున్నా వారిని ఆపే ప్రయత్నం మగవారు చేయలేదు. అనేకంటే చేయలేక పోయారనడంలో వాస్తవికత వుంటుందేమో! పెద్దరికం అనేది డబ్బుతో రాదని మరోసారి వారిరువురి తగువులతో తెలిసిపోయింది...

స్మిత కన్నీటి కడలే అయ్యింది... ఎంత దుఃఖించినా తీరని సంక్షోభం.. ఎంతగా ప్రయత్నంచినా తట్టుకునే శక్తి రావడంలేదు కదా మరింత దుఖం పెరిగిపోతుంది. చిన్నతనం నుండి తాను ఆడిన ఆటలు, పెంచుకున్న పప్పీ అనే కుక్కపిల్ల,ఒక్కతే ఆడపిల్ల కావడంతో అందరి ప్రేమ ఏడువంటే తెలియకుండా పెరిగిన స్మిత నేడు కన్నీటిలోనే ఈత కొడుతుందంటే ఇందుకు కారణం ఏమిటి? బిడ్డలు బతికుంటే ఈ పాటికి ఇద్దరి పిల్లల తల్లి అయ్యేది.. మొదటి సంతానం ఇప్పటికే అమ్మా అంటుండేది. తల్లి తండ్రి ఎంతగా ఓదార్చుతున్నా తీరని దుఖమిది... కడుపులో దేవినట్లుంది.. ఎవరు ఎన్ని అంటున్నా వినిపించుకోలేని స్థితి ఇది. ప్రకాష్‌కు ఎలా ఓదార్చాలో తెలియడం లేదు. ఎంత డబ్బు అయినా ఇస్తాను బిడ్డను కాపాడమని డాక్టరును ఎంత వేడుకున్నా తనకు న్యాయం జరగలేదు.. ఎనిమిది నెలలు బతికిన బిడ్డ తొమ్మిదోనెల రాగానే ఎందుకు చనిపోతుంది. అడుగుతుంటే చెప్పేవారు లేరు. ఇద్దరు బిడ్డలు కళ్ళ ముందు ఆశ చూపి దూరమవడం



నిజంగా దురదృష్టం.. ఉదయం లేస్తే ఎన్నో పుట్టుకలు.. ఎన్నో చావులు.. అందులో ఇది ఒకటి అనుకుందామనుకున్నా మనసు ఊరుకోవడం లేదు. జీవితంలో కష్టమంటే ఏదో తెలియదు. డబ్బుతో అన్నింటి కొనొచ్చు ఒక్క అమ్మ అనిపించుకోవడం తప్ప... అనుకుంటూ గత స్థితిని తలుచకుంది.. రాహుల్ ఎంతో ప్రేమించింది. తనేమీ పేదవాడు కాదు కానీ అలాగనీ గొప్పవాడు మాత్రం కాదు. తనను తనకంటే ఎక్కువ ప్రేమించాడు. తిండి, నిద్ర అంతా తనే అయ్యాడు ఏ పని చేస్తున్నా రాహుల్ జ్ఞాపకం వచ్చేవాడు. నిత్యం ఫోను.. ఫోను ఎంత రాత్రి మెలకువ వచ్చినా వెంటనే ఒక మెసెజ్ లేదా ఫోను కాల్.. తనకంటూ ఒక ప్రత్యేకమైన గది వుండేది ఏ మాత్రం తల్లిదండ్రులకు తెలిసేది కాదు. కాలేజికి వెళ్లేటపుడు తన కారులోనే రాహుల్ ఇంటికి వెళ్ళడం లేదా ఎక్కడికైనా వెళ్ళి మాట్లాడుకోవడమే జీవితంగా వుండేది, ఇదంతా ప్రేమా అంటే ఖచ్చితంగా ఇద్దరూ ప్రేమే అని తీర్మానించుకుని పెద్దవారి అనుమతి తీసుకునేందుకు పెద్దవారి అనుమతి తీసుకునేందుకు వెళితే రాహుల్ తల్లి దండ్రులకు ఏ మాత్రం అభ్యంతరం లేదని తెలపడం వీరు ప్రేమ అనే పేరుతో కాస్త తొందరపడంతో బిడ్డను మోయల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న రాహుల్ ఇంటికి వెళితే తన తల్లితో కలిసి తనను డబ్బు కోసం మోసం చేసాడని తెలిసింది. ఐదో నెల వరకూ తెలియకుండా వుండడంతో తెలిసేసరికి తల్లి ప్రాణం పోతుందని తనని తన మేనత్త ఇంటికి పంపి ఆడపిల్లకు జన్మనిచ్చింది. బిడ్డతో ఇంటికి వెళితే తల్లి తట్టుకోలేదని తన జీవితానికి ఆ బిడ్డ అడ్డమనుకుని గోదావరికి అంకితం చేసింది. మళ్ళీ పెళ్ళి కూతరయింది. జీవితంలో చేసిన పాపం ఇలా బిడ్డలే లేకుండా చేస్తుందని ఊహించలేకపోయింది. తను ఏ సుఖం కోసం తన బిడ్డను చేతులారా చంపుకుందో ఆ సుఖమే జీవితంలో లేకుండా చేసిందని తెలుసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. పెళ్ళయిన కొత్తలో మన మధ్య ఏమీ రహస్యాలుండకూదనప్పుడు ఇది చెప్పాలనిపించలేదు. తెలిస్తే అమ్మో! ఇంకేమయినా వుందా? ఎంతో స్వచ్ఛంగా వున్న ప్రకాష్ నన్ను అసహ్యించుకుంటాడు. ఛఛ ఇలాంటి ఆలోచనలు ఎందుకొస్తున్నాయి తనకు? ఇకపై చెప్పలేదు కూడా...స్మిత ఎందుకు ఏడుస్తుందో అర్థం కాక..తన గదిలోకి వెళ్ళాడు. ప్రకాష్ పాపం! ప్రకాష్ నేను చేసిన పాపాన్ని తాను అనుభవిస్తున్నాడు కదా? నాకు పుట్టిన పాపకు పేరే పేరే పెట్టలేదు... ఎక్కడున్నావో కదా? పాపా! ఒక అమ్మగా నేను చాలా పెద్ద తప్పు చేసానమ్మా! నన్ను క్షమించు తల్లీ. అంటూ చేతులెత్తి మనసులోనే నమస్కరించింది స్మిత.

ఒంటరిగా పడుకుని సీలింగ్ వైపుకు చూస్తుంటే ప్రకాష్‌కు పాతరోజులు జ్ఞాపకం వచ్చాయి. లావణ్య మదిలో మెదిలింది. తనను చిన్నూ అనేది.. ఎప్పుడూ ప్రకాష్ అని పిలిచేది కాదు..

ఇది నా పేరు నా ఇష్టం అంటూ అలానే పిలిచేది.. డబ్బు లేకున్నా ఎంతో ప్రేమను అందించింది. ఎంతో మంది ఆడవారితో తనముందే సరదాగా మాట్లాడినా కోపగించుకునేదికాదు. పైగా నువు నా చిన్నూవి. ఎందరితో మాట్లాడిని నాకోసమే వస్తావు అది చాలు అనేది.

పది మందికి ఇలా మాట్లాడి ప్రేమిస్తున్నట్లు అనిపించేలా చేయకు అదినీకే పాపం అనేది ఆరిందాలా... నాకున్నా ఆస్తికి, అందానికి కొందరు ఎదురుగా వచ్చి ఐలవ్‌యు అని చెప్పినా నవ్వి ఊరుకునేది.. ఏం నీకు అసూయ లేదా అంటే నాకేందుకు, గర్వంగా వుంది. ఇంత మంది ఐలవ్‌యు చెప్పేటంత గొప్పవాడు నాచిన్నూ అంటూ భుజంపై తలవాల్చేది.. విసుక్కోవడం, మాటలనడం తనకు వచ్చేది కాదు. ఒకవేళ తానే ఒక గంట ఆలస్యంగా వస్తే కూడా ఏదో కూనిరాగాలు తీసుకుంటూ ఏంటిచిన్నూ.. నేను మనిషినేరా! అనేది అంతకు మించి ఏమీ అనేది కాదు. అలాంటి లావణ్యను ఎంతో బాధపెట్టాను.. ఎన్నో మాటలన్నాను. పేదకుటుంబమని డబ్బు ఇచ్చి హేళన చేసాను. అయినా ఏమీ అనలేదు.. తనలో తానే ఏడ్చుకుంటూ వెళ్ళి పోయింది. కడుపులో బిడ్డతో వస్తే నేను చాలా అసహ్యంగా ప్రవర్తించాను.. ఈ రోజు ఆ పాపమే కదా నన్ను వెంటాడుతున్నది..? నేను చేసిన పాపానికి పాపం స్మిత అనుభవిస్తోంది కద అనుకుని కన్నీటిని తుడుచుకున్నాడు. పెళ్ళయిన కొత్తలో ఏ రహస్యాలూ ఉండకూడదని నా అంతట నేనే చెప్పి నేనే ఇంత పెద్ద రహస్యాన్ని దాచాను. తెలిస్తే అమ్మో! ఇంకేమైనా వుందా? స్వచ్ఛమైన స్మిత నన్ను వదిలిపోతే నా పరువు పోదూ! ఛఛ ఇక పై చెప్పలేనుకూడా.. లావాణ్యా! నువు ఎక్కడున్నా నన్ను క్షమించు. అని చేతులెత్తి మనసులోనే నమస్కరించాడు! ఎంత పాపం చేసానో కదా? అనుకుని తలుచుకుంటూ తట్టుకోలేక ఏడ్చి ఏడ్చి చివరకు ఒక నిర్ణయానికి వచ్చి హాయిగా నిద్రపోయాడు. ప్రకాష్.

***

"స్మితా! తయారవ్వు..! బయటకు వెళ్లాలి అన్నాడు.

"బయటకా? అని సందేహంగా స్మితతో పాటుగా తల్లి తండ్రులు, అత్త మామలు కూడా చూసారు.

"అమ్మా ఎక్కడికని అడగకండి. నేనొక మంచి పని కోసం బయటకు వెళుతూ స్మితను తీసుకెళుతున్నాను. అంటూ వీలయినంత త్వరగా తయారయి బయలుదేరారు.

స్మితకేఈ అర్థం కావటం లేదు. అంతా అయోమయంగా వుంది. అలాగని ఎక్కడికి అని అడగలేకపోతుంది.

కారు సరాసరి అనాధ శరణాలయానికి చేరుకుంది. రండి సార్ రండి! మీరేనా రాత్రి ఫోను చేసింది. అని అక్కడున్న ఇన్‌చార్జ్ సాదరంగా ఆహ్వానించింది.



అపుడే పుట్టిన పిల్లల్ని, కాస్త పెరిగిన పిల్లల్ని చూపింది. సార్! ఈ బాబును తీసుకోండి సార్.. లేదా ఈ బాబును అనే లోపే..

"నాకు బాబులు వద్దమ్మా! నాకు ఆడపిల్ల కావాలి అంటూ అక్కడే ఉయ్యాలలో చాలీచాలని పాలను తాగుతున్న పాపని తన చేతిల్లోకి తీసుకుని స్మిత చేతిలో ఉంచాడు. స్మితా! నీకు బాగుందా పాప! అని అడిగాడు. "బాగుండడమా? పాప! బంగారు తల్లిలా.. మీ మనసులా వుంది అంది కళ్ళనీళ్ళతో.. మనస్ఫూర్తిగా అందుకుంటూ...

ఇంతలో ఒక పాప అమ్మా అంటూ స్మిత కాళ్ళను చుట్టుకుంది. అదిచూసిన యజమాసురాలు ఈ అమ్మాయి ఎవరొచ్చినా ఇలానే అంటుంది సార్! ఈ మధ్యే వాళ్ళ అమ్మ చనిపోయింది. అందుకు మీరేమీ అనుకోకండి సార్! స్మిత కళ్ళు ఆ పాపకేసి జాలిగా చూసాయి. విషయం అర్థం చేసుకున్న ప్రకాష్ ఆ పాపను కూడా చేతిలోకి తీసుకున్నాడు.

"సార్ ఇద్దరూ!" అంది తడబడుతూ

"అవును ఇద్దరూ! ఒకరు నాకు మరొకరు మా స్మితకు అన్నాడు. యధాలాపంగా అన్నా ఎవరో చెంప చెళ్ళునకొట్టినట్ల యింది. స్మితకు.. పిల్లలిద్దరిన్ని గుండెకు హత్తుకుంది సంతోషంగా..

చేసిన తప్పుల్ని సరిదిద్దుకున్నామన్న తృప్తి ఇద్దరి కళ్ళలో కనబడుతోంది. ఇపుడు వారికి వారి బంగళా, కార్లు, ఏవీ గుర్తు కు రావడం లేదు.. స్మితకు ఇద్దరి పాపల్లో తన ప్రపంచం చాలనుకుంటోంది. పదే..పదే... 'అమ్మా' అంటున్న పాపలో ప్రపంచమంతా కనిపిస్తోంది. ఈ ఆస్తులు, బంగళాలు, బంగారాలు అవన్నీ ఒట్టి మట్టి ముద్దల్లా స్మిత మనసుకు అనిపిస్తోంది. స్మిత ముఖంలో ఆనందం విలువకు ఏ ఆస్తీ సరితూగదనిపిస్తుంది ప్రకాష్‌కు..

"స్మితా! సంతోషమేనా?" అన్నాడు.

తన ఆనందాన్ని తెలుపుకోవడానికి మాటలు లేక ప్రకాష్ గుండెలపై పడి వెక్కి వెక్కి ఏడ్చింది స్మిత..తన కన్నీటితో... వదిలేసిన పాప పాదాల్ని కడుగుతున్నట్టు అనిపించింది. అప్రయత్నంగా ప్రకాష్ కళ్ళు చెమర్చాయి. లావణ్య ఎదురుగా వచ్చి చిన్నూ! నాకు తెలుసురా! నువ్వు మంచివాడివి అన్నట్టుగా వుంది.. స్మితను మరింత దగరగా తీసుకున్నాడు ప్రకాష్.

కొన్నాళ్ళకు స్మిత, ప్రకాష్‌లకు బాబు కలిగాడు.. ఎంతో అపురూపంగా పెద్దపాప అమ్మా ఏ పేరు పెడదాం తమ్ముడికి అంటుంది. ఆరించాలా.. మా లావణ్య ఏ పేరు చెబితే అదే పెడతాం అన్నాడు ప్రకాష్ ఎత్తుకుంటూ...

***('కదలిక మనలో' మాసపత్రికలో జనవరి 2012లో 1,116రూ.లు గెలుచుకున్న కథ)***

# జీవితానికి ఆవలిగట్టున

కృష్ణానదికి ఆవలిగట్టున వున్నకొండల వెనుక సూర్యుడు దాక్కుంటున్నట్లు, సత్యమూర్తి తన ముఖాన్ని ఎవ్వరికీ చూపించకుండా కనబడనీయకుండా ఒక వారగా దిగులుగా కూర్చున్నాడు. కానీ... ఆ సమయం సూర్యునికి అస్తమయం... సత్యమూర్తికి మాత్రం తన జీవితానికి ఆ సమయం ఏమిటో అర్థం కాని స్థితి..., పక్కనే ఉన్న ఒక్కొక్క రాయీ చేతిలోకి తీసుకుంటూ ఎదురుగా వున్న నీటి ప్రవాహంలోకి విసిరేస్తూ తన అసహనాన్ని తెలియజేసుకుంటున్నాడు. విసురుతున్న ఏ రాయీ నీటిపైకి తేలనట్లే తాను పడుతున్న ఏ కష్టం ఫలితం చూపటంలేదు. అలాగని ప్రయత్నించని చోటంటూ లేదు. అయినా ఫలితం కనబడలేదు. ఏ చిన్న ఉద్యోగం అయినా చేద్దాం అంటే ఆతను ఎం.ఏ., చదివినందువల్ల అంత బావుండదేమో అని మీమాంస. ఇక బతకటం వృథా అనిపించింది సత్యమూర్తికి ఎదురుగావున్న నదిలో మళ్ళీ మళ్ళీ అలుపులేకుండా వస్తున్న ఆ కెరటాల్ని చూస్తుంటే వాటిముందు మనమెంత? అనిపించినట్లు సత్యమూర్తి అప్పుడప్పుడూ ఆ కెరటాలకేసి చిద్విలాసంగా చూస్తున్నాడు.

అయినా ఆ కెరటాలు వేరు. మన జీవితం వేరు.. ఎన్నిసార్లు ఉరికి ఉరికి తిరిగి లీనం అవుతున్నా ఆ నదీమతల్లి తన గర్భంలో ఇముడ్చుకుంటుంది. కానీ... ఉద్యోగాలు రాకుండా తిరిగి అలసిపోయి ఇంటికి వెడితే మాత్రం ఏ తల్లీ కూడా మనసు పెట్టి చూడని రోజులివి.. సరే...!! ఇప్పుడెక్కడికెళ్ళాలి? తరువాత తన జీవితం ఏమిటి? లాంటి ప్రశ్నలు తనను ఉక్కిరిబిక్కి చేస్తుంటే చివరకు తాను తనువు చాలించడమే మిగిలిందని అనుకుని చేతికున్న నాన్న వాచీ, ఎపుడో ప్రేమతో నాన్నమ్మ మెళ్ళో వేసిన సన్నటి గొలుసు, తాను బాగుపడతాడేమో అనుకుని తన దగ్గరున్న రెండు గాజులు అమ్మి, అదృష్టపు రాయితో వున్న బంగారం లాంటివన్నీ జాగ్రత్తగా తీసి, తన చావుకు ఎవరూ కారణం కాదంటూ ఉత్తరం రాసి, దాదాపు శిథిలావస్థలో వున్న చొక్కా చేబులోపెట్టి, మిగతావన్నీ తన చొక్కాలో చుట్టి, దానిపై ఒక రాయిపెట్టి, గట్టు మీద పెట్టి, అటూ ఇటూ పడిపోకుండా చూసు కుంటూ, ఒకసారి "భగవంతుడా!! వచ్చే జన్మలోనయినా నేను ఏ కలెక్టరో., డాక్టరో, ఇంజనీరో, అయ్యేటట్లు ఒకవేళ చదువు అబ్బకపోతే ఏ పి.యమ్.నో, ఏ సి. ఎమ్.నో, కనీసం ఎం.ఎల్.ఏ.గానో అయ్యేట్లు ఆశీర్వదించు స్వామీ" అని గట్టిగా వేడుకుని ముందుకు నడిచేంతలో...

"సార్... ఆగండి" అని వినిపించింది.

ఎవరు? ఇక్కడ నన్నెవరు పిలుస్తున్నారు? అనుకుంటూ చుట్టూ కలియజూశాడు. కనుచూపుమేరలో ఎవ్వరూ కనిపించలేదు.. "అరె... ఎవరూ లేరే!! మరి నన్నెవరు పిలిచారు?" సరే... ఎవరైతేనేం? మన పని మనం చేసుకుందాం అనుకుంటూ ముందుకు నడిచాడు సత్యమూర్తి.

కొన్ని అడుగులు వేసాక మళ్ళీ "సార్... కాస్త ఆగండి" అంటూ మళ్ళీ వినిపించింది.

"ఇదేంటి? మనిషి కనబడకుండా నన్ను ఎవరో పిలుస్తున్నారు? కొంపదీసి ఏ దెయ్యమో కాదు కదా? అనుకునేసరికి ఎక్కడలేని భయం ముంచుకొచ్చింది సత్యమూర్తికి... ఛ... చావబోయేవాడికి భయం ఏమిటి? అనుకుంటూ మరింతగా ముందుకు కదిలాడు... సత్యమూర్తి... తెచ్చి పెట్టుకుంటున్న ధైర్యంతో.

"అసలు నువ్వు చచ్చి సాధించేదేమిటి? హాయిగా బతకకుండా ఈ పిచ్చిపనులు నాకేం నచ్చడంలేదు. రోజులన్నీ ఒక్కలా వుండవు కదా సార్..... జీవితం అంటేనే ప్రయత్నించడం" అని ఎవరో హెచ్చరించినట్లు అయ్యింది.

సత్యమూర్తి కాస్సేపు అయోమయంగా అనిపించింది. నన్నెవరు ఇంతగా ఇబ్బంది పెడుతున్నారు? ఎలాగూ నన్ను బతకనీయటంలేదు. కనీసం చావటానికి కూడా నాకు స్వేచ్ఛ లేదా? ఎక్కడో కొండ ప్రాంతంలో ఎవ్వరూ లేకుండా వుంటారని, తనను ఎవరూ వేలెత్తి చూపేవారు వుండరని, కనీసం మనస్ఫూర్తిగా ఏడ్చే అవకాశం ఉంటుందని వస్తే... ఎవరో నన్ను ఆపుతున్నారు అనుకుంటూ ప్చ్... పోనీ బతుకుదామంటే... అమ్మో... ఇంకేమయినా వుందా? "కంచం దగ్గరకు మాత్రం టైం ప్రకారం వస్తావు" అనే తండ్రి మాట, నేనేం పాపం చేసానురా? ఇలా ఎందుకూ పనికిరాని కొడుకు పుట్టాడు... భగవంతుడా.. వాడికోదారి చూపితే నీ కొండకు వచ్చి తలనీలాలు అర్పిస్తాము తండ్రీ... అంటూ నిత్యం చేతులెత్తి ఆ భగవంతుడిని కోరుకుంటూ బాధపడుతున్న తల్లి, గుర్తుకు

వచ్చేసరికి "ఇదేంటి? మళ్ళీ వెనక్కు తిరుగుతున్నాను? ఇక చావు తప్ప మరో ఆలోచనే వుండకూడదు" అనుకుని దృఢనిశ్చయంతో ముందుకు కదిలాడు తాను కట్టిన మూటను ఒకసారి చూసుకుంటూ.

దారిలో ఏదో పక్షికాబోలు... దీనంగా అరుస్తోంది. దాని బాధ ఏమిటో అని అటువైపు చూస్తాడు... ఎవరో మనిషి కాబోలు దాన్ని పిస్టల్‌తో కాల్చినట్లున్నాడు. అనుకుని దగ్గరగా వెళ్ళి ఆ పక్షిని ఒకసారి తన చేతిలోకి తీసుకుని నిమిరాడు. 'అయ్యోపాపం' అనుకుంటూ.

అది కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతోంది.. అక్కడే వున్న నీళ్లను కొన్ని చేతిలోకి తీసుకొని దానిపై పోసాడు సత్యమూర్తి. కాస్సేపు నోరు తెరచి ఆ నీటిని ఆస్వాదించినా వెంటనే ఇక తనవల్ల కాదని, మానవుని అకృత్యాలకు దూరంగా పోదామనుకుని కన్నుమూసింది.

సత్యమూర్తి కాస్సేపు మౌనంగా వుండిపోయాడు. కొన్ని నిమిషాలక్రితం ఇది ఎగురుతున్న ఒక అందమైన రంగుల పక్షి. ఇపుడు సర్వం కోల్పోయిన ఒక నిర్జీవయిన శరీరం. దీనికోసం బాధపడేవారు లేరు. రేపు నేనూ అంతే... కాకపోతే మనుషులం కనుక సమాజం కోసం కాస్సేపు మధనపడినా, తర్వాత వార్తల్లో వ్యక్తిగా మిగిలిపోతాను. అంతేగా... అయినా బతికుంటే ఎప్పటికయినా ఒకప్పుడు తన కంటూ ఒక వ్యక్తిని సంపాదించుకోవచ్చు... అనుకున్నాడు.. కాస్సేపు ఆ పక్షికేసి చూస్తూ....

అలాగని రేపటి జీవితాన్ని తలచుకుంటూంటే ఒక పక్క అప్పులు, మరోపక్క నిరుద్యోగం... ఏం చెయ్యాలో తోచడంలేదు సత్యమూర్తికి. బతికివుంటే ఇవన్నీ తీర్చాలి తప్పదు. కానీ అవన్నీ ఇప్పట్లో తీరేటట్లు లేదు. తెల్లవారితే ఇరవై వేలు అప్పు తీర్చకపోతే ఆ పరంధామయ్య అస్సలు ఊరుకోడు. సరే... ఈ జన్మ ఇలా కానిద్దాం... వచ్చే జన్మలో మొదటినుండి ఎంతో ప్లానింగ్‌గా వుండాలి అనుకుంటూ మళ్ళీ నీటిలోకి ప్రయాణం సాగిస్తున్నాడు. ఈత రావటం వల్ల తాను మళ్ళీ ప్రాణభయంతో బయటపడతాడేమోనని సంశయంతో నడుముకు ఒక బండరాయిని గట్టిగా కట్టుకున్నాడు. ఇదంతా చూస్తున్న ఎవరో పక్కున నవ్వినట్టయింది. ఎవరది... ఎవరు తనకు కనబడకుండా నవ్వుతున్నారు? ఎవరైనా నన్ను ఫాలో అవుతున్నారా? అని అనుమానం వచ్చింది... ఎవరది? అంటూ గట్టిగా అరిచాడు. మళ్ళీ నవ్వుతూ "సత్యమూర్తీ నువ్వు చావలేవు" అని మళ్లీ వినిపించింది.

"అదే ఎందుకు చావలేను? నేనెంత చేతగానివాడి నయినా బతకలేకపోయానే గానీ... చావడానికేమయినా డబ్బుకావాలా ఏంటి?" అన్నాడు ఉక్రోషంగా సత్యమూర్తి.

"డబ్బు కావాలంటే ఎప్పుడయినా వస్తుంది కానీ ఇప్పుడు నీకు ధైర్యం కావాలి... అది ఎప్పుడంటే అప్పుడు రాదు" అని వినిపించగానే...



"నాకెందుకు లేదు ధైర్యం? చాలా వుంది...." అనుకున్నాడు కాస్త గట్టిగానే...

మళ్ళీ నవ్వుతూ "నిజంగా నీకు ధైర్యమే వుంటే నువ్వు బతికేవాడివేమో... బతకడానికికంటే చావడానికే ఎక్కువ ధైర్యం కావాలి అని వినిపించేసరికి... ఒకింత ఆలోచనలో పడ్డాడు. అయినా ఎందుకు చనిపోవాలి? తల్లీ తండ్రి అన్నాక ఎన్నో అంటారు....

కానీ... ఒక్కరోజు నువ్వు కనబడకపోతే ఏడ్చే మీ అమ్మ ఏమయిపోతుంది? ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకుని? ఉద్యోగం లేకుండానే పోయాడు పాపం... అని తెలిసినా కూడా "తల్లీ తండ్రీ పెట్టింది తిని బతకలేక ఏ అమ్మాయినో ప్రేమించి వుంటాడు. ఆ అమ్మాయి ముఖంమీద కొట్టివుంటుంది. ఆ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుని వుంటాడని" నలుగురూ అనుకుంటూంటే భరించి, జీవితాంతం ఏడవలేక, నవ్వలేక బతుకుతూన్న మీ తండ్రి "ఈ వెధవని కనకపోయినా బాగుండు" అనుకునేలా చేసి నువ్వు సాధించింది ఏమిటి? అని వినిపించేసరికి మళ్ళీ వెనక్కు తిరిగి చూసుకుని అక్కడున్న రాయిపై చతికిలపడ్డాడు. ఇదేంటి? ఒక పక్క చీకటి.. మరోపక్క ఎవరివో హెచ్చరికలు... ఏం జరుగుతోంది? అయినా ఇది నిజమా తనను నిత్యం తూలనాడే తల్లిదండ్రులు ఇంతగా బాధపడతారా? అంటే ప్రేమ వుండే నన్ను తిడుతున్నారా? అయినా నేను జీవితంలో ఏమీ సాధించలేక ప్రాణం తీసుకుంటూంటే మధ్యలో అమ్మాయి... ప్రేమా అంటారా? అనుకుంటూంటేనే పెదవులపై తెలియని చిరునవ్వు లాస్యమాడింది. అంటే జీవితంపై ఇంకా ఆశ చావలేదన్నమాట... అనుకుంటూ.. ఇప్పుడెలా బతకాలి? అనే అంశంపై ఆలోచిస్తూంటే అర్థమయ్యింది తనకు ఆలోచించే మనసుందని... తన గూర్చి తాను ఆలోచించే సమయం వచ్చిందని...

ఆ ఆలోచనలతోనే భళ్ళున తెల్లవారింది. చీకటి జీవితంలో పిరికితనం నింపుతున్నా వెలుతురు మాత్రం చీకటిలో చేసే పాపకృత్యాలకు పర్యవసానం, ఆలోచనలకు సమాధానాలు చూపుతుంది అనేది నిజం అన్నట్లు, బతకాలి అనే నిర్ణయం కాకున్నా, ఏదోవిధంగా బతకాలి అని మాత్రం స్పష్టంగా నిర్ణయించుకున్నాడు సత్యమూర్తి. ఆ ఆలోచన రాగానే వెంటనే షర్టు వేసుకున్నాడు. ఆ పాకెట్‌లో వున్న గొలుసు వేసుకున్నాడు. అదృష్టపు ఉంగరం పెట్టుకున్నాడు. తాను ఆలోచనారహితంగా రాసిన ఉత్తరం వెంటనే చింపిపారేశాడు. ఈ పాటికి ఆత్మహత్య చేసుకుంటే చనిపోయి వుండేవాడు. నాకోసం నా అన్నవాళ్ళందరూ ఏదో మొక్కుబడిగా వచ్చి కొందరు తిట్టి, మరికొందరు అయ్యో పాపం అని మళ్ళీ వాళ్ళ పనిమీద వాళ్ళు వెళ్ళిపోయేవారు... తర్వాత ఒకరోజు ఎక్కడపడితే అక్కడ తన గూర్చి తలోవిధంగా చెప్పుకునేవారు. ఆ తర్వాత మరచిపోయేవారు అమ్మో! ఒకవిధంగా నా మనసు నాకు మేలే చేసింది అనుకుంటూ అడుగులు వేసేంతలో...

కడుపులో ఏదో మంట మొదలయ్యింది. అప్పుడర్థమయ్యింది నిన్నటినుండి తానేమీ తినలేదని... జేబులో చూసుకుంటే ఒక్క రూపాయి ఉంది. ఈ ఒక్క రూపాయితో తిని కడుపు నింపుకోలేడుగా అందుకని అక్కడే 'టీ టీ' అంటూ వెళుతున్న కుర్రాడిని కేకేసాడు.

"బాబుగారు టీ కావాలండీ" వినయంగా అడిగాడు.

"అవునుగానీ... టీ ఎంత?" అడిగాడు దీనంగా సత్యమూర్తి...

"నాలుగు రూపాయలండీ..." అన్నాడు అదే వినయం ప్రదర్శిస్తూ...

"అమ్మో నాలుగు రూపాయలే.. వద్దులే... వెళ్లు" అన్నాడు నీరసంగా

"అదేంటి సార్... నాలుగు రూపాయలు తక్కువే కదా సార్...." అన్నాడు ఆ కుర్రాడు మరింతగా మీద పడుతున్న జట్టును వెనక్కుతోసుకుంటూ.

"నీకు తక్కువేలేరా... నా పరిస్థితి నీకేం అర్థం అవుతుందిలే... వెళ్లు... అన్నాడు చిరాగ్గా ...సత్యమూర్తి.

"తీసుకోండి సర్... టీ తాగండి నాకు ఆకలంటే తెలుసు సారూ... తాగండి అంటూ గ్లాసునిండా పోసి ఇచ్చాడు.

"వెంటనే ఏమి ఆలోచించకుండా తాగేసాడు సత్యమూర్తి. మరి మీ యజమానికి ఈ విషయం తెలిస్తే... అడిగాడు.

"తెలిస్తే తెలియనీయండి సారూ.. ఇది కాకుంటే ఇంకోటి.. కష్టం ఎక్కడ చేసినా డబ్బులు వస్తాయి అంతమాత్రాన ఎవరో, ఎపుడో తీసేస్తారని, కొడతారని అనుకోవడం ఎందుకండీ... వాళ్ళు మనల్ని తీయగలరు కానీ మన శక్తిని కాదు కదండీ" అన్నాడు.

"సత్యమూర్తి ఆశ్చర్యపోయాడు. పట్టుమని పదేళ్ళు కూడా లేవు – జీవితం పట్ల ఇంతటి అవగాహనా? ఎంత చక్కని మాట చెప్పాడు నిజమే కదా...ఎవరైనా మనిషిని తీయగలరు కానీ వారిలోని శక్తిని కాదుగా... అనుకుంటూ ఆ అబ్బాయి వంక చూస్తూ... నీపేరేంటి? అనడిగాడు సత్యమూర్తి నవ్వుతూ.

శీను.. అని నవ్వాడు. ఆ నవ్వులో ఎన్ని బాధల తాలూకు చిహ్నాలున్నాయో... ఎన్ని అనుభవాల పాఠాలున్నాయో... అంతు పట్టలేదు సత్యమూర్తికి.

"సరే... ఎక్కడుంటావు?" అడిగాడు సత్యమూర్తి భుజంపై చెయ్యి వేస్తూ.

ఇక్కడే... అంటూ ఫుట్‌పాత్ చూపాడు. "అదే మా ఇల్లు... నాకు అమ్మ, నాన్న ఎవ్వరూ లేరు సారూ... నేను ఈ చెత్తకుండీలో అదో అక్కడ కనబడుతున్నాడే ఆ ఎర్రచొక్కాయన... ఆయన నన్ను పెంచుతున్నాడు. అప్పటినుండి నేను ఇక్కడే వుంటాను" అన్నాడు నవ్వుతూ.



"మరి పెంచుకుంటున్నాడు అంటున్నావు... మరి వాళ్ళింట్లో పడుకోవచ్చుగా..." ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకు సారూ.. ఈమధ్య వీధిలో ఎవరో నాలాగే ఒక అమ్మాయిని పెంచుకున్నారట. ఇ ఇంట్లో గొలుసుపోతే ఆమెను పోలీసులకు పట్టించారటండీ.. నాకు తెలుసు ఆ అమ్మాయి అలాంటిది కాదని... నాకు చెప్పింది కూడా.. అందుకే నేను చెత్తకుండీలోనే పుట్టినోడిని. ఈ రోజు నన్ను పనిచేస్తున్నానని పట్టించకపోవచ్చు. ఆ పెద్దవాళ్ళకు పెద్ద బుద్ధుల్లో ఎప్పుడు ఏం పుడతాయో ఏమో? వాళ్ళకు వాళ్ళే గొలుసు తీసేసి మాలాంటి వాళ్లపై పెడితే ఎట్టాగండీ...? పెంచినందుకు వాళ్ళకు పని ఏదైనా చేసిపెడతా... రాత్రంతా ఇక్కడే నా మకాం" అన్నాడు ఊడిపోతున్న గుండీని పెట్టుకుంటూ.

"చలి వేస్తే? వాన వస్తే?" అని అడిగాడు సత్యమూర్తి.

ఆ మాటలకు ఒక్కసారిగా నవ్వాడు.. చలి, వాన నన్నేం చేస్తాయి సారూ... అన్నింటికీ అలవాటుపడ్డా... వస్తా సారూ... నాకు పేపర్ వేసే టైం అయ్యింది?

"పేపరు కూడా వేస్తావా?" అడిగాడు.

"ఒక్క పేపరేంటి సారూ... పది గంటలకు హోటల్‌లో పనిచేస్తా... రాత్రి సినిమా హాలుకాడ పనిచేస్తా, అయినా నాకోసం ఎవరు చూస్తారు సారూ... వస్తా సారూ? అంటూ వెళ్ళిపోయాడు శీను.

ఎవరో సాచి చెంపపై కొట్టినట్లయింది సత్యమూర్తికి.

నీడ పట్టున పెంచి, చదివించి ఇంతవాడిని చేస్తే... ఏమీ చేతకానివాడిలా చావడానికి వచ్చాడు. ఏ నిమిషంలో తన జీవితం ఏమైపోతుందో కూడా తెలియని ఆ పసివాడికి తన జీవితంపై ఇంతటి నమ్మకమా? అనుకున్న క్షణమే తాను బతకగలననే నమ్మకంతో ముందుకు అడుగులు వేస్తాడు సత్యమూర్తి.

బతకాలి అనే నమ్మకంతో జీవితానికి ఆవలిగట్టు వైపుకు... ధైర్యంగా...

*("ఆంధ్రభూమి" ఉగాది బహుమతి పొందిన కథ- 2006)*

# కర్తవ్యం

సాయం సమయం... మబ్బులతో కప్పబడి... అస్తమిస్తున్న సూర్యుడ్ని తనలో దాచుకున్న వేళ.. సముద్రంలో కెరటాలు కాంతిలేక నెమ్మదిగా.. ప్రవహిస్తూ... వాతావరణాన్ని కాస్త సందిగ్ధంలో వుంచుతున్న వేళ... తమ చుట్టూ ఏర్పరుచుకున్నట్టి కాంతులతో పిల్లల అల్లరులు... వేడివేడిగా వ్యాపారాలు సాగుతున్న వేళ.. సన్నని చిరుజల్లులు ఆత్మీయంగా పలకరిస్తున్న వేళ... అవేవీ పట్టనట్లు ఒంటరి అలలా కూర్చుంది లహరి. ఆ ముఖంలో ఏ ఆశ లేదు. ఏ విధమైన ఆశయం లేదు గాలికి స్వేచ్ఛగా ఎగురలేని తడి ఇసుక లాటి స్తబ్దత వుంది. ప్రశాంతంగా వున్న చీకటిలాంటి నిశ్శబ్దం దాగుంది... ప్రకృతిని తిలకించాల్సిన ఆ కళ్ళ నిండా నీళ్ళు నిండుకున్నాయి. పలకరించా ల్సిన పెదవులు మౌనంగా వున్నాయి. మెదడంతా ఆశ్చర్యంగా వుంది. ఇలా ఎందుకు జరిగిందని సంశయం దాగుంది. అంతలో "లహరీ! ఇక్కడున్నావా? ఇంటికెళదామా?" అంటున్న అన్నయ్య శ్రీహరి గొంతులో కర్కశం దాగుంది.

"వెళదాం." అని అక్కడ్నించి కదిలింది.

ఏది చెప్పినా నీ మంచి కోసమే చెబుతామనేది గుర్తుంచుకో...? అన్నాడు కార్ డోర్ తెరుస్తూ...

.......................?

నిన్నే మాట్లాడుతుంటే సమాధానం ఇవ్వవేం? నీ మూలంగా అమ్మ నాన్న, నేను వారం రోజులుగా తిండి, నిద్ర లేకుండా బాధపడుతుంటే నువ్వేమో, నీకు నువ్వే అన్యాయం చేసుకుంటూ అప్పటికేదో మేమేదో అన్యాయం చేస్తున్నట్లుఇంటి పట్టున లేకుండా ఇలా



అర్థరాత్రి అపరాత్రి లేకుండా తిరుగుతున్నావు. అమ్మ ముందర అంటే అమ్మ బాధపడుతుందని ఇక్కడ అంటున్నాను... ఏంటి వినబడుతోందా?? అంటూ కార్ డ్రైవ్ చేస్తూ అరుస్తున్నాడు.

"నా గూర్చి ఎవ్వరూ బాధపడక్కర్లేదు. నా జీవితాన్ని నిర్దేశించుకునే ధైర్యం నాకుంది... మీకు నా మీద ప్రేమ లేదని నేనంటే మీకు కోపం రాదా? అలాగే నా మీద ప్రేమ లేదని మీరందరూ అంటూంటే నాకు కోపం రాదా?" అంది కోపంగా.

"అభి... అభి... అభి... నువ్వా మాట అనడం మానవా? రెండేళ్ల క్రితం ఈ మాటంటే మేము నీకు అడ్డు చెప్పామా? ఇప్పుడు తెలిసి తెలిసి అతనికి అలా వుందని తెలిసి ఇంకా ప్రేమ అంటున్న నిన్ను చూసి ఏమనుకోవాలి? ఎలా చెబితే నీకు అర్థమవుతుందో నాకు అర్థం కావడం లేలేదు... ఛీ ఛీ...?"

"అన్నయ్యా!... నువ్వెంతగా నన్ను అసహ్యించుకున్నా నా నిర్ణయంలో మార్పుండదు... మీ మీద నాకేమీ కోపం లేదు... అలా అన్నా మీరు నమ్మరని నాకు తెలుసు. అయినా నాకు నా మీద నా నిర్ణయాల పైనా నమ్మకం వుంది అంతే– ఇంతకంటే నన్ను ఎక్కువగా మాట్లాడనీయకండి." ఇల్లు రావడంతో లోపలికి విసురుగా వెళ్లింది.

"ఏరా... దాని నిర్ణయంలో ఏదైనా మార్పుందా?" అడిగింది తల్లి మెల్లగా...

లేదమ్మా... ఇక దాని గూర్చి మాట్లాడకండి... అది అసలు మన ఇంట్లో పుట్టలేదను కుందాం...!! వెళ్ళి వెళ్ళి గోతిలో పడతానంటే మనం మాత్రం ఏమి చెయ్యగలం? నాన్నా ... మీరు కూడా... దాన్ని ఇక ప్రాధేయపడకండి. అది అందర్నీ మించిపోయింది. జీవితంలో సొంత నిర్ణయాలు తీసుకునేటంతగా ఎదిగిపోయింది. ఇక మీరు నేను చెప్పితే మారిపోయే మనస్తత్వంలో వున్న చిన్న పిల్ల కాదు. పైగా మేజర్... అంటూ గట్టిగా అరిచి చెప్పాడు శ్రీహరి.

"ఒరేయ్ శ్రీహరీ! ఆవేశం తగ్గించుకోరా! నేను నచ్చచెబుతాగా... నువ్వూరుకో...? అన్నాడు తండి రాఘవయ్య కండువా భుజంపై వేసుకుంటూ...

అహా.. మీకా నమ్మకం వుంటే అలాగే కానీయండి. అంతలా మనం అనుకున్నట్లే జరిగితే నాకూ సంతోషమేగా... అంటూ తన గదిలోకి వెళ్ళాడు విసురుగా...

లహరీ.. కాస్త ఎంగిలి పడు తల్లీ.. నా బంగారవు కదూ... కోప్పడితే మాపైన పడు... అన్నం మీద ఎందుకే.. అంటూ అన్నం కలుపుకొచ్చి ఇచ్చింది ... నవ్వుతూ తల్లి కామాక్షి.

నాకు ఆకలిగా లేదమ్మా తర్వాత తింటాలే? అంది కోపంగానే లహరి.

"ఆకలి ఎందుకుండదు...? మనసులో బాధలకు మనసుతోనేగా పని...? మరి

తిండి దగ్గర చూపుతావెందుకు?" అంటూ బలవంతంగా రెండు ముద్దలు తినిపించింది.

"అమ్మా... నాకు అభి అంటే చాలా ఇష్టం" అంది మెల్లగా...

ఇష్టం అన్నావనే మేము పెళ్ళికి సిద్ధపడ్డాం... ఎపుడైనా మీ మాట కాదన్నామా? చెప్పు... కానీ... ఇలా కానిరోగం వచ్చినవాడిని చేసుకుంటానంటే ఎలాగమ్మా...!!??

అలాగని నాలుగేళ్ళుగా ప్రేమించుకుంటున్న మేము విడిపోవాలా? అంది కోపంగా.

లహరీ... నువ్వేమి చిన్నపిల్లవు కావు. అభిరామ్‌కు వచ్చింది ఏ కాన్సరో... గుండె జబ్బో కాదు. ఎయిడ్స్... దీనికి మందులు లేవు. కాకపోగా నీ జీవితం చిన్నతనంలోనే నాశనం అవుతుంది... మేము ఏం చెప్పినా నీ మంచి కోసమే చెబుతాము కదా...! మాకున్నది నువొక్కదానివే కదా నిన్ను దూరం చేసుకుని ఎలా బతకాలి నువ్వే చెప్పు? అంది కంటనీరు పెడుతూ కామాక్షమ్మ...

"నేను లేకుంటే అభి బతకడమ్మా...?"

"నీ ముఖం.. అసలు ఆ అబ్బాయికి అంత ప్రేమే వుంటే ఈ రోగం ఎందుకు తెచ్చుకుంటాడు.. నీకు బుద్ధి రాదు..." అంటూ ఆవేశంగా అక్కడ్నించి వెళ్ళిపోయింది.

"అసలు ఎవ్వరికీ నా బాధ ఎందుకని అర్థం కాదు? అసలు నేనేం తప్పు చేసాను? అయినా ఈ వ్యాధి... ఇలాంటి సంబంధాలున్న వారికే వస్తోందా? కాదే... ఆరునెలల క్రితం యాక్సిడెంట్ అయింది. అప్పుడే ఏదో పొరపాటు జరిగి వుంటుంది. తన అభి ఎలాంటి వాడో తనకు తెలుసు. ఇక లాభం లేదు ఒకసారి అభిని చూసి రావాలి.." అనుకుంటూ బయలుదేరింది... లహరి.

***

"అభి వున్నాడా? రామూ" అడిగింది అక్కడున్న పనివాడిని

లేదమ్మా– ఫ్రెండ్స్ ఎవరో వస్తే...? అంటూ ఆగాడు.

ఫ్రెండ్స్... నాకు తెలిసీ అభికి ఇలా బయటకు పిలుచుకు వెళ్ళేవారు లేరే?... అని ఆలోచిస్తూ పైకి చూసింది. మేడ మీద అభి వున్న రూమ్‌లో ఎవరో ఉన్నట్లు కనబడింది.

వెంటనే "రామూ! అభి ఇంట్లోనే వున్నాడుగా... లేదని ఎందుకు చెప్పావు?" అడిగింది కోపంగా... అంటూనే లోపలికి విసురుగా ఎంతగా వెనుకగా పిలుస్తున్నా వినకుండా వెళ్ళింది.

మేడమీదకు విసురుగా వెళ్ళిన లహరికి లోపలి దృశ్యం చూడటం నోటి మాట రాకుండా ఒక్క క్షణం నిర్ఘాంతపోయింది. అభి మరొక స్త్రీతో చూడలేకపోయింది.

తనకు ఏం చెయ్యాలో తెలియడం లేదు... ఒక వైపు ఏడుపు రావడం లేదు. కోపం రావడం లేదు. మెదడంతా స్తబ్దుగా తయారయ్యింది. ఒక్క ఉదుటున ఇంటికి



వచ్చింది. రావడంతోనే తన గదిలోకి వెళ్ళి గడియ పెట్టుకుంది. ఒక్కసారిగా దుఃఖం కట్టలు తెంచుకుంది.

కూతురు గదిలోకి వెళ్ళడం అలా ఏడవటంతో ఇంట్లో వారందరూ కంగారు పడ్డారు. 'లహరి' అంటూ తలుపును తట్టారు. చాలాసేపటివరకూ ఏడ్చి మెల్లగా తలుపు తీసింది... కామాక్షమ్మ... మెల్లగా లహరి దగ్గరగా కూర్చుంది.

"అమ్మా!... మీరు చెప్పినట్లే వింటాను... కానీ రెండేళ్ళ దాకా నాకు పెళ్ళి మాట వద్దు... నన్ను నా చదువును పూర్తి చేయనీయండి అంది స్థిరంగా.

ఆ మాట వినడంతోటి అందరి కళ్ళల్లో ఆనందం. అలాగేరా తల్లీ.!. నీ మాట ఎపుడైనా కాదన్నామా?" అన్నారు తల్లిదండ్రులు ముక్తకంఠంతో.

ఒక గండం గడిచినట్లు అన్నయ్య శ్రీహరి ముఖంలో నవ్వు కనిపించింది.

***

"లహరీ... నువ్వు అనుకున్నట్లే... నువ్వు మాథ్స్ పోస్టుగ్రాడ్యుయేషన్ యూనివర్సిటీ ఫస్టు వచ్చావురా... చూడు?" అంటూ శ్రీహరి ఆనందంగా చెప్పాడు.

"నాకు తెలుసు... నా కూతురు... బంగారం... దానికేం తక్కువని... అనుకుందంటే సాధించడం దానికి అలవాటు...?" తండ్రి వంత పాడాడు.

"అన్నీ మా అన్నయ్యలానే...! వాడూ అంతే చిన్నప్పటి నుండీ ఏ పరీక్ష పెట్టినా అందులో ఎప్పుడూ ఫస్టే... అంతా మేనమామ పోలిక" అంటూ సాకు దొరికిందని తన పుట్టింటి గొప్పలు వర్ణిస్తూ తల్లి అంది కాఫీ కాస్తూ...

లహరి మాత్రం మౌనంగా వుంది. ఒక వైపు భయంగా వుంది. తనకు ఇక పెళ్లి అంటారని.. "ఏమ్మా నీ ఆలోచన?" అంటూ తండ్రి అడగనే అడిగాడు.

"నాన్నా... ఏదైనా ఉద్యోగం అంటే కాలేజీ లెక్చరర్‌గా టెంపరరీగా చేస్తూ పిహెచ్‌డి చేయాలని" అంది మెల్లగా.

"మరి నువ్వు– రెండేళ్ళు అన్నావని మన లక్ష్మణరావు అంకుల్ కొడుకుతో నీకు పెళ్ళి చేయాలని నిర్ణయించాము. అయినా వాళ్ళు మన మాట కాదనరు... పెళ్ళి అయినా నీ చదువు మన ఇంట్లోనే సాగుతుందని చెబుతాను... వారు ఒప్పుకుంటేనే ... సరేనా...?" అంటే తండ్రి పడుతున్న అతురతకు లహరికి నవ్వు వచ్చింది. పాపం... వీరు నిత్యం ఎంత బాధపడుతున్నారా అనిపించింది.

అందరూ లహరి ఏం చెప్తుందా అని ఆమె ముఖంలోకి చూస్తుండగానే "సరే మీ ఇష్టం" అంది మెల్లగా...!

ఇక వారి ఆనందానికి హద్దులు లేవు. ఎవరెవరికో ఫోన్లు చేస్తున్నారు... స్వీట్లతో

తెగ హైరానా పడుతున్నారు. తన గురించి ఎంతో గొప్పలు చెప్పుకుంటున్నారు. అన్నీ గమనిస్తున్న లహరి మనసులో ఏ మార్పు లేదు. కేవలం స్తబ్ధత తప్ప... "మనిషి బతికితే తన కోసం. అది చెయ్యి దాటిపోతే ఎదుటివారికోసం" అనే మాటను అనుసరిస్తున్న తీరులో వుంది లహరి తీరు...

లహరి పెళ్లికి ఇక నెల కూడా లేదు.. మనం బట్టలు కొనుక్కుని వద్దాం... అంది కామాక్షి. ఆనందంగా... "బట్టలా...? నువ్వు, పిన్ని వెళ్ళి తెచ్చేయండి..." అంది నవ్వుతూ.

అదేమిటే...? అవ్వ!! నవ్విపోతారు ఎవరైనా ఇప్పటికే చాలామంది ఇదేంటి లహరి ముఖంలో నవ్వు లేదు. పెళ్ళి కళలేదు అంటున్నారు. మేమే దాటవేస్తున్నాము. రేపు నీకు కాబోయే అత్తగారు మావగారు వస్తారు...ఇలాగే వుంటే ఏమనుకుంటారు! పెళ్ళి కావల్సిన పిల్ల " అని పూర్తి కాకుండానే...

"అమ్మా... ప్లీజ్... నన్ను విసిగించకు నేనేమీ మీ మాటను కాదనటం లేదుగా... ఇంకా ఎందుకు నన్ను విసిగిస్తున్నారు...? నన్ను ఇలా వదిలేయండి...?" అంది కటువుగా.

"అమ్మా...! అది మారిందనుకుంటున్నారు కానీ దాని మనసులో ఇంకా ఆ రోగిష్టి వాడే వున్నాడు..?" అన్నాడు శ్రీహరి మరింత ఉద్వేగంగా.

"విన్నావుగా అమ్మా.. అన్నయ్య చెబుతున్నది... అయితే ఏంటి? నా మనసుతో మీకేం పని? మీకు కావల్సింది నేను కదా" అంది... మరింత కోపంతో.

"చూసావామ్మా దానికెన్ని మాటలు వస్తున్నాయో...? ఊరుకుంటున్నామని...?" అంటూ చెయ్యి లేపేంతలో...

"హరీ...! పెళ్ళి కావల్సిన పిల్లపై చెయ్యి చేసుకుంటావా? నీ ఆవేశంలో అర్థం లేదు?" అంటూ వారించింది తల్లి కామాక్షమ్మ.

"అసలు తన తీరులో ఎక్కడైనా పెళ్ళి చేసుకునేలా కనబడుతోందా? మొదట ఎందుకు కావాలందో.., తర్వాత మన మాట ఎందుకు విందో మనకు తెలియదనుకుంటోంది.. ఎందుకులే, చిన్నపిల్లవని చూస్తుంటే...?"

"అదే, మీకేం తెలిసింది...? నేనేమీ ఇప్పటివరకు మీకేమీ చెప్పలేదే...?" అంది లహరి.

"అంటే చెప్పకపోతే తెలియదనుకుంటున్నావా?"

"అదే ఎలా తెలుసు" అంది మరింత గట్టిగా లహరి.

"ఎందుకు తెలియదు? వాడి ప్రవర్తన...?" అనే లోపే...

"నీకెలా తెలుసు అన్నయ్యా? ..."

"అది నీకనవసరం...?"



"అది చెప్పడానికి ఇంత సంకోచం ఎందుకు చెప్పు? నువ్వే అభి ఇంటికి వెళ్లావని... నా దారికి అడ్డం వస్తే ప్రాణం తీస్తానని లేదా మా ఇంటిల్లిపాది ప్రాణాలు తీసుకుంటామని ... భయపెట్టి తనకు మత్తు మందిచ్చి మరో అమ్మాయితో అలా వుండేలా చేసి నువ్వేదో సాధించావని నువ్వు అనుకుంటున్నావు కానీ.., నాలుగేళ్ళ ప్రేమ తర్వాత కూడా తాను ఎలాంటి వాడో తెలియకుంటే నేను, నా ప్రేమ పనికిరాని చెత్తతో సమానం... ప్రేమ అనేది పొందడం ఒక వరం. అభి అమాయకుడు. నాకున్న పాటి జ్ఞానం కూడా లేనివాడు... పదిమంది గొడవ పడుతుంటే ఆ వైపు కూడా చూడలేనంత భయస్తుడు... అలాంటివాడు ఒక్కరోజుతో అంతటి విలన్ అయిపోయాడంటే వెనుక నీ మేధస్సు తప్పక వుండి వుంటుందనకున్నాను అక్కడ పని చేసే రాము ద్వారా నిజమని తెలుసుకున్నాను... అసలే అభికి ఆరోగ్యం బాగులేదు... నేను ఇంకా అభినే తలుస్తుంటూ ఏదో అనర్థం జరుగుతుందని నేనే దూరంగా, నిందను భరిస్తూ ఇప్పటిదాకా వున్నాను. మీకు తెలియనిది ఒకటుంది."

"రెండున్నర సంవత్సరాల క్రితం కారు యాక్సిడెంట్‌కు కారణం నేనే...! అభి ఏమయిపోతాడో తెలియని స్థితిలో అక్కడే వున్న ఒక హాస్పిటల్‌లో చేర్చాను... ప్రస్తుతం వాడేసిన సిరంజీలు చెత్తబుట్టలో పడేస్తున్నారే గానీ హాస్పిటల్ యాజమాన్యం వాటిని నాశనం చేయటం లేదు. దాని వల్ల వాటిని చెత్త ఏరుకునే పిల్లల ద్వారా తెప్పించుకుని కడిగి మళ్ళీ వాడుతున్న ఆసుపత్రులు లేకపోలేదు... అలాంటిదే అభికి ఎదురైంది. దురదృష్టవంతుడు అన్నయ్యా...!" అంటూ కళ్ళు తుడుచుకుంది. ఈ రెండు సంవత్సరాలు అభి ఏం చేస్తున్నాడో తెలుసా? తనలాగా ఎవరూ చేయని తప్పుకు బలి కాకూడదని అందరిని ఒక విధంగా రిహేబిలిటేషన్ సెంటర్లో చేరి తెలియజేస్తున్నాడు. అక్కడే అమ్మకు ఏదో జరిగిందని వెలివేసిన కుటుంబం నుండి వచ్చిన వారందరినీ ఆప్యాయంగా చూసుకుంటూ ధైర్యం చెబుతున్నాడు.. నిజమే...! మీరన్నట్లు నేను అభిని పెళ్ళి చేసుకుంటే మీకందరికీ బాధే నాకు తెలుసు... కానీ మనసు అనేది పిండి మర కాదు కదా అన్నయ్యా... మొన్నటి సంఘటన నాకు జరిగివుంటే అభిలాంటి పరిస్థితి నాకు వచ్చివుంటే నా స్థానంలో వున్న అభిని వారి తల్లిదండ్రులు వారించేవారే ... కానీ? అంటూ ఇంకా చెప్పేంతలో శ్రీహరి వారిస్తూ....

"వద్దమ్మా.. నువ్వింకేమీ చెప్పొద్దు.. నాకు అర్థమయ్యింది.. నీ పెళ్ళికేం తొందరలేదు... నువ్వు కోరుకుంటున్నట్లు పిహెచ్.డి పూర్తి చేయి" అన్నాడు.

"నువ్వు ముందు అభికి ధైర్యం చెప్పు. మానసికంగా తోడుగా వుండు.... చిన్నపిల్లవి

నీకు తెలిసింది కేవలం తొందరపాటే అని అనుకున్నానే తప్ప... నీపాటి జ్ఞానం నాకు లేకపోయింది. ఇకపై నువ్వే కాదు... మన కుటుంబం మొత్తం అభికి తోడుగా వుంటుంది. హెచ్ఐవి రాగానే అది ఎయిడ్స్‌తో సమానం కాదు... ఈలోగా తన ట్రీట్‌మెంట్ ఎంతవరకు వచ్చిందో తెలుసుకుందాం... అందరం అతని పట్ల శ్రద్ధగా వుందాం..." అంటూ బయటపడ్డాడు.

***

"అభీ... నన్ను క్షమించవూ...?"

"ఊరుకో లహరీ...! నాకు తెలియదా నువ్వు ఎలాంటి దానివో పైగా ఆడపిల్లవి... నీపై తల్లిదండ్రుల వత్తిడి ఎంతగా వుంటుందో నాకు అర్థం కానిది కాదు... నన్ను నువ్వే మొదట ప్రేమించావని చెప్పావు గుర్తుందా...?"

"నాకు తెలిసి స్త్రీ ఎంతగానో ప్రేమిస్తే తప్ప తనంతట తానుగా బయటకు చెప్పదు. అలాంటిది... నేను ఎలా నీ గురించి వేరేవిధంగా ఆలోచిస్తానని అనుకున్నావు?"

"థ్యాంక్స్ అభీ...!"

"ఇదిగో... ఈ థ్యాంక్స్‌లు, సారీలు ప్రేమకు నిషిద్ధం. అంటూ నువ్వే అనేదానివిగా.. నిజంగా నేను ఇప్పుడు ఏమీ బాధపడటం లేదు. పదిమందిని బాధపడకుండా చేస్తున్నాను... లహరీ...! సృష్టిలో పుట్టిన ప్రతి మనిషి చనిపోవాల్సిందే.. కాకుంటే కాస్త ముందు... వెనుకే... అంతే!" అనేసరికి లహరికి కన్నీళ్ళు ఆగలేదు...

"ఊరుకో... లహరీ...! ఏడవటం... నవ్వటం.. అనేది అందరూ చేస్తారు. ఆలోచించడం కొందరే చేస్తారు. ఆ కోవలోకి మనం వెళ్ళి తెలియని అమాయక ప్రజలకు తెలియజేద్దాం. నలుగురికి సహాయపడదాం. ఎవ్వరినీ ఈ ఉచ్చులోకి రానీయకుండా కాపాడుకుందాం" అంటూ చెయ్యి చాపాడు. ఆ చేతిలో సంతోషంగా చెయ్యి వేస్తూ ముందుకు వెళ్ళడానికి సంసిద్ధమయియింది లహరి. తమద్వారా కొంతమందయినా బయటపడతారనే తృప్తితో.. సాధిస్తామనే నమ్మకంతో తమ వంతు కర్తవ్యం తాము చేద్దామన్న నిర్ణయంతో.

***

దాదాపు పదేళ్ళు గడిచాయి. లహరికి తనను అర్థం చేసుకున్న తండ్రి తెచ్చిన వ్యక్తితోనే వివాహం అయ్యింది. వారికి అభినయ అనే పాప కూడా. ఇప్పుడు లహరికి సమయమే వుండదు. అభినయ ఎయిడ్స్ రిహాబిలిటేషన్ సెంటర్ ద్వారా ఎందర్నో



ఆదుకుంటోంది. వ్యాధి పట్ల అందరికీ అవగాహన కలగజేస్తోంది. తన సెంటర్‌లో పేరు కింద ఆ మాటల్ని కూడా జత చేసింది.

"ఏడవటం, నవ్వటం మనుషులందరూ చేస్తారు.

ఆలోచించడం మాత్రం కొందరే చేస్తారు.

అందుకే మనం ఆలోచిద్దాం...!"

ఆ అక్షరాలలో అభిని చూసుకుంటూ తాను తమ మధ్య లేకున్నా తనలో ఉన్నట్లే భావిస్తోంది లహరి.

*(సిలికానాంధ్ర 'సుజన రంజని' వెబ్ మాగజైన్‌లో ప్రచురితం)*

# "అడ్డా"

"ఓ యాదగిరిన్నా... కూలిగిట్ల కావాల్నా" అంటూ ఒక్కరు కాదు, దాదాపు వందమంది దాకా మేస్త్రీలు చుట్టూ చేరేరు.

అరె చూప్... గింతమంది ఒకేపాలి యంబడిపడితే ఎట్లా? నాపనికి పదిమంది చాలు" అన్నాడు చేతిలో ఉన్న బీడిని గట్టిగా పీల్చివదులుతూ యాదగిరి.

ఆ మాట పూర్తయినంతనే బాలమ్మ ముందుకు దూసుకువచ్చి ఊడిపోతున్న జుట్టును గట్టిగా ముడేసుకుంటూ "అన్నా నాలుగురోజుల సంది నాకు పని దొరుకుతలే. గందుకే నేను నా చెల్లె లచ్చుమమ్మ వస్తా తీరాదూ" అనే మాటలు పూర్తి కాకుండానే.

"ఏయ్... ఏందే... నకరాలు చేస్తున్నావు? నిన్ననేగందే ఆ రాఘవన్న పిలిస్తే పోతివి శరం లేదే.... అబద్ధాలు ఆడనీకి... నీ నోట్లో మన్నుబడ" అంటూ నోట్లో వున్న కళ్ళని ఒక పక్కగా ఉమ్మింది గంగమ్మ.

"అవ్ అక్కా... నీ కాల్మోక్కుతా... నిన్న రాఘవన్న తానికి పనికిపోతే..."

"పనికి పోకుండా పండనీకి పోయినావే నీ... అంటూ బాలమ్మ జుట్టు పట్టుకొని వెనక్కి తోసింది... ముఖం వికృతంగా పెట్టి గంగమ్మ. అక్కడితో ఆగకుండా...

ఇంగో అందరూ ఇనుండ్రి... రాజమ్మ, కనకాలు, గౌరవమ్మ, అండాలు. నేను, యాదగిరి అన్న తానికి పనికి పోతున్నం. మగోల్లు సంగతి నాకెరుకలే... ఆ అన్న పిలుస్తడు.. ఆళ్ళు రాండ్రి... నా యెనకగిట్ల మళ్లీ ఎవరయినా నామింద ముచ్చట్లు పెట్టింండ్రనుకో ఆళ్ళ యిజ్జత్ దీస్తా... ఏమనుకున్నారో... అంటూ రుసరుసలాడుతూ ఏమాత్రం స్త్రీత్వం లేని స్త్రీలా పలుగు పార, గంప చేతపట్టుకుని ముందుకు నడిచింది గంగమ్మ.



"చూస్తివాన్నా... ఎట్ల జబర్దస్త్ చేస్తుందో... నన్ను ఏడికిబోయినా బతకనిస్త లేదన్నా..." అంటూ అక్కడే కూర్చని బీడి తాగుతున్న రాఘవయ్యకు తెలుపుకుంది జుట్టును విప్పి మరోసారి ముడి వేసికొని బాలమ్మ.

"ఊకో... బాలమ్మా... గంగమ్మ తీరు ఎవురికి తెలవదు... ఇయాళ కొత్తనా ఏంది... నీకు ఎన్నిసార్లు చెప్పినా గంగమ్మ ఉన్న కాడ పనికి రావద్దని" అంటూ ఓదార్చాడు రాఘవయ్య.

ఏందన్నా ఇదంతా దాని అడ్డానా అన్నా... నువ్వు కూడా గట్లంటవు... నీ కండ్ల ముందే ఎట్టంటదో విన్నావా.. నిన్న నువ్వు ఆదేదో బాసాన్ల పని ఉంటే చేస్తవా అన్నవు... నాకు వీలు పడదని నే బేగివచ్చిన.. గప్పటిసంది షూరు చేసినాది నిన్ను రాఘవన్న తోలుకోబోయిందుగా అని ఎంత అన్యాయం సూసినావాన్నా..."

"గప్పుడే చెప్పేదుండే బాలమ్మా... గిట్ల అన్న నాకు బాసాన్లపనికి తోలుకో బోయిండని"

చెప్పినా... అప్పుడు ఇన్నది.. ఇయాల మళ్ళా షురూ చేసింది. నాగాని కోపం ఎల్లాల మా మాయనకు చెప్పి దాన్ని బట్టలూడదీసి తంతా లం..." అంది కోపంగా బాలమ్మ.

ఇవన్నీ అలవాటుపడ్డ రాఘవయ్య... సమాధానం చెప్పకుండా అయిపోతున్న బీడికేసి చూస్తూ... మళ్ళీ చేతిలో ఇంకోటి లేకపోవడంతో తన్మయత్వంతో పీల్చు కుంటున్నాడు.

***

"గయ్యో... బాలమ్మా... గాపోరిని పట్టుకోమ్మా... కూసింత బువ్వ తినమంటే ఉరుకుతున్నది..." అంటూ రాజమ్మ, బాలమ్మ కూర్చున్న చోటకు చేతిలో అన్నం గిన్నె పట్టుకొని మారాం చేస్తూ పారిపోతున్న కన్నకూతురి కేసి మురిపెంగా చూస్తూ వచ్చింది.

"ఏంది ఇంటికాద తిన్లే... అవుగాని రాజమ్మా.... గింత ఎండలో పోరిని తోలు కొచ్చినావు... ఇంటికాడ నీ అత్తమ్మ ఉందిగా... ఆడ్నే ఉంచకపోయినవు" అంది పారిపోతున్న పిల్లను చేతపట్టుకొని బాలమ్మ... రాజమ్మను ఆరా తీస్తూ.

"ఆ! నా మొగానికి గదొక్కటే తక్కువ... గా ముసల్ది చిన్నపని చేస్తదా? తింటది, పండతది. మధ్యలో ఏమన్నా తక్కువయిందనుకో ఎంబడే నా మగనికి చెప్తది. ఆనాకొడుకు నన్ను తంతడు. గా మొన్న గిట్లనే.. నల్లకాడికి పోయినా... సన్నగా రాబట్టే నల్ల. ఇగ అందరూ పట్టిరి. నా కాడికి వచ్చినాది రెండు బిందెలు పట్టి బయటపడినా... ఇక నా మొగనికి చెప్తుంది... చూసినవా బిడ్డా... రెండు బిందెల నీళ్ళ కొరకు గింత సేపా కొడకా...

ఏడ ముచ్చట్లు పెట్టిందో ఏమో అన్నది... ఇగ నా మొగుడు మస్తు తన్నిండు నన్ను... దాని పీనిగెల్ల అది సావదు.. నా పానం తీయది. అక్కా .. నా బాధ ఎవరు తీరుస్తరు. అందుకే నాపని నేనే సేస్కుంటా... పొద్దుగాల్ల లేచిన... గంత బువ్వ వండి... కోడిగుడ్డు వండి... ఆమెకు, నా మొగనికి ఆడపెట్టినా నేను టిఫిన్‌లో గింత పెట్టుకొన్నా... ఉరికి వచ్చినా... రాక్కా... తిందువు... ఇయాల కూర మంచిగా వచ్చింది" అంటూ కాస్త అన్నం దానిపై కాస్త కూర వేసి బాలమ్మకు ఇచ్చింది ప్రేమగా రాజమ్మ.

అప్పటిదాకా ఎంతో బాధపడిన బాలమ్మ... ఆ అన్నం చూసేసరికి ఎక్కడలేని ఓపిక వచ్చింది... తినడానికి ఉపక్రమించింది.

"ఓ... సీతమ్మక్కా... ఎట్లున్నవు?" అడిగింది రాజమ్మ దిగులుగా కూర్చొన్న సీతమ్మతో...

"మంచిగున్నా... మొన్నటిసంది నా పానం మంచిగలే... నిన్నటిసంది బువ్వలే... గంజి కాచి పొరగాళ్ళకు పెట్టినా... కట్టుపడంది పైసలు పడకెళ్ళినించి వస్తయి? అయినా ఇయాల రేపు కట్టం చేస్తామన్నా ఏడ దొరుకుతలే... నాకయితే బతకబద్దుయితలే రాజమ్మా... ఆకలి... ఆకలి... అంటూ పొరగాళ్ళు... తాగొచ్చి లొల్లి చేసే మగడు... ఛీ ఏమిటికి బతుకాల్నో తెలుస్తలే...." అంటూ కళ్ళు ఒత్తుకొంది సీతమ్మ.

"అయ్యో... సీతమ్మక్కా... ఊకోరాదూ... మనసంటోళ్ళు చస్తా బతకాలె... ఫికరు పడకక్కా... అన్నీ మంచిగయితయి. గాడ్నే మా ఇల్లు... పోరగాళ్ళను మా ఇంటికి తోలరాదూ... బువ్వ పెట్టేదాన్నిగా అక్కా...." అంది ఓదార్చుతూ రాణెమ్మ...

"ఒక్కనాటిదా రాణెమ్మా ఈ బాధ... నేను సచ్చేటంత వరకూ నా ఎంబడే ఉంటది... జర నీతాన నీళ్ళు ఉంటే ఇయ్యరాదూ! గొంతెండకపోతుంది... పొద్దుగాల మా ఇంటి కాడుంటే డాక్టర్ సాబు గోలీనిచ్చిండు.. జరం తక్కువయింది... ఆకలి షురూ అయ్యింది...." అంది గొంతుపై అరచేతితో రుద్దుకుంటూ... సీతమ్మ.

అయ్యో... అక్కా! ఇగో పట్లు నా తన బ్రెడ్ ఉన్నది. తిను" అంటూ చేతి సంచిలో ఉన్న కొన్ని బ్రెడ్ ముక్కల్లోంచి నాలుగు ముక్కలు తీసి ఇచ్చింది రాణెమ్మ.

***

ఓ... సీతమ్మక్కా... రాణెమ్మా, బాలమ్మా, రాజమ్మ, రాఘవన్నా, గౌరమ్మా... మన బతుకులు బుగ్గి అయినాయి... మన గుడిసెలు మంటలొచ్చినాయింట... రాండ్రి... అందరూ బేగిరాండ్రి... ఓ... దేవుడో ... మాకింత అన్యాయం చేసినావేందిరో... అంటూ గుండెలు బాదుకుంటూ నెత్తి బాదుకుంటూ దిక్కులు పిక్కటిల్లేలా రోదనలతో ఆ ప్రాంతం అంతా పరుగులు దీశారు. ఎవరికి తోచినట్లు వాళ్లు...



అందరూ వెళ్ళేసరికే మంటలు ఆకాశానికి ఎగిసాయి... ఆ ప్రాంతం అంతా కెమెరాల్తోనూ, ప్రెస్ వాళ్ళతోనూ నిండిపోయింది. బిడ్డల్ని కోల్పోయిన తల్లులూ, తల్లుల్ని పోగొట్టుకున్న పిల్లలూ వారికి సంబంధించి వారికై వెదుకులాటలు, అంత బాధలోనూ వారి ముందు కొచ్చి ప్రశ్నలు అడుగుతున్న టీవీ ఛానల్స్‌కు వారి బాధలు వినిపిస్తున్న వైనంతో ఆ ప్రాంతం అంతా రోదనలతోనూ... నిండిపోయింది.

బాలమ్మక్కా... ఇగో ఆ గంగమ్మ ఇంటిలో పోరగాళ్ళు, కాళ్ళులేని బిడ్డ, పోరి... లోపల్నే ఉండిపోయినరే...! వాళ్లాయన తాగనీకి బయటకు పోయిండో ఏమో... అనే మాట పూర్తి కాకుండానే... బాలమ్మ... ఒక్క ఉదుటున లోనకు బయలుదేరింది.

అయ్యో... నువ్వెందుకు పోయినావక్కా. మంటలు నీ మీద పడతాయి...రా... ఓ రాఘవన్నా... శివ్వన్నా... అందరూ రాండ్రి... ఆ బాలమ్మలోన కెళ్లింది...జర ఈడ్చక రండ్రి. అయ్యో...! ఎంత పనయిందన్నా...! అని పెద్దపెట్టున పెట్టే అరుపులకు అందరూ గంగమ్మ గుడిసె దగ్గరకు చేరారు. కాస్సేపట్లో ఆ చేతిలో ఒక బిడ్డ... మరో చేతిలో పసిపిల్లతో  జుట్టంతా కాలిపోగా ముఖం అంతా కందిపోగా... బయటకు వచ్చింది బాలమ్మ... ఆ మరు నిమిషంలో కళ్ళు తిరిగి పడిపోయింది. కొందరు పసిపిల్లలను సేదదీర్చుతుండగా మరికొందరు బాలమ్మ దగ్గర చేరి శుశ్రూష చేస్తున్నారు. అంతలో అంబులెన్స్ బాలమ్మ లాంటి వారందర్నీ వ్యాను ఎక్కించడం, గాంధీ హాస్పిటల్‌కు చేర్చడం నిమిషాలలో జరిగిపోయింది.

శరీరాన్ని ఆలసటకు గురిచేసి... రాత్రనక, పగలనక కాయకష్టం చేసి, పిల్ల పెళ్ళి చేయాలని కొందరు, తమ కొడుకుల్ని తమలా కాకుండా చదివించాలని మరికొందరు దాచుకున్న కాస్త డబ్బంతా ఎలా దాచుకోవాలో తెలియనివారు తమ ఇంట్లో చీరల కింద, ట్రంకు పెట్టెల్లోనూ దాచుకున్నదంతా బూడిదపాలయింది. ఒక పక్క ఒక్కొక్కళ్ళకు పక్కా ఇళ్ళు నిర్మిస్తామని, మరో పక్క చనిపోయిన పెద్దవారికి లక్ష రూపాయలు, పిల్లలకు 25 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తాని తమ పార్టీ నిలబెట్టుకోవాలనే నాయకుల తాపత్రయం, ప్రజల్ని మోసగిస్తున్నారంటూ ప్రతిపక్ష నాయకుల నిందారోపణలు యధావిధిగా జరుగుతున్నాయి.

విషయం విన్న తన ఇల్లు, పిల్లలు ఏమయిపోయారోనని పరుగుతో ఆ రోజు కూలి డబ్బుతో హుటాహుటిన వచ్చింది గంగమ్మ.

గంగమ్మ రాకను గమనించిన రాఘవులు జరిగిందంతా వివరించి...

బాధపడద్దని ఓదార్చేడు. బిడ్డల్ని కాపాడాలనే తాపత్రయంలో బాలమ్మ తన ప్రాణాల్ని

సైతం లెక్కచేయని తీరుకు హృదయం బరువెక్కిపోయింది. ఇన్నాళ్ళు... ఈ బాలమ్మని బిడ్డలు లేని గొడ్రాలంటూ తను తిట్టిపోసింది. తిండి, డబ్బు ఏమాత్రం అందకుండా చేసింది... అని ఆలోచనలో గుండె భారమవ్వగా... ఈశ్వరమ్మక్కా!... మనం బేగి దావఖానకు పోదాం లేంద్రి" అంటూ దాదాపు పదిమంది దాకా చేరి బయలుదేరారు.

ఒకవైపు నేల మీద ఒక మూలగా గంగమ్మ పిల్లలు నిద్రపోవటం చూసి... ఒక పెట్టున ఏడుపు లంకించుకుంది.

ప్రాణాపాయం గడిచినందుకు వేయి దేవుళ్ళకు మొక్కుకుంది. తన తలనీలాలిస్తానని ఆ వెంకన్నకు మొక్కుకుంది. వారిని దాటుతుండగానే బట్టలు సగం కాలి, జుట్టు సగం కాలి అక్కడక్కడా కాలిన మచ్చలతో నిద్రపోతున్నబాలమ్మను చూసింది. తాను చేసిన పాపం ముందు బాలమ్మ మంచితనం ఎంతో ఎత్తులో ఉన్నట్లు అనిపించింది. దగ్గరగా చేరి... "బాలమ్మా, ఎట్లుందే" అంది తలప చేయివేస్తూ కళ్ళలో నీళ్ళు ... అంత బాధలోనూ నీళ్ళు నిండుకోగా.

మాగన్నుగ కళ్ళు తెరచిన బాలమ్మ కళ్ళలో నీళ్ళు... అంత బాధలోనూ పోరగాళ్ళు ఎట్టున్నారక్కా" అంది నీరసంగా.

వాళ్ళకేందే, నవ్వు పానాల్ని సైతం లెక్కజేయకుండా కాపాడితివి ఆళ్ళు నీ బిడ్డలే. ఇయ్యాల్టి నుంచి నీ బిడ్డలు..." అంది కళ్ళు తడుచుకుంటూ గంగమ్మ.

బాలమ్మకు ఒంటిమీద ఎన్ని గాయాలున్నా అవి బాధ పెట్టడం లేదు. రేపటి నుండా నా బతుకెలా? అని భయం కల్గటం లేదు. వేడి టీ తెప్పించి అందులో బన్ను ముక్కలు ముంచి తన బిడ్డలతో సమంగా తినిపిస్తున్న గంగమ్మ తీరుతో హృదయం తేలికయింది. నీకంటే నేను గొప్ప, నన్ను మించిన వాళ్ళు లేరు అనే గంగమ్మ శాంతం కొండంత ధైర్యాన్ని తెప్పిస్తోంది బాలమ్మకు.

అయ్యో... బాలమ్మకు రేపటి నుండి అడ్డాకు ఎట్లొస్తాది... గింతకుముందే శ్రీధర్ సారు పనికి పిలిచిండు... అంటూ కళ్ళు తుడుచుకుంటూ చెప్పిన గౌరమ్మను వారిస్తూ... బాలమ్మ ఇక ఏడికి రాదు బిడ్డా.... నే కష్టం చేసి సూసుకుంటా....

పానం మంచిగయ్యేదాకా బాలమ్మకు నేనుంటా.. అనే మాటలు కొత్త ప్రాణం పోశాయి బాలమ్మకు.

ఆ ప్రాంతం... డబ్బు పోగొట్టుకున్నా, నిలువనీడ పోగొట్టుకున్నా, ఆత్మీయులను గెలుచుకున్నారు. ఒకరికోసం మరొకర్ని సంపాదించుకున్నారు. అందరూ ఒకే కుటుంబంలా కలిసిపోయి సమష్టిగా బతుకుతున్నారు. వారికి భవనాలు లేవు. డబ్బు లేదు. ఒకరి గుండెల్లో ఒకరు చోటు సంపాదించుకున్నారు. మనిషి విలువను కాపాడుకుంటున్నారు. వారిని ఆదుకుంటామనే నాయకులూ, ఇళ్ళు నిర్మిస్తామనే హామీల్తో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే ఉన్నారు. అది వారి దుస్థితి. ఏమి లేకున్నా... ఇది వీరి గ్రహస్తితి... "అడ్డా"లో ఆత్మీయత, ఉచ్ఛస్థితిలో అనురాగం కలగలిపిన బంధం... పేదవారికిది ఆనవాలు. ఇవి చాలేమో మనిషి జీవితానికి.....

*("అల" మాసపత్రిక కథల పోటీలలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ)*

# నిర్ణయం

సమయం తెల్లవారుఝూమున నాలుగు గంటలు. ఇంకా ఏ ప్రాణి నిద్ర లేవలేదు. ప్రకృతి కూడా ఎంతో ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటోంది. రోడ్లన్నీ పగలంతా వాహనాల తొక్కిడికి అలసిపోయాయేమో... గాఢంగా నిద్రపోతూ వుండుండి చిన్న చిన్న అలికిడికి ఉలిక్కిపడి నిద్ర లేస్తున్నాయి. సూర్యకాంతి తాలూకు నులివెచ్చని కిరణాల తాకిడి వలనేమో పక్షులన్నీ తమ విధినిర్వహణకై ఏమాత్రం విసుగు లేకుండా బయలుదేరే తీరు క్రమశిక్షణంతా వీటివరకే పరిమితమయిందా అనిపిస్తోంది. వీధిలో ఒకటీ అరా చప్పుళ్ళు, సన్నగా ఆకుల కదలికలు లాంటి ప్రశాంతమయిన వాతావరణంలో వున్న ఆదినారాయణ తనకున్న చిన్న ఇంటి ముందుగదిలో వాలుకుర్చీ వేసుకుని కూర్చున్నా, మనసు మాత్రం ఎంతో వేడిగా, బాధగా వుంది..., ప్రపంచంలో ఎవరికీ రాని కష్టం తనకే వచ్చిన రీతిలో ఆదినారాయణ భార్య సావిత్రమ్మ వుంది. వుండి వుండి వారి కన్నీటిని ఆపే ప్రయత్నం కూడా చేసే స్థితిలో లేరు. ఒకరినొకరు ఓదార్చుకునే స్థితిలో అంతకన్నా లేరు. అసలు ఈ బాధ ఎవరూ తీర్చలేరు. అంతో...,

"ఒరేయ్..., నారాయణా! కాస్త మంచినీళ్ళయినా తాగరా... అంటూ తోబుట్టువు చెబుతూనే వున్నా పలకటం లేదు. నిజమే అది పలికే స్థితి కాదు... చెట్టంత కొడుకు యాక్సిడెంట్‌లో పోవడం అంటే తల్లి తండ్రులకు ఇంతకంటే శిక్ష వేరే వుంటుందా? అంటూ ఇంకా తన ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకున్న ఆదినారాయణ తల్లి కోడల్ని పట్టుకుని వల వలా ఏడుస్తున్నా ఎవరూ తీర్చలేని ఆవేదన అది. ఇంకాస్సేపటిలో కొడుకు నిర్జీవ మయిన శరీరం ఇంటికి రావటం తలుచుకుంటూంటే తల్లి పడే ఆవేదనకు భాష లేదు.



తెలిపే ఆవేదనకు అక్షరాలు లేవు. బహుశా వారి బాధను తీర్చడం ఆ సృష్టికర్త వల్ల కూడా కాదేమో.

అన్నం తిననంటే ఆటలతో పాటలతో మురిపించి అన్నం తినిపించిన ఆ కన్న తల్లి చేతులు, బడికి వెళ్లనంటూ మారాం చేస్తుంటే భయపెట్టో, బతిమాలి మరీ కొడుకు తన కన్నా ఎంతో ఎదగాలని తనకున్నా లేకున్నా ఉన్నదానిలో వున్నదంతా పెట్టి చదివించిన ఆ తండ్రి హృదయం.., నిన్నటిదాకా కొడుకు ప్రయోజకుడయ్యాడని, రేపో మాపో తనను ఆదుకుంటాడని ఆశిస్తున్న ఆ తల్లి తండ్రులకు నేడు నిర్జీవంగా కన్నబిడ్డ ఒక్క శరీరంతో మాత్రమే రావడం ఎంత దారుణం? అక్కడి వాతావరణం అంతా ఒక్కసారిగా ఏడుపులతో మర్మోగిపోయింది..., ఎంత ఏడిస్తే ఏం లాభం..., పోయిన ప్రాణం తిరిగిరాదుకదా అని అందరికీ తెలుసు..., కానీ పేగు తెంచుకు పుట్టిన బిడ్డ తన ముందే ఇలా తనను వదిలి వెళ్ళిపోవటం మూలంగా కలిగే బాధ ఎన్ని కన్నీటిబొట్టు రాల్చితే తెలుస్తుంది? ఎన్ని జన్మలు ఎత్తితే అర్థం అవుతుంది? కడివెడు కన్నీళ్ళు కార్చినా ఆ కన్నీట తడి పోయిన ఆ శరీరానికి తగలదన్న విషయం ఆ దంపతులుకు తెలియదా? తెలిసినా వస్తున్న ఆ కన్నీరు వాస్తవాలను గమనించే పరిస్థితిలో లేవు కదా!! ఇలా ఎన్ని అనుకున్నా, జరగాల్సిన పనులు చేయడంలో ఆ సృష్టికర్త నిర్దాక్షిణ్యంగానే వుంటాడని ఇలాంటపుడే అనిపిస్తుంది.

***

అంతా నిశ్శబ్దం... పలకరింపులూ, పరామర్శలూ, నిటూర్పులూ, జాలిగొలిపేవారూ ఒక్కొక్కరుగా దూరం అవుతున్నారు. ఆ దంపతులకు దుఃఖం మరింతగా చేరువ అవుతోంది. ఆ కొడుకు దూరం అయి మరింత వారి హృదయాలకు దగ్గరయ్యాడు. కానీ వీరిరువురూ బతికున్న శవాలుగా మిగిలిపోయారు. అంతలో...

"నారాయణ" అంటూ మూర్తి పిలుపు...,

నారాయణ సమాధానం చెప్పే పరిస్థితిలో లేదు. అయినా తాను కృంగిపోయి భార్య సావిత్రమ్మను మరింత బాధకు దగ్గరగా చేయాలేమోనని కాస్త ధైర్యం నటిస్తూ..

"రావోయ్ మూర్తీ. ఇదేనా రావడం... అందరూ బాగున్నారా? అంటూ పలకరించాడు.

"ఏ బాగులే నారాయణా... నిన్నీ స్థితిలో వుంచిన ఆ భగవంతుడ్ని అనాలని వుంది. అయినా నువ్వేం పాపం చేసావురా! ఇంత శిక్షను అనుభవిస్తున్నావు? అని పూర్తి కాకుండానే ఒక చేత్తో నోటిని మూస్తూ... భార్య సావిత్రి రావడాన్ని సైగతో చూపి వారించాడు.

శోకాన్ని మాత్రమే తాగుతున్న సావిత్రిని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది.

మూర్తికి... ఎప్పుడొచ్చినా నిండుగా పలకరించి తన కొడుక్కు ఏదయినా సబభందం చూడమంటూ చెప్పే సావిత్రి ఈ రోజు ఇలా శోకదేవతలా నిలబడటం చూస్తుంటే ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వుండిపోయాడు. పలకరిస్తే మరింత బాధ తప్ప ఏముంటుందని అనుకున్నాడేమో... అలా చూస్తూ వుండిపోయాడు. జీవితం మరీ ఇంతలా వుంటుందంటే మొదటిసారిగా మూర్తికి భయం వేస్తోంది... మెల్లగా ఆ భయంకరమయిన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ..., ఏదో మరిచిపోయినట్లు నటిస్తూ నారాయణే ముందుగా "ఏం మూర్తీ...మన భాస్కర్‌కు ఈ ఏడాది ఆ ప్రమోషన్ ఏదో రావాలని అన్నావు కదా... అది వచ్చిందా" అంటూ అడిగాడు ఎంతో సర్వసాధారణంగా...,

"ఆ వచ్చింది..., అయినా ఏం వచ్చినా ఏముందిలే.., "అన్నాడు ఎంతో బాధగా నుదులిపై చేతిని రుద్దుకుంటూ..., మూర్తీ...,

"అదేం..., వాడికి ప్రమోషన్ వస్తేగానీ మీ కష్టాలు తీరవు అన్నావుగా.., మరి ఈ రోజేంటి? ఇలా? "అడిగాడు నవ్వుతూ..., నారాయణ..,

నిజమే..., కానీ..., ఎన్నో మనం అనుకుంటాం. అన్నీ జరుగుతున్నాయా? అబ్బాయికి ప్రమోషన్ వస్తే క్వార్టర్స్ వస్తాయి... దాంతో మనకు అద్దె కట్టే అవసరం వుండదని ఎంతో అనుకున్నానురా... కానీ...," అంటూ ఆగాడు ఏదో చెప్పలేక పోతున్నట్టు...

విషయం అర్థం అయ్యి లేనట్లుండే సరికి నారాయణకు ఆశ్చర్యం వేసి "అందేంట్రా.... అలా నాన్చుతావు అసలు విషయం ఏంటో చెప్పు..., ఇందులో నా దగ్గర దాచాల్సినదేముంది? అంటూ రెట్టించాడు.. నారాయణ చనువుగా భుజంపై చెయ్యివేస్తూ....

నిజమే నీ దగ్గర దాచేదేముంది? నా కొడుకు ప్రదీప్ మొన్నటిదాకా నన్ను ప్రమోషన్ వస్తే నాకు ఎలా విశ్రాంతి నిస్తాడో చెప్పి మాకు ఎంతో ఆశ కల్పించాడు. కానీ నిన్న వాడి మాటల్లో తెలిసిందేమింటే...వాడి భార్య, అంటే నా కోడలికి, నేను కానీ మీ చెల్లెలు కస్తూరికి రావడం ఇష్టం లేదట..., అందుకని ఎక్కడున్నా వాడు సగం అద్దె కడతాడట. అదీ వాడి భార్యకు తెలియకుండా... ఆ మాట వినేసరికి కస్తూరికి కంటి మీద కునుకు లేదు. కనిపెంచి పెద్దచేసిన వాడికి, మనకంటే నిన్న వచ్చిన కోడలు ఎక్కువైపోయిందా అని ఒకటే ఏడుపు. "ఏం చేద్దాం వాడు బాగుండాలనే కదా పెళ్లి చేసింది. ఒకవేళ వాళ్లు ఎలా వున్నా, మనం చూస్తూ సంతోషించాలే తప్ప ఎంత ఏడ్చినా ఏం లాభమే అని ఎంతగా ఓదార్చినా తను వినటం లేదు. అలాగని ఏదయినా అంటే మిమ్మల్ని మేం కనమన్నామా అనే రోజులివి... ఏదో వాడి వుద్దేశం వాడు చెప్పాడు. నా కంటావా ఏదో



అయిదువేలు దాకా పెన్షన్ వస్తుంది. ఏదో తింటాం, ఏదో బతుకుతాం, అంతే" అనే మాట పూర్తి కాకుండానే ఆశ్చర్యంగా... సావిత్రి కల్పించుకుని...

"అదేంటి అన్నయ్య గారూ, రేపేదయినా ఒంట్లో బాగోకపోతే ఎవరు చూస్తారు? ఈ వయసులో మిమ్మల్ని ఒంటరిగా వుంచటం అంత న్యాయం కాదు... పైగా కస్తూరికి ఒళ్ళు అంత మంచిది కాదు తను పని చేసుకోలేదు. పాపం... ఎంతగా బాధ పడుతుందో అయినా కస్తూరి అన్నదాంట్లో తప్పేముందని? కొడుకు తనని చూస్తాడని ఎంతో ఆశలు పెట్టుకుంటారు కదా... ఎవరైనా..., ఈ కాలం పిల్లల్ని నమ్మడం అంటే కష్టమే... అంది యధాలాపంగా సావిత్రి.

ఆ మాటలు భర్త నారాయణ, మూర్తి ఇద్దరూ ఆశ్చర్యపడినా పైకి కనపడనీయలేదో, సావిత్రి తన ధోరణిలో ఏదో చెప్పుకుంటూ పోతుంది. పిల్లలూ వారి తీరును గూర్చి బాధపడుతూనే వుంది. మెల్లగా ఆ ధోరణిలో మాట కలుపుతూ... నారాయణ కూడ మరింతగా మూర్తి కూతురు గూర్చి ఆరా తీయటం మొదలెట్టాడు. "మరీ మధ్య ఎలా వుంది?" అంటూ...

"ఏం పద్మ లేరా ఎంతైనా వేరింటి కోడలు, ఆడపిల్లలు ఎంత చదువుకున్నా, ఎంతగా పుట్టింటి ప్రేమను పొందినా, పెళ్ళయితే మాత్రం పూర్తిగా ఆ ఇంటి పిల్లలు అయిపోతారనిపించినప్పుడల్లా ఆడపిల్లల మీద ఆశలు పెట్టుకోవాలంటే కాస్త భయంగా వుంటుంది" అన్నాడు నిరుత్సాహంగా.

ఆ మాటలు విన్న నారాయణ "అదేంటి, పద్మ అలాంటిది కాదు. మొన్ననే నాకు ఫోను చేసింది." అంకుల్! మా వారికి ఈ మధ్యే ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయింది... నువ్వు ఇక్కడికి వస్తే తప్పకుండా మా ఇంట్లోనే దిగాలని కూడా చెప్పింది" అన్నాడు.

"నిజమే, అంటుంది ఎందుకు అనదు? నువ్వు నాన్నవి కావుగా... అంకుల్ అయి తప్పించుకున్నావ్... ఇంతకీ వాళ్ళాయనకు ట్రాన్స్‌ఫర్ ఎలా అయిందో కూడా చెప్పిందా?" అన్నాడు కాస్త చిరాగ్గా మూర్తి.

"ఏమయిందిరా, ఇంతకీ ఏం జరిగిందో చెప్పకుండా, నువ్వలా అనడం ఏమీ బాగోలేదు" అన్నాడు నారాయణ పక్కనే వున్న పేపరుతో విసురుకుంటూ.

"ఏముంది, నీకు తెలుసు కదా నా అల్లుడి అమ్మ నాన్న ఇద్దరూ అక్కడే వుంటా రని... అక్కడికి వెళ్ళిపోవాలని అతనికి వుందో లేదు తెలియదు కానీ, మా పద్మకు మాత్రం అక్కడకు వెళ్లిపోవాలని అనిపించిందేమో తన మాటలుగానే వాళ్ళ అమ్మతోనే అందట... కానీఅది బయటపడనీయకు... వాళ్లాయనకు తన అమ్మ నాన్న దగ్గరకు వెళ్లాలని వుందని వున్న పళాన అక్కడికి ట్రాన్స్‌ఫర్ అవ్వాలంటే రెండు లక్షలయినా ఖర్చు

అవుతుందని చెప్పి నాతోనే ఆ పని చేయించుకుంది. నాకు విషయం తెలిసినా నేనేమీ అనలేదు, ఎందుకంటే అది నా కళ్ళ ముందు నుండి వెళ్ళిపోతున్నా, ఎక్కడున్నా బావుండాలనే నా ఆశ... అంతే! అయినా ఏదో బాధ కస్తూరి అన్నట్లు కనీ పెంచి పిల్లల నుంచి ఏవిధమయిన డబ్బు, ఖరీదయిన జీవితాన్ని ఎన్నడూ ఆశించము... కేవలం వారి నుంచి కాస్తంత ప్రేమ అంతే... అది కూడా స్వార్థంగా మారిపోతే ప్రపంచంలో ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది" అన్నాడు మూర్తి ఒకింత బాధ ధ్వనించే ధోరణిలో.

"ఊరుకోరా... అన్నీ నెగిటివ్‌గా తీసుకుని ఆలోచించడం నీకు అలవాటయి పోయింది. పిల్లలు ఎక్కడున్నా సుఖంగా వుంటే చాలు అంటూ ఆడపిల్ల వారి అత్తవారి పట్ల అంత శ్రద్ధ చూపుతోంది, అంటే నిజంగా అది సంతోషించదగ్గ విషయం" అన్నాడు నారాయణ.

"అది నిజమే అనుకో కానీ... నువ్వు నీకు చెట్టంతగా ఎదిగిన కొడుకును నిర్దాక్షిణ్యంగా పోగొట్టుకున్నావు. కానీ నాకు ఎవరూ లేని వాడనే అయ్యాను. ఇక నీకూ నాకూ తేడా ఏంటి చెప్పు? ఇక్కడ వుండి వుంటే వాళ్లు ఏదో వుద్ధరించే వారనే ఊహ చాలు మనల్ని జీవితాంతం సుఖంగా వుంచడానికి... కానీ నా పరిస్థితి ఏంటి చెప్పు? అందుకే పిల్లల్ని మనం కంటాం కానీ వారి తలరాతల్ని మనం కనలేం కదా...! ఏదో పని వుండి పుట్టారు. వారి పని అయిపోయింది వెళ్ళిపోయారు. అంతమాత్రాన బాధ వుందనటం లేదు. తప్పకుండా బాధ వుంటుంది. అలాగని బాధపడుతూ కూర్చుంటే వారు తిరిగిరారు కదా" అన్నాడు మూర్తి ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ.

ఆ మాటకు గుండె బరువెక్కిపోగా... నారాయణ, ఒక కంటితో తన భార్య సావిత్రిని గమనిస్తూనే వున్నాడు. తాను ఎంతో శ్రద్ధగా గమనిస్తూనే వుంది. ఏ నిమిషంలో తానెలా ప్రతిస్పందిస్తుందో అర్థం కాని పరిస్థితిలో అక్కడి వాతావరణం మార్చాలనే వుద్దేశంతో "సావిత్రీ, సరే మూర్తి ఎంతో బాధలో వున్నట్టున్నాడు, నువ్వెళ్ళి మంచి కాఫీ పట్రా" అన్నాడు నవ్వుతూ యధాలాపంగా.

మరి ఏ మంత్రం ఎలా పనిచేసిందో తెలియదు కాని మంత్రముగ్ధలా లేచి కాఫీ తెచ్చి చేతికి అందిస్తూ విచారవదనంతో వున్న మూర్తిని చూసి "ఊరుకోండి అన్నయ్య గారు... పిల్లల్ని పెంచి పెద్దవార్ని చేసి వారు బతకడానికో మార్గం చూపించారు. ఒక వేళ వాళ్ళు మిమ్మల్ని చూసుకోవడం మాట ఎలా వున్నా, వాళ్లు సంతోషంగా వుంటే చాలనుకోండి. మన బతుకు విషయం అంటారా.. అంతా పైవాడి దయ... అంతే" అంది నిర్మోహమాటంగా.



"సరే నారాయణా! నువ్వే బాధల్లో వున్నావు. అది చాలదన్నట్లు నా బాధలు కూడా నీకే చెప్పాను, ఏమీ అనుకోకురా" అన్నాడు వెళ్ళబోతూ మూర్తి.

"అంత మాటనకురా... నువ్వెంతో మంచి పనిచేశావు. నా సావిత్రి ఈ లోకంలోకి వస్తుందని కలలో కూడా అనుకోలేదురా... ఏది జరిగినా మన మంచికే జరుగుతుందని మాత్రం అనిపిస్తుంది" అన్నాడు చేయి అందిస్తూ నారాయణ.

రాత్రంతా కలత నిద్రే అయ్యింది ఆ దంపతులకు. పిల్లలు పెరిగి పెద్దవారై తనకు మిగలకుండా పోయినందుకు బాధ పడాలా లేక పిల్లలు వుండీ నిత్యం తమను బాధించే వాళ్ళుగా అయినందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితిలో వున్నారు ఇద్దరూ. కానీ ఒక్కటి మాత్రం నిజం, మనకు లేనిది వుంటే బావుండుననే కోరిక తప్పదు. వున్నా బాగోలేరనే బాధ తప్పదు. ఈ జీవితంలో ఏదోవిధంగా బాధ పడాల్సిందే అదీ తప్పదు. ఒక మిగిలింది భార్యకు భర్త, భర్తకు భార్య అంతే, వారిలో కూడా ఎవడికి ఎవరు? ఎంతవరకు నిజం? అనేది నేడు కూడా ప్రశ్నే. ఎవరు ఎలా వున్నా , లేకున్నా నారాయణకు సావిత్రి వుందనేది నిజం. అలాగే సావిత్రికి నారాయణ తోడు అనేది నిజం. అనుకున్నారేమో నిశ్చితంగా ఒకరి వంక ఒకరు చూసుకుని నిశ్చితంగా నిద్రపోయారు.

***

మరో పక్క మూర్తి పరిస్థితి కూడా అలానే వుంది. తాను మంచే చేసాడో చెడే చేసాడో అర్థం కాని పరిస్థితి. తన కొడుకులో ఎంతో ఔన్నత్యం వున్నా, మంచితనం వున్నా, వారిని ఎలా ఓదార్చాలో తెలియని స్థితిలో ఆ విధంగా చెప్పి వారిని పూరడించాలనే వుద్దేశంతో, తనలో లేని బాధల్ని చెప్పి వారి చేతనే ఓదార్చుకునే పరిస్థితి రావడం, వారిని వారి లోకంలోకి తెప్పించడం, ద్వారా తానో మంచి పని చేసానని అనుకున్నాడు మూర్తి. దాంతోపాటు తానో నిర్ణయానికి కూడా వచ్చాడు. ఒక వారంలో తల్లీ తండ్రితో క్వార్టర్స్‌లోకి మారాలనే కొడుకు ఆలోచనను పూర్తిగా తీసేయాలని కూడా నిర్ణయించుకున్నాడు. కన్నవాడు కొడుకైనా, కూతురైనా వారిలో ఏమాత్రమయినా మంచితనం వుంటే చాలు... ఆ మంచితనం తన కొడుకులో ఉంది. ఉన్నంతవరకూ ఆ దంపతులను అప్పుడప్పుడు పలకరిస్తుంటే చాలు... ఏ క్షణమయినా ఏమయిపోయినా సరే అనుకున్నాడేమో..., మూర్తి నిశ్చింతగా నిద్రపోయాడు.

***("తేజ" పత్రికలో ఈవారం కథగా ప్రచురితం- ఫిబ్రవరి 22, 2008)***

# సూర్యోదయం

రోడ్లన్నీ తడిసి ముద్దయ్యాయి... అనే కంటే నీళ్ళలో మునిగి వున్నాయి అంటే సరిపోతుందేమో... ఇంకా రెండు రోజులు అంటే 48 గంటలు వర్షం కొనసాగవచ్చనే వార్తలు... కరెంటు లేదు... పిలిస్తే పలికే వారు లేరు. వాతావరణం పగలో రాత్రో తెలియనట్లుంది. రాములమ్మ తనకున్న ఇద్దరాడపిల్లల్ని దగ్గరగా కూర్చోపెట్టుకుని... కాస్తయినా తెరిపి ఇస్తే బావుండు... పనిలోకి వెళ్ళొచ్చు. వెళితే కాస్త తిండయినా దొరుకుతుందని ఆశగా ఆకాశం వేపు చూస్తోంది.

"అమ్మా! ఆకలేస్తోందమ్మా" అనే బిడ్డల ఆక్రందన వింటూంటే కడుపులో తిప్పు తున్నట్లుంది. ఏం చేయాలి? ఎక్కడ్నుంచి తేవాలి? ఒక పక్క తనకూ ఆకలేస్తోంది. ఎలా? అర్థం కావటం లేదు రాములమ్మ, అంతలో...

"ఓ రాములమ్మో... ఇదిగో అక్కడ మనబోటి వాళ్ళకు అన్నం ఇస్తున్నారు. వెళదాం పద" అన్న మాటలు వినబడ్డాయి. ఆ మాటలు చెవుల్లో అమృతం పోసినట్లయింది. వెంటనే లేచి "ఇగో లచ్మీ, చెల్లెను భద్రంగా చూసుకో, నే వెళ్ళి.. ఆ పొట్లాలు తెస్తా... ఇక్కడ్నించి కదలకండి" అంటూ ఇద్దర్నీ కాస్త ఎత్తులో ఉన్న బల్లపై కూర్చోబెట్టి బయలుదేరింది కూడా విడిగా రాములమ్మ.

అక్కడ వందలూ వేలు మీద మనుషులు ఆహారపొట్లాలపై దాదాపు దాడి చేస్తున్నట్లే ఉంది. అయినా ఆరాటం... ఒక్క పొట్లమయినా తనకందుతుందనే ఆశ... పిచ్చినమ్మకంతో ముందుకురికింది రాములమ్మ. "ఏయ్ లైన్లో నిలుచోండమ్మా చెబుతుంటే నీక్కాదూ..." అనే అదిరింపు ఒకవైపు.



"ఇందాకట్నించి మేము లైన్లో నిలబడితే ఇప్పుడొచ్చి ఎవరో అది లోపలికెళ్ళింది? దాన్ని లాగి బయట పడెయ్యండి" అంటూ ఒక వైపు నుంచి సీతమ్మ అరుపు.

"అమ్మా... ఊరుకోమ్మ. పిల్లలు ఆకలితో ఉన్నారమ్మా" అంఊట రాములమ్మ అభ్యర్థన.

"అంటే మాకు లేరా పిల్లలు" అంటూ ఒకళ్ళపై ఒకళ్ళు అజమాయిషీలు... ఒక పక్క ఆకలి, మరో పక్క పోరాటం. రెంటికిఆ బాగా పొత్తు కుదిరిందేమో. యుద్ధం చేస్తున్నారు. దాదాపు రెండు గంటలు హోరాహోరీ పోరాటం. అయినా రాములమ్మకు ఒక్క ప్యాకట్టు కూడా దక్కలేదు. పైగా కళ్ళు తిరుగుతున్నాయి. మధ్యలో ఎవరో మంత్రి వచ్చారట. రండి మన గోడు చెప్పుకుందాం.. అనే మాటలు వినబడుతున్నాయి. పరుగులు, ఉరుకులు, అప్పటికి ఆ మంత్రి వచ్చి తననేదో ఉద్ధరిస్తారనే ఆశ... తప్పదు... ఈ ప్రయత్నం అనుకుంటూ మెల్లగా ముందుకు కదిలింది మంత్రముగ్ధలా రాములమ్మ.

నలిగీ నలగని దుస్తులతో హెలికాప్టర్ నుండి దిగాడు మంత్రి. వెంటనే చేతికి మైకు... "ఇదిగో మీ అందరికీ పునరావాసం కల్పిస్తాం. ఇళ్ళు పోయిన వాళ్ళకు పక్కా ఇళ్ళు కట్టిస్తాం. ఇంట్లో ఎవరైనా మీ ఆత్మీయులు పోతే ఒక్కో మనిషికి పదివేలు అందజేస్తాం" అనే వాగ్దానాల వర్షం... ఇదివరకు పడిన వర్షం కంటే వేగంగా పడుతోంది.

"అయ్యా సారూ! మా బతుకులు చూడండి సారూ" అనే ఒక మహిళ ఆక్రందన.

"ఆ చెప్పా కదమ్మా... మీరేం అధైర్యపడకండి. నేను లేనా? మీ కన్ని ఏర్పాట్లు చేస్తాం..."

"ఏర్పాట్లు అంటే ఏంది? సారూ"

"అదేనమ్మా మీరుండడానికి ఇల్లూ, కట్టుకోవడానికి బట్టలు చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా లాంటివి... సరేనా?"

"అది సరే సారూ... ముందయితే ఆకలవుతుంది.. కాస్త అన్నం పెట్టించండి సారూ!" అడిగింది దీనంగా రాములమ్మ.

"అన్నం అందరికీ పంపాం కదమ్మా"

"ఆ పొట్లాడి నా దాకా రాలేదు సారూ..."

"ఇదిగో నాగన్నా"

"సర్... పిలిచారా? సార్..."

"ఇదిగో ఆమెకు ఆకలిగా ఉందట... అన్నం అందేలా ఏర్పాట్లు చేయండి" అంటూ చెప్పి మంత్రి ముందుసీటులో వున్న అసిస్టెంటు వెనకసీట్లో కూర్చున్న కారు ముందుకు కదిలిపోయింది.

"ఆశ్చర్యపోవడం రాములమ్మ వంతయింది. అటుగా వెళుతున్న రాజమ్మను చూసి రాజమ్మ ఇంకా ఇస్తున్నారా?"

"ఆ ఇస్తున్నారులా ఉంది... వెళ్లు..." హడావిడిగా చెప్పి వెళ్ళిపోయింది రాజమ్మ.

మళ్ళీ ఉసూరుమంటూ ... రాములమ్మ నడక. ఏం చేయాలి? ఇంట్లో పిల్లలు జ్ఞాపకం రాగానే మరింతగా నడక వేగాన్ని పెంచింది.

"అయ్యా... అన్నం"

"ఇందాక తిన్నావు కదమ్మా"

"నాకు రాలేదు సారూ... నాకందలే"

నేనేం చేయాలి. ఇప్పటికే వేలకు వేలు పంచాం.

"నాకే గాదు సారూ... సానమందికి అందలే... అందరూ ఆడనే కూచున్నారు" అంది దీనంగా రాములమ్మ.

"నేనేం చెయ్యాలి చెప్పు. అక్కడిచ్చినవి తెచ్చాం ఇచ్చాం. అంతే... సరే నా దగ్గర రూపాయి ఉంది తీసుకో ఏదయినా కొనుక్కో" అంటూ ఒక రూపాయి ఆమె చేతిలో ఉంచాడు.

రాములమ్మకు నవ్వాగలేదు. రూపాయితోనా? ఏమున్నాయని కొనుక్కోవాలి? కాలు కదిలే అవకాశం ఉంటే ఈ రూపాయి నేనే ఇద్దును నీకు అన్న అర్థం గోచరించేలా నవ్వుతూనే వుంది రాములమ్మ.

ఆ నవ్వుకు అర్థం తెలియని అక్కడున్న అసామి "ఎంత పొగరు? అందుకే దీని బతుకిలా ఉంది" అని గర్వంగా అనుకున్నాడు.

"సారూ.. మాకు ఇండ్లు కట్టిస్తారంటా.... ఎక్కడయ్యా... ఎప్పుడు?"

"ఏమో నాకు తెల్వదు. కట్టినప్పుడు నిన్ను పిలుస్తాలే... అప్పటికి నువ్వుంటే..." అనే మాటలో ఎన్నో అర్థాలు గోచరించాయి ఆమెకు.

ఇప్పుడేం చేయాలి ఆకలితో ఉన్న పిల్లలకే ఏదో తెస్తానని బయలుదేరింది. ఇప్పుడేం తీసుకెళ్ళాలి అనే ఆలోచనతో ఇంటిదారి పట్టింది.

"లచ్చిమీ.. చెల్లి నిద్ర పోతుందా?"

"ఆ! అవునమ్మా... నువ్వెళ్ళినప్పుడు కాస్సేపు ఏడ్చింది. తర్వాత నుండి నిద్ర పోతుంది. ఇందాక ఆకాశంలో విమానం వచ్చిందమ్మా... అది చూద్దాం లెమ్మన్నా లేవలేదు. నువ్వు చూసావమ్మా... ఆ విమానం ఎంత బావుందో కదమ్మా " అంది అమాయకంగా.

"పిలుద్దామన్నా ఒంట్లో తిండి ఉంటేగా ...?" అయినా పర్వాలేదు. కాస్సేపు



పాలిచ్చినట్లు భ్రమతోనయినా ఉంచుదామని లేపింది... అంతే ఒక్కసారి ... కెవ్వున కేకేసింది. "వామ్మో... నాబిడ్డ నా బిడ్డ సచ్చిపోయింది. అయ్యో బిడ్డ నన్నొదిలి ఎల్లిపోయింది దేవుడో..!" అంటూ పెద్దగా ఏడ్పు మొదలెట్టింది. ఆ అరుపుకు చుట్టుపక్కలున్నవారు ఇద్దరు ముగ్గురు చేరారు ఏమయిందంటూ. విషయం విన్నవారు 'అయ్యో' అని అనగలిగారు అంతే. అయినా ఆ బాధ ఎంత ఉందో ఆ కన్నతల్లి కంటేనా...?

అయ్యో నా బాధ ఎవరికి చెప్పుకోవాలి? అంటూ ఏడుస్తున్న రాములమ్మను చూస్తూ బిత్తరపోయింది లచ్చిమి. "అమ్మా...! ఊరుకోవే..." అంటూ తన చిన్ని చేతుల్ని రాములమ్మ తలపై వేసింది .

"ఊరుకోక ఏం చేయనమ్మా... పుట్టిన బిడ్డకు ఇంతన్నం పెట్టలేకపోయాను. పాపిష్టిదాన్ని ... దాన్ని నేనే చేతులారా చంపుకున్నాను, నేనే చంపుకున్నాను" అంటూ పిచ్చి పట్టినదానిలా రోదిస్తూ ఆ రోజంతా గడిపింది.

ఆ ఆవేదన ఎవరికీ వినబడలేదు. ఇందర్ని ముంచిన ఆ నీటి ప్రవాహంలో అది కొట్టుకుపోయింది. సృష్టి వైపరీత్యం ఎవరు తీర్చగలరు? మనిషి కోపాన్ని తీర్చవచ్చు గాని...

అధికారుల దాహాన్ని తీర్చవచ్చు... ప్రకృతి ఆగ్రహాన్ని ఎవరు ఆపగలరు? అన్యాయం, దురాక్రమణ, అసత్యం లాంటివన్నీ ఏలుతున్న ప్రపంచం ఇది.

***

"అమ్మా"

"ఏం?" అన్నట్లు కన్నెత్తి చూసింది రాములమ్మ.

"మరి... మరి..."

"చెప్పు... నీకు ఆకలిగా వుందా? పద మనం వెళ్ళిపోదాం... ఇక్కడ మనం ఉండద్దు... దూరంగా ఎక్కడికైనా పోయి బతుకుదాం..." అంది ఉన్న పెట్టి బట్టా అన్నీ ఒక మూటగా సర్దుతూ రాములమ్మ.

"ఎక్కడికమ్మా?..."

"ఎక్కడికో అక్కడికి... నువ్వు ఏమి మాట్లాడకు" అంది కోపంగా.

"అమ్మా!"

"ఏంటే..."

"మరి చెల్లి చచ్చిపోయిందా?"

"అవును..."

"మరి ఇంట్లో ఎవరైనా చచ్చిపోతే డబ్బులిస్తారటగా అమ్మా... అది తీసుకొని..." అనే మాట పూర్తి కాలేదు.

"లచ్చిమి..." అంటూ గుండెలకు హత్తుకుంది.

"వద్దమ్మా... అయినా ఆ డబ్బు మనకెవ్వరూ ఇవ్వరు.. అవి కేవలం నీటి మూటలని... ఎవరు చెబితే అర్థమవుతుంది ఆ చిన్నారికి. బాధతో పైకి ఏమీ అనకుండా..." లేదమ్మా మనం కష్టపడదాం. బతుకుదాం. నీకేం భయం లేదు. నేనున్నాను అని మాత్రం అనగల్గింది. రాబోయే సూర్యోదయంపై ఆశతో రాములమ్మ.

*('మూసీ" మాసపత్రికలో ప్రచురితం- ఏప్రిల్, 2008)*



# శిథిల చిత్రాలు

ఉన్నట్లుండి ఉలిక్కిపడింది నీలిమ. చుట్టూ కలియజూసింది. ఎక్కడ్నించీ ఈ శబ్దం? అనుకుంటూ ఒక్కసారి లేచి అటూ ఇటూ చూసినా, ఎక్కడా ఏదీ కనబడలేదు. అక్కడి విశాల వాతావరణంలో చక్కని గుడి ప్రాంగణంలో గుడిగంటలు తప్ప ఇంకే మీ వినబడవని వచ్చిన నీలిమకు ఈ శబ్దం ఎక్కడిదో అర్థం కావటం లేదు. ఒక పక్కగా సెలయేరు. పలచగా జనం, బహుశా భగవంతుడు కూడా నాలానే ప్రశాంతతను కోరుకుంటున్నాడేమో పాపం. ఆ ముఖంలో చిరునవ్వులు చిందిస్తూ నా వైపు చూస్తున్నట్లుంది. ఎదురుగా నిలువెత్తు రాముని విగ్రహం. పక్కనే తానుగా ప్రేమించి పెళ్లి చేసుకున్న సీతతో ఎంతో ప్రశాంతంగా వుండచ్చు. కానీ ఏమిటో ఆ ప్రశ్నార్థకం. ఇప్పుడర్థమైంది నాకు. ఆ శబ్దం నా గుండె లోనిదేనని. చిరునవ్వులు చిందిస్తూ నా వైపు భయంగా చూస్తూ, ఒక వైపు ఆరాధన, మరో వైపు ఆవేదన, ఏవీ కనబడనీయకుండా, గంభీరంగా, హుందాగా నిలుచుని, నా వైపు చూస్తున్న కొంటె చూపు నాకు గుర్తుకొస్తోంది. ఆ మాటలు...

"నీలూ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ నడవడి, మాట, ప్రవర్తనలో ఏదో ఒక కొత్తదనం వుంది" లాంటి ఇంకా ఇంకా ఎన్నో మాటలు గుండెల్ని తట్టి లేపుతున్నాయి. నిర్వికారమైన ఈ జీవితానికి, ఈ గుండెకు, ఈ శరీరానికి, ఏ మందూ పని చేయనంతగా ఆ మాటలు మంత్రాల్లా పని చేశాయి. ఎక్కడ్నించి వచ్చిందీ ఈ అధికారం? అంత చనువు, ఇంతటి ఆత్మీయత ఎక్కడివి? అయినా నాకెందుకు? అవసరమా? అలనే మాటలు అర్థం కాకున్నా, జీవితమంతా యాంత్రిక జీవితంతో అలసిపోయిందేమో నా ఎండిపోయిన గుండె... మళ్లీ చిగురించినట్లయింది. ఇక ఈ జన్మకు నిద్ర అవసరం లేదు. ఆహారం

అసలే అవసరం లేదు. అన్నీ ఒక్కమాటతో సరిపోతున్నట్లుంది. అనే ఆలోచన వచ్చేసరికి ఒక్కోసారి నాలో నేనే నవ్వుకుంటాను. ఎవరినో ఏదో నేను ఓదార్చాలని అనుకుంటే, ఆ ఓదార్పే నాకు అవసరమైందేమో అనిపించే తీరు, నాకే ఆశ్చర్యంగా వుంది.

అయినా ఎందుకో దుఃఖం తన్నుకొస్తున్నట్లుంది. కన్నీళ్లు ఎంతో అదృష్టమయినవి. ఎవరిలో వచ్చినా వారి కోసమే వస్తాయి. ఎప్పుడో చిన్నతనంలో అంటే కాలేజీ రోజుల్లో కథలుగా అనుకున్నవి, నిజజీవితంలో ఇన్నాళ్లకు ఎదురవటమా? అయినా ఆనందంగా ఆహ్వానించినా, అవి కేవలం మాటలే అని తెలుసుకున్న మరుక్షణం నాకు ఎవరి కోసం బతకాలో అర్థం కావటం లేదు. విధి మళ్లీ నన్ను వెక్కిరిస్తున్నట్లుంది. అనుకుని తలచుకుంటూంటే నాకు దుఃఖం ఆగటం లేదు.

అయినా నా దుఃఖం ఎవర్ని కరిగిస్తుందని? అయినా నేనే. మళ్లీ మాట్లాడాలని ప్రయత్నించినా, ఎవరో పక్కనే వున్నట్లు మాట్లాడుతున్నట్లు, ప్రవర్తించే ఆ తీరు నాకెంతో ఆశ్చర్యాన్ని కల్గించాయి. అంటే ఇంతగా నన్ను నమ్మించాలిన ఆడిన నాటకమా? ఎందుకు? ఇందులో అతని అంతర్యం ఏమిటి? ఎంతగా ప్రయత్నించినా అర్థం కావటం లేదు. ఇంతలో... నాకు తిరుగు ప్రయాణానికి సమయం ఆసన్నమైంది. రైలుకు మరీ తొందరెక్కువేమో, నా కంటే చాలా ముందుగా వచ్చింది. ఈ రైలు ప్రయాణం అంటే ఒక పక్క నాకు ఇష్టం లేకున్నా, మరో పక్క ఒంటరిగా నేనేంటో ఆలోచించుకునే అవకాశం వస్తుందనే సంతోషం కూడా, ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందంటే, ఒక పక్క అలజడితోపాటు ఆనందం కూడా కలుగుతోంది. నాకంటూ ప్రశాంతతను కలిగించేవి ఒక్క రైలు ప్రయాణం, లేదా నన్నే నమ్ముకున్న నా ఏకాంతం. నా కోపం, నా కన్నీళ్లు, నా ఆశయం, లాంటివన్నీ నా నేస్తాలే!

రైలు కదిలే సమయంలో నేను ఎదురుగా చూశాను. సుమారు ఇరవై ఏళ్లు వుంటాయేమో, కళ్ళు ఎరుపెక్కి ముఖానికి ఒక చేతి రుమాలు అడ్డం పెట్టుకుని కూర్చున్న ఓ యువకుని తీరు నాకెందుకో వింతగా అనిపించినా, అతను అపరిచితుడు కావటంతో నేనంతగా శ్రద్ధ కనబరచలేదు. నిమిషాలు, గంటలు గడుస్తున్నాయి. ఆ దుఃఖం ఆగటం లేదు. నాకెందుకో ఆ రోజు చాలా ఆకలేస్తోందేమో టిఫిన్ బాక్స్ నిండా అన్నాన్ని నింపుకున్నాను. తీరా రాత్రి పది కావొస్తున్నా ఆ దుఃఖం ఆగకపోవడం నాకు ఎంతో కంగారుగా అనిపించి, కాస్త మెల్లగా "బాబూ...!" అని పిలిచాను. ఆ పిలుపు అతనికి వినిపించిందో లేదో తెలియదో కానీ, నన్నయితే చూడలేదు.

ఇక నేను ఆగకుండా, "నిన్నే పిలుస్తుంటే వినబడదా?" అన్నాను భుజంపై చెయ్యి వేస్తూ.



ఆ స్పర్శకు కాబోలు, నావైపు ఒక్కసారి చూసి కాస్త విసుగ్గా ముఖం పెట్టి, "నాకేం కాలేదు అయినా మీకెందుకు?" అన్నాడు మరీ విసుగ్గా.

"నాకు కావాలి నువ్వు చాలాసేపు నుండి ఏడుస్తూనే వున్నావు. నాకైతే ఆకలేస్తోంది. నువ్వలా ఏడుస్తూ వుంటే నాకెలా తినబుద్ధి అవుతుంది చెప్పు?" అన్నాను నవ్వుతూ. నాకైతే డబ్బు ఇవ్వకపోతే అలిగిన నా కొడుకు గుర్తుకొచ్చేడు.

"నా ఏడుపు నా యిష్టం. ఎంతసేపైనా ఏడుస్తాను. మీరేమైనా నాకు ఆప్తులా, సన్నిహితులా? మీ ఆకలెందుకు ఆపుకోవటం? మీరు తినండి" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"దీన్ని బట్టి నాకు అర్థం ఏమైందంటే, నువ్వు ఎంతో మంచివాడివని" అన్నాను నవ్వుతూ, ముఖంలోకి తొంగి చూస్తూ.

"అదెలా అర్థమైంది? నేనేమీ మీతో మాట్లాడందే!" అన్నాడు మళ్లీ విసుగ్గా ముఖం పెట్టి.

"నువ్వు మాట్లాడావు, నీ మాటల్లో సంస్కారం వుంది. నేనెవరినో తెలియకున్నా, మీరు అంటూ సంబోధించావు. అది చాలు, నీవెవరో తెలుసుకోవడానికి. మరి ఇంతటి వాడికి ఇంత బాధ ఎందుకు కలిగిందో తెలుసుకోవాలని నాకుండదా? మా బాబూ అంతే. పట్టుకుంటే వదలడు. ఏది కావాలన్నా నిమిషాల్లో కళ్లముందు వుండాలంటాడు" అంటూ ఆ ముఖంలో మార్పును కనిపెట్టాను.

"నేనేమీ ఏది కావాలంటే అది ముందుండాలని అనుకోలేదు... అంటీ?"

"మరేం కావాలనుకుని ఇలా బాధపడుతున్నావు" రెట్టించాను.

"ముందు మీరు అన్నం తినండి" అన్నాడు ఆ బాక్స్ వైపు చూస్తూ.

"సరే నేను తింటాలే. నువ్వెప్పుడు భోంచేశావో నాకు తెలియదు కదా. అందుకే నువ్వూ, నేనూ కూడా కలిసి తిందాం. సరేనా?"

అన్న వెంటనే పాపం ఎంత ఆకలిగా వున్నాడో ఏమో... నా చేతిలో వున్న బాక్స్‌ను అందుకుని మొత్తం తినేశాడు. పూర్తి అయిన తర్వాత "అయ్యో అంటీ, మీరు అస్సలు తినకుండా నేనే తినేశాను. ఏమీ అనుకోకండి" అంటూ ఒక కొంటె నవ్వు నవ్వాడు.

అప్పుడు నాకు నిజంగా నవ్వు వచ్చింది. "మా బాబూ అంతే కోపం వస్తే, అదీ తినమని నేను విసిగిస్తే అంతా తినేస్తాడు" అన్నాను నవ్వుతూ.

ఆ మాటలకు అతను ఏం అనుకున్నాడో ఏమో "సారీ అంటీ" అన్నాడు మెల్లగా తలదించుకుని, నేల చూపులు చూస్తూ.

"వద్దమ్మా... అలా అనకు, నాకు నిజంగా ఆకలి లేదు, ఏదో నీ చేత తినిపించాలనే ఉద్దేశంతోనే అలా అన్నాను" అని అన్నాను ఒక వైపు ఆకలి వేస్తున్నా. అల్లరి పిల్లలు అంతే అనిపించింది.

"ఇప్పుడు చెప్పు. అసలు నువ్వెందుకు అలా వున్నావు చెప్తావా?" అడిగాను.

"నేను ఇల్లు వదిలి వచ్చేశాను అంటీ" అన్నాడు.

"అది తెలుస్తూనే వుంది. ఎందుకు అని అడుగుతున్నా" అన్నాను మళ్ళీ రెట్టిస్తూ.

"సమ్ హౌ ఐ డొంట్ లైక్ మై పేరెంట్స్" అన్నాడు, కేర్‌లెస్‌గా.

"అలాగా... మనం కాస్సేపు తెలుగులో మాట్లాడుకుందామా? అదీ సరదాగా, నీకు వచ్చు కదా..."

" ఆ.. వచ్చు, నాకు మా అమ్మా, నాన్న అంటే ఇష్టం లేదు" అన్నాడు తెలుగులో మాట్లాడాలనే సంకల్పంతో.

"ఏం ఎందుకని? నీకు తిండి పెట్టలేదా? చదువుకోమనలేదా, ఇంట్లో వుండనివ్వలేదా? ఇవేవైనా నీకు లోటు చేశారా? చెప్పు. వారి మీద నీకే కాదు నాకు కోపంగానే వుంటుంది" అన్నాను.

"అవి ఎవరికి కావాలాంటీ... ఆ మాత్రం ప్రతి తల్లి, తండ్రి చేస్తూనే ఉన్నారు" అన్నాడు ఎంతో కేర్‌లెస్‌గా, జుట్టును వెనక్కు తోసుకుంటూ.

"అంటే ఈ వయసులో ఇంత కంటే ఇంకేం కావాలమ్మా? నా కర్థమైంది నీకు సెల్‌ఫోను కొనివ్వలేదేమో, అంతేనా, లేక నువ్వడిగిన బండి లాంటిది కొనలేదేమో, అంతేనా" అన్నాను ఛాయిస్ ఇస్తున్నట్లు.

"అదేం లేదాంటీ, నేను ఒక అమ్మాయిని ప్రేమించాను..." అనగానే.

"అది అలాంటిదేదో అయ్యుంటుందని అనుకున్నాను లే, ఆ చెప్పు ఆ తర్వాత...?"

"మా కులాలు వేరు, వాళ్లకి ఆస్తి లేదు. మాకు వుంది. మా అమ్మకేమో కట్నం కావాలి. ఆ అమ్మాయికి ఆ స్తోమత లేదు. నాకు ఆ అమ్మాయి లేకపోతే బతుకే లేదు. అందుకే ఇలా ప్రయాణం చేసి, చేసి ఎక్కడో ఒక చోట దూకి చనిపోవాలని నిర్ణయించుకున్నా అంటీ, అపుడు కానీ మా అమ్మా నాన్నలకు బుద్ధి రాదు" అన్నాడు కోపంగా.

నాకు కాస్త కోపం వచ్చింది. ఎందుకంటే నేనూ తల్లినే కదా. కానీ ఇపుడు సమయం కాదని గ్రహించి, "నాకు నిన్ను చూస్తుంటే నవ్వొస్తోంది. ఒక లోకం తెలియని అమాయకుడు తన చొక్కాను నిప్పు అంటించుకుని మంటలు ఎంత బావున్నాయో అనుకున్నాడట, ఇలా వుంది నీ పరిస్థితి" అన్నాను, నవ్వుతూ.

"నీకు తెలియదు అంటీ, మా అమ్మ, నాన్న సంగతి, ఎప్పుడూ చదువుకోమని తప్ప ఏమీ చెప్పరు".

"అంతకంటే ఏం చెప్పాలని నీకు అనిపిస్తోంది? అంటే ప్రేమించమని లాంటివి తల్లిదండ్రి చెప్పరు కదా!"

కాస్సేపు మౌనంగా వున్నా "అలా కాదాంటీ" అన్నాడు మెల్లగా.

"ఇంతకీ నువ్వేం చదువుతున్నావు!"

"బి.టెక్ ఫైనలియర్"

"ఆ అమ్మాయి?"

"ఫిజిక్స్ లెక్చరర్"

"ఇంకేం? నీకు ఉద్యోగం కూడా అక్కరలేదు. ఆ అమ్మాయి నిన్ను పోషిస్తుంది. అంతేకదా? పెళ్ళి చేసుకోండి" అన్నాను, చాలా తేలిగ్గా.

"మరి ఆమె నా కంటె నాలుగు సంవత్సరాలు పెద్దది కూడా. అయినా నాకు ఆమె అంటే చాలా ప్రాణం" అన్నాడు.

"ప్రాణం అంటే పెళ్ళి చేసుకోవాలి. చనిపోవటం ఎందుకు?" ఎదురు ప్రశ్న వేశాను.

"మరి మా నాన్న ఈ పెళ్ళి చేసుకుంటే చనిపోతానని బెదిరిస్తున్నాడు అంటీ!"

"చాలా బావుంది. చేసుకుంటే మీ నాన్న చనిపోతాడు. చేసుకోకపోతే నువ్వు చనిపోతావు. మొత్తం మీద మీ ఇంట్లో ఎవరో ఒకరు చనిపోవడం ఖాయం అన్నమాట. చాలా కష్టమైన పరిస్థితి వచ్చిందమ్మా. నీకు, నీ పేరేంటన్నావు?" అన్నాను చాలా క్యాజువల్‌గా.

"సందీప్, అంటీ? మీరే నాకు ఏదో దారి చూపాలాంటీ" ప్రాధేయపడ్డాడు.

"సరే, నువ్వొక్కసారి నాకు మీ స్నేహితురాలు, అదే నువ్వు పెళ్ళి చేసుకోవాలను కుంటున్నావే... ఆమెతో మాట్లాడిస్తావా?" అన్నాను సూటిగా.

"ఎందుకాంటీ" కంగారుగా అడిగాడు సందీప్.

"నేనేం అనను లేమ్మా. ఆ అమ్మాయికి కూడా విషయం తెలియాలి కదా..." అన్నాను, పక్కనే వున్న సెల్‌ఫోన్ అందుకుంటూ.

విషయం విన్న నాకు ఏమీ తోచలేదు. ఏంటీ యువతరం? ఏమైపోతున్నారు?

వీల్లేదనుకుంటే అది తప్పకుండా జరిగిపోవాలంటే ఎలా కుదురుతుంది? ఇంతగా చెప్పిన ఆ శ్రావణి ఉద్దేశం వీడు తెలుసుకోనక్కరలేదా? అసలేమైంది? ఏవిధంగా చెబితే అర్థం అవుతుంది? ఇపుడు నేనేమైనా కటువుగా చెప్పడం మొదలెడితే, తెలిసీ తెలియని వయసులో తాను అన్నంత పనీ చేస్తాడు. అనుకుని ఆలోచిస్తుంటే....

"ఏమైంది అంటీ! అలా అయిపోయారు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఏమీ లేదమ్మా, ఇంతకీ నువ్వు ఆ అమ్మాయిని అడిగావా?" అన్నాను.

"అడగడం ఎందుకాంటీ... ఎప్పుడు కాలేజీలో కనబడినా నవ్వుతుంది. భోంచేశావా అంటుంది. ఇంతేనా చదువుకోకూడదా? అంటుంది. ఈ రోజు ఏంటీ నువ్వు ఇంత స్మార్ట్‌గా వున్నావు? అంటుంది. ఇంతకంటే ఏం కావాలి అంటీ, ఆమె నన్ను ఇష్టపడుతోంది అనడానికి?" అనటం చూస్తుంటే నాకు నోట మాట రాలేదు. ఇదేం ప్రేమ? ఆశ్చర్యంగా వుందే... పైగా ఆత్మహత్య ఒక్కటా? అనుకుంటూ ఇలాంటి ప్రేమకు ఆత్మహత్య ఒక్కటా అనుకుని, "అదేంటీ సందీప్, ఇందాక అన్న నీ మాటలన్నీ నేనూ అడిగాను. నేను తెచ్చుకున్న అన్నం కూడా తిన్నావు కదా, నువ్వు పలకరించకున్నా, నేనే నిన్ను పలకరించాను. నవ్వించాను కూడా. నాకు ఆకలి వేస్తున్నా నీతో నేను మాట్లాడుతూనే వున్నాను. నాకు నిన్ను ఓదార్చాలని ఉంది. మరి నీ లెక్క ప్రకారం నన్ను కూడా నువ్వు ప్రేమించాలి కదా?" అన్నాను నవ్వుతూ.

"మీరు అలా మాట్లాడకూడదు అంటీ... ఎందుకంటే మీరు నా కంటే పెద్దవారు" అన్నాడు తల దించుకుని.

"మరి ఆమె కూడా పెద్దవారే కదా నాన్నా..."

ఏం మాట్లాడాలో తెలియలేదు. కాసేపు ఆగి "మరి ఆమె నన్ను ప్రేమిస్తోందిగా అంటీ!" అన్నాడు.

"అలా అని నీకు చెప్పిందా?" అడిగాను సూటిగా.

"లేదు"

"మరి ఎలా నీకు నువ్వే అనుకుంటే? నా ప్రేమలో తల్లిని చూశావు. నీ ఆధునిక భాషలో అంటీని చూశావు. అలాంటప్పుడు ఆమె ప్రేమలో తోబుట్టువుని చూడలేవా?" అడిగాను.

"అలా అని నీకు చెప్పిందా" అన్నాడు కోపంగా.

"చెపితే ఏం చేస్తావు?"



"చంపేస్తాను దాన్ని...!" అనే మాట పూర్తి కాకుండానే చెంప చెళ్లుమనిపించాను. నా అతి చనువు పక్కనే వున్నవారికి కాస్త ఇబ్బంది కలిగించిందేమో, "అదేంటమ్మా, పసిపిల్లవాడిని అలా కొట్టావు?" అని అడిగారు.

"ఏమీ లేదండీ, వాడు మా వాడే. కాస్త పెంకిఘటం. దారిలో పెట్టాలంటే ఒక్కోసారి తప్పదు. మేము హైదరాబాద్ వెళ్ళాలని బయలుదేరాం. మరి మా వాడేమో మధ్యలో దిగిపోదామని గొడవ చేస్తున్నాడు. ఏం చెయ్యాలి చెప్పండి" అని సర్ది చెబుతూ వారి దృష్టిని మార్చాను.

"సందీప్, ప్రేమ అనేది ఒక అపురూపమైన పదం. అది అందరి సొత్తూ కాదు. ఒక ప్రేమ, అది తల్లి నుండి కావచ్చు, చెల్లిది కావచ్చు, ఎవరైనా కట్టిపడేసేదే ప్రేమ. ఆ ప్రేమ జీవితాంతం వుండేలా చూసుకోవాలే తప్ప, జీవితాన్ని నాశనం చేసేదిగా వుండకూడదు. అసలు ఆ అమ్మాయి నిన్ను ఏ దృష్టితో చూస్తుందో తెలుసుకోలేని నువ్వు, జీవితంలో ఎలా జీవిస్తావు? అయినా ఒకరిని చంపే హక్కు ఎవరికుంది? నువ్వెవరు ఆమెని చంపడానికి? ఆమె నుండి బలవంతంగా ప్రేమను పొందడానికి? ఇక చనిపోతావనుకుంటున్నావు. ఈ రోజు నువ్వు చనిపోతే, నిజంగా ఏడ్చేది నీ కన్నతల్లితండ్రులే..., కనీ పెంచి పెద్దచేసిన వారిని చూడకున్నా పర్వాలేదు. బతికుండగా చచ్చి సాధించడం ఇదేం న్యాయం? నువ్వు పసిపిల్లవాడివేం కావు, నీకు నా మాటలన్నీ అర్థమవ్వకపోవడానికి. నువ్వు వెంటనే మీ ఇంటికి వెళ్లు. పూర్తి చేయాల్సిన పనులు అంటే చదువు పూర్తి చేయి. తర్వాత నీ కాళ్లపై నువ్వు నిలబడు. ఆర్థికంగా. ఆ తర్వాత పెళ్లి, ప్రేమ లాంటివన్నీ తెలిసిందా?" అన్నాను. "చెప్పు, ఎక్కడకు వెళతావు?" అడిగాను సీరియస్‌గా.

"అమ్మ దగ్గరకు" అన్నాడు మెల్లగా.

"గుడ్, కీపిటప్..." అంటూ ధైర్యం చెప్పాను. నాకు ఎంతో తృప్తిగా వుంది కూడా . ఒక జీవితాన్ని నిలబెట్టాననే సంతోషం ఉంది. ఒక ప్రయాణం ద్వారా ఒక మంచి పని చేశాననే తృప్తి వుంది.

కానీ, నా గుండె మాత్రం ఇంకా బరువుగానే ఉంది. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి? ఒక పక్క ప్రేమించకుండానే, ప్రేమిస్తుందనే నమ్మకంతో ఒకరు, మరో పక్క ప్రేమతో వున్నా గుర్తించకుండా ప్రపంచంలో అందాల వెంట తిరిగేవారు ఎందరో, అయినా ప్రేమ, అంటేనే స్త్రీ ప్రతిరూపం... అలా కాకుండా అందమైన చెట్లు, సెలయేరు, అలలు, కొండలు, ఆకాశం, స్వేచ్ఛ లాంటి వాటిలో ఆనందం వుంటుందా? ఇవన్నీ

ప్రేమించే మనసులో వుండవా? అది తెలుసుకోలేక పరుగులు తీస్తున్న, ఈ నవ నాగరికతలో స్త్రీ జాతి మొత్తం, ఏవిధమైన ఆశల్ని పొందలేక, ఏవిధంగానూ తమ కిష్టమైన జీవితాన్ని జీవించే ధైర్యం చాలలేక, బతకలేక, చావలేక, జీవచ్ఛవాల్లా ఎంతకాలం? అనేవి జవాబు లేని ప్రశ్నలే.

ప్రపంచమంతా ఇలాంటి శిథిల చిత్రాలే... వీటికి స్పందన లేదు. ఉండకూడదు కూడా, ఉంటే... ఏమో?

*(జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ వారి కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ, ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో ప్రచురితం **2006**, ఏప్రిల్ **30**)*



# పనిపిల్ల

సమయం సాయంత్రం ఆరుగంటలు దాటుతోంది. చలికాలం కావటం వల్లనేమో అపుడే బయటంతా చీకట్లు ముసురుకుంటున్నాయి. చాలామంది ఇళ్ళకు చేరిపోయారు. అక్కడక్కూడా కష్టజీవులు తప్ప ఎవరూ వస్తున్న, నడుస్తున్న ఛాయలు కనబడటం లేదు. ఒంటికి స్వెట్టర్, చెవులకు మఫ్లర్ లేని మనుషులు అక్కడక్కడా కనబడుతున్నారు. దారిలో వస్తున్నవాళ్ళూ, వెళుతున్నవాళ్ళూ...అందరిలో ఏదో ఒక ప్రత్యేకత... ఒక్కొక్కరూ ఒక్కోరకం. కొందరు వారిలో వారే గొణుక్కుంటూ, మరికొందరు పక్కవారితో అందరికీ వినిపించేలా అరిచి మాట్లాడుతూ, ఒకరు పరుగులాంటి నడకతో, మరొకరు వాతావరణాన్ని విస్మయంగా, తన్మయంగా గమనిస్తూ మెల్లగా... ఇలా ఒక్కో మనస్తత్వం. అలవాట్లు గమనిస్తూంటే మాత్రం ప్రతిదీ కొత్తగా అనిపిస్తోంది.

ఇవన్నీ గమనిస్తున్న సీతకు తన చిన్నతనం గుర్తుకొచ్చింది. ఇలాంటి చలికాలం రావడంతోటే అమ్మ ఒడిలో మరీ దగ్గరగా అమ్మ చేతుల మధ్య చేరి ఎంతటి చలినైనా జయించగల ధైర్యం గుండెల్లో వుండేది. నిద్రపోయే ముందు దగ్గరగా వచ్చి మెడదాకా దుప్పటి కప్పి, నుదుటిపై ఇచ్చే ముద్దుతో జీవితమంతా రాత్రి అయితే ఎంత బావుండునో అనిపించేది. నిద్ర లేచీ లేవగానే కుంపటి ముందు కూర్చున్న అమ్మ ఒడిలోనే కాస్సేపు కూర్చుంటే అక్కడున్న వెచ్చదనాన్ని చేతులతో పట్టి చెంపలకు, కడుపు భాగానికి అందిస్తున్న అమ్మ ఒడిలో ప్రపంచమంతా వుందేమో అనిపించేది. ఇవన్నీ గుర్తొచ్చే చలికాలం అంటే సీతకు ప్రాణం. అమ్మలోని వెచ్చదనం చలికాలం అనిపించేది.

ఇలా చిన్నతనపు తీపి గుర్తులు ఒక్క చలికాలమేమిటి? ఎండాకాలమైనా,

వర్షాకాలమైనా ఏ కాలమైనా దాని ఆనందం, ఆ అనుభూతి అవన్నీ దేనికి తగ్గట్టు దానికి వుండేది. అన్ని కాలాలూ ఋతువులూ అమ్మ దగ్గరే సేదతీరేవి. అలా అనుభూతులు నెమరు వేసుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా "అమ్మగారూ...?" అంటున్న పనిమనిషి లక్ష్మమ్మ గొంతు వినబడింది. ఆ గొంతు వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అదేంటి? లక్ష్మమ్మ ఇలా వేళకానివేళలో అలా అదరాబాదరాగా వస్తూ ఏడుస్తోంది? కారణం ఏమై వుంటుందోనని సీత ఎదురుగా వెళ్ళింది.

"ఏమయిందే... లక్ష్మీ...?" కాస్త హడావిడిగా అడిగింది సీత.

"ఏం చెప్పేదమ్మా? ఆ సచ్చినోడు మళ్లా తాగొచ్చి నన్నూ పిల్లల్నీ ఒకటే కొట్టిండు..." అంటూ రాగాలు మొదలు పెట్టింది.

ఇది సీతకు మామూలే. ఇలా వారానికో, పదిరోజులకో ఒకసారి భర్త కొట్టడం, ఏడుస్తూ ఇంటికి రావడం, ఇవన్నీ విని ఆమెని సీత ఓదార్చడం, కొన్నాళ్ళు నేను వెళ్లనని లక్ష్మమ్మ అనడం, ఆమె బాధ చూడలేక పోలీసు కంప్లయింట్ ఇవ్వు అంటూ సీత ఆవేశపడటం, రెండు రోజులు కాగానే మళ్లీ "మా మావ... ఏం తిన్నాడో ఏమో పాపం" అని లక్ష్మమ్మ వాపోవడం... దాదాపు పదేళ్ళ నుంచీ సీతకు అలవాటే. కానీ ఈ రోజు మాత్రం అలా కాకుండా రాత్రికి రాత్రే తాను వాళ్లమ్మ దగ్గరకు వెళతానని, ఇక తాను తన భర్త దగ్గరకు అసలు వెళ్ళడం కుదరదనీ చెబుతోంది లక్ష్మమ్మ. ఒకవైపు కంటి మీద కొట్టాడేమో... కన్నంతా కందిపోయింది. తలపై దేనితో కొట్టాడో ఏమో... రక్తం కారుతోంది... పాపం....!! ఏం జీవితాలో ఏమో... అనుకుంటూ రక్తం కారకుండా కాస్తంత పసుపు పెట్టి, అదిమివుంచి, అక్కడే వున్న బట్టను గట్టిగా కట్టి, వేడివేడిగా టీ ఇచ్చింది సీత.

నిమిష నిమిషానికీ భర్తను తిట్టి పోస్తూ... "ఆడు వుండి నాకేం పెట్టదమ్మా, వీడి జిమ్మడిపోనూ... కడుపు నిండా తాగి ఓ మూల తొంగుంటే ఆడి సొమ్మేం పోతదమ్మా... రోజూ ఇదే గొడవ... తాగి లొల్లి సేసినా నేనూరుకున్నా, కానీ ఇయాల నా బిడ్డని అనరాని మాటలన్నా, నా కొడుకు అడగబోతే, అడ్డి కఱ్ఱ తీసుకొని కొట్టిండు. ఆడికి అడ్డంపోతే నన్ను ఎట్లంటే గట్ల తన్నిండు. చేతికి కఱ్ఱ దొరకబుచ్చుకుని ఒకటే కొట్టుడు. రోజు రోజుకు మా బస్తీలో నా ఇజ్జత్ తీస్తున్నాడమ్మా... నాకయితే బతక బుద్ధయితలే. ఇంత ఇసం తీసుకొని నేను, నా పోరగాండ్లు పోతామని అనుకుంటున్నాం" అంది ఏడుస్తూ.

అదంతా విన్న సీత "ఛ... ఊరుకో... అయినా నీకిదేం కొత్త కాదు గదే... వాడు కొట్టడం, నువ్వు అలగడం" అంది నవ్వుతూ.



"నిజమే... నాకయితే ఇయాల యాస్టకొచ్చిందమ్మా... నువ్వేమయినా అనుకో... ఇసుంటి మగడు వుంటే ఏంది? లేకుంటే ఏంది?" అంది కోపంగా లక్ష్మమ్మ.

"మరేం చెయ్యాలనుకుంటున్నావు? పోలీసు కంప్లయింట్ ఇవ్వకూడదూ" అంది విసుగ్గా సీత.

"గా మధ్యలో ఇచ్చిన. ఆళ్ళు మస్తు తన్నిరి. మళ్ల ఇడిచిబెట్టిరి. గపుడు రెండు దినాలు ఊరుకుండే. మళ్లా షురు జేసిండు..." అంది వెక్కుతూ.

"మరి మీ అమ్మా నాన్నను పిలుచుకురా. నువ్వు వెళ్లిపోతే వాడికేం? హాయిగా వుంటాడు. అలాంటి పిచ్చిపనులు చేయకు" అంది సీత ఆలోచిస్తూ.

"పోయిన నెలలో గట్లే చేసినా, మా అమ్మ, బాపును కూడా గలీసు మాటలు అనిండు. ఈ పాలి వాళ్లు వస్తరని నేననుకుంటలే. ఏందో మా యమ్మకు ఒకటే పరేషాన్ వుంటదమ్మా. ఒక్క నా బతుకు గట్ల అయిందన్నట్లు" అంది కళ్ళు తుడుచుకుంటూ లక్ష్మమ్మ.

సీతకు ఏమీ తోచడం లేదు. ఇదేంటి? వీళ్ళు ఇలా... ఏం చెయ్యడానికి పాలుపోవడం లేదు. నిజమే పాపం...!! వీళ్లకు దిక్కెవరు? సరే... ఈ రాత్రికి ఇక్కడే వుండనిద్దాం. పొద్దున్నే లేస్తే అన్నీ సర్దుకుంటాయి అనుకుంటూ ఊరుకుంది.

"సరే ముందయితే అన్నం తిను. అపుడే ఎనిమిది అవుతోంది" అంది.

"నాకు ఆకలయితలేదమ్మా" అంది దిగులుగా లక్ష్మమ్మ.

"నువ్వు కాస్సేపయ్యాక తిందువుగానిలే. ముందు పిల్లలకు పెట్టు. మీరు తినండే. మీరూ మీ అమ్మతోపాటు అలిగారా ఏంటి? ఎంత బాధ వున్నా తిండి దగ్గర చూపకూడదు. హాయిగా తినండి. కష్టపడేవాళ్లు అలా వుండకూడదు. సరేనా" అంది చనువుగా సీత వాళ్లకు అన్నం పెడుతూ.

"నిన్ను పరేషాన్ చేస్తున్నమమ్మా" అంది బాధ నిండిన గొంతుతతో లక్ష్మమ్మ.

"నేనేమయినా నీ కష్టాలను తీయలేను కదా, విని ఓదార్చడం తప్ప" అని వాళ్ళు నిద్రపోవడానికి పక్కరూంను సరిచేసింది సీత. రాత్రి ఒటిగంట దాటింది.

***

"ఎయ్... ఎక్కడ చచ్చావే" అనే అరుపుతో ఒక్కసారిగా భయపడిన సీత "అబ్బ ఊరుకోండి ఎవరైనా వింటే..." అంది భయపడుతూ.

"నా ఇల్లు... నా ఇష్టం... నేనిష్టమొచ్చినట్లు మాట్లాడతా. అడగటానికి నువ్వెవరే...?" అంటూ ముందుకు తూలి పడబోయాడు శేఖర్.

"అరె ... పడిపోతారండీ... కాస్త మెల్లగా... పిల్లలు మెలకువగా వున్నారు. వాళ్లు మిమ్మలిలా చూస్తే ఇంకేమయినా వుందా? తాగను... తాగను అంటూ మళ్లీ ఇదే తంతు..." అంది సీత కాస్త మెల్లిగా.

"నేను ఇపుడు కూడా తాగలేదు. అయినా నా ఇష్టం. నా సంపాదనతోనే తాగుతాను. వేరే వాళ్లకు పంచుకుంటానే నీకేంటి? నీకు దమ్మిడీ ఆదాయం లేదు. చచ్చినట్లు ఇంట్లో పడివుండక నాకే నీతులు చెబుతావా?" అంటూ చెయ్యి పైకెత్తాడు.

"మీ ఆరోగ్యం కోసమే నేను చెప్పేది. నాకేమి మిమ్మల్ని అనాలని సరదానా ఏంటి? మీరు ముందు లోపలికి పదండి" అంది చెయ్యి పట్టుకుని నడిపిస్తూ సీత.

కడుపు నిండా అన్నం తిన్నాక "ఇదిగో నిన్నే" అంటూ గర్జించాడు.

"చెప్పండి" అంది మెల్లగా.

"సాయంత్రం మీ అన్న వచ్చాడటగా"

"ఆ... అవును" అంది మెల్లగా సీత.

"ఏమంటాడు... ఏదయినా డబ్బు ఇచ్చాడా?"

"లేదు ఇస్తానన్నాడు"

"ఎప్పుడట? నువ్వు పోయాకా?"

"నిన్నే... ఇక్కడ మాట్లాడుతుంటే సమాధానం చెప్పవేం?"

"మీరలా అంటుంటే నేనేమి సమాధానం చెప్పాలి"

"చెప్పాలి. తప్పదు లేదా నువ్వు అడగాలి"

"నాకేమి వాళ్లిచ్చే డబ్బు మీద ఆశ లేదు"

"నీకు ఆశ లేదు. కానీ నాకుంది. మర్యాదగా నేనడిగిన డబ్బు ఇస్తాడా లేక సంగతి తేల్చుకోమంటాడా" అడిగాడు.

"అసలు డబ్బు ఇవ్వాలని రూలు ఏమయినా వుందా?" అడిగింది సీత కాస్త హెచ్చు గొంతుతో.

"ఏంటే, గొంతు లేస్తోంది. నాకు అర్జంట్‌గా యాభైవేలు కావాలి. అంతే నువ్వు ఎవర్ని అడుగుతావో నాకనవసరం" అన్నాడు కోపంగా.

"ఎవర్ని అడుగుతాను. అలా అడగడానికి బుద్ధి వుండాలి. పోయిన నెలలోనే మా వాళ్ళ దగ్గర నుండి పాతికవేలు తెచ్చాను. మళ్ళీ ఏ మొఖం పెట్టుకుని అడగాలి" కాస్త చిరాగ్గానే అంది సీత.

"ఆ ఇచ్చారు ముష్టి పాతికవేలు. అవి ఆరోజే అయిపోయాయి" అన్నాడు.



"అవును మరి... ఇంట్లో వున్న డబ్బంతా దానికిచ్చేస్తే ఇక మనకెక్కడి నుంచి వస్తుంది?" అంది కాస్త కటువుగానే.

"ఏంటే వాగుతున్నావు? ఎంత ధైర్యం?" అంటూ చెయ్యి లేపాడు కొట్టడానికి.

"ముందు చెయ్యి దింపండి. ఇంట్లో భార్య వుండగా మరో ఆడదాన్ని వుంచుకోవడానికి లేని కోపం ఇపుడెందుకో" అంది హేళనగా.

"నోర్ముయ్... అప్పటికేదో లక్షలకు లక్షలు తగలేసినట్లే మాట్లాడతావేం?"

"ఇప్పటివరకు నా నగలు, పాపాయి నగలు అన్నీ కలిపితే లక్ష ఎపుడో అయివుంటుంది" అంది కూల్‌గానే సీత.

"నీకు నోరు ఎక్కువయిపోయిందే... అవును నేను చేతగానివాడినే. మరెందుకు పెళ్లి చేసుకున్నట్లో" అన్నాడు వెటకారంగా.

"మీకు తెలియనిదా... నేనెందుకు ఏ పరిస్థితుల్లో మిమ్మల్ని చేసుకున్నానో?"

"తెలుసు కాబట్టే నేను ఎవరితోనైనా తిరుగుతాను. మరెందుకు మీరక్కడికెళ్లేరు? అని ఆరాలు" అన్నాడు శేఖర్.

"ఆరాలు కావు మీరు సంపాదించినవేవయినా ఎవరికైనా ఇచ్చుకోండి. అంతేగానీ అలాంటి వాళ్ళందరికీ మా అన్నయ్యలు, నేనూ మా దగ్గరున్నవీ ఇచ్చేయాలంటే ఎలాగ కుదురుతుంది? అనేదే నా ప్రశ్న. మీరెక్కడున్నా మీ లానే వుండండి. అర్ధమయ్యిందా?" అంది గట్టిగా కాస్త కోపం ధ్వనించే స్వరంతో.

"ఛీ.. నీతో మాట్లాడటమే ఒక తప్పు. అందుకే ఇంటికి రావాలంటేనే విసుగ్గా వుంటుంది" అంటూ పైకి లేచాడు.

"ఏంటి తాగినదంతా దిగిపోయిందా? బయలుదేరుతున్నారు?" అంది వెటకారంగా సీత.

దాంతో కోపం పట్టలేక ఓ మూలగా వున్న కర్ర తీసుకుని చేతికొచ్చినట్లు కొట్టి తన దారిన తాను వెళ్ళిపోయాడు శేఖర్.

ఇలాంటివెన్నో అలవాటు పడ్డ సీత కాస్సేపు ఆ దెబ్బల ధాటికి తట్టుకోలేక ఏడ్చి, మౌనంగా నిద్రపోయింది.

***

ఇదంతా విన్న లక్ష్మమ్మ నిర్ఘాంతపోయింది. ఇదేంటి అమ్మగారు కూడా ఇలా బాధపడుతున్నారు? తన భర్త మాత్రమే తాగి వచ్చి తనను హింసిస్తున్నాడనుకుంటున్న తాను ఈ రోజు ఇలా అదీ తనకు ఏమాత్రం తీసిపోకుండా.. ఆశ్చర్యంగా వుంది.

ఇవన్నీ భరిస్తూ అమ్మగారు ఎందుకు బయట పడలేదు? తనలా దొంగనాకొడుకు అని తిట్టేది కాదే? ఇంకా ఆయన, వారు అంటూ ఎంతో గౌరవంగా చెప్పేది? పాపం ఈవిషయంలో ఎంతగా నలిగిపోయి వుంటుందో, బయలకు ఒక్క మాటైనా ఎవరికీ తెలియనిచ్చేది కాదు. తానంటే ఏదో బయటపడి ఎంతో కొంత సాంత్వన పొందేది. మరి ఇలాంటి వాళ్లు? .. ఎవరికి చెప్పుకుంటారు? పైగా ఈ అయ్యగారి కంటే తన మావే నయ్యం. తాగుడుకు బానిసై డబ్బు కోసం తనను కొడతాడే గానీ, తనను కాదని మరొకరి దగ్గరకు అస్సలు ఎల్లడు. ఎంత రాత్రయినా తన కోసమే వస్తాడు.

పెద్దింటోళ్లు ఎంత అదృష్టవంతులో అనుకునే లక్ష్మమ్మకి ఒక్కసారిగా జ్ఞానోదయం అయింది.

వేళపట్టున తినడానికి తిండి, కట్టుకునేందుకు రకరకాలయిన బట్టలు, అపుడపుడూ సినిమాలు, షికార్లు, ఆడపాదడపా చుట్టాలు, ఇలా చూసే వాళ్ళందరికీ అలా మనమెందుకు లేమనే భావన కలిగించేలా వుంటుంటే "వచ్చే జన్మంటూ వుంటే పెద్దొల్ల ఇంట్ల పుట్టాలి" అనుకునేది.

ఒకసారి నువ్వు నన్ను వదిలి బయటకు పో అన్నపుడు "ఏయ్ లచ్చిమి! అంత మాట అనబాకే. "నీ కాదుంటే నే పైసలియ్యి, నేను మల్లొస్తా అని బతిమాలడం.. తాను పనిచేసి అలిసిపోయినపుడు వంట చేసి తినిపించడం, తాను పిల్లని కన్నపుడు రిక్షా తొక్కి వచ్చిన డబ్బుల్తో తనకో చీర, పిల్లకు బట్టలు తెచ్చి మురిసిపోవడం... ఇలా ఒక్కటేమిటి... సంఘటనలు కొన్నే అయినా మరిచిపోలేనివిగా మిగిలిపోయాయి. ఒక్క తాగుడు తప్ప మరేమీ వ్యసనం లేని తన మావ ఇక్కడ అయ్యగారి కంటే ఎన్నో రెట్లు గొప్పవాడిగా తోచాడు. మంచివాడుగా అనిపించాడు. ఇలాంటి ఆలోచనలతో ఒక నిర్ణయానికొచ్చి నిశ్చింతగా నిద్రపోయింది లక్ష్మమ్మ.

***

సీత నిద్ర లేచేసరికి ఇల్లంతా శుభ్రం చేసింది లక్ష్మమ్మ. "అరె... అపుడే పనంతా అయిపోయిందా? ఇపుడింకా అయిదు కూడా అవ్వలేదు. అపుడే లేవడం, పని పూర్తి చేయడం... అయితే రాత్రంతా నిద్ర పట్టలేదా ఏంటి? అడిగింది సీత టూత్‌బ్రష్‌పై పేస్టు వేసుకుంటూ.

"అమ్మగారూ...." నేను ఒక్కసారి ఇంటికి వెళ్లొస్తాను" అంది మెల్లగా.

"అదేంటే అపుడే? ఇంకా పిల్లలు నిద్ర లేవలేదుగా" అంది సీత పడుకున్న ఆ పిల్లల వైపు చూపిస్తూ.

"పర్వాలేదమ్మా వాళ్ళు లేచాక వస్తారులే. లేకుంటే ఇపుడే లేపుతా" అంది నిద్రపోతున్న పిల్లలపై చెయ్యి వేస్తూ.

"వద్దులే. వాళ్లు లేచాక నేనే పంపుతాలే. ఇల్లు తెలియనంత చిన్నవాళ్లు కారుగా. కనీసం కాఫీ అయినా తాగి వెళ్లు..." స్టవ్ వెలిగిస్తూ.

"వద్దమ్మా నేను మళ్లీ వస్తాను. ఇంటి దగ్గర మా మావ ఎట్టుండాడో ఏమో? రాత్రి కూడా ఏమీ తినలే" అంది తలకిందికి దించి నేలపై బొటనవేలుతో రాస్తూ.

విషయం అర్థమైన సీత నవ్వుతూ "అయితే వెళ్లు' అని మాత్రం అనగల్గింది.

*( నెల్లూరు కొడవలూరు బలరామమూర్తి గారి 1000 రూ.లు స్మారక పురస్కారం అందుకున్న కథ)*

# పగటి కల

ఇలా జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. అతనలా ప్రవర్తిస్తాడని అస్సలు ఊహించలేదు. గంటలకొద్దీ నాతో కబుర్లు చెబుతున్నప్పుడూ నా వుంగరాల జుట్టును మెచ్చుకుంటున్నప్పుడూ, నన్ను నిత్యం ఏడిపించి నాక్కోపం వస్తే నా అందాన్ని మరింతగా మెచ్చుకుంటున్నప్పుడూ, నా కోసమే ఇతను పుట్టాడా అనిపించేది.

నాతో ఏం మాట్లాడినా ఇంకా మాట్లాడాలని ఉందని నన్ను గూర్చి ఎంత తెలుసుకున్నా ఇంకా తెలియనివి ఉన్నాయని, నా వ్యక్తిత్వం ముందు ఎవ్వరూ పనికి రారని, అతను చెప్పే మాటలు నాలో లేని నమ్మకాన్ని కల్గించాయంటే అతిశయోక్తి కాదు.

పలకరిస్తే... ప్రాణంలా... భావించేవాడు. నేను దిగులుగా వుంటే తనకేం తోచదు అనేవాడు. తన జీవితాశయం 'నా నవ్వే' అనేవాడు. నా సంతోషం అతని సంపద అంటూ మురిసిపోయేవాడు. ఇన్ని అనుకుంటున్న అతన్ని గూర్చి నాకు ఎన్నో అనిపించేవి. కానీ, అన్నింటికీ మధ్య ఏదో తెలియి అనుమానం ఉండేది. ఎందుకంటే నా అందం గూర్చి నాకు తెలుసు. నాకంటూ ఒక్క చెల్లెలు తప్ప ఎవ్వరూ లేరని తెలుసు. ఇవన్నీ లేని నాపై ఇతనికి ప్రేమా? ఏమో... నమ్మకం కుదరడం లేదు. అలా అని పైకి అనలేను. పైకి అంటే ఈ కాస్త ఆనందం కూడా జారిపోతుందేమోననే భయం, తప్పదు... ఈ అబద్ధపు జీవితంలోనే కాస్త ఊరట వుందనిపిస్తోంది. నా దగ్గర అతను ఆశించేది ఏముంది? నాకు తెలిసీ ఏమీ లేదు. అనుకుంటే మాత్రం ఆ రోజంతా నాకు గర్వంగా వుండేది.

నేను, రవి స్నేహితులం. అదీ సాధారణమైన స్నేహం కాదు. దాదాపు ఆరేళ్ళ నుంచి స్నేహం. ఒకరికొకరం అనుకునేవాళ్ళం. కాలేజీలో క్లాస్‌మేట్స్‌మి. తను కాలేజి ఎగ్గొడితే నా సాయం, నేను ఏదో కారణం మీద మానేస్తే తను సహాయం చేసుకునేవాళ్ళం. అలా పరిచయం అయిన అతను ఒక్కచోట ఏమిటి? ప్రతిరోజు, ప్రతిగంట, నాతోనే గడిపేవాడు. అతని స్నేహం వల్ల నాలో వున్న ఆత్మన్యూనతాభావం పోయింది. అందరిలా మామూలుగా ప్రవర్తించేదాన్ని. చదువు రాదనుకున్న నేను పి.జి.దాకా చదవగలిగాను. పెద్దగా ఉద్యోగం రాకున్న, ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించగలిగాను. అన్నిటికన్నా నాపై నేను నమ్మకాన్ని పెంచుకున్నాను.

అతనిలా కాదు, ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. పెద్ద కంపెనీలో ఇంజనీరింగ్‌గా నెలకు దాదాపు ముప్ఫయి వేల దాకా సంపాదించుకుంటున్నాడు. అతనితో స్నేహం నా అదృష్టంగా భావించుకున్నాను. ఎందుకంటే తన సంతోషం, తన ఆశ,, అన్నీ నాతో చెప్పుకునేవాడు. భవిష్యత్ పట్ల తను కన్న కలలు నాకు చెప్పేవాడు. ఏ ఒక్కటీ దాచకుండా తెలిపే గుణం చూస్తుంటే నా జీవితాన్నే అతనికి అంకితం చేయాలనిపించింది. నా ఆశ, ఆశయం, అంతా తనలాగే అనిపించేది.

అకాలపు వర్షాలు, అకాలపు ఎండలూ, ప్రపంచలో స్వార్థం, అసూయ, అన్నీ సహజమే అనిపించేది. ఒక్కమాటలో చెప్పాలంటే సృష్టి అంతా అతనితో ముడిపడినట్లుగా భావించేదాన్ని.

ఒకరోజు బయట కుంభవృష్టి కురుస్తోంది. ఇంటిముందు వరకూ నీళ్ళే... మేము పై వాటాలో ఉండటం వల్ల అంతగా అనిపించలేదు. ఇంట్లో నాకంటూ మిగిలివున్న చెల్లెలు రూప మాత్రం చదువుకుంటోంది. తను నాలాగే డిగ్రీ కాకుండా బి.ఇ. చదువుతోంది. అలా అనేకంటే బి.ఇ.డి.చదువు రవి వల్లే చదువుకొంటుంది అనవచ్చు. నేనేం చెపితే అదే దానికి వేదం. తల్లీ, తండ్రి పోయాక నేనే దానిక అమ్మనై మావయ్య, రవి సహాయంతో చదివిస్తున్నాను. తాను పెద్ద ఆఫీసర్ కావాలని నా కల... ఇంతలో... "దీపా" అన్న పిలుపు.

ఆ పిలుపు ఎంతో సుపరిచితమైనదే. నా ప్రాణం... నా సర్వస్వం అయిన రవితేజ దే... అనుకునే లోపలే.... అతడు లోపలికి రావడం జరిగిపోయింది.

"రవీ... నువ్వేనా?"

"అబ్బో... చక్కగా గుర్తుపట్టావు" అన్నాడు నవ్వుతూ.

"నిన్ను గుర్తు పెట్టుకోకపోతే నన్ను నేను మరిచిపోయినట్టే" అని మనసులో అనుకున్నా పైకి మాత్రం నవ్వుతూ ఊరుకున్నాను.

"ఏంటీ రవీ! ఇలా వచ్చావు" మెల్లగా అడిగాను.

"ఏం లేదు... బయట వర్షం కదా! మీరిద్దరు ఎలా ఉన్నారో అమ్మ చూసి రమ్మంటేనూ" అన్నాడు.

"పోనీలే రవీ... నాకు కంగారుగానే వుంది. ఒక పక్క రూప చదువు, కరెంటు రావడం లేదు... అయినా ఏదో ఒకటి చేస్తాలే, తప్పదుగా ..." అన్నాను ఉదాసీనంగా.

"అరె వద్దు దీపా... ఇప్పుడిలాంటివి ఏమి చేయవద్దు. అమ్మకు ఫోన్ చేస్తాను. పది నిమిషాల్లో క్యారేజీ రెడి చేస్తుంది" అన్నాడు ఫోన్ అందుకుంటూ రవి.

"వద్దు రవీ..." అని ఎంతగా వారిస్తున్న వినకుండా ఆంటీకి ఫోన్ చెయ్యటం, అరగంటలో క్యారేజీ రావటం, అందరూ భోజనం చెయ్యడం జరిగిపోయింది.

"సరే దీపా... నేను వెళ్ళొస్తాను. జాగ్రత్త... బయటకు ఎవ్వరూ వెళ్ళకండి. ఏదయినా ఉంటే ఫోన్ చెయ్యి" అంటూ తగు జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్లాడు రవి.

రోజు రోజుకు రవి మీద తెలియని భావం, అది ప్రేమో, ఆరాధనో, ఏదో తెలియని బంధం.. మరింతగా బంధిస్తోంది. చెల్లెలు గదిలో లైటు లేదు. పాపం!! నిద్ర పోయిందేమో... అనుకుని నేను నిద్రకు ఉపక్రమించే సమయంలో....

టెలిఫోన్ మోగింది. ఆ సమయంలో ఎవరో అనుకుంటూ ఫోను అందుకున్నాను.

"దీపా... నేను రవిని"

ఉలిక్కిపడ్డాను. రవి ఈ సమయంలో ఎందుకు ఫోనును చేశాడబ్బా అనుకుంటూ.

"దీపా"

"ఆ.. చెప్పు రవీ"

"కంగారు పడ్డావా?"

"ఆ అబ్బే అదేం లేదు రవీ, చెప్పు"

"మరి... మరి.. నీతో ఒక విషయం మాట్లాడాలని అనుకుంటున్నాను..." అన్నాడు మెల్లగా. అందుకు వెంటనే "అందుకు నా పర్మిషన్ కావాలా" అన్నాను చనువుగా.

"అంటే... విన్న తర్వాత నువ్వేమి అనుకోవుగా..."

"ఇందులో నేను అనుకునేందుకు ఏముంది రవీ...! మన మధ్య ఇలాంటివి కూడా అవసరమా?" అన్నాను.

"అంటే విషయం..." అంటూ రవి నోటి నుండి వచ్చే లోపే... సరే రవీ. ఇప్పుడు మాట్లాడతావా"అంటూ అడిగాను.

"నో... నో.. ఇప్పుడు కాదు, రేపు ఉదయం... సరేనా, రేపు నీకు హాలీడేగా" అంటూ అడిగాడు ఎంతో క్యాజువల్‌గా.

"అవును రేపు క్రిస్‌మస్ కదా... హాలిడే, సరే రా... రవీ... నీ కోసం నేను ఎదురు చూస్తుంటాను"

"అబ్బా...! అంత అవకాశం నీకు నేను ఇవ్వనులే... చెప్పిన టైము కంటే ముందే అక్కడుంటాను" అన్నాడు నవ్వుతూ రవి.

"ఓకే... గుడ్‌నైట్ రవీ..."అంటూ ఫోను పెట్టేశాననే మాటనే గానీ... ఇప్పుడే నాలో అలజడి ప్రారంభమయింది. రవి ఏం మాట్లాడుతాడో తన ఉద్దేశం ఏమిటో... నన్ను ఆలోచింపజేయాలనేగా... తను మాత్రం నిద్ర పోతుంటాడా ఏమిటి? నాలాగే కన్‌ఫ్యూజన్‌లో ఉంటాడు, అనుకుంటూ జీవితంపై ఎన్నో ఆశలతో నిద్రలోకి జారుకున్నాను.

***

తెల్లవారింది. ఎక్కడలేని హడావుడి నాలో కనబడుతుంది. ఈ రోజుతో నా జీవితం ఒక మలుపు తిరగబోతుంది. ఇన్నాళ్ళూ కన్నకలలు ఇప్పటికి నిజం అయ్యే అవకాశం వచ్చింది అనుకుంటూ ఎంతో ఉదయమే నిద్ర లేచి పూజ పూర్తి చేసుకొని భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ఇంతలోనే...

"అక్కా"

"ఏమ్మా" రూప పిలుపుకు వెనక్కు తిరగాను.

"నేను జ్యోతి ఇంటికి వెడతాను చదువుకోవడానికి... మధ్యాహ్నం కల్లా వచ్చేస్తాను" అంది మెల్లగా రూప.

అప్పటిదాకా ఒంటరిగా ఉండాలని చేసే ప్రయత్నానికి ఒక దారి దొరికినట్టయింది. వెంటనే ఆలస్యం చేయకుండా వెళ్ళు అన్నాను.

ఆశ్చర్యపోవడం రూప వంతయింది. ఇదేంటి? ఎప్పుడు ఎక్కడికి వెళ్ళినా ఎందుకు? వెళ్ళాల్సిన అవసరం ఏమిటి? అంటూ ఎన్నో ప్రశ్నలు వేసే అక్క అలా ఒక్కసారిగా వెళ్ళమని చెప్పడం ఒకింత ఆలోచనలో పడేసినా... తనకు ముఖ్యమయిన పని వల్ల ఆలస్యం చేయకుండా వెళ్ళిపోయింది రూప.

అంతలోనే రవి వచ్చాడు. "దీపా!" అంటూ.

"స్వీటుతోనే వచ్చావు. విషయం ఎంతో విలువైంది... బలమైందిలా ఉందే" అన్నాను నవ్వుతూ.

"అబ్బో నీకు కవిత్వం కూడ వస్తోంది దీపా" అన్నాడు ముఖంలోకి చూస్తూ. ఆ చూపులో ఏదో వెలితి కనబడుతోంది దీపకి. ఆ వెలితి ఏదో వెదికే ప్రయత్నంలో ఉండగానే

"అంతా నీ చలవే" అంటూ అక్కడే వున్న ఫ్లాస్క్‌లోంచి కాఫీ రెండు కప్పుల్లోకి పోసి ఒకటి చేతికి అందిస్తూ, ఒకటి తీసుకొని సోఫాలో వెనక్కు వాలాను.

"రూప ఏది?" అడిగాడు నాలుగువైపులకు కలియజూస్తూ.

"తన స్నేహితురాలింటికి వెళ్ళింది... ఎగ్జామ్స్ ఏవో వస్తున్నాయికదా! కదా" అన్నాను యధాలాపంగా కాఫీ కప్పులు లోపల పెడుతూ.

"తనే వెళ్ళిందా? నువ్వు పంపావా?" అడిగాడు నవ్వుతూ.

"నేనెందుకు పంపుతాను? మరీ అలా మాట్లాడుతున్నావు?" అన్నాను కాస్త కోపం ధ్వనించే స్వరంతో.

"అబ్బ ఎంత కోపమో, మరీ ఒక్కమాట పడవు కదా... సరదాగా అన్నా..." అంటూ నవ్వాడు. ఆ నవ్వు చూస్తుంటేనే ఎంతో ధైర్యంగా ఉంటుంది. ఆ మాటలు వింటూ జీవితాంతం గడిపేయాలనిపిస్తుంది. అంతలో "హల్లో మేడమ్" అనేసరికి ఈ లోకంలోకి వచ్చాను.

"తమరేదో లోకంలోకి వెళ్ళిపోయినట్లున్నారే..." అనే మాట విన్న వెంటనే "ఏదయినా అనుకో రవీ... నీతో వాదించే ఓపిక... సహనం నాలో లేవు... ఇంతకీ విషయమేమిటో చెప్పు" అన్నా నవ్వుతూ.

"అమ్మో... ఆశ... ఆ విషయం చెప్పేది... చెప్పాల్సింది నేను కాదు..." అనే మాట విని "ఇంకెవరూ" అన్నాను.

"మా అమ్మ"

"ఏంటీ.. అంటీ వచ్చిందా?" అనుకుని ఆశ్చర్యపోయాను. నేనేమయినా వద్దంటాను అనుకున్నాడేమో రవి... "అమ్మా...! రా" అన్నాడు.

"అదేంటి ఆంటీ...! మీరు వచ్చి లోపలికి రాకుండా...." అంటూ ఆగిన నన్ను చూసి నవ్వుతూ...

"లేదమ్మా నేను వాడితో రాలేదు. ఇప్పుడే వచ్చాను. రవికి అలా మాట్లాడటం కొత్త కాదుగా... అయితే నేను రాకుండా కాఫీ తాగేసారన్నమాట" అంటూ చనువుగా అక్కడున్న ఫ్లాస్క్‌లోంచి కాఫీ తీసుకుంది సావిత్రమ్మ.

***

"సరే దీపా... విషయం నేను చెబితేనే బావుంటుందని నేనే వచ్చాను. అందుకు నువ్వు ఒప్పుకోవాలని ఒప్పందం ఏమీలేదు. నీకు నచ్చితేనే, మీరు మాకు పరాయి కాదు. మీ అమ్మ, నాన్న పోయినప్పటి నుండి మీరు నాకేమి కొత్త కాదు, మీ ప్రవర్తన, మీ జీవిత విధానం అంతా నాకు తెలుసు. ఇప్పటిదాకా మిమ్మల్ని పరాయి వ్యక్తుల్లా భావించలేదు. భగవంతుడు మీ జీవితం పట్ల చిన్నచూపు చూసినా, క్రుంగిపోకుండా మీ కాళ్లపై మీరు నిలబడి ఇంతటి వారయ్యారు. ఇకపై మీ బాధ్యత కూడా మేము తీసుకుంటే



ఇంత మంచి పిల్లలకు మంచి దారి చూపగలిగిన పుణ్యం వుంటుందని నాకే కాదు మీ అంకుల్ కూడా అనుకుంటున్నారు, ఏమంటావు" అంది సావిత్రమ్మ నా ముఖంలోకి చూస్తూ.

"మీ ఇష్టం అంటీ....!" అనేసాను ధైర్యంగా.

"ఓకె... నాకెపుడూ నీ మీద నమ్మకం వుంది. నా మాట కాదనవనే నమ్మకంతోనే మరో మాట కూడా చెప్పాలని వుంది. అది ఎలా" అంటూ ఆగిన సావిత్రమ్మను "చెప్పండి ఆంటీ ఏదయినా పర్వాలేదు..." అన్నాను.

ఒక పక్క ఏం చెబుతుందోననే భయం, మరో పక్క చెప్పిన వెంటనే నేనెలా రియాక్ట్ కావాలో అనే భయం. వాతావరణం ఎంతో ఉత్కంఠభరితంగా వుంది.

"అయితే... ఇక చెప్తాను... మా అబ్బాయి మీద నీ అభిప్రాయం ఏంటి?"

"మంచి అభిప్రాయమే..." అని టక్కున అనేశాను.

"అయితే రవి ఎప్పట్నించో ఒక మాట అంటున్నాడు. అమ్మా! నాకు రూప అంటే ఇష్టమని... తనని పెళ్ళి చేసుకుంటానని, తనకెలాగూ ఆఖరు సంవత్సరమేగా అయిపోయాక అడుగుదాం అని నేనంటున్నా, ఈ లోపు నీ పెళ్ళి అయితే రేపు రూప చదువు అయిపోయిన వెంటనే వీరిద్దరికీ చేసేయచ్చు..." అంటున్న ఆ మాటలు అస్సలు నాకు వినబడటం లేదు. నేనేం అయిపోతున్నానో నాకే అర్థం కావటం లేదు. శరీరాన్ని ఎవరో రెండుగా చీల్చుతున్న ఫీలింగ్... ఒక్కసారిగా గుండె నీరుగా మారిపోయిందా అనే ఆలోచన... నేను బతికే వున్నానా అనే అనుమానం ఒక్కసారిగా కలిగాయి...!

"ఏమ్మా!... అలా వుండిపోయావు? ఏమయినా...?"

"లే, లేదాంటీ... సంతోషమే... రూపకు ఇంతటి అదృష్టం తలపు తట్టి వస్తే ... నాకు అంతకంటేనా..." అన్నాను బలవంగా నవ్వు తెచ్చుకుంటూ.

ఈ లోపు నీకో మంచి మొగుడ్ని వెతికి పెడతాలే" అంది బుగ్గపై చిన్నగా దెబ్బ వేస్తూ సావిత్రమ్మ. ఇద్దరూ నా గుండెను ఇష్టం వచ్చినట్లు చీల్చి చెండాడి వెళ్ళిపోయారు.

నా పరిస్థితికి భాష లేదు. తెలుపుకుందామన్నా ఆత్మీయులు లేరు. ఉందనుకున్న ఒక్క అనురాగం మరెటో ప్రవహిస్తోందని తెలియని మూర్ఖురాలిగా మిగిలిపోయాను. కన్నీరు రావటం లేదు. నాకు చిన్నపటినుండి కన్నీళ్ళు రావు. ఎంత బాధయిన గుండెకే తగులుతుంది. గుండె స్పందించడం మానేస్తుంది. మళ్లీ తప్పదనుకుంటూ పని చేస్తుంది. కానీ... ఇన్నాళ్ళ కన్నీరు ఒక్కసారిగా పైకి వచ్చింది. అలా ఎంతసేపు ఏడుస్తూ వుండిపోయానో తెలియదు. మళ్ళీ సాయంత్రం రూప తలుపు తట్టేవరకూ మెలకువ రాలేదు.

***

"అక్కా... ఏంటక్కా... అలా వున్నావు?" అడిగింది రూప.

"ఏం లేదు. ఒంట్లో కాస్త నలతగా ఉందంతే" అన్నా ముభావంగా.

"అక్కా"

"ఏంటమ్మా"

"మరి... మరి..."

"చెప్పవే... అలా భయపడతావేం."

"ఆంటీ వాళ్ళు వచ్చారా?"

"ఏ ఆంటీ వాళ్ళు" అన్నా ఆశ్చర్యంగా.

"అదే రవి వాళ్ళు"

"అంటే నీకు వాళ్ళు వస్తారని తెలుసా?" అన్నా మరింత ఆశ్చర్యంగా.

మౌనంగా వున్న రూపను చూస్తూ "చెప్పు ఇంకా ఆ నాన్చుడు ఎందుకు?" అని నాకుతెలియకుండానే గద్దించాను.

"తెలుసు... రవి, నేను రెండేళ్ళుగా ప్రేమించుకుంటున్నాం. నా చదువు అయిపోయాక పెళ్ళి చేసుకుంటానని... చెప్పినా ఇపుడేదో నీ కోసం ఒక మంచి సంబంధం వచ్చిందని, అది చెప్పేటపుడే నా విషయం కూడా చెబుతానని అంటే సరేనన్నాను... తప్పయితే క్షమించు అక్కా..."

"ఇందులో నీ తప్పేమీ లేదమ్మా... అంతా నాదే" అని మనసులో అనుకుంటూ...

"ఇందులో క్షమించాల్సినంత తప్పేం లేదమ్మా... మంచి నిర్ణయమే తీసుకున్నావు. కానీ... నీ ప్రేమ విషయం నాకు ముందే చెప్పి ఉంటే బావుండేది" అన్నాను నిర్లిప్తంగా.

ఇపుడు నా మనసులో బాధ లేదు. కోప్పడదామనే ఆలోచనే లేదు. అంతా నిర్వికారంగా వుంది. ఏ భావానికి నోచుకోలేని ఒక స్తబ్దత ఉంది. అంతా అర్థమయినా ఒక్కటి మాత్రం ప్రశ్నలా ఉంది.

"ప్రేమ అనేది మనుషులను కలుపుతోందా...? లేక దొరికినట్లు మాయ చేసి మనసులతో ఆడుకుంటోందా? అర్థం కాలేదు. మనిషికి గానీ, మనసుకుగానీ ఒంటరి తనాన్నే తోడుగా భావిస్తూ, ఇన్నాళ్ళ జీవితం ఒక పగటికలలా భావిస్తూ ఒంటరిగా ఉండిపోయాను.

***(2007 మే నెల 'నది' మాసపత్రికలో ప్రచురితం)***



# శైలజామిత్ర సాహితీ విశేషాలు

**కవితలు:**

శంఖారావం (1997)
మనోనేత్రం (1999)
నిశ్శబ్దం (2002)
అంతర్మథనవేళ (2006)
సిల్వర్ లైన్స్ (2003 ఆంగ్ల కవితా సంపుటి)
అగ్నిపూలు (2011 మినీ కవితా సంపుటి)

**కథలు:**

తరంగాలు (2005)
అడ్డా (2012)

**నవలలు:**

ఆకుపచ్చని జాబిలి (2011)
('చిత్ర' మాసపత్రికలో ప్రచురితం)
ఏ నావది ఏ తీరమో (2012)
(ఇటీవలే ఆంధ్రభూమి పోటీలలో
సాధారణ బహుమతి పొందినది)
నేలపైని నక్షత్రాలు (చిన్నపిల్లల నవల, 2010)
(తెలుగు పొయట్రీ.కామ్‌లో ధారావాహికం)
ఈ తప్పెవరిది? (2009)
(మనదేశం పత్రికలో ధారావాహికం)
నీకు నువ్వే (ప్రచురణ కానిది)
మనీషి (ప్రచురణ కానిది)

**సమీక్షలు:**

నేటినిజం, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఈవారం, ఆంధ్రప్రదేశ్, ఉషోదయ వెలుగు (వెబ్ మేగజైన్ సుజన రంజని), అన్నింటిలో కలిపి దాదాపు 250 దాకా

**వ్యాసాలు:**

ఉషోదయ వెలుగులో 'మానవీయం' అనే అంశంపై
48 సామాజిక వ్యాసాలు
భక్తిరంజనిలో 'ఆధ్యాత్మికం-జీవితం' అనే అంశంపై
54 వ్యాసాలు ధారావాహికంగా
'నమోవెంకటేశాయ' అనే పత్రికలో 12 భక్తి పాటలు

**అనువాదాలు:** Voice of water
(పెనుగొండ సత్యనారాయణమూర్తిగారి
'జలవాణి' కవితా సంకలనం)
Glouring flowers
(మోపూరి పెంచల నరసింహంగారి
'వెలుగుపూలు' కవితలు)
Let us know telugu
(డా॥ ద్వానాశాస్త్రిగారి గ్రంథం
'తెలుగులో మాట్లాడుకుందాం')
Lightning Roots
(డా॥ రావి రంగారావుగారి
'వెలుతురువేళ్ళు' మినీ కవితా సంపుటి)
Hard working earth
(అనంతరావుగారి 'శ్రామిక ధరిత్రి' Long Poem)

1. 'సాహిత్యశ్రీ' (అఖిల భారత్ భాషా సాహిత్య సమ్మేళన్, భోపాల్)
2. (కేంద్ర సాహిత్య అకాడమీ, బెంగుళూరు వారిచే
15 రోజులు తమిళనాడు పర్యటన)
3. రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం (2006)
4. కొడవలూరి బలరామయ్య కథా పురస్కారం (నెల్లూరు)
5. మదర్‌థెరిస్సా పురస్కారం– హెల్త్‌కేర్ ఇంటర్నేషన్ వారిచే
6. కవితాసంపుటి 'అంతర్మథనవేళ'కు అక్షర ఫౌండేషన్‌వారిచే శ్రీశ్రీ పురస్కారం
7. కథాసంపుటి 'తరంగాలు'కు పెనుగొండ రమ్యసాహితీ సమితి వారిచే
ఉత్తమ గ్రంథ పురస్కారం)
8. 'అగ్నిపూలు' మినీ కవితా సంపుటికి మచిలీపట్నం సాహితీమిత్రుల
వారిచే ఉత్తమ మినీ కవితా ప్రతిభా పురస్కారం
9. ఆంధ్ర సాంస్కృతిక సమాఖ్య మరియు ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి
విజయవాడలో చెలిమి వారిచే దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం
10. సాహితీ తపస్వి డాక్టర్ ఆరుద్ర పురస్కారం, జ్వాలాముఖి పురస్కారం

***